సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 | వెల: ₹ 5.50 | సంపుటి: 16 | సంచిక: 125

బుధవారం | 26-7-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'గ్రామం ప్రగతిపథంలో ఉంటే ఎవ్వరూ మురా కక్షల జోలికి వెళ్లరు'



హర్మన్‌పై 2 మ్యాచ్‌ల నిషేధం

బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో అనుచిత ప్రవర్తనపై ఐసీసీ చర్య

-12లో



హైదరాబాద్, వైజాగ్‌లో క్రికెట్ కిక్

భారత జట్ల టెస్టు, టి20 మ్యాచ్‌లు కేటాయింపు

-12లో



ఐదోసారి కక్ష్య దూరం పెంపు

చంద్రయాన్‌-3 మిషన్ కక్ష్య దూరాన్ని ఇస్రో ఐదోసారి విజయవంతంగా పెంచింది. ఆగస్టు 17న జాబిల్లి కక్ష్యకు చేరుకుంటుంది.

వివరాలు 6లో ▸



అబుదాబిలో 'మెర్స్‌-కోవ్'

యూఏఈలోని అబుదాబిలో ఓ యువకుడికి ప్రాణాంతకమైన మిడిల్ ఈస్ట్ రెస్పిరేటరీ సిండ్రోమ్ కరోనా వైరస్ (మెర్స్‌-కోవ్) సోకింది.

వివరాలు 6లో ▸



చినుకుతో వణుకు

మొన్న ముంబై. నిన్న చెన్నై. ఇవాళ ఢిల్లీ.. నగరమేదైనా అదే వ్యథ.. చినుకే వరదై రాజధాని తల్ల'ఢిల్లీ'పోతోంది.

వివరాలు 6లో ▸



లాభాల్లోకి టాటా మోటార్స్

ఆటో రంగ దేశీ దిగ్గజం టాటా మోటార్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం క్యూ1లో రూ. 3,301 కోట్ల నికర లాభం ఆర్జించింది.

వివరాలు 13లో ▸

న్యూస్‌రీల్

జస్టిస్ సామ్ కోషి బాధ్యతల స్వీకరణ రేపు



తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ సామ్ కోషి 27న బాధ్యతలు చేపట్టనున్నారు. గురువారం సీజే జస్టిస్ అలోక్ అరాధే ఆయనతో ప్రమాణ స్వీకారం చేయిస్తారు.

- వివరాలు 10లో▶

జాతీయ విద్యా సంస్థల్లో చదివే బీసీలకూ రీయింబర్స్‌మెంట్



ప్రతిష్టాత్మక విద్యాలయాల్లో చదివే బీసీ విద్యార్థులకు పూర్తిస్థాయిలో 'ఫీజు రీయింబర్స్‌మెంట్' అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే బీసీలకూ వర్తింపచేయనుంది.

- వివరాలు 5లో▶

ఐఐటీ విద్యార్థి విషాదాంతం



వారం క్రితం అదృశ్యమైన ఐఐటీ విద్యార్థి కార్తీక్ విశాఖపట్నం బీచ్‌లో శవమై తేలాడు. ఐఐటీ హైదరాబాద్‌లో బీటెక్ రెండో ఏడాది చదువుతున్న కార్తీక్ పరీక్షల్లో తప్పడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు.

- వివరాలు 5లో▶

కారు.. టార్గెట్ పదహారు



ఏడాది చివరలో జరిగే రాష్ట్ర శాసనసభ ఎన్నికలతో పాటు వచ్చే ఏడాదిలో జరిగే లోక్‌సభ ఎన్నికలపైనా బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ దృష్టి సారించారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో 'కారు.. పదహారు' నినాదంతో బరిలోకి దిగిన బీఆర్‌ఎస్ వచ్చే ఎన్నికల్లోనూ అదే నినాదాన్ని ఎంచుకోనుంది.

- వివరాలు 3లో▶



ఇతను లంచం 'తిన్నా'డ్సార్!



వరంగల్ నగరంలో నీటమునిగిన సంతోషిమాత నగర్, ఎన్టీఆర్ నగర్



ఖమ్మం జిల్లా రాజేశ్వరపురంలో వరి నారు కొట్టుకుపోవటంతో విలపిస్తున్న రైతు లింగయ్య

రాష్ట్రానికి రెడ్ అలర్ట్

వచ్చే మూడు రోజుల పాటు భారీ వర్షాలు

- సోమవారం రాత్రి నుంచే కుండపోత షురూ..
- నిజామాబాద్ జిల్లా వేల్పూర్‌లో 46 సెం.మీ. అతి భారీ వాన
- మరికొన్ని ప్రాంతాల్లో 20 సెంటీమీటర్లకుపైనే నమోదు
- ఉమ్మడి వరంగల్, మెదక్, కరీంనగర్ జిల్లాల్లోనూ కుంభవృష్టి
- వాగులు, వంకలు పొంగి పొర్లడంతో తెగిపోయిన రోడ్లు
- రాష్ట్రంలోని 25 జిల్లాల్లో అధిక వర్షపాతం

సాక్షి, హైదరాబాద్, సాక్షి నెట్‌వర్క్: ఎడతెరిపిలేని వానలతో రాష్ట్రం తడిసి ముద్దవుతోంది. ఆకాశం చిల్లులు పడిందా అన్నట్టుగా వానలు పడుతున్నాయి. నగరాలు, పట్టణాలు, గ్రామాలనే తేడా లేకుండా ఎక్కడ చూసినా నీళ్లే కనిపిస్తున్నాయి. ఇప్పుడీ వానలు మరింత ముదురుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా మరో మూడు రోజులు కుండపోత వానలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. అల్పపీడనం ప్రభావంతో ఉత్తర తెలంగాణ జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ మేరకు రాష్ట్రమంతా రెడ్ అలర్ట్ జారీ చేసింది. అయితే సోమవారం రాత్రి నుంచే మిగతా 2వ పేజీలో ▶

రాష్ట్రంలో మూడో అతి భారీ వర్షంగా రికార్డు

నిజామాబాద్ జిల్లా వేల్పూర్‌లో తాజాగా కురిసిన 46.3 సెంటీమీటర్ల వాన రాష్ట్రంలో మూడో అతి భారీ వర్షంగా రికార్డుల్లోకి ఎక్కింది. ఇంతకుముందు 2013 జూలై 19న ములుగు జిల్లా వాజేడులో ఏకంగా 51.75 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. అదే ఏడాది జూలై 23న కొమ్రంభీం జిల్లా దహెగాంలో 50.36 సెంటీమీటర్ల వాన పడింది.

వణికిన నిజామాబాద్ ఓరుగల్లులో జడివాన

ఉమ్మడి నిజామాబాద్, వరంగల్ జిల్లాలు కుండపోత వర్షంతో వణికిపోయాయి. పలుచోట్ల.. కొంత దూరంలో ఉన్నవేవీ కనబడనంతగా అతి భారీ వర్షం పడింది. మహబూబ్‌నగర్ జిల్లాలో ఓ వాగులో కొట్టుకుపోయి ఇద్దరు యువతులు మృతిచెందారు.

2లో

నేడు, రేపు విద్యాసంస్థలకు సెలవు

వనమా ఎన్నిక చెల్లదు..

సాక్షి, హైదరాబాద్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఎన్నిక చెల్లదంటూ హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. తెలంగాణ రాష్ట్ర చరిత్రలో ఓ శాసనసభ్యుడి ఎన్నిక చెల్లదని కోర్టు తీర్పు ఇవ్వడం ఇదే తొలిసారి. వనమా సమీప ప్రత్యర్థి జలగం వెంకట్రావు (పిటిషనర్)ను శాసనసభ్యుడిగా ప్రకటించాలని ఎన్నికల అధికారులను ఆదేశించింది. 2018 డిసెంబర్ 12 నుంచి జలగమే ఎమ్మెల్యే అని స్పష్టంచేసింది. ఉద్దేశ పూర్వకంగా అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇచ్చినందుకు వనమా వెంకటేశ్వర రావుకు రూ.5 లక్షల జరిమానా విధించింది. అలాగే వెంకట్రావుకు కోర్టు ఖర్చులను చెల్లించాలని స్పష్టం చేసింది. 'వెంకటేశ్వరరావుపై క్రిమినల్ కేసులున్నా చెప్పలేదు. గత ఎన్నికల్లో పేర్కొన్న పలు స్థిర, చరాస్తుల వివరాలను 2018 ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడించలేదు. భూముల ఆధారంగా రైతుబంధులాంటి ప్రభు త్వ పథకాలూ పొందారు. అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇవ్వడం లేదా వివరాలను దాచడం చట్టవిరుద్ధం. ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం వనమా ఎన్నిక చెల్లదు. అలాగే ఎన్నికల పిటిషన్‌పై విచారణ సందర్భంగా సాక్ష్యమిచ్చేందుకు వనమా హాజరుకాలేదు. సాక్ష్యం ఇవ్వని పక్షంలో ఆరోపణలు వాస్తవ మని భావించవచ్చు' అని కోర్టు తీర్పులో పేర్కొంది.

84 పేజీల తీర్పు: 2018లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన వెంకటేశ్వరరావుకు 81,118 ఓట్లు, టీఆర్‌ఎస్ (ప్రస్తుతం బీఆర్‌ఎస్) నుంచి మిగతా 3వ పేజీలో ▶





వనమా



జలగం వెంకట్రావు

కొత్తగూడెం ఎమ్మెల్యే ఎన్నికపై హైకోర్టు సంచలన తీర్పు

- ఉద్దేశపూర్వకంగానే అఫిడవిట్‌లో తప్పుడు సమాచారమిచ్చారు
- 2018, డిసెంబర్ 12 నుంచి జలగమే కొత్తగూడెం ఎమ్మెల్యే
- వనమాకు రూ.5 లక్షల జరిమానా
- జలగం వెంకట్రావును ఎమ్మెల్యేగా ప్రకటించాలని అధికారులకు ఆదేశం

మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు చుక్కెదురు

ఎన్నికల పిటిషన్‌లో ఆయన ఐఏను కొట్టివేసిన హైకోర్టు

మంత్రిపై దాఖలైన పిటిషన్ విచారణార్హమేనని వెల్లడి

3లో





సమావేశంలో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క. పక్కన మధుయాష్కీగౌడ్

ఉచిత విద్యుత్‌పై బీఆర్‌ఎస్ మాట్లాడితే..

వైఎస్సార్ ఫొటో చూపించండి


నేతలు, కార్యకర్తలకు భట్టి సూచన

- ఉచిత విద్యుత్ కాంగ్రెస్‌కు పేటెంట్ అని స్పష్టీకరణ
- కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌లు అబద్ధాలు చెబుతున్నారని ధ్వజం
- 'సెల్ఫీ విత్ కాంగ్రెస్ డెవలప్‌మెంట్' ప్రారంభించిన సీఎల్పీ నేత
- ఉచిత విద్యుత్ ఫైలుపై వైఎస్ సంతకం చేస్తున్న ఫొటో వద్ద సెల్ఫీ

3లో

దారుణంగా దర్యాప్తు..

వివేకా హత్య కేసులో కల్పిత కథనాలతో డైలీ సీరియల్‌లా సీబీఐ చార్జిషీట్: సజ్జల



- ప్రజాక్షేత్రంలో సీఎం జగన్‌ను ఎదుర్కోలేని గుంటనక్కలకు వేదికలా దర్యాప్తు సంస్థ
- భారతమ్మతో కలసి నేను సునీతమ్మ ఇంటికి వెళ్లలేదు..
- హత్య జరిగిన పది రోజుల తర్వాత నా భార్యతో కలసి పరామర్శకు వెళ్లా
- వివేకా గౌరవానికి భంగం కలగకూడదని ఇంతకాలం భరించాం
- మేం మౌనం వహిస్తుంటే... సునీతమ్మ బతికున్నవారినే బజారుకీడుస్తున్నారు.. జీవితాలను నాశనం చేసే స్థితికి వచ్చాక మేమెందుకు మౌనంగా ఉండాలి?
- వివేకా హత్య కేసులో ఆధారాలు ఒకవైపు.. దర్యాప్తు మరోవైపు
- సీఎం జగన్ ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తీసే కుట్ర ఇదంతా
- ఉగ్రవాదుల కంటే ఘోరంగా ఎల్లో మీడియా తీరు ఉందని ఫైర్

10లో

కేంద్రంపై అవిశ్వాసం!

- నేడు 'ఇండియా' కూటమి భేటీలో నిర్ణయం
- మణిపూర్‌పై అట్టుడికిన ఉభయ సభలు
- హోరెత్తిన నినాదాలు.. 51 మంది విపక్ష ఎంపీల నోటీసులు
- నిరసనలకు మద్దతు పలికిన బీఆర్‌ఎస్
- చర్చలకు విపక్షాలు కలసి రావాలంటూ అమిత్ షా లేఖ



6లో

దశాదిశా లేని కూటమి 'ఇండియా'

- దేశం పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించలేరు
- దేశాన్ని పాలించి, విభజించాలన్నదే విపక్ష కూటమి లక్ష్యం
- బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రధాని మోదీ విమర్శలు

హెల్పింగ్ హ్యాండ్స్



వాగులో కొట్టుకుపోయి.. పైపులో ఇరుక్కుని..

మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం లంబాడి తండాలో ఎర్రవాగు పోటెత్తి లోలెవల్ వంతెన పైనుంచి ప్రవహిస్తోంది. ఇక్కడి జంగాల్‌పేటకు చెందిన సమ్మయ్య అనే రైతు వంతెన దాటేందుకు ప్రయత్నిస్తూ నీటిలో కొట్టుకుపోయాడు. కొంత దూరంలో వాగులో ఉన్న పైపులో చిక్కుకున్నాడు. పోలీసులు, స్థానిక యువకులు కలిసి ఆయనను కాపాడారు.



మూలవాగులో చిక్కుకుని..

జగిత్యాల జిల్లా శెట్టిపల్లికి చెందిన మారుతి ప్రమాదవశాత్తు రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మూలవాగులో చిక్కుకుపోయాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు వాగు వద్దకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. బ్లూకోల్ట్స్ కానిస్టేబుళ్లు శ్రీనివాస్, శ్రీనివాస్‌రావు తాళ్ల సాయంతో వాగులోకి దిగి మారుతిని సురక్షితంగా బయటికి తీసుకువచ్చారు.



వరద నీటిలో అంతిమయాత్ర

సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం వేచరేణి గ్రామానికి చెందిన బస్వరాజు బాలయ్య (70) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. గ్రామానికి ఆనుకుని వాగు ఒడ్డున వైకుంఠ ధామం ఉంది. భారీ వర్షాలతో వాగులో నడుములోతు నీటి ప్రవాహం కొనసాగుతోంది. కుటుంబ సభ్యులు, బంధువులు వరదలోనే మృతదేహాన్ని తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.



ఇళ్లలోకి రోళ్ల వాగు నీళ్లు

జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలో రోళ్ల వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీనిపై ఉన్న ప్రాజెక్టు కాల్వల నుంచి వరద ఉప్పొంగడంతో.. దిగువన ఉన్న నర్సింహులపల్లె గ్రామం జలమయమైంది. ఇళ్లలోకి నీరు చేరడంతో తీవ్రంగా ఇబ్బందిపడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు.



వరంగల్‌లోని వరద ప్రాంతాల్లో ట్రాక్టర్‌లో పర్యటిస్తున్న పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్, సిబ్బంది

వణికిన నిజామాబాద్..

ఓరుగల్లులో జడివాన

సాక్షి నెట్‌వర్క్: సోమవారం రాత్రి నుంచి రాష్ట్రవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో వానలు పడినా.. ఉమ్మడి నిజామాబాద్, వరంగల్ జిల్లాలు మాత్రం కుండపోత వర్షంతో వణికిపోయాయి. పలుచోట్ల అయితే కొంత దూరంలో ఉన్నవేవీ కనబడనంతగా అతి భారీ వర్షం పడింది. నిజామాబాద్ జిల్లా వేల్పూర్‌లో సోమవారం రాత్రి 10 గంటల నుంచి మంగళవారం తెల్లవారుజామున 4 గంటల వరకు ఆరు గంటల్లోనే ఏకంగా 46.4 సెంటీమీటర్ల రికార్డు స్థాయి వాన పడింది. చాలా ప్రాంతాల్లో 15 సెంటీమీటర్లకుపైనే వర్షపాతం నమోదైంది. భారీ వర్షాలతో జిల్లాలో 73 ఇళ్లు దెబ్బతిన్నాయి. వేల్పూర్‌లో చెరువు కట్ట తెగిపోయి నీరంతా రోడ్డుపై ప్రవహిస్తూనే ఉంది. ఇక్కడి తహసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్ నీటమునిగాయి. ఇదే మండలంలోని పచ్చలనడ్కుడ వద్ద చెరువు కట్ట తెగిపోవడంతో భీంగల్ వైపు రాకపోకలు నిలిచిపోయాయి. లక్కోర, ఆర్మూర్ మండలం చేపూర్ వద్ద 63వ నంబర్ జాతీయ రహదారి కోతకు గురైంది. జక్రాన్‌పల్లి మండలం మనోహరాబాద్–తొర్లికొండ మధ్య రోడ్డు తెగిపోయింది.



నిజామాబాద్ జిల్లా వేల్పూర్ పోలీస్‌స్టేషన్ ఎదుట డివైడర్‌పై నుంచి ప్రవహిస్తున్న వరదనీరు

- ఉమ్మడి వరంగల్ జిల్లానూ వాన ముంచెత్తింది. వరంగల్ నగరంలో 31 కాలనీలు నీట మునిగాయి. ఇళ్లు, గుడిసెల్లోకి వరద నీరు చేరి నిత్యావసరాలు, సామగ్రి తడిసిపోయాయి. 700 మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని ధర్మసాగర్, ఆత్మకూర్, గీసుకొండ, రేగొండ, మల్హర్‌రావు మండలాల్లో అతిభారీ వర్షపాతం నమోదైంది.
- మెదక్ ఉమ్మడి జిల్లా పరిధిలోని హుస్నాబాద్‌లో చెరువులు మత్తడి దూకుతున్నాయి. పట్టణంలో చాలా ప్రాంతాలు జలమయం అయ్యాయి. పోలీస్‌స్టేషన్ చుట్టూ జలమయం అయింది. కూడెల్లి, మోయతుమ్మెద వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. బస్వాపూర్ వద్ద సిద్దిపేట–హనుమకొండ ప్రధాన రహదారిపై వరద పోటెత్తడంతో వాహనాల రాకపోకలు ఆగిపోయాయి.
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల పరిధిలో భారీ వర్షాలు కురిశాయి. మిడ్‌మానేరు, లోయర్ మానేరు రిజర్వాయర్లకు గణనీయంగా ప్రవాహాలు వస్తున్నాయి.
- ఖమ్మం ఉమ్మడి జిల్లాలోని చాలా ప్రాంతాల్లో వాగులు వంకలు ఉప్పొంగాయి. రహదారులపై వరద ప్రవహించడంతో రాకపోకలకు ఇబ్బంది ఎదురైంది. పాలేరు, కిన్నెరసాని రిజర్వాయర్లు గరిష్ట స్థాయికి చేరాయి.
- రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో భారీ వానలతో కాగ్నా, మూసీ, ఈసీ, బెల్కటూర్, రాస్నం వాగు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. కోట్‌పల్లి, లఖ్నాపూర్, జుంటుపల్లి ప్రాజెక్టులు అలుగు పారుతున్నాయి. పలుచోట్ల పొలాలు నీట మునిగాయి.
- ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలో ఓ మోస్తరు వానలు పడ్డాయి. సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని శ్రీమన్నారాయణ కాలనీ, భవానీ నగర్ ప్రాంతాల్లో ఇళ్లు నీట మునిగాయి. యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలంలో బిక్కేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. పత్తి చేన్లు నీట మునిగాయి. బొమ్మలరామారం మండలంలో మూడు ఇళ్లు కూలిపోయాయి.

వాగులో కొట్టుకుపోయి ఇద్దరు యువతులు మృతి

మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం కొండేడ్‌కు చెందిన పడకంటి కేశవులుకు దుందుభి వాగు అవతల వ్యవసాయ భూమి ఉంది. ఇటీవలే అందులో పత్తి సాగు చేపట్టారు. మంగళవారం కేశవులు కుమార్తె స్వాతి (18), వరుసకు సోదరి అయ్యే అనూష (19) కలసి పత్తి చేనులో మందు చల్లేందుకు వెళ్లారు. కానీ దుందుభి వాగు దాటే క్రమంలో వరదలో కొట్టుకుపోయారు. కొంతసేపటికి స్వాతి తల్లి నాగమ్మ, మరికొందరు కూలీలు చేనుకు వెళ్లేందుకు వాగు దగ్గరికిరాగా.. నీళ్ల బిందె, టిఫిన్ బాక్సు కనిపించాయి. గ్రామస్తులు గాలింపు చేపట్టగా రెండు గంటల తర్వాత కిలోమీటర్ దూరంలోని చిన్న ఆదిరాల శివారులో స్వాతి, అనూషల మృతదేహాలు కనిపించాయి. దీంతో వారి కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు.

బడి చుట్టూ చెరువులా..



భారీ వర్షాల కారణంగా పెద్దపల్లి జిల్లా రాఘవాపూర్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణ చెరువులా మారిన దృశ్యమిది. మోకాలి లోతు నీరు నిలవడంతో తరగతి గదులకు చేరుకునేందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ఇక పెద్దపల్లి తహసీల్దార్ కార్యాలయం, ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో నీరు నిలిచింది.



ఉధృతంగా ప్రవహిస్తున్న గుండ్లమడుగు వాగు

కొట్టుకుపోయిన డైవర్షన్ రోడ్లు

సాక్షి, హైదరాబాద్: వరుసవర్షాల ధాటికి డైవర్షన్ రోడ్లు దెబ్బతిన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 26 ప్రాంతాల్లో వంతెనల వద్ద ఏర్పాటు చేసిన మళ్లింపు రోడ్లు కొట్టుకుపోయాయి. ఆయా ప్రాంతాల్లో వాగులు పొంగి, మళ్లింపు రోడ్ల ఆనవాళ్లే లేకుండా పోవడంతో రాకపోకలు కష్టతరమవుతున్నాయి.

- ఆదిలాబాద్ జిల్లాలో ఇచ్చోడ, బోథ్, నేరేడుగొండ, బదహత్నూరు ప్రాంతాల్లో మళ్లింపు రోడ్లు కొట్టుకుపోయాయి. జైనథ్‌బేలా ప్రధాన రోడ్డు కూడా దెబ్బతింది. ఒక్క ఆదిలాబాద్‌లోనే 9 కి.మీ. మేర ప్రధాన రోడ్లకు నష్టం వాటిల్లింది.
- కామారెడ్డి జిల్లాలో ఐదు ప్రాంతాల్లో రోడ్లు బాగా దెబ్బతిన్నాయి. మిగతా ప్రాంతాల్లో జిల్లాకు ఒకటి రెండు చోట్ల వాటికి నష్టం వాటిల్లింది.
- రాజీవ్ రహదారిలో శామీర్‌పేట నుంచి ప్రజ్ఞాపూర్ మధ్య దాదాపు నాలుగు కిలోమీటర్ల మేర రోడ్డు గుంతలమయంగా మారింది.
- డైవర్షన్ రోడ్లు దెబ్బతిన్న కారణంగా 20 చోట్ల ఎగువ ప్రాంతాలతో అనుసంధానం లేకుండాపోయింది.దాదాపు రూ.100 కోట్లతోపునరుద్ధరణ చర్యలు చేపడుతున్నారు. ముఖ్యంగా మళ్లింపుదారులు పూర్తిగా కొట్టుకుపోయిన చోట వెంటనే తాత్కాలిక రోడ్లు ఏర్పాటు చేసే పనులు ప్రారంభించారు. రాజీవ్ రహదారిపై ప్యాచ్ వర్క్ మొదలుపెట్టారు.



నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ చెరువు కట్ట తెగిపోవడంతో కొట్టుకుపోయిన భీమ్‌గల్ ప్రధాన రహదారి


వానాకాలం వస్తే వణుకే..

గూడూరు: వానాకాలం వచ్చిందంటే ఆ గ్రామ ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బతకాల్సిందే. సరైన రోడ్డు, వాగులపై వంతెనలు లేక.. ఏటా రెండు, మూడు నెలలు బాహ్య ప్రపంచానికి దూరంగా ఉండాల్సిందే. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని మట్టెవాడ జీపీ పరిధిలో దొరవారి తిమ్మాపురం గ్రామం దుస్థితి ఇది. అడవిలో ఉన్న ఈ గ్రామం మట్టెవాడ నుంచి 14 కిలోమీటర్ల దూరంలో ఉండగా.. అందులో ఎనిమిది కిలోమీటర్ల మేర మట్టి దారే. పైగా మధ్యలో వాగులు, వంకలు. సోమవారం రాత్రి కురిసిన వానకు గుండ్లమడుగు వాగు పోటెత్తడంతో ఈ గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. కావాల్సిన సరుకులు ముందే తెచ్చిపెట్టుకుంటున్నామని, కానీ ఏదైనా ఆపద వస్తే ప్రాణాలు కాపాడుకోవడం కష్టమేనని గ్రామస్తులు వాపోతున్నారు. తమ గ్రామానికి రోడ్డును, వంతెనను నిర్మించాలని కోరుతున్నారు.



దొరవారితిమ్మాపురం

నేడు, రేపు విద్యాసంస్థలకు సెలవు



సాక్షి, హైదరాబాద్: ఎడతెరిపిలేకుండా భారీ వర్షాలు కురుస్తుండటంతో బుధ, గురువారాలు రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. ఈ మేరకు వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి సూచించారు. అనంతరం విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ అన్ని విద్యాసంస్థలకు బుధ, గురువారం సెలవులంటూ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఇది అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు వర్తిస్తుందని పేర్కొన్నారు. వర్షాల నేపథ్యంలో విద్యాసంస్థల పరిస్థితిపై ప్రభుత్వం ఆరా తీసింది. దీంతో ఉన్నతాధికారులు జిల్లాల నుంచి సమాచారం సేకరించారు. అనేకచోట్ల విద్యార్థుల హాజరు తగ్గిందని, బడులకు వచ్చే అవకాశం లేదని జిల్లా విద్యాశాఖాధికారులు తెలిపారు. దాదాపు 6 వేల బడుల్లో 30 శాతం హాజరు కూడా కన్పించలేదని తెలిసింది. వర్షాలు పడుతుండటంతో బడుల్లో మధ్యాహ్న భోజనం వండటానికీ అష్టకష్టాలు పడుతున్నారు. భోజనం వండే అవకాశం ఉండటం లేదని, తరగతి గదులకు సమీపంలోని వరండాల్లో వండటం వల్ల పొగతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని పలువురు హెచ్‌ఎంలు చెప్పారు. అన్నిచోట్ల రవాణా వ్యవస్థ స్తంభించిందని, రాకపోకలు నిలిచిపోతున్నాయని అధికారులు తెలిపారు. ఈ పరిస్థితులను అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సీఎం కేసీఆర్ స్పందించి సెలవులు ఇవ్వాలని మంత్రి సబితను ఆదేశించారు.

గోదావరిలో పెరుగుతున్న వరద!

- ప్రాణహిత పరీవాహకంలో భారీ వర్షాల ప్రభావం
- అటు కృష్ణా ప్రాజెక్టులకూ గణనీయంగా ప్రవాహాలు
- వారం రోజుల్లో శ్రీశైలం రిజర్వాయర్‌కు వరద మొదలు!


సాక్షి, హైదరాబాద్: పరీవాహక ప్రాంతాల్లో విస్తారంగా వానలు పడుతుండటంతో గోదావరి నదిలో మళ్లీ వరద పెరుగుతోంది. ఎగువన శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి 39,443 క్యూసెక్కుల వరద వస్తోంది. నీటి నిల్వ 64.37 టీఎంసీలకు చేరింది. కామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్, సంగారెడ్డి జిల్లాలోని సింగూరు ప్రాజెక్టులకు ఇన్‌ఫ్లో పెరిగింది. ఎల్లంపల్లి ప్రాజెక్టుకు 59,507 క్యూసెక్కులు వస్తుండగా వరద అంతా దిగువకు వదిలేస్తున్నారు. ఇక ప్రాణహిత, ఇంద్రావతి ఉప నదుల నుంచి భారీ ప్రవాహం కొనసాగుతోంది. దీనితో మేడిగడ్డ (లక్ష్మి) బ్యారేజీకు 5,87,360 క్యూసెక్కులు, సమ్మక్క బ్యారేజీకు 7,43,650 క్యూసెక్కుల వరద వస్తోంది. భద్రాచలం వద్ద మంగళవారం సాయంత్రం 5 గంటలకు వరద 7,59,015 క్యూసెక్కులకు చేరగా, నీటి మట్టం 38.9 అడుగులకు పెరిగింది. ఎగువన భారీ వర్షాల నేపథ్యంలో ప్రాణహితకు భారీగా వరద రానుందని.. దీనితో బుధవారం రాత్రికల్లా భద్రాచలం వద్ద ప్రవాహం 10 లక్షల క్యూసెక్కులకు పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

శ్రీశైలానికి వారంలో వరద

కృష్ణా నదిపై కర్ణాటకలోని ఆల్మట్టి డ్యామ్‌కు 1,16,263 క్యూసెక్కుల వరద వస్తోంది. నీటి నిల్వ 74.22 టీఎంసీలకు చేరింది. మరో 55 టీఎంసీలు వస్తే డ్యామ్ నిండి నీటిని దిగువకు విడుదల చేస్తారు. పశ్చిమ కనుమల్లో భారీ వానలతో వరద పెరుగుతోందని, మూడు, నాలుగు రోజుల్లో ఆల్మట్టి గేట్లను ఎత్తే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దాని దిగువన నారాయణపూర్, జూరాల ప్రాజెక్టుల్లో నీటి నిల్వ గణనీయంగా ఉండటంతో.. వారం రోజుల్లోగా శ్రీశైలం ప్రాజెక్టుకు వరద మొదలవుతుందని భావిస్తున్నారు. ఇక తుంగభద్ర డ్యామ్‌లోకి 72,489 క్యూసెక్కులు చేరుతున్నాయి. నీటి నిల్వ 31.66 టీఎంసీలకు చేరింది. దిగువన నాగార్జునసాగర్‌లో 6,438 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.

'పాలమూరు'పై 31న భేటీ

- తెలంగాణ, ఏపీతో సమావేశం కానున్న జలశక్తి శాఖ
- ప్రాజెక్టుకు 90 టీఎంసీల కేటాయింపుపై ఏపీ అభ్యంతరాలు
- దీనిపై ఇప్పటికే విచారణ ముగించిన బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్



సాక్షి, హైదరాబాద్: పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి 90 టీఎంసీల కృష్ణా జలాలు కేటాయిస్తూ తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల అమలును అడ్డుకోవాలంటూ ఏపీ ఫిర్యాదు చేసిన నేపథ్యంలో కేంద్ర జలశక్తి శాఖ ఈ నెల 31న ఆ రెండు రాష్ట్రాలతో సమావేశం కానుంది. పోలవరం ద్వారా కృష్ణాకు మళ్లించనున్న 80 టీఎంసీల గోదావరి జలాలకు బదులుగా సాగర్ ఎగువన ఉన్న రాష్ట్రాలు 80 టీఎంసీల కృష్ణా జలాలను వాడుకోవడానికి గతంలో బచావత్ ట్రిబ్యునల్ అనుమతి ఇచ్చింది. ఇందులో మహారాష్ట్ర, కర్ణాటక వాటాలు పోను మిగిలిన 45 టీఎంసీలతో పాటు మైనర్ ఇరిగేషన్‌లో పొదుపు చేసిన 45 టీఎంసీలు కలిసి మొత్తం 90 టీఎంసీలను పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు కేటాయిస్తూ గతంలో తెలంగాణ జీవో జారీ చేసింది. ఈ జీవోపై ఏపీ చేసిన ఫిర్యాదుపై ఇప్పటికే బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ రెండు రాష్ట్రాల వాదనలు విని విచారణ ముగించింది. తీర్పు వెలువడాల్సి ఉంది. అయితే ఎగువ రాష్ట్రాలకు కేటాయించిన కృష్ణా జలాల్లో మహారాష్ట్ర, కర్ణాటకల వాటాలు పోగా మిగిలిన 45 టీఎంసీలపై ఉమ్మడి ఏపీ రాష్ట్రానికి హక్కు ఉందని, తెలంగాణ ఆ నీళ్లను వినియోగించుకోవాలంటే విధిగా ఏపీతో ఒప్పందం చేసుకోవాల్సిందేనని ఇటీవల కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) తేల్చి చెప్పింది. ఈ మేరకు తెలంగాణకు లేఖ రాసింది. అయితే సాగర్ ఎగువన తెలంగాణలోనే కృష్ణా బేసిన్ ఉందని, అందువల్ల 45 టీఎంసీలు తమకే దక్కుతాయని తెలంగాణ వాదిస్తోంది. పోలవరం ప్రాజెక్టు ఏపీలో ఉందని, దాని ద్వారా తరలించనున్న 80 టీఎంసీలతో ఏపీలోని కృష్ణా డెల్టాకు ప్రయోజనం కలగనుందని, ఇందుకు బదులుగా కేటాయించిన కృష్ణా జలాల్లో తెలంగాణకు మాత్రమే హక్కు ఉంటుందని స్పష్టం చేస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్ర జలశక్తి సమావేశాన్ని తలపెట్టడం ఆసక్తికరంగా మారింది.

పూర్తయిన తెలంగాణ మీడియా అకాడమీ నిర్మాణం

త్వరలో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభం: అల్లం నారాయణ



సాక్షి, హైదరాబాద్: కార్పొరేట్ భవనంలా తెలంగాణ మీడియా అకాడమీ భవన నిర్మాణం పూర్తయిందని, త్వరలో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభించుకుంటామని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ తెలిపారు. భవన నిర్మాణంలో కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ, జర్నలిస్టుల పట్ల ఆయనకు ఉన్న చిత్త శుద్ధితోనే ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. మంగళవారం పౌర సంబంధాలశాఖ ప్రత్యేక కమిషనర్ అశోక్‌రెడ్డి, డైరెక్టర్ రాజ మౌళి తదితరులతో కలిసి అకాడమీ భవన నిర్మాణాన్ని ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నాంపల్లిలోని పాత అకాడమీ స్థానంలో ఉన్న వేయి గజాల్లో రూ. 15 కోట్లతో నాలుగు అంతస్తుల్లో ఈ భవనం నిర్మించారని చెప్పారు. జర్నలిస్టుల కోసం నాలుగు తరగతి గదులు, కార్యాలయ సిబ్బంది కోసం ఒక అంతస్తు, రెండంతస్తుల్లో 250 మంది కూర్చునే సామర్థ్యంతో ఆడిటోరియం, గ్రంథాలయం, చైర్మన్, తదితరులకు ప్రత్యేకగదులు నిర్మించామన్నారు. ప్రారంభోత్సవానికి సీఎం కేసీఆర్‌ను ఆహ్వానించామని, ఆయన ఆమోదం కోసం చూస్తున్నామని అల్లం నారాయణ వెల్లడించారు.

ఆరు వారాల్లో నివేదిక అందజేయండి

'వినియోగదారుల కమిషన్'పై ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ అధ్యక్షుడి నియామకానికి ఆరు వారాలు గడువిస్తున్నామని, ఆలోగా నియామకం చేపట్టి నివేదిక అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. కీలక పోస్టులు భర్తీ చేయకుండా ఖాళీగా ఉంచడం సరికాదని స్పష్టంచేసింది. తదుపరి విచారణను 8 వారాలకు వాయిదా వేసింది. రాష్ట్ర ప్రభుత్వం.. కమిషన్ అధ్యక్షుడిని వెంటనే నియమించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ న్యాయవాది, వినియోగదారుల రక్షణ చట్టం పుస్తక సహ రచయిత బాగ్లేకర్ ఆకాశ్‌కుమార్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ వినోద్‌కుమార్ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. న్యాయవాది ఆకాశ్ వాదనలు వినిపించారు. ప్రభుత్వం నియామక ప్రక్రియ ప్రారంభించిందని, 4 వారాలు గడువు కావాలని ప్రభుత్వ న్యాయవాది కోరారు. దీంతో ధర్మాసనం విచారణను సెప్టెంబర్ 6కు వాయిదా వేసింది.

రాష్ట్రానికి రెడ్ అలర్ట్

▶ మొదటి పేజీ తరువాయి

ఈ వర్షాల ప్రభావం కనిపించడం మొదలైంది. ఉమ్మడి నిజామాబాద్, వరంగల్, మెదక్, నల్లగొండ జిల్లాల పరిధిలో పలుచోట్ల అతి భారీ వర్షాలు కురిశాయి. నిజామాబాద్ జిల్లాలో అయితే రికార్డు స్థాయిలో వానలు పడ్డాయి. ఇక రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌నూ వాన వణికిస్తోంది. రోడ్లపై నీళ్లు నిలవడంతో వాహనాల ట్రాఫిక్ ఇబ్బందిగా మారింది.

రికార్డు స్థాయిలో వానలు..

మంగళవారం రాష్ట్రంలో సగటున 4.39 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. నిజామాబాద్‌తోపాటు జనగాం, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, హనుమకొండ, వరంగల్, సిద్దిపేట, మహబూబాబాద్, ఖమ్మం, మంచిర్యాల, కరీంనగర్, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో పలుచోట్ల అతి భారీ వర్షాలు కురిసినట్టు వెల్లడించింది. సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు 24 గంటల్లో నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండల కేంద్రంలో ఏకంగా 46.3 సెంటీమీటర్ల అత్యంత భారీ వర్షపాతం నమోదైనట్టు ప్రకటించింది. అదే జిల్లా ఆర్మూరు మండలం పెర్కిట్‌లో 33.1, వరంగల్ జిల్లా సంగెం మండలం కాపుల కనపర్తిలో 29.4, నిజామాబాద్ జిల్లా భీంగల్‌లో 26.4, జనగాం జిల్లా కునూర్‌లో 24.2, నిజామాబాద్ జిల్లాలోని కోనసమందర్‌లో 22.6, జక్రాన్‌పల్లిలో 22.2 సెంటీమీటర్ల కుంభవృష్టి కురిసింది. హైదరాబాద్‌లో గరిష్టంగా చార్మినార్ ప్రాంతంలో 7.3 సెంటీమీటర్ల వాన పడింది.

25 జిల్లాల్లో అధిక వర్షపాతం

రాష్ట్రంలో నైరుతి రుతుపవనాల సీజన్ ప్రారంభమైన తర్వాత తొలి నెల రోజుల పాటు వర్షపాతం లోటు ఉండగా.. గత వారం రోజుల్లో అధిక వర్షపాతానికి చేరింది. వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో ఏకంగా 60శాతం అధికంగా వానలు పడగా.. నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, ఆదిలాబాద్, నిర్మల్, కామారెడ్డి, జనగాం, వరంగల్, కొమురంభీం, మేడ్చల్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నారాయణపేట్, జగిత్యాల, హైదరాబాద్, యాదాద్రి భువనగిరి, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, హన్మకొండ, వనపర్తి, మంచిర్యాల జిల్లాల్లో 20 నుంచి 59 శాతం వరకు అధిక వర్షపాతం నమోదైంది. మిగతా ఎనిమిది జిల్లాల్లో సాధారణ స్థాయిలో వానలు పడ్డాయి.

3 రోజులు జాగ్రత్త

బంగాళాఖాతంలో సోమవారం ఏర్పడిన అల్పపీడనం మంగళవారం ఉదయానికి తీవ్ర అల్పపీడనంగా బలపడింది. ఇది మరో 24 గంటల్లో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని.. దీనికితోడు రుతుపవన ద్రోణి ప్రభావంతో తెలంగాణలో వచ్చే మూడు రోజులు భారీ వర్షాలు పడతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మూడు రోజులు జాగ్రత్తగా ఉండాలంటూ రెడ్ అలర్ట్ ప్రకటించింది. కొన్ని జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు పడతాయని.. ఉరుములు, మెరుపులతోపాటు గంటకు 40–50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది.

పొలాల్లో రైతులు సెల్‌ఫోన్లు వాడొద్దు

రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు జాగ్రత్తగా ఉండాలి. పొలాల్లో నీళ్లు నిలవకుండా చూసుకోవాలి. పొలాల్లో ఉన్న సమయంలో వాన, ఉరుములు, మెరుపులు వస్తుంటే రైతులు, ఇతరులు ఎవరైనా సెల్‌ఫోన్లు వాడొద్దు. అలా వాడితే పిడుగులు పడే ప్రమాదం ఉంటుంది. పొలాల్లో ఉన్నప్పుడు నేలపై కూర్చోవాలి. ఎత్తుగా నిలబడి ప్రయాణం చేయవద్దు. విద్యుత్ స్తంభాలు, చెట్ల కింద కూడా నిలబడొద్దు.

– నాగరత్న, హైదరాబాద్ వాతావరణ కేంద్రం డైరెక్టర్

రాష్ట్రంలో అధిక వర్షపాతం నమోదైన ప్రాంతాలివీ..

ప్రాంతం	వర్షపాతం	ప్రాంతం	వర్షపాతం
వేల్పూర్	46.3	ఇస్సాపల్లి	8.0
పెర్కిట్	33.1	కమ్మర్‌పల్లి	7.5
భీంగల్	26.4	డిచ్‌పల్లి	7.3
కోనసముందర్	22.6	బాల్కొండ	7.2
జక్రాన్‌పల్లి	22.2	మగిడి	7.0
కోరాట్‌పల్లి	17.2	తొండాకూర్	6.8
మోర్తాడ్	11.2	సిరికొండ	6.5
ధర్పల్లి	9.7	బెల్లాల్	6.4
ఆలూర్	8.7	తుంపల్లె	6.1
మంచిర్యాల	8.3	నిజామాబాద్	5.6
గోపన్నపల్లి	8.2		

(సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు.. సెంటీమీటర్లలో)

క్లుప్తంగా...

విభజన చట్టం అమలుపై 31 సమీక్షా సమావేశాలు

లోక్‌సభలో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానంద రాయ్



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014 అమలుపై తెలంగాణ, ఏపీ రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర ప్ర భుత్వ వివిధ మంత్రి త్వ శాఖలతో కేంద్ర హోంశాఖ ఇప్పటివరకు 31 సమీక్షా సమావేశాలు నిర్వహించిందని హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ తెలిపారు. ఇప్పటికే అనేక అంశాలు అమలు చేశామని, మిగిలిన అంశాల అమలు వివిధ దశల్లో ఉందని పేర్కొన్నారు. అంతేగాక పున ర్విభజన చట్టం అమలుకు సంబంధించి రెండు రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి సహకారంతోనే వివాదాలు పరిష్కారం అవుతాయని ఎంపీలు వైఎస్ అవినాశ్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మన్నె శ్రీనివాస్‌రెడ్డిలు అడిగిన ప్రశ్నలకు మంగళవారం కేంద్రమంత్రి లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

రాష్ట్రంలోని ప్రముఖులతో భేటీకానున్న అమిత్‌షా

ఏర్పాట్లపై కిషన్‌రెడ్డి సమీక్ష



సాక్షి, హైదరాబాద్: బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా 29న రాష్ట్రానికి రానున్న నేపథ్యంలో..అందుకు సంబంధించిన పర్యటన ఏర్పాట్లను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి సమీక్షించారు. మంగళవారం రాత్రి బీజేపీ కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకులతో జరిపిన సమీక్షలో అమిత్ షా పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను చర్చించారు. తెలంగాణ మేధావులు, కవులు, కళాకారులు, ఉద్యమకారులు, వివిధ రంగాల ప్రముఖులతో అమిత్ షా భేటీ అయ్యేలా ఓ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యక్రమంతో పాటుగా పార్టీ రాష్ట్ర శాఖ పదాధికారులు, తెలంగాణలోని అసెంబ్లీ నియోజకవర్గాల కన్వీనర్లు, జిల్లాల అధ్యక్షులు, ఇతర ముఖ్యనేతలతోనూ అమిత్ షా భేటీ కానున్నారు. ఈ సమావేశం సందర్భంగా.. తెలంగాణలో పార్టీని అధికారంలోని తీసుకొచ్చే విషయంలో పార్టీ కేడర్‌కు షా దిశా నిర్దేశం చేయనున్నారు.

మునిగిన కాళేశ్వరం ప్రాజెక్టుతో అప్పు ఎలా తీర్చారు?

సీఎం వ్యాఖ్యలపై ట్విట్టర్ వేదికగా వైఎస్ షర్మిల ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్: రూ.1.49 లక్షల కోట్లతో 'కాళేశ్వరం తిప్పిపోతల పథకం' కట్టిన ఘనుడు సీఎం కేసీఆర్ అని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఎద్దేవా చేశారు. కాళేశ్వరం అప్పులు తీరినయ్ అంటూ సీఎం చేసిన వ్యాఖ్యలపై మంగళవారం ట్విట్టర్ వేదికగా ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడేళ్లకే మునిగిన ప్రాజెక్టుతో రూ.80 వేల కోట్ల అప్పు ఎలా తీర్చారని నిలదీశారు. రోజుకు 3 టీఎంసీలు అని చెప్పి, అర టీఎంసీ కూడా ఎత్తలేని ప్రాజెక్టు బాకీలు తీర్చిందా? లేదా ఎత్తిపోసిన 157 టీఎంసీలలో 100 టీఎంసీలను గోదాట్లో పోసినందుకు బాకీలు తీరినయా? అని ప్రశ్నించారు. 70 ప్రాజెక్టుల పాత ఆయకట్టును కనికట్టు చేసి కొత్త ఆయకట్టుగా చూపి.. కాళేశ్వరం ఖాతాలో వేసినంత మాత్రాన కోటి ఎకరాలను తడిపినట్లు కాదన్నారు. విస్తారంగా వర్షాలు పడి, పాత ప్రాజెక్టులు నిండినయే తప్ప.. తమ కాసులధార కాళేశ్వరం ఒక్కటే నింపలేదని షర్మిల విమర్శించారు. తొమ్మిదేళ్లలో 15 లక్షల కొత్త బోర్లు పడ్డాయంటే తమ డ్రీమ్స్ ప్రాజెక్ట్ అంతా బోగస్ అని తేలిపోయిందన్నారు. ఫలితం లేని ప్రాజెక్ట్ కాళేశ్వరం అని, నిర్వహణ కింద ఏటా రూ.23 వేల కోట్లు బూడిదలో పోసిన పన్నీరుతో సమానమేనని మండిపడ్డారు. రైతులకు ఉన్న అప్పుల్లో దేశంలోనే తెలంగాణ ఐదో స్థానంలో ఉందని పేర్కొంటూ.. రైతుల ఆదాయంలో 25వ స్థానంలో నిలిచిందని షర్మిల తెలిపారు.

కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చేందుకు కార్యాచరణ

చెరకు సుధాకర్ నేతృత్వంలో ముందుకెళ్లాలని ఉద్యమకారుల నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకు రావడమే ధ్యే యంగా ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్లాలని ఆ పార్టీలోని తెలంగాణ ఉద్యమకారులు నిర్ణయించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ నివాసంలో మంగళవారం తెలంగాణ కాంగ్రెస్ ఉద్యమ కారులు సమావేశమై చర్చించారు. తెలంగాణ ఉద్యమ లక్ష్యాలను నేరవేర్చే విధంగా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను రూపొందించాలని, రాష్ట్రంలోని బీఆర్ఎస్, బీజేపీయేతరపార్టీలు, ప్రజాస్వామిక శక్తులు, ప్రజా, కుల, కార్మిక సంఘాలను సమీకరించాలని నిర్ణయించారు. తెలంగాణ ఉద్యమకారులకు పార్టీ అవకాశాలు కల్పించే విధంగా ఢిల్లీ పెద్దలను కలవాలన్న ప్రతిపాదనపై ఈ సమావేశంలో ఏకాభిప్రా యానికి వచ్చారు. తెలంగాణ ఉద్యమకారుడు, టీపీసీసీ ఉపాధ్యక్షుడు చెరకు సుధాకర్ నాయకత్వంలో ముందుకెళ్లాలని ఈ సమా వేశంలో నిర్ణయించారు. ఈ కమిటీకి మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్‌ను సమన్వయకర్తగా ఎన్నుకున్నారు.

కారు.. టార్గెట్ పదహారు

అసెంబ్లీ ఎన్నికలతో పాటు లోక్‌సభ ఎన్నికలపైనా కేసీఆర్ నజర్

- జాతీయ పార్టీగా బీఆర్ఎస్ ఉన్న నేపథ్యంలో క్లీన్ స్వీప్ కోసం ఆరాటం
- ఒక్కసారి కూడా గెలవని మల్కాజిగిరి, సికింద్రాబాద్‌పై ఫోకస్
- గతంలో కాంగ్రెస్, బీజేపీ గెలిచిన స్థానాలపై మొదలైన కార్యాచరణ
- జాతీయ స్థాయిలో కనీసం 75 నుంచి వంద స్థానాల్లో పోటీ చేసే యోచన



సాక్షి, హైదరాబాద్: ఏడాది చివరలో జరిగే రాష్ట్ర శాసనసభ ఎన్నికలతో పాటు వచ్చే ఏడాదిలో జరిగే లోక్‌సభ ఎన్నికలపైనా భారత్ రాష్ట్ర సమితి అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు దృష్టి సారించారు. రాష్ట్రంలో 17 లోక్‌సభ స్థానాలు ఉండగా 2019 లోక్‌సభ ఎన్నికల్లో 'కారు.. పదహారు' నినాదంతో బరిలోకి దిగిన బీఆర్ఎస్ రానున్న లోక్‌సభ ఎన్నికల్లోనూ అదే నినాదాన్ని ఎంచుకోనుంది. జాతీయ పార్టీగా బీఆర్ఎస్ ఆవిర్భవించిన నేపథ్యంలో సొంత రాష్ట్రంలో హైదరాబాద్ మినహా 16 లోక్‌సభ స్థానాలనూ క్లీన్‌స్వీప్ చేయాలని భావిస్తోంది.

ఆ రాష్ట్రాల్లోనూ బీఆర్ఎస్ పోటీ!

ఇక మహారాష్ట్రలోని 48 లోక్‌సభ నియోజకవర్గాల్లోనూ పోటీ చేస్తామని ఇప్పటికే కేసీఆర్ ప్రకటించిన సంగతి తెలిసిందే. జాతీయ స్థాయిలో కనీసం 75 నుంచి వంద లోక్‌సభ స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు పోటీలో నిలిచే అవకాశమున్నట్లు పార్టీ వర్గాలు చెప్తున్నాయి. మహారాష్ట్రతో పాటు ఏపీ, కర్ణాటక, మధ్యప్రదేశ్‌తో పాటు మరికొన్ని రాష్ట్రాల్లోనూ బీఆర్ఎస్ అభ్యర్థులు లోక్‌సభ ఎన్నికల బరిలోకి దిగే అవకాశముంది.

చేరికలు, పదవుల పందేరంపై దృష్టి

2019 లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో బీఆర్ఎస్ తొమ్మిది స్థానాల్లో గెలుపొందగా, బీజేపీ నాలుగు, కాంగ్రెస్ మూడు, ఎంఐఎం ఒక్కో స్థానంలో గెలుపొందిన విషయం తెలిసిందే. గత లోక్‌సభ ఎన్నికల అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 16 స్థానాల్లో గెలుపొందడానికి అవసరమైన వ్యూహాన్ని ఆచరణలో పెట్టడంపై కేసీఆర్ దృష్టి కేంద్రీకరించారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు లక్ష్యంగా ఇతర పార్టీల నుంచి చేరికలు ప్రోత్సహించడం, సొంత పార్టీ నేతలకు పదవుల సర్దుబాటు, విపక్షాలను బలహీనపరచడం, ఎన్నికల నిధుల సమీకరణ తదితరాలను దృష్టిలో పెట్టుకుని కసరత్తు చేస్తున్నారు.

ఆ రెండు సీట్ల నుంచి మళ్లీ వారిద్దరే?

తెలంగాణ రాష్ట్ర సమితిగా 2001లో ఆవిర్భవించింది మొదలుకుని ఇప్పటి వరకు హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు ఒక్కసారి కూడా విజయం సాధించలేదు. మిత్రపక్షమైన ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ హైదరాబాద్ లోక్‌సభ స్థానంలో గెలుపొందారు. మరోవైపు మల్కాజిగిరి నుంచి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సికింద్రాబాద్ నంచి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఏడాది చివరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి, కిషన్‌రెడ్డి పోటీ చేసే అవకాశముంది. ఆ తర్వాత జరిగే పరిణామాల్లో ఈ ఇద్దరు నేతలు తిరిగి అవే స్థానాల నుంచి లోక్‌సభకు పోటీ చేస్తారా లేదా అనే అంశంపై స్పష్టత వస్తుంది. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి ఓటమి పాలైన మర్రి రాజశేఖర్‌రెడ్డి (మల్కాజిగిరి), తలసాని సాయికిరణ్ (సికింద్రాబాద్)లు మరోమారు పోటీ చేయనున్నట్లు తెలుస్తోంది.

ప్రభాకర్‌రెడ్డికి ఈసారి దుబ్బాక అసెంబ్లీ సీటు?

మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ఇప్పటికే దుబ్బాక అసెంబ్లీ స్థానంపై ఫోకస్ చేసి పోటీ చేసేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి, మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి, మైనంపల్లి రోహిత్‌రావు వంటి పేర్లు కూడా తెరమీదకు వచ్చే అవకాశముంది. పెద్దపల్లి, చేవెళ్ల, నాగర్‌కర్నూలు, ఖమ్మంలో ప్రస్తుత అభ్యర్థులే కొనసాగనుండగా, వరంగల్, మహబూబాబాద్, మహబూబ్‌నగర్ అభ్యర్థుల పేర్లు రాష్ట్ర శాసనసభ ఎన్నికలపై ఆధారపడి ఉంటాయని బీఆర్ఎస్ వర్గాలు చెప్తున్నాయి.

బీజేపీ, కాంగ్రెస్ స్థానాలపై నజర్

కాంగ్రెస్ ప్రాతినిధ్యం వహిస్తున్న భువనగిరి, నల్లగొండ లోక్‌సభ స్థానాలకు సంబంధించి ఇప్పటికే సీఎం కేసీఆర్ వ్యూహాన్ని ఖరారు చేసినట్లు సమాచారం. యాదాద్రి భువనగిరి జిల్లా డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డిని భువనగిరి నుంచి లోక్‌సభకు పంపే యోచనతోనే బీఆర్ఎస్‌లో చేర్చుకున్నట్లు పార్టీ వర్గాలు చెప్తున్నాయి. బీసీ కోటాలో రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సంస్థ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ భువనగిరి లేదా నల్లగొండ నుంచి లోక్‌సభకు పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. మరోవైపు బీజేపీ ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్ నుంచి మాజీ ఎంపీ వినోద్‌కుమార్ పేరు ఖరారు కాగా, నిజామాబాద్ నుంచి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మరోమారు పోటీ చేయనున్నారు. ఆదిలాబాద్ నుంచి మాజీ గెడాం నగేశ్ లేదా ఎన్నికల నాటికి ఉండే పరిస్థితిని బట్టి మరో అభ్యర్థిని కేసీఆర్ బరిలోకి దింపే అవకాశముంది. ఇక గతంలో మూడుసార్లు నల్లగొండ ఎంపీగా ప్రాతినిధ్యం వహించిన శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కుమారుడు అమిత్ రెడ్డి మునుగోడు లేదా నల్గొండ అసెంబ్లీ సీటును ఆశిస్తున్నట్లు చెబుతున్నారు.

అసెంబ్లీలోనూ అబద్ధాలే

- సీఎం నిజాలు మాట్లాడడం లేదు
- ఉద్యోగులను తొక్కేశారు... కేసీఆర్‌పై ఈటల ధ్వజం



సాక్షి, హైదరాబాద్: సీఎం కేసీఆర్ బయటే కాకుండా శాసనసభలోనూ అబద్ధాలే మాట్లాడుతున్నారని బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్, శాసనసభ్యుడు ఈటల రాజేందర్ విమర్శించారు. మంగళవారం ఆయన బీజేపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్రంలో ఎవరైనా హక్కుల కోసం సమ్మె చేస్తే శంకరగిరి మాన్యాలు పట్టిస్తున్నారు. అధికారంలోకి రాగానే 1700 మంది మున్సిపల్ కార్మికులను తీసివేశారు. ఆర్టీసీలో సమ్మె చేసి 39 మంది చనిపోయినా కనికరించలేదు. ఆయా కుటుంబాల ఉసురు తగిలి ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కేసీఆర్ సర్కారు పతనం ఖాయం'అని ఈటల ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాళేశ్వరంపై పచ్చి అబద్ధాలు: 'కాళేశ్వరం కోసం ఖర్చు చేసిన డబ్బులు వెనక్కు వచ్చాయని సీఎం కేసీఆర్ పచ్చి అబద్ధాలు చెప్తున్నారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు రూ.16,200 కోట్ల అంచనాతో మొదలై కాంగ్రెస్ హయాంలో రూ.34 వేల కోట్లకు పెరిగింది. దానిని కేసీఆర్ తొలుత రూ.84 వేల కోట్లకు.. చివరికి రూ.లక్ష కోట్లకు పెంచేశారు. కానీ కాళేశ్వరం వల్ల ఒరిగింది ఏమీ లేదు. దేవుడు కరుణించి మంచి వర్షాలు పడి భూగర్భ జలాలు పెరిగాయే తప్ప కాళేశ్వరం వల్ల కాదు. కాళేశ్వరం కట్టినప్పటి నుంచి ఇప్పటివరకు 155 టీఎంసీల నీటిని ఎత్తిపోసారు. 150 టీఎంసీల నీటితో రూ.600 కోట్ల పంట పండి ఉంచవచ్చు. కానీ మొత్తం డబ్బు వాపస్ వచ్చింది అంటే వినడానికి ఎడ్డోల్లమా?'అని ప్రశ్నించారు. 'కాళేశ్వరం వల్ల పండే పంట కంటే పెట్టే ఖర్చు ఎక్కువ అని ఆనాడే చెప్పాం. కాళేశ్వరం అప్పు మన మనుమల్లు కూడా కట్టాలి'అని ఈటల వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో 35 శాతం మంది కౌలు రైతులకు రైతుబంధు, రైతుబీమా రావడం లేదని ఆరోపించారు.

బీజేపీలో భేటీల పర్వం..

పార్టీలో చేరేందుకు కిషన్‌రెడ్డితో, తాజాగా డీకే అరుణతో సంప్రదింపులు



సాక్షి, హైదరాబాద్: బీజేపీలో చేరికలపై కసరత్తు ముమ్మరంగా సాగుతోంది. తాజాగా పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణతో కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్సీ మాగం రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్, మాజీమంత్రి బాగారెడ్డి కుమారుడు, మెదక్ డీసీసీబీ మాజీ చైర్మన్ జైపాల్‌రెడ్డి, రంగారెడ్డి డీసీసీబీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి తదితరులు భేటీ అయ్యారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా జి.కిషన్‌రెడ్డి బాధ్యతల స్వీకరణకు ముందే వీరంతా ఆయనతో సమావేశమైనట్టు తెలిసింది. ఈ నేతలే డీకే అరుణతోనూ సమావేశం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈనెల 29న కేంద్రమంత్రి అమిత్‌షా హైదరాబాద్‌కు వస్తున్నారు. ఆయన సమక్షంలోనే వీరంతా బీజేపీ తీర్థం పుచ్చుకునే అవకాశాలున్నట్టు పార్టీవర్గాల సమాచారం. ఒకవేళ అది కుదరకపోతే ఢిల్లీ వెళ్లి అమిత్‌షా లేదా జేపీ నడ్డాల సమక్షంలో పార్టీలో చేరొచ్చు. రాష్ట్ర పార్టీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల కూడా వివిధ ఉమ్మడి జిల్లాల్లోని అధికార బీఆర్ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్ నేతలను బీజేపీలో చేర్చుకునే విషయంలో సంప్రదింపులు ముమ్మరం చేసినట్టు ఆయనకు సన్నిహితంగా ఉండే నేతలు చెబుతున్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు పార్టీపరంగా సంసిద్ధం కావడంలో భాగంగా దాదాపు ఇరవై కమిటీలను నియమించనున్నట్టు సమాచారం.

'ఇండియా' కూటమిలో బీఆర్ఎస్ భాగమే

బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ కె.లక్ష్మణ్



సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ కనుసన్నల్లోనే బీఆర్ఎస్ ఎంపీలు నడుస్తున్నారని.. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాణేనికి బొమ్మ, బొరుసు లాంటివని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ కె.లక్ష్మణ్ ఆరోపించారు. పార్లమెంట్ సమావేశాల్లో కాంగ్రెస్ వాకౌట్ అంటే వాకౌట్, బాయ్‌కాట్ అంటే బాయ్‌కాట్ అనే విధంగా బీఆర్ఎస్ వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఉన్నట్లు చిత్రీకరించేందుకు తెలంగాణలో బీఆర్ఎస్ వివాదాలకు పాల్పడుతూ, పార్లమెంట్‌లో మాత్రం పరస్పరం మద్దతు ఇచ్చుకుంటున్నారని మండిపడ్డారు. 'ఇండియా'కూటమిలో బీఆర్ఎస్ భాగంగా ఉందని విమర్శించారు. మంగళవారం ఢిల్లీలోని విజయ్‌చౌక్‌లో లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో అన్ని పార్టీల ముసుగు తొలగిపోతుందన్నారు. దొంగ నాటకాలు ఆడుతున్న బీఆర్ఎస్, కాంగ్రెస్‌లతో బీజేపీ సమదూరం పాటిస్తుందని తెలిపారు. కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీతో కలిసి బీఆర్ఎస్ పార్లమెంట్‌లో గాంధీ విగ్రహం ముందు కలిసి ధర్నాలు చేస్తోందని, బీఆర్ఎస్ అవకాశవాద రాజకీయాలను తెలంగాణ ప్రజలు గ్రహించాల్సిన అవసరముందని లక్ష్మణ్ అభిప్రాయపడ్డారు. బీఆర్ఎస్ ఎంపీలు దొంగల ముఠాలా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు.

బోయ, వాల్మీకి, వడ్డెర కులాలను ఎస్టీ జాబితాలో చేర్చండి

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీ, తెలంగాణలోని బోయ, వాల్మీకి, వడ్డెర కులాలను ఎస్టీ జాబితాలో చేర్చాలని బీజేపీ ఎంపీ కె.లక్ష్మణ్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఛత్తీస్‌గఢ్‌లో పలు కులాలను ఎస్టీ జాబితాలో చేర్చుతూ మంగళవారం రాజ్యసభలో కేంద్రం తెచ్చిన ఎస్టీ రాజ్యాంగ ఐదవ సవరణ బిల్లుపై లక్ష్మణ్ మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల్లోనూ బోయ, వాల్మీకి, వడ్డెర కులాలు ఎన్నో ఏళ్లుగా ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తున్నట్లు సభ దృష్టికి తీసుకెళ్లారు. అంతేగాక పోడు భూములపై హక్కుల కోసం పోరాడుతున్న తెలంగాణ గిరిజనులకు న్యాయం చేయాలని కేంద్ర గిరిజన శాఖమంత్రి అర్జున్ ముండాను కోరారు.

ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా కొల్లాపూర్ సభ

ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్



స్టేషన్ మహబూబ్‌నగర్: తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా ఈనెల 30న భారీస్థాయిలో కొల్లాపూర్‌లో పాలమూరు ప్రజాగర్జన సభ నిర్వహిస్తున్నట్లు ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ తెలిపారు. మహబూబ్‌నగర్ ఎనుగొండలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో సభ నిర్వహణపై ఉమ్మడి జిల్లా నాయకులు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి సంపత్ విలేకరులతో మాట్లాడారు. కొల్లాపూర్‌లో జరిగే చరిత్రాత్మక సభలో ప్రియాంకాగాంధీ రాష్ట్రంలోని మహిళలకు శుభవార్త చెబుతారని వెల్లడించారు. జూపల్లి మాట్లాడుతూ తొమ్మిదేళ్ల నుంచి ప్రజలను మభ్యపెడుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని సాగనంపడానికి ఈ సభ పెడుతున్నట్లు చెప్పారు. తన 20 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నడూ చూడలేని అవినీతి, దుర్మార్గమైన పాలన రాష్ట్రంలో కొనసాగుతున్నట్లు మండిపడ్డారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ గ్రాఫ్ రోజు రోజుకు తగ్గిపోతోందని ఏఐసీసీ ఇన్‌చార్జి సెక్రెటరీ మన్సూర్ అలీఖాన్ అన్నారు. రాష్ట్రంలో కేసీఆర్‌ను సాగనంపి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని సూచించారు. నాగర్‌కర్నూల్ డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ మాట్లాడుతూ కొల్లాపూర్ సభలో జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి తమ అనుచరులతో కాంగ్రెస్‌లో చేరుతారని తెలిపారు. సమావేశంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి, ఒబేదు ల్లా కొత్వాల్, నాయకులు మధుసూదన్ రెడ్డి, రాంమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐటీ రిటర్న్స్ ఫైలింగ్ గడువు పొడిగించండి

కేంద్ర ఆర్థికమంత్రికి బీఆర్ఎస్ ఎంపీ కేకే వినతి



సాక్షి, న్యూఢిల్లీ: ఈ నెల 31వ తేదీతో ముగియనున్న ఆదాయ పన్ను రిటర్న్స్ ఫైల్ చేసే గడువును పొడిగించాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కె.కేశవరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఢిల్లీలో బీఆర్ఎస్ ఎంపీలు కేఆర్ సురేశ్‌రెడ్డి, బడుగుల లింగయ్య యాదవ్‌తో కలిసి కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్‌కు కేకే వినతిపత్రం సమర్పించారు. కొన్ని రోజులుగా ఉత్తరాదితోపాటు దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాలు వరదలు, ప్రకృతి బీభత్సంతో అతలాకుతలమైనందున ఆదాయపన్ను రిటర్న్స్ ఫైల్ చేసే గడువును కనీసం నెల రోజులపాటు పొడిగించాలని కోరారు.

వనమా ఎన్నిక చెల్లదు

▶ మొదటి పేజీ తరువాయి

పోటీచేసిన జలగం వెంకట్రావుకు 76,979 ఓట్లు వచ్చాయి. 4,139 ఓట్ల మెజారిటీతో వనమా గెలిచినట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. అయితే ఎన్నికల అఫిడవిట్‌లో వనమా తప్పుడు సమాచారం ఇచ్చారని, కొన్నిచోట్ల ఇవ్వాల్సిన సమాచారం ఇవ్వకుండా దాచిపెట్టారని జలగం హైకోర్టులో 2019, జనవరిలో ఎన్నికల పిటిషన్ దాఖలు చేశారు. వనమా ఎన్నికలను రద్దు చేసి తనను ఎమ్మెల్యేగా ప్రకటించేలా ఎన్నికల అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. దీనిపై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం కొద్ది రోజుల క్రితం తీర్పు రిజర్వు చేసింది. 26 సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులను పరిశీలించిన జస్టిస్ రాధారాణి మంగళవారం 84 పేజీల తీర్పు వెలువరించారు.

పిటిషనర్ పేర్కొన్న అంశాలు

- 2014, ఏప్రిల్ 20న కొత్తగూడెం పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసు వివరాలను వనమా అఫిడవిట్‌లో వెల్లడించలేదు.
- 2004, 2009, 2014 ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న న్యూపాల్వంచ ఇందిరానగర్‌లోని 300 చదరపు గజాల ఇల్లును 2018లో చూపించలేదు.
- హిందూ అవిభక్త కుటుంబం అని పేర్కొన్న అంశంలో పలు విషయాలను దాచిపెట్టారు.
- స్థిరాస్తులకు సంబంధించి 2004, 2009, 2014లో పేర్కొన్న వాటిని 2018లో వెల్లడించలేదు. అయితే అవి వారి పేరుపైనే ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి.

వాదనలు సాగాయిలా..

'వెంకటేశ్వరరావు భార్య, ఇద్దరు కుమారులు కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో రెండు ఇళ్లను కొనుగోలు చేయగా, ఒకే ఇంటిని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. పాల్వంచలోని ఎకరం 33 గుంటల భూమిని కూడా పేర్కొనలేదు. వెంకటేశ్వరరావు భార్య పద్మావతికి కొత్తగూడెంలోని ఓ వాణిజ్య భవనంలో వాటా ఉంది. దీనికి సంబంధించి రూ.23,948 విద్యుత్ బిల్లు బకాయి ఉన్నా.. ఆ వివరాలు వెల్లడించలేదు. పద్మావతి పేరుపై ఉన్న ఇన్నోవా కారు చలానాను, కొత్తగూడెం మున్సిపాలిటీకి కట్టాల్సిన రూ.3,120 వాటర్ బిల్లును పేర్కొనలేదు. పాల్వంచలో సర్వే నంబర్ 10లో 18 గుంటలు ఉంటే 13 గుంటలు మాత్రమే ఉన్నట్లు చెప్పారు' అని పిటిషనర్ తరఫున రమేశ్ కుతుంబాక వాదించారు. ఇలా అఫిడవిట్‌లో పేర్కొనని పలు ఆస్తులు, అప్పులు, పన్నులు ఇతర అంశాలను కోర్టు దృష్టి తెచ్చారు. వీటన్నింటిపై వెంకటేశ్వరరావుకు పూర్తి అవగాహన ఉందని, ఉద్దేశపూర్వకంగానే వెల్లడించలేదని చెప్పారు. ఈ పిటిషన్‌కు విచారణ అర్హత లేదని, కొట్టివేయాలని వనమా తరఫున శ్రీ శరత్ తడకమల్ల వాదనలు వినిపించారు. 2018 అసెంబ్లీ ఎన్నికల అనంతరం వనమా కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరిన విషయం తెలిసిందే. ప్రస్తుతం జలగం వెంకట్రావు కూడా బీఆర్ఎస్‌లోనే కొనసాగుతుండటం గమనార్హం.

మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు చుక్కెదురు

సాక్షి, హైదరాబాద్: మహబూబ్‌నగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే, మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు హైకోర్టులో చుక్కెదురైంది. తనపై దాఖలు చేసిన ఎన్నికల పిటిషన్‌ను కొట్టివేయాలని కోరుతూ మంత్రి దాఖలు చేసిన మధ్యంతర అప్లికేషన్ (ఐఏ)ను హైకోర్టు కొట్టివేసింది. శ్రీనివాస్‌గౌడ్ ఎన్నిక చెల్లదంటూ దాఖలైన పిటిషన్ విచారణార్హమేనని తేల్చిచెప్పింది. మంత్రి అభ్యంతరాలపై కూడా విచారణ చేస్తామని స్పష్టం చేసింది. ఎన్నికల అఫిడవిట్‌లో కుటుంబ ఆస్తుల గురించి శ్రీనివాస్ గౌడ్ తప్పుడు సమాచారం ఇచ్చారంటూ మహబూబ్‌నగర్‌కు చెందిన సీహెచ్ రాఘవేంద్ర రాజు 2019లో హైకోర్టులో ఎన్నికల పిటిషన్ (ఈపీ) దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను కొట్టివేయాలన్న శ్రీనివాస్ గౌడ్ అభ్యర్థనను హైకోర్టు గతంలోనే నిరాకరించడంతో ఆయన సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. దీనిపై హైకోర్టునే ఆశ్రయించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఈపీకి అర్హత లేదని కొట్టివేయాలని శ్రీనివాస్ గౌడ్ హైకోర్టులో మరో ఐఏ వేశారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ ఎం.లక్ష్మణ్ ఎదుట రాఘవేంద్రరాజు తరఫున న్యాయవాది వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. మంత్రి దాఖలు చేసిన ఐఏను కొట్టివేశారు.

అప్పుడు తండ్రి.. ఇప్పుడు కుమారుడు

- అనర్హత వేటు కోసం పోరాడిన జలగం వెంగళరావు, వెంకట్రావు,
- అప్పట్లో జ్యేష్ట వెంకటేశ్వరరావు.. ఇప్పుడు వనమాపై వేటు



జ్యేష్ట వెంకటేశ్వరరావు (ఫైల్)



జలగం వెంగళరావు (ఫైల్)

సత్తుపల్లి: ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గానికి 1979లో జరిగిన ఉపఎన్నికలో 14 వేల ఓట్ల మెజార్టీతో ఇందిరా కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిచిన జ్యేష్ట వెంకటేశ్వరరావు అసెంబ్లీకి వెళ్లకుండానే వేటు పడింది. తాజాగా 2018 ఎన్నికల్లో కొత్తగూడెం ఎమ్మెల్యేగా గెలిచిన వనమా వెంకటేశ్వరరావుపై ఇప్పుడు వేటు పడింది. నాటి ఘటనలో మాజీ సీఎం వెంగళరావు వ్యూహాత్మకంగా వ్యవహరించగా.. ఇప్పుడు ఆయన కుమారుడు జలగం వెంకట్రావు అదే పంథాను అనుసరించడం చర్చనీయాంశంగా మారింది.

ఉప ఎన్నిక ఎందుకు వచ్చిందంటే..

1978లో జరిగిన ఎన్నికల్లో జలగం వెంగళరావు కాంగ్రెస్(ఆర్) నుంచి, కాకోజీ నారాయణరావు ఉభయ కమ్యూనిస్టు పార్టీల నుంచి, న్యాయవాది శాంతారావు ఇందిరా కాంగ్రెస్ తరఫున బరిలోకి దిగారు. ఈ ఎన్నికలో జలగం వెంగళరావు అత్యధిక మెజార్టీతో సత్తుపల్లి ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే ఎమర్జెన్సీ సమయాన సీఎంగా జలగం వెంగళరావు ప్రజాస్వామ్య హక్కులకు భంగం కల్పించారనే ఆరోపణలతో అప్పటి సీనియర్ నేత చేకూరి కాశయ్య కేంద్రానికి ఫిర్యాదు చేశారు. దీంతో నాటి జనతా ప్రభుత్వం జలగం వెంగళరావుపై విచారణకు విమద్ లాల్ కమిషన్‌ను నియమించింది. దీంతో వెంగళరావు నైతిక బాధ్యత వహిస్తూ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడంతో ఉపఎన్నిక అనివార్యమైంది. 1979లో జరిగిన ఉప ఎన్నికలో జ్యేష్ట వెంకటేశ్వరరావు ఇందిరా కాంగ్రెస్ నుంచి పోటీ పడగా జలగం వెంగళరావు అనుచరుడైన ఉడతనేని సత్యం ఉభయ కమ్యూనిస్టు పార్టీలు, జనతా పార్టీ బలపరిచిన అభ్యర్థిగా పోటీ పడ్డారు. ఆ ఉప ఎన్నికలో జ్యేష్ట వెంకటేశ్వరరావు విజయం సాధించారు. అయి తే, ఆయన ఎన్నికల నియమావళికి విరుద్ధంగా డబ్బు ఖర్చు పెట్టారని జలగం వెంగళరావు ముఖ్య అనుచరుడు ఒగ్గు బస్విరెడ్డి కోర్టును ఆశ్రయించటంతో విచారణకు ఆదేశాలు వచ్చాయి. ఈ విచారణ నాలుగేళ్లు సాగడంతో ఆయన ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయకుండానే పదవీకాలం ముగిసిపోయింది. ఇప్పుడు కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావుపై జలగం వెంగళరావు కుమారుడు వెంకట్రావు కోర్టును ఆశ్రయించడంతో ఎన్నికలకు నాలుగు నెలల ముందు ఆయనపై వేటు వేస్తూ తీర్పు వెలువడింది.

ఉచిత విద్యుత్‌పై బీఆర్ఎస్ మాట్లాడితే.. వైఎస్సార్ ఫొటో చూపించండి

పార్టీ నేతలు, కార్యకర్తలకు భట్టి సూచన

- ఉచిత విద్యుత్ కాంగ్రెస్‌కు పేటెంట్ అని స్పష్టీకరణ
- కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌లు అబద్ధాలు చెపుతున్నారని ధ్వజం
- 'సెల్ఫీ విత్ కాంగ్రెస్ డెవలప్‌మెంట్' ప్రారంభించిన సీఎల్పీ నేత
- ఉచిత విద్యుత్ ఫైలుపై వైఎస్ సంతకం చేస్తున్న ఫొటో వద్ద సెల్ఫీ



వైఎస్ రాజశేఖరరెడ్డి ఫొటో వద్ద సెల్ఫీ తీసుకుంటున్న భట్టి. చిత్రంలో దామోదర రాజనర్సింహ, మధుయాష్కీ తదితరులు

సాక్షి, హైదరాబాద్: ఉచిత విద్యుత్ కాంగ్రెస్ పార్టీకి పేటెంట్ అని, ఉచిత విద్యుత్ గురించి బీఆర్ఎస్ నేతలు మాట్లాడితే డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ఉచిత విద్యుత్తు ఫైలుపై మొట్ట మొదటి సంతకం పెడుతున్న ఫొటో చూపించాలని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పార్టీ నేతలు, కార్యకర్తలకు సూచించారు. ఆ రోజు చరిత్రాత్మకమైనదని పేర్కొన్నారు. ఉచిత కరెంటు తమ పాలసీ అంటూ సీఎం కేసీఆర్, మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ అబద్ధాలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. మంగళవారం సీఎల్పీ కార్యాలయంలో మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనరసింహ, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ తదితరులతో కలిసి 'సెల్ఫీ విత్ కాంగ్రెస్ డెవలప్‌మెంట్'కార్యక్రమాన్ని భట్టి ప్రారంభించారు. ఉచిత విద్యుత్ ఫైలుపై వైఎస్సార్ మొదటి సంతకం చేస్తున్న ఫొటో వద్ద సెల్ఫీ దిగారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు.


కాంగ్రెస్ అభివృద్ధి పనుల ముందు సెల్ఫీలు

ఉచిత కరెంటుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, ఇప్పుడు, ఎప్పుడూ, ఎల్లప్పుడూ దీనిని కొనసాగిస్తామని, అధికారంలోకి రాగానే 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందిస్తామని భట్టి చెప్పారు. ఉచిత విద్యుత్‌పై బీఆర్ఎస్ నేతలు తెలంగాణ సమాజాన్ని పక్కదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. వారి తప్పుడు ప్రచారానికి అడ్డుకట్ట వేసేందుకు, కాంగ్రెస్ పార్టీ 60 ఏళ్లలో తెలంగాణలో ఏం అభివృద్ధి చేసిందో చెప్పడానికి 'సెల్ఫీ విత్ కాంగ్రెస్ డెవలప్‌మెంట్'కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ఇందులో భాగంగా వివిధ అభివృద్ధి పనులు, ప్రాజెక్టుల ముందు సెల్ఫీ దిగి, వాటి గురించి ప్రజలకు వివరిస్తామని చెప్పారు.

ప్రతి అభివృద్ధి పని గురించి ప్రజలకు వివరిస్తాం

'మెట్రో రైలు మేమే తెచ్చాం.. మెట్రో ఎక్కి సెల్ఫీ తీసి ఇది కాంగ్రెస్ హయాంలోనే వచ్చిందంటాం. అలాగే కాంగ్రెస్ హయాంలో ఔటర్ రింగ్ రోడ్డు, అంతర్జాతీయ విమానాశ్రయం, ఈసీఐఎల్, బీహెచ్ఈఎల్, బీడీఎల్, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఇలా ప్రతి అభివృద్ధిని 'సెల్ఫీ విత్ కాంగ్రెస్ డెవలప్‌మెంట్'పేరిట ప్రజలకు వివరిస్తాం. ఈ కార్యక్రమంలో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పాల్గొంటారు. వాట్సాప్ డీపీలో సెల్ఫీ విత్ కాంగ్రెస్ డెవలప్‌టెంట్ ఫొటోలు పెట్టి విస్తృత ప్రచారం కల్పిస్తాం..'అని భట్టి తెలిపారు. సీఎంకు సోయి లేక కాంగ్రెస్‌ను విమర్శిస్తున్నారని ధ్వజమెత్తారు. ఎస్ఆర్ఎస్పీ ప్రారంభించి 60 ఏళ్లు అవుతోందని, ఈ సందర్భంగా నిజామాబాద్‌లో ప్రాజెక్టు వద్ద సంబరాలు నిర్వహిస్తామని మధుయాష్కీ తెలిపారు.

ఇవన్నీ కొత్త డ్రామాలు: దూదిమెట్ల



సాక్షి, హైదరాబాద్: సెల్ఫీ విత్ కాంగ్రెస్ కాదు..సెల్ఫీ విత్ తెలంగాణ ద్రోహులు అని పెట్టుకోవాలని తెలంగాణ గొర్రెల, మేకల అభివృద్ధి సంస్థ చైర్మన్ దూదిమెట్ల బాలరాజ్ యాదవ్ హితవు పలికారు. రాష్ట్రానికి చేసిన అన్యాయాలు అప్పుడే మరిచిపోయారా అని మంగళవారం ఒక ప్రకటనలో నిలదీశారు. ఉచిత విద్యుత్‌పై రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను కప్పిపుచ్చుకోవడం కోసం కొత్త డ్రామాలు చేస్తున్నారని దూదిమెట్ల ఆరోపించారు.

చనిపోయిన రైతుల ఇళ్లకు వెళ్లి సెల్ఫీలు తీసుకోవాలి

భట్టికి రెడ్కో చైర్మన్ సతీశ్‌రెడ్డి సలహా



సాక్షి, హైదరాబాద్: 'సెల్ఫీ విత్ కాంగ్రెస్ డెవలప్‌మెంట్ కాదు.. మీ పాలనలో చనిపోయిన రైతుల ఇళ్లకు వెళ్లి సెల్ఫీలు తీసుకోవాలి' అని సీఎల్పీ నేత భట్టి విక్రమార్కకు తెలంగాణ రెడ్కో చైర్మన్ సతీశ్‌రెడ్డి సలహా ఇచ్చారు. రైతులకు ఉచితంగా కరెంట్ ఇవ్వడం లేదంటున్న నేతలు ఒక్కసారి వ్యవసాయబావుల దగ్గరికి వెళ్లి అక్కడ కరెంట్ తీగలను పట్టుకొని సెల్ఫీ దిగితే కరెంట్ ఇస్తున్నామో లేదో తెలుస్తుందని ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఎరువు లు, విత్తనాల కోసం లైన్లో ఉన్న చెప్పుల ఫొటోలు, లాఠీచార్జీలతో గాయపడి రక్తమోడుతున్న రైతుల ఫొటోలు పట్టుకుని సెల్ఫీ దిగాలని సతీశ్ ఎద్దేవా చేశారు.



మన ఆలోచనలతోనే మనం
ఈ ప్రపంచాన్ని రూపొందిస్తాం.
– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, 26 జూలై 2023

సమతూకపు నియంత్రణ!

అసలేమీ చేయకుండా ఉండే కన్నా, ఆలస్యంగానైనా కళ్ళు తెరిచి ఆచరణలోకి దిగడం మంచిదే! కృత్రిమమేధ (ఏఐ)ను నియంత్రించడానికి చట్టబద్ధమైన స్వతంత్ర సంస్థను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన అలాంటిదే. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా అథారిటీ ఆఫ్ ఇండియా పేర ఒక సంస్థను నెలకొల్పాలంటూ భారత టెలికామ్ నియంత్రణ ప్రాధికార సంస్థ (ట్రాయ్) చేసిన తాజా సిఫార్సు స్వాగతించాల్సిన అంశం. టెలికామే కాక బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సేవలు, రవాణా, విద్య, వ్యవసాయం లాంటి అనేక రంగాలపై ఏఐ అమితమైన ప్రభావం చూపుతున్న విషయాన్ని ఇప్పటికైనా గుర్తించి, సమగ్రమైన నియంత్రణకు సమకట్టడం సరైన చర్య. ట్రాయ్ ప్రతిపాదించిన నియంత్రణ సంస్థ ఏఐ సంబంధిత రంగాలన్నిటికీ సలహా దారుగా, నియంత్రణకర్తగా వ్యవహరిస్తుంది. సాంకేతిక సంస్థలు మాత్రం తమ నియంత్రణకు మరిన్ని చట్టాల ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నాయి. ఏఐ కోసం స్వతంత్ర చట్టబద్ధ సంస్థను పెట్టాలన్న ట్రాయ్ సిఫార్సుపై తీవ్రంగా స్పందిస్తున్నాయి. అయితే, సాంకేతికతతో వచ్చే లాభాలను స్వీకరిస్తూనే, జరిగే హానిని కూడా గుర్తించి, సమతూకం సాధించడం అవసరం. ప్రపంచవ్యాప్తంగా పాల కుల ముందున్న సవాలు ఇది.

5జీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) లాంటి సాంకేతికతలు ఏఐతో ముడిపడ్డాయి. వీటికి విడివిడి విధానాలతో లాభం లేదు. అన్నిటినీ సమన్వయపరిచే సమగ్రమైనది అవసరం. ట్రాయ్ తన 141 పేజీల నివేదికలో ఆ మాటే ప్రస్తావించి, తాజా సిఫార్సు చేసింది. నూతన సాంకేతిక ఆవిష్కరణలు శరవేగంతో వస్తుంటే, మన విధాన నిర్ణేతలు ఎంతో వెనుకబడి ఉన్నారు. రెండు దశాబ్దాల క్రితం ఆరంభమైన ఆన్‌లైన్ వేదికలకు సైతం నేటికీ సరైన నియంత్రణ వ్యవస్థ లేని దేశం మనది. 1998లో వచ్చిన గూగుల్, 2004లో ఆరంభమైన ఫేస్‌బుక్ లాంటివి ఇప్పటికీ వినియోగదారుల డేటాను యథేచ్ఛగా వాడుకుంటూ, లాభాలు మూట గట్టుకుంటున్నాయి. దాన్ని నియంత్రించడానికి ఉద్దేశించిన వ్యక్తిగత సమాచార భద్రత బిల్లు వగైరాలను దేశం దీర్ఘకాలంగా చర్చిస్తూనే ఉంది. సరైన నియంత్రణ లేక సామాజిక మాధ్యమ వేదికలు యూజర్ల డేటాను తస్కరిస్తూనే ఉన్నాయి. కొన్ని వేదికలు వేధింపులనూ, విద్వేషాలనూ రాజేస్తున్నాయి. ఏఐ ఆవిర్భావంతో డేటా దుర్వి నియోగం ఎల్లలు దాటిందనే అనుమానం తలెత్తింది. వ్యక్తిగత గోప్యతే కాదు... ఆర్థికవ్యవస్థ పైనా ప్రభావం చూపే పరిస్థితి. ఏఐ నియంత్రణకు స్వతంత్ర వ్యవస్థ ఆలోచనను ఈ నేపథ్యం నుంచి చూడాలి.

గత నవంబర్‌లో ఓపెన్ ఏఐ సంస్థ తన ఛాట్‌బాట్ అయిన 'ఛాట్ జీపీటీ'ని విడుదల చేసినప్పటి నుంచి ఏఐ పట్ల ఉత్సాహం ఎంత ఉందో, ఆందోళనా అంతే ఉంది. ఛాట్ జీపీటీ లాంటి నమూనాల రూపకల్పనపై 6 నెలల మారటోరియం విధించాలని ఎలాన్ మస్క్ లాంటి నిపుణులు సైతం అనడం గమనార్హం. వివిధ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చి, మానవకృషికి కొత్త మార్గాలు తెరిచి, మామూలు పనుల్ని సైతం సృజనాత్మకంగా చేయడానికి ఏఐ ఉపయుక్తమే. కానీ మనుషుల కృత్రిమ రూపాల తయారీ, తప్పుడు సమాచార వ్యాప్తి సహా ప్రమాదాలున్నాయి. ఏఐని అణ్వస్త్రపోరుతో పోలుస్తూ, మానవజాతి మనుగడకే ప్రమాదకారి అంటున్న శాస్త్రవేత్తలూ లేకపోలేదు. అందుకే, ఏఐని విశృంఖలంగా వదిలేయరాదన్నది నిపుణులు, పాలకుల ఏకాభిప్రాయం. నవీన ఆవిష్కరణల్ని ఆహ్వానిస్తూనే, వాటిని నైతికబద్ధంగా వాడేలా సమతౌల్య సాధన కీలకమనేది ప్రధాన సూత్రం.

ఏఐ ప్రతికూల ప్రభావాన్ని కట్టడి చేయడానికి విశ్వవ్యాప్తంగా అనేక ప్రైవేట్ సంస్థలు ఇప్పటికే ప్రయత్నాలు ప్రారంభించాయి. విదేశాలు చట్టాలు చేస్తున్నాయి. కెనడా ముసాయిదా చట్టం చేసింది. అమెరికా ఏఐ బిల్లు తెచ్చింది. సురక్షితంగా, పారదర్శకంగా ఏఐ అభివృద్ధి సాగేలా చూస్తామంటూ అమెజాన్, గూగుల్, మెటా, మైక్రోసాఫ్ట్, ఓపెన్ ఏఐ తదితర 7 ప్రధాన ఏఐ సంస్థల నుంచి ఈ నెల 21నే అమెరికా ప్రభుత్వం స్వచ్ఛంద వాగ్దానాలు తీసుకుంది. చైనా సైతం పాలనా చర్యలపై ఒక ముసాయిదా సిద్ధం చేసి, ప్రజాస్పందన కోసం ఉంచింది. బ్రెజిల్, జపాన్‌లు ఏఐ నియమావళి సిద్ధం చేశాయి. అభివృద్ధి చెందిన దేశాలతో కూడిన 'గ్లోబల్ పార్ట్‌నర్‌షిప్ ఆన్ ఏఐ' సంస్థాపక సభ్యదేశమైన భారత్ వంతు ఇప్పుడు ట్రాయ్ సిఫార్సుతో వచ్చిందనుకోవాలి. ఏఐ అభివృద్ధిలో భాగస్థులు పాటించాల్సిన బాధ్యతల్ని నాస్కామ్ ఇప్పటికే వెల్లడించింది. కానీ ఏఐపై మోజులో ప్రమాణాలు, నైతికత, జవాబుదారీతనం గాలికి పోవచ్చు. కాబట్టి నియంత్రణ సంస్థ పెట్టాలన్న మాట బంగారు బాట.

నిజానికి, పార్లమెంట్‌లో 'డిజిటల్ వ్యక్తిగత సమాచార భద్రత బిల్లు'ను ప్రవేశపెట్టనున్నారు. 2000 నాటి ఐటీ చట్టం స్థానంలో వచ్చే డిజిటల్ ఇండియా చట్టం కొంతవరకు ఏఐని నియంత్రిస్తుందని భావిస్తున్నారు. అయితే, ఏఐకి ప్రత్యేక చట్టం యత్నాలేవీ ఇప్పటికీ లేవు. ఇది ఆలోచించాల్సిన విషయం. యూజర్లకు హాని ఏ మేరకు కలుగుతుందనే కోణం నుంచి ఏఐపై కేంద్ర ప్రభుత్వ నియంత్రణ వైఖరి ఉంటుందనీ, ఇప్పటికిప్పుడు తీవ్రమైన చర్యలేమీ అవసరం లేదనీ సంబంధిత కేంద్ర మంత్రివర్యుల ఉవాచ. ముందుగానే ఏఐపై కఠిన నిబంధనలు పెట్టి, నవీన సాంకేతికకు ఉరితాళ్ళు బిగించరాదన్న మాట నిజమే! అదే సమయంలో రాబోయే కష్టనష్టాలను కూడా ముందుగా ఆలోచించడం, అవసరమైన చట్టాలతో యుద్ధానికి సిద్ధంగా ఉండడం వివేకం. ఏఐకి సంబంధించి చట్టబద్ధమైన స్వతంత్ర నియంత్రణ సంస్థ ఆలోచన అందుకు తొలి అడుగు కావాలి. ఏఐపై ప్రాథమిక నిబంధనలు, హద్దు మీరితే జుల్మానాలు, దోషులపై పట్టు బిగించే అధికారాలతో సంస్థ ఏర్పాటు కావాలి.


గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, అధిక శ్రావణ మాసం, తిథి: శు.అష్టమి ఉ.10.25 వరకు తదుపరి నవమి, నక్షత్రం: స్వాతి రా.8.55 వరకు తదుపరి విశాఖ, వర్జ్యం: రా.2.36 నుండి 4.15 వరకు, దుర్ముహూర్తం: ప.11.41 నుండి 12.30 వరకు, అమృతఘడియలు: ఉ.11.50 నుండి 1.29 వరకు.

సూర్యోదయం : 5.40
సూర్యాస్తమయం: 6.32
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

భారత - చైనా బంధం బలపడేనా?

విశ్లేషణ



శ్యామ్ శరణ్

సరిహద్దు సమస్యను పూర్తి స్థాయి సంబంధాలలో ఒక అంశంగా మాత్రమే ఉంచాలనీ, అది సంబంధాల మొత్తం స్వభావాన్ని నిర్వచించకూడదనీ చైనీయులు పట్టుబట్టడం కొనసాగిస్తున్నారు. సరిహద్దులో పరిస్థితి 'అసాధారణం'గా ఉందనీ, ఇది ద్వైపాక్షిక సంబంధాలను ప్రతికూలంగా ప్రభావితం చేస్తున్నదనే భారత వైఖరిని ఇది పరోక్షంగా తిరస్కరించడమే! అయితే గల్వాన్ ఘర్షణలు చైనా ప్రణాళికాబద్ధంగా జరిపినవన్న భారత్ అభిప్రాయం తప్పు అనీ, అది కేవలం 'అనుకోని ఘటన' అనీ పీఎల్ఏ అధికారి చెప్పిందే నిజమైతే, మరి యథాతథ స్థితిని ఎందుకు పునరుద్ధరించకూడదు? అయితే ఎల్ఏసీ అమరిక గురించి భారత్‌కు కచ్చితమైన ఆలోచన ఉంది. ఎల్ఏసీ గురించి సందేహం ఉందని మనం పరోక్షంగా కూడా సూచించకూడదు.

వార్షిక వరల్డ్ పీస్ ఫోరమ్‌లో పాల్గొనడానికి నేను ఈ నెల ప్రారంభంలో బీజింగ్‌లో ఉన్నాను. ఆ సమావేశంలోనే అదనంగా భారత్–చైనా సరిహద్దు సమస్యపై ఒక ఆంతరంగిక చర్చ జరిగింది. దీనికి పలువురు చైనా విద్వాంసులు హాజరయ్యారు. ప్రస్తుత, మాజీ చైనా అధికారులు కొందరితో సంభాషణకు కూడా వీలు కలిగింది. ఇవి భారత్–చైనా సంబంధాలకు సంబంధించిన అవకాశాల గురించి చైనా అవగాహన విషయంలో ఒక కొత్త గవాక్షాన్ని అందించాయి.

సరిహద్దు సమస్యను పూర్తి స్థాయి సంబంధాలలో ఒక అంశంగా మాత్రమే ఉంచాలనీ, అది సంబంధాల మొత్తం స్వభావాన్ని నిర్వచించకూడదనీ చైనీయులు పట్టుబట్టడం కొనసాగిస్తున్నారు. సరిహద్దులో పరిస్థితి 'అసాధారణం'గా ఉందనీ, ఇది ద్వైపాక్షిక సంబంధాలను ప్రతికూలంగా ప్రభావితం చేస్తున్నదనే భారత వైఖరిని ఇది పరోక్షంగా తిరస్కరించడమే. చైనీయుల ప్రకారం, సరిహద్దు పరిస్థితి 'స్థిరీకరించబడింది'. ఘర్షణకు సంబంధించిన కొన్ని అంశాలను పరిష్కరించడంలో పురోగతి సాధించామనీ, అయితే మరికొన్ని మిగిలి ఉన్నాయనీ భారతదేశం గుర్తిస్తోంది. 2020 జూన్‌లో తూర్పు లద్దాఖ్‌లోని గల్వాన్ లోయలో జరిగిన హింసాత్మక ఘర్షణలకు ముందు ఉన్న యథాతథ స్థితికి తిరిగి రావడానికి చైనా సుముఖంగా ఉన్నట్లు ఎవరూ భావించడం లేదు.

భారత–చైనా సరిహద్దు ప్రశ్న (2005) పరిష్కారానికిగానూ రాజకీయ పారామితులు, మార్గదర్శక సూత్రంతో సహా – వాస్తవాధీన రేఖను (ఎల్ఏసీ) స్పష్టం చేయడం కోసం ఉమ్మడి కసరత్తును చేపట్టేందుకు – అనేక శాంతి భద్రతల ఒప్పందాలను ఇరుపక్షాలు అంగీకరించినప్పటికీ, చైనీయులు అలా చేయడానికి నిరాకరించారు. భూభాగాన్ని 'కొద్దికొద్దిగా కొరుక్కు తింటూ' చైనాను భారతదేశం దూరంగా నెడుతోందని ఒక ఆరోపణ వచ్చినప్పుడు, భారత్ చేపట్టడానికి సిద్ధంగా ఉన్న ఎల్ఏసీ స్పష్టీకరణ ద్వారా అటువంటి కబళింపును కచ్చితంగా నిరోధించవచ్చని ఎత్తి చూపడం ద్వారా ఒకరు దీనిని ప్రతిఘటించారు. దీనికి సమాధానం ఏమిటంటే, 2004లో జరిగిన సమావేశంలో ఈ కసరత్తు ప్రారంభమైనప్పుడు, చైనా ప్రాదేశిక క్లెయిమ్‌లను బలహీనపర్చగల 'అతిశయోక్తి' క్లెయిమ్‌లను భారతదేశం పశ్చిమ సెక్టార్‌లో ముందుకు తెచ్చింది.

ఎల్ఏసీని సరిగా స్పష్టం చేయకపోవడం వల్ల భారత్ అధీనంలో ఉన్న భూభాగాన్ని ఆక్రమించుకోవడానికి సందిగ్ధతలను ప్రదర్శించగల వీలు చైనాకు కలుగుతుంది. అయితే ఎల్ఏసీ అమరిక గురించి భారత్‌కు కచ్చితమైన ఆలోచన ఉంది. కొన్ని అంశాల్లో ఎల్ఏసీకి సంబంధించి 'భిన్నమైన అవగాహనలు' ఉన్నాయని మనం చెప్పుకోకూడదు. భారత్ పేర్కొన్నట్లుగా ఎల్ఏసీపై పోటీ పడటంలో చైనా పక్షానికి కొంత సమర్థన ఉందని ఇది పరోక్షంగా అంగీకరిస్తుంది.



ఎల్ఏసీ అమరికలో మనం పరిగణించే వాటిపై చైనీస్ పక్షాన్ని పోటీ పడనివ్వండి. ఎల్ఏసీ ఎక్కడ ఉందనే దాని గురించి మనకు సందేహం ఉందని మనం పరోక్షంగా కూడా సూచించకూడదు. మొత్తంమీద, సరిహద్దు వద్ద ప్రతిష్టంభన కొనసాగే అవకాశం ఉంది. అయితే రెండు వైపులా భారీ సైన్యాన్ని మోహరించే అవకాశం లేదు. ఎల్ఏసీ వైపు చైనా నిర్మించిన తాజా శాశ్వత, పాక్షిక–శాశ్వత నిర్మాణాలను కూల్చివేయడం, తొలగించడం కూడా అసంభవం. భారత్ అలవర్చుకోవాల్సిన మెరుగైన సామర్థ్యానికి ఇవి సూచికలా పనిచేస్తాయి.

భవిష్యత్‌లో ఏం జరగవచ్చో సూచించే రెండు ఘటనలు కూడా ఉన్నాయి. సరిహద్దు సమస్యపై తరచూ వ్యాఖ్యానించే చైనా మాజీ పీఎల్ఏ అధికారి ఒకరు, గల్వాన్ ఘర్షణలు చైనా బలగాలు ముందస్తుగా, ప్రణాళికాబద్ధంగా జరిపిన ఆపరేషన్ అని భారత్ భావిస్తున్న అభిప్రాయం తప్పు అనీ, అది కేవలం 'అనుకోని ఘటన' అనీ నాతో అన్నారు. నేను ఇంతకు ముందు ఇది వినలేదు. పీఎల్ఏ అధికారి చెప్పిందే నిజమైతే, మరి యథాతథ స్థితిని ఎందుకు పునరుద్ధరించకూడదు?

ప్రస్తుతం చైనీస్ కమ్యూనిస్ట్ పార్టీ కమిషన్ ఫర్ ఫారిన్ ఎఫైర్స్ ఆఫీస్ డైరెక్టర్‌గా ఉన్న వాంగ్ యీ(జూలై 25నే తిరిగి విదేశాంగ మంత్రి అయ్యారు) ఇటీవల జకార్తాలో భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌తో జరిపిన భేటీలో, 'నిర్దిష్ట సమస్యలు మొత్తం సంబంధాన్ని నిర్వచించనివ్వకుండా, సరిహద్దు సమస్యకు ఇరు పక్షాలు పరస్పరం ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని కనుగొనాలి' అన్నారు. ఇది చైనా వైఖరికి పునఃప్రకటన. అయితే, 'భారత పక్షం చైనాతో సంబంధాలు మెరుగుపర్చుకునేలా, సరిహద్దు సమస్యకు ఇరుపక్షాలకు ఆమోద యోగ్యమైన పరిష్కారాన్ని కనుగొంటుందని ఆశిస్తున్నట్లు' ఆయన కొనసాగించారు.

ఆ ప్రాంతం చైనా సార్వభౌమ భూభాగమనీ, దానిని కాపాడుకుంటామనీ చైనా ప్రకటనలు పేర్కొంటున్నాయి కాబట్టి గల్వాన్ సంఘటన నేపథ్యంలో, ఇది సాపేక్షంగా సామరస్యపూర్వకమైన భాషగా కనిపిస్తోంది. దీంతో సంబంధాలు 'మెరుగుపర్చుకునే' అవకాశం లేకుండా పోయింది. మారిన భాషను మనం అతిగా వ్యాఖ్యానిస్తున్నామేమో! కాలమే దీన్ని తేల్చి చెబుతుంది.

ప్రధాని మోదీ వాషింగ్టన్‌లో ఉన్నత స్థాయి అధికారిక పర్యటన విజయవంతంగా ముగించిన తర్వాత వెంటనే బీజింగ్‌లో నా సంభాషణలు జరిగాయి. భారత్–అమెరికా సంబంధాల్లో పురోగతిపై చైనా ఆందోళన స్పష్టంగా కనిపించింది. చైనాను నిలువరించే అమెరికా వ్యూహంలో భారత్ భాగమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆసియాలో 'నాటో' పాత్రకు భారతదేశం మద్దతు ఇస్తుందా అనేది నాకు వారు సంధించిన ఒక ప్రశ్న. నా అభిప్రాయం ప్రకారం, నాటో అనేది యూరోపియన్ భద్రతకు సంబంధించినదనీ, ఆసియాన్ నేతృత్వంలోని యంత్రాంగాలతో సహా ఈ ప్రాంతంలో శాంతి భద్రతలను కాపాడుకోవడానికి ఆసియా అనేక యంత్రాంగాలను కలిగి ఉందనీ నేను చెప్పాను. గ్లోబల్ సౌత్ నుండి చైనాను మినహాయించాలని భారతదేశం ప్రయత్నిస్తున్నదా అనే ఆందోళన కూడా వారిలో ఉంది. తాము గ్లోబల్ సౌత్‌లో భాగమా, కాదా అనేది నిర్ణయించుకోవాల్సింది చైనాయేనని నేను చెప్పాను. త్వరలో జరగనున్న జీ20 సదస్సు సన్నాహాల్లో భాగంగా, గ్లోబల్ సౌత్ సమావేశాన్ని ఏర్పాటు చేసేందుకు మోదీ చొరవ తీసుకోవడం చైనాను ఆశ్చర్యానికి గురిచేసింది.

ఆర్థికపరమైన చిక్కులను కలిగించవచ్చు కాబట్టి, చైనాకు 'అభివృద్ధి చెందుతున్న దేశం' హోదాను నిరాకరించే అమెరికా ప్రయత్నాల గురించి వారు ప్రస్తావించారు.

చైనా చేసిన మరొక ఫిర్యాదు ఏమిటంటే, 'షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్' (ఎస్సీఓ) సమావేశాన్ని భారత్ వ్యక్తిగత స్థాయిలో కాకుండా, క్లుప్తంగా ఆన్‌లైన్ సదస్సును నిర్వహించడం ద్వారా దాని 'స్థాయిని తగ్గించింది' అని. ఇది అమెరికా ప్రభావంతో జరిగిందనే అనుమానం చైనాకు ఉంది.

మొత్తంమీద, చైనా తన గురించి తాను అస్పష్టంగానే ఉందనే భావన కలుగుతుంది. అదే సమయంలో భారత్ తన ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లడంలో ప్రావీణ్యతనూ, చురుకుదనాన్నీ ప్రదర్శించిందనే అభిప్రాయం ఉంది. పెట్టుబడి, సాంకేతికత ప్రవాహానికి భారతదేశం కొత్త గమ్యస్థానంగా మారినట్లు కనిపిస్తున్న నేపథ్యంలో, ఇది చైనా ఆర్థిక అవకాశాల గురించి గుర్తించిన ఒక నిర్దిష్ట నిరాశావాదానికి సంబంధించినది కావచ్చు. ఇది భారతదేశం పట్ల చైనా వైఖరిలో మార్పును సూచిస్తుందా? ఇకపై సంఘటనలు ఎలా వెల్లడవుతాయో చూద్దాం.

వ్యాసకర్త విదేశాంగ మాజీ కార్యదర్శి, ఆనరరీ ఫెలో, సీపీఆర్
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

మారాల్సినది...



నన్ను నమ్మండి... జనాలు మతాల ఆధారంగా చీలిపోవడం లేదు. వారి వారి ఆలోచనా దృక్పథాల ఆధారంగా చీలిపోతున్నారు.

– జాహక్ తన్వీర్, కాలమిస్ట్

వేగం... వేగం...



జనాలు ఎంతమాత్రమూ పుస్తకాలు చదవడం లేదు, వాళ్లు ట్వీట్స్ చదువుతున్నారు. జనాలు వార్తాపత్రికలు చదవడం లేదు, కేవలం హెడ్‌లైన్స్ చదువుతున్నారు. జనాలు సినిమాలు చూడటం లేదు, రీల్స్ చూస్తున్నారు.

– తస్లీమా నస్రీన్, రచయిత్రి

ఎవరికైనా జరగొచ్చా?



షీ జిన్‌పింగ్ చైనా: ప్రభుత్వంలో ప్రజలకు అత్యంత తరచుగా కనబడే ఒక ముఖం, ఒక విదేశాంగ మంత్రి, నెల రోజులుగా ప్రజలకు కనబడకుండా మాయమైపోతారు : ఏ కారణమూ ఇవ్వకుండా ఆయన్ని తొలగిస్తున్నట్టు వెలువరించిన ఏకవాక్య ప్రకటన ప్రజలను అయోమయంలో ఉంచుతుంది. ఇది ఆయనకే జరిగితే...

– అనంత్ కృష్ణన్, జర్నలిస్ట్

వాళ్లెలా భరిస్తారో!



వాసన అత్యంత దుర్భరంగా ఉందిక్కడ. ఇజ్రాయిలీ ప్రజాస్వామ్య అనుకూల నిరసనకారుల మీద మొదటిసారి ఇజ్రాయిల్ పోలీసులు స్కంక్ స్ప్రే (రోజుల తరబడి మురికి వాసనొచ్చే ఒక రసాయనిక మిశ్రమం) ఉపయోగించారు. దీన్ని ఎలా తట్టుకోవాలో మేము పాలస్తీనియన్ల నుంచి నేర్చుకోవాలి!

– జెస్సికా మోంటెల్, యాక్టివిస్ట్

ఏర్పాటు చేసుకోవాలి!



బంధువు: నువ్వు విమానాశ్రయంలో ఉన్నప్పుడు పాపరాజ్జీ నీ ఫొటోలు తీయరా? నేను: నేను వారిని పిలవను. బంధువు: మనం పాపరాజ్జీని పిలవాల్సి ఉంటుందా? నేను: లేకపోతే వాళ్లు ఊరికే ఎయిర్ పోర్ట్‌లో మన కోసం కాచుకుని కూర్చుంటారనుకుంటున్నావా?

– వీర్ దాస్, కమెడియన్

దూరం... దూరం...



ఉన్నట్టుండి కళ్లకలక/ఐ ఫ్లూ కేసులు పెరుగుతున్నాయి. ఈసారి వైరస్ మరింత వేగంగా వ్యాపిస్తోంది. దీన్ని ఆపగలిగే ఐ డ్రాప్స్ లేవు కాబట్టి చేతుల్ని తరచుగా కడుక్కోండి. కళ్లను తాకొద్దు. ఇతరులకు సోకకుండా ఆపేందుకు ఇది సోకిన మనిషిని కళ్లల్లో నీళ్లు, స్రావం ఆగే వరకు విడిగా ఉంచండి.

– పారుల్ ఎం.శర్మ, ఐ సర్జన్

ఇప్పటికి అర్థమైంది!



ఇస్లాం గురించి మాట్లాడే మాజీ–ముస్లింల బాధల గురించి వినడానికి మొన్నటిదాకా ఎవరూ సిద్ధంగా లేరు. అది మీ అనుభవం అని చెప్పి వాళ్లు మా నోళ్లు మూయించారు. కానీ ఇప్పుడు సోషల్ మీడియా యూరప్‌లో రాడికల్ ఇస్లాం ప్రమాదాల గురించి మాత్రమే మాట్లాడుతోంది. ఆఖరికి ముస్లింలను అక్కున చేర్చుకునే ఉదారవాదులు కూడా!

– జారా కే, యాక్టివిస్ట్

ఇన్ బాక్స్

నాస్తికోద్యమ నిర్మాత

మూఢ నమ్మకాల్లో మునిగిపోయి ఉన్న ఈ 'దైవ కేంద్ర' సమాజాన్ని 'మానవ కేంద్ర' సమాజంగా మార్చడానికి జీవితాంతం కృషి చేసిన మహోన్నతుడు గోపరాజు రామచంద్రరావు (గోరా). వృక్షశాస్త్ర అధ్యాపకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, గాంధీజీ అనుచరుడు, జాతీయస్థాయి కాంగ్రెస్ కార్యనిర్వాహకుడు అయిన గోరా తాను ఏం చెప్పారో అదే ఆచరించి చూపారు. అస్పృశ్యతా నివారణకూ, ఆర్థిక సమానత్వ సాధనకూ కృషి చేస్తూనే ప్రజల్లో కులమత తత్వ నిర్మూలనకు నడుం బిగించిన కార్యకర్త. సమష్టి భోజనాలను నిర్వహిస్తూ జనాన్ని మతాంతర వివాహాల వైపు నడిపించిన కార్యశీలి. దేశంలో ఉన్నత విద్య సులభంగా అందుబాటులో లేని కాలంలో దాని కోసం తపించి స్నాతకోత్తర పట్టా సాధించిన వైజ్ఞానిక విద్యార్థి.



గోరా

ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా 'ఛత్రపురం'లో సంప్రదాయ కుటుంబంలో జన్మించారు (1902) గోరా. స్వతంత్ర భావాలు గలవారు కావడంతో ఎక్కడా ఏ ఉద్యోగంలోనూ నిలకడగా ఉండలేకపోయేవారు. నాస్తికునిగా మారుతున్న దశలో ఆయన ఇంట్లో ఉండే ఆచార, సంప్రదాయాలతో రాజీపడేవారు కాదు. తండ్రికి తన ప్రవర్తన నచ్చకపోవడంతో భార్య, పిల్లలతో ఇల్లు వదిలి బయటికి వచ్చేశారు. సమాజంలో మార్పు తేవడానికి భార్య 'సరస్వతీ గోరా'తో ఆలోచించి కృష్ణా జిల్లా 'ముదునూరు'లో 'నాస్తిక' కేంద్రాన్ని (1940) స్థాపించారు. సంపూర్ణ గ్రామీణాభివృద్ధి సాధించడానికి కుల మతాలకు అతీతంగా మానవ వాద మూలాలపై ఇది నడిచింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కార్యకలాపాలు విస్తృత పరచడానికి నాస్తిక కేంద్రాన్ని విజయవాడకు మార్చారు. ప్రపంచ హేతువాద, నాస్తికోద్యమాలకు గోరా స్థాపించిన ఆ నాస్తిక కేంద్రమే కేంద్ర బిందు వయ్యింది. 1972లో తొలి 'ప్రపంచ నాస్తిక మహాసభలు' విజయవాడలో నిర్వహించిన ఘనత గోరాదే. అప్పటికి ఆయన వయసు 70 ఏళ్లు. 'భారత గ్రామీణ సమాజంలో ఎలా మార్పు తేవాలి' అనే అంశంపై ఉపన్యసిస్తూనే 1975 జూలై 26న గోరా తుదిశ్వాస విడిచారు. 2002 గోరా శత జయంతి సందర్భంగా భారత ప్రభుత్వం తపాలా బిళ్ల విడుదల చేసింది. వాస్తవాలు చెప్పేవారు లేక ఈ తరం యువత దారి తప్పుతున్నారు. గోరా జీవితం, ఆయన రచనలూ ఇటు వంటి వారికి ప్రపంచం, జీవితం గురించిన వాస్తవాలు తెలియజేస్తాయి.

డా॥ దేవరాజు మహారాజు; సాహితీవేత్త, జీవశాస్త్రవేత్త
(నేడు 'గోరా' వర్ధంతి)

కునారిల్లుతున్న ప్రభుత్వ పాఠశాలలు

ఎన్నో ఉద్యమాలు, ప్రాణ త్యాగాలు చేసి స్వరాష్ట్రం సాధించుకుంటే విద్యారంగం 'ఎక్కడ వేసిన గొంగడి అక్కడనే అన్న' ట్లుంది. స్వయాన ముఖ్యమంత్రి మన వడు 'ప్రభుత్వ పాఠశాలలను చూస్తే నాకు మనసు కలిచివేసి కన్నీటి పర్యంతమయ్యా'నని చెప్పడం ఈ సందర్భంగా గమనార్హం. పట్టణ ప్రాంతంలో ఉండే పాఠశాలలోనే కనీస అవసరాల లేకుండా ఉంటే, అత్యంత మారుమూల ఆదివాసీల పల్లెలలో, గ్రామీణ ప్రాంతాలలో పాఠశాలల పరిస్థితి ఎంత దయనీయంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. సర్కారు బడుల్లో సౌలత్‌లు మెరుగుపడలేదు. బడులలో సరిపోను సార్లు లేరు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత ఉండటం లేదు. హాస్టళ్ల పరిస్థితి మరీ అధ్వానం. బడులు ప్రారంభమై 2 నెలలు పూర్తి కావస్తున్నా ఇంకా పూర్తి స్థాయిలో పాఠ్య పుస్తకాలు అందలేదు. కొన్ని జిల్లాల్లో యూనిఫామ్ కూడా రాలేదు. చదువుకోవడానికి పుస్తకాలు లేక, కూర్చునేందుకు సరిపోను తరగతి గదులు లేక పిల్లలు నానా అగచాట్లు పడుతున్నారు.

బడులను అభివృద్ధి చేయడానికని 'మన ఊరు – మన బడి' పథకం తీసుకొచ్చిన సర్కారు దాని ద్వారా ఇప్పటి వరకు ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేయలేదు. మొదటి దశలో భాగంగా రాష్ట్రంలో కొన్ని స్కూళ్లను ఎంపిక చేసినప్పటికీ ప్రభుత్వం నిధులు మంజూరు చేయక, పనులు ముందుకు సాగడం లేదు. రాష్ట్రంలో చాలా చోట్ల ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు సరిపోను తరగతి గదులు, టాయిలెట్లు, వంట రూములు లేవు. కొన్ని చోట్ల బడులు శిథిలావస్థకు చేరుకున్నాయి. కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్లు లేక ఆరు బయటకు వెళ్లి పిల్లలు అవసరాలు తీర్చుకుంటున్నారు. రాష్ట్రంలో గురుకులాలకు కూడా పూర్తి



స్థాయి భవనాలు లేక కొన్ని అద్దె భవనాలలో నడుస్తున్నాయి.

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో అమలుచేస్తున్న మధ్యాహ్న భోజనం కూడా అధ్వాన్నంగానే ఉంది. హాస్టళ్లు, గురుకులాల్లో ఉండి చదువుకునే విద్యార్థులకు సన్న బియ్యంతో అన్నం పెడతామని రాష్ట్ర సర్కారు గొప్పగా ప్రకటించింది. ప్రారంభంలో కొన్ని నెలలు మాత్రమే సన్న బియ్యం సరఫరా చేసి.. ఆ తర్వాత వదిలేసింది. అంతే కాక మధ్యాహ్న భోజన బిల్లులు ప్రభుత్వం సకాలంలో చెల్లించకపోవడంతో చాలా చోట్ల నిర్వాహకులు నాసిరకం భోజనం పెడుతున్నారు. నెలల తరబడి ప్రభుత్వం బిల్లులు చెల్లించక పెండింగులో పెడుతుండటంతో నిర్వాహకులు అప్పు తెచ్చి మరీ వంట చేస్తున్నారు.

అన్ని హాస్టళ్లు, గురుకులాలకు, ప్రభుత్వ పాఠశాలలకు ఇప్పుడు సర్కార్ దొడ్డు బియ్యం సరఫరా చేస్తోంది. కొన్ని నెలలుగా మండల్ లెవెల్ స్టాక్ పాయింట్స్ నుంచి తుట్టెలు కట్టిన, పురుగుపట్టిన, మక్కిన బియ్యాన్ని సరఫరా చేస్తున్నారు. అధికారులకు ఎన్ని ఫిర్యాదులు చేస్తున్నా, ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని తెలిసింది. దీంతో పురుగుల అన్నం, నీళ్ల చారు పెడుతున్నారని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అనేకచోట్ల ఆహారం విషతుల్యమై చాలామంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రుల పాలు కావాల్సి వచ్చింది. అయినా సంబంధిత అధికారులు గానీ, విద్యాశాఖ మంత్రి గానీ నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని రాష్ట్రంలో అనేక చోట్ల విద్యార్థులు ఆందోళనలు చేస్తున్న ఘటనలు చూడొచ్చు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని సమస్యలను తీర్చాలి.

– ముంజంపల్లి దేవేందర్, ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్

కోతుల బెడద తీరాలి!

ఆధునిక కాలంలో మనిషి విచక్షణా రహితంగా చెట్లూ, గుట్టలను ధ్వంసం చేయడంతో కోతులు మానవ ఆవాసాల పైకి దండయాత్ర చేయవలసిన ఆగత్యం ఏర్పడింది. ఫలితంగా ఇళ్లూ, పంటపొలాలూ చిల్లం కల్లం అవుతున్నాయి. గ్రామాల్లో కోతుల సంచారం వలన కూరగాయలు, పండ్లు ఫలాలు కరువవుతున్నాయి. కోతుల వలన కూలీనాలితో ఉపాధిని పొందే కుటుంబాలు తమ గుడిసె ముంగట, అంటుబొల్లు కడిగే దగ్గర, పెంట బొంద దగ్గర కూర గాయాలను పండించుకోవడం బంద్ పెట్టారు. పొప్పడి, జామ, అరటి, చింత, కరివేప, సపోట, ఆల్లనేరడి చెట్లను పెంచడం కూడా బంద్ పెట్టారు. గుమ్మడి పువ్వు దొరుకక పసుపు గౌరమ్మతో బతుకమ్మను పేర్చుకుంటున్నారు. ఇండ్ల మీద ఉన్న కుమ్మరి గూనపెంకులను పెకిలించినందున బెంగుళూరు టైల్స్‌తో మరమ్మతులు చేసుకుంటున్నారు. తాటి, ఈత చెట్ల మొగిని చెడిపేసి కుండలో కల్లు నిండకుండా చేస్తున్నాయి కోతులు. పక్షుల గుడ్లను పగులగొడ్తున్నాయి. గూళ్లను పీకేస్తున్నాయి. దానితో అనేక పక్షుల పుట్టువడి తగ్గ తోంది. కోతులు ముట్టని పంటలు లేవు.

ఇప్పుడు గ్రామీణ తెలంగాణలో కోతుల బెడద ప్రధాన సమస్యగా మారిందంటే అతిశయోక్తి కాదు. కోతుల బెడద 2016 డిసెంబర్ 29న అసెంబ్లీలో చర్చకు వచ్చింది. స్వయంగా ముఖ్యమంత్రే కోతుల బెడద తీవ్రంగా ఉందని ఒప్పుకున్నారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన 2021 నవంబర్ 29న ఈ సమస్యపై క్యాబినెట్ మీటింగ్ జరిగింది. డిసెంబర్ 1న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ రివ్యూ సమావేశం జరిపారు. అధికారులను వారంలోగా పరిష్కార మార్గాలు సూచించాలని ఆదేశించారు. కాని 18 నెలలు గడచినా కనీస కార్యాచరణ లేదు.

కాంగ్రెస్ పార్టీ చేపట్టిన 'హాథ్ సే హాథ్ జోడో' యాత్రలో భాగంగా మానకొండూరు నియోజకవర్గంలోని మన్నెంపల్లి, మల్లాపూర్ గ్రామాల మహిళలు రేవంత రెడ్డిని కలిసి 'మాకు సంక్షేమ పథకాలు ఇవ్వకపోయినా పర్వాలేదు. కోతుల బెడదను మాత్రం నివారించాల'ని మొరపెట్టుకున్నారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

స్టెరిలైజేషన్ (గర్భ నిరోధం), పునరావాసం, అణచి వేయడం, తరలించడం వంటి ప్రక్రియల ద్వారా కోతుల బెడద నియంత్రించవచ్చని పర్యావరణ వేత్తలు, నిపుణులు సూచిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు తీసుకొని కోతుల నుండి ప్రజలను రక్షించాలి.

– మేరుగు రాజయ్య, కేంద్ర కార్యదర్శి
సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ)

క్లుప్తంగా...

స్టాఫ్ నర్స్ పరీక్ష హాల్ టికెట్ల డౌన్‌లోడ్ ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: స్టాఫ్ నర్స్ పరీక్షకు సంబంధించి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునే ప్ర క్రియను మంగళవారం ప్రారంభించారు. స్టాఫ్ నర్స్ పోస్టుల భర్తీకి వచ్చే నెల 2వ తేదీన కంప్యూటర్ ఆధారిత రాత పరీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవా లని మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్ మెంట్ బోర్డ్ సభ్య కార్యదర్శి గోపీకాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 25 నుంచి ఆగస్టు ఒకటో తేదీ సాయంత్రం 5 గంటల వరకు తమ వెబ్‌సైట్ https://mhsrb.telangana.gov.in ద్వారా తమ హాల్ టికెట్‌లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

నేడు పాస్‌పోర్టు స్లాట్ల విడుదల



రాంగోపాల్‌పేట్: ఆగస్టు 5వ తేదీన నిర్వహించే పాస్‌పోర్ట్ స్పెషల్ డ్రైవ్ కోసం ఈ నెల 26వ తేదీ సాయంత్రం 4.30 గంటలకు స్లాట్లు విడుదల చేస్తామని హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి దాసరి బాలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ స్పెషల్ డ్రైవ్ 14 పోస్టాఫీస్ పాస్‌పోర్టు సేవా కేంద్రాల్లో నిర్వహిస్తామని పేర్కొన్నారు. పాస్‌పోర్టు, పీసీసీల కోసం గతంలో దరఖాస్తు చేసుకున్నవారు..కొత్తగా దరఖాస్తు చేసుకునే వారు అధికారిక వెబ్‌సైట్, 'ఎం పాస్‌పోర్ట్‌సేవా' యాప్ ద్వారా షెడ్యూల్, రీ షెడ్యూల్ చేసుకోవచ్చన్నారు.

నారాయణపేటలో వ్యవసాయ పాలిటెక్నిక్ కాలేజీ

ఈ విద్యాసంవత్సరం ప్రారంభించాలని వ్యవసాయ వర్సిటీ నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: నారాయణపేట జిల్లాకేంద్రంలో 40 సీట్లతో వ్యవసాయ పాలిటెక్నిక్ (కో ఎడ్యుకేషన్) కాలేజీని ఈ విద్యాసంవత్సరం ప్రారంభించాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం ఆన్‌లైన్‌లో వ్యవసాయశాఖ కార్యదర్శి, వర్సిటీ ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ రఘునందన్‌రావు అధ్యక్షతన అకడమిక్ కౌన్సిల్ సమావేశం జరిగింది. డిప్లొమా, యూజీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సులకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. వ్యవసాయ మంత్రిత్వశాఖలోని ఆయిల్ సీడ్స్ విభాగంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ అవినాశ్ వనం తనపేరిట బంగారు పత కం అందించాల్సిందిగా చేసిన విజ్ఞప్తిని కౌన్సిల్ ఆమోదించింది. ఈ బంగారు పతకం కోసం డాక్టర్ అవినాశ్ వనం రూ.4 లక్షల సాయం అందించనున్నారు. ఈ డబ్బుపై వచ్చే వడ్డీతో వరంగల్ వ్యవసాయ కళాశాలలో బీఎస్సీ(ఆన ర్స్) అగ్రికల్చర్ కోర్సులో అత్యధిక ఓవరాల్ గ్రేడ్ పాయింట్ సాధించిన విద్యార్థికి ప్రతిఏటా విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవం రోజున బంగారు పతకాన్ని అందచేస్తారు.

మణిపూర్ మీదుగా చొరబడుతున్న ఉగ్రవాదులు

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు:కె.నారాయణ
- మణిపూర్ అల్లర్లను నిరసిస్తూ భారీ ర్యాలీ



ర్యాలీలో తమ్మినేని, కూనంనేని, నారాయణ

సాక్షి, హైదరాబాద్/ అబిడ్స్: మణిపూర్ మీదుగా ఆయుధాలతో టెర్రరిస్టులు దేశంలోకి చొరబడుతున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. మణిపూర్‌లోకి యథేచ్ఛగా ఉగ్రవాదులు చొరబడుతున్నప్పటికీ కేంద్రం, మణిపూర్ ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. 'మణిపూర్ అల్లర్లను అరికట్టండి.. ప్రజల ప్రాణాలను కాపాడండి' అని నినదిస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో లిబర్టీ నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు మంగళవారం పెద్దఎత్తున ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ, మణిపూర్‌లో శాంతియుత వాతావరణం నెలకొనాలని ప్రధాని మోదీ కోరుకోవడం లేదన్నారు. మణిపూర్ మహిళలను నగ్నంగా ఊరేగించిన వీడియోను పార్లమెంట్ సమావేశాలకు ఒక రోజుముందుగా ఉద్దేశపూర్వకంగానే విడుదల చేశారని, ఈ ఘటనలో సుప్రీంకోర్టు సూచనలను కూడా బీజేపీ ప్రభుత్వం తమకు అనుకూలంగా మలచుకుందని ఆయన మండిపడ్డారు. మణిపూర్ భూగర్భ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు ప్రధాని కుట్రపన్నుతున్నారని ఆరోపించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ, అధికారాన్ని శాశ్వతంగా నిలబెట్టుకునేందుకే బీజేపీ ప్రభుత్వం అనేక కుట్రలకు పాల్పడుతోందన్నారు. సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా మాట్లాడుతూ, భేటీ బచావో అని నినదించిన ప్రధాని మణిపూర్‌లోని భేటీల విషయంలో ఏం చేస్తున్నారని నిలదీశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ, మత ఘర్షణల ద్వారానే బీజేపీ ఎదుగుతోందని విమర్శించారు. మణిపూర్ ఘర్షణలు రాజకీయ ఎత్తుగడలో భాగమన్నారు. ఈ కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈటీ నరసింహ అధ్యక్షత వహించగా, సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఛాయాదేవి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ విద్యా సంస్థల్లో చదివే బీసీలకూ ఫీజు రీయింబర్స్‌మెంట్

- ఎస్సీ, ఎస్టీలకు ఇస్తున్న తరహాలో అమలుకు సీఎం కేసీఆర్ నిర్ణయం
- ఏటా 10వేల మంది తెలంగాణ బీసీ విద్యార్థులకు లబ్ధి
- రాష్ట్ర ప్రభుత్వంపైరూ.150 కోట్ల అదనపు భారం: గంగుల



సాక్షి, హైదరాబాద్: దేశంలోని ప్రతిష్టాత్మక విద్యాలయాల్లో చదివే బీసీలకు పూర్తిస్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్ (ఆర్టీఎఫ్) పథకాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఐఐటీలు, ఐఐఎంలు, సెంట్రల్ యూనివర్సిటీలు వంటి 200కు పైగా ఇన్‌స్టిట్యూట్లలో ప్రవేశం పొందిన రాష్ట్ర బీసీ విద్యార్థులకు ప్రభుత్వమే ఫీజులు చెల్లించనుంది. ఈ మేరకు వివరాలను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ వెల్లడించారు. ఇప్పటివరకు రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అమలు చేస్తున్న ఈ పథకాన్ని.. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే బీసీలకు కూడా వర్తింపజేయాలని సీఎం కేసీఆర్ ఆదేశించారని చెప్పారు.

ఏటా సుమారు 10 వేల మందికి..

ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం యూఎస్, యూకే, ఆస్ట్రేలియా తదితర దేశాల్లో చదువుకునే బీసీ విద్యార్థులకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లను అందజేస్తోందని.. రాష్ట్రంలో చదువుతున్న వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేస్తున్నామని మంత్రి గంగుల గుర్తు చేశారు. ఇకపై దేశంలోని ప్రతిష్టాత్మక కాలేజీల్లో సీట్లు పొందిన బీసీ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి ఫీజు అందించనుందని తెలిపారు. మొత్తంగా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజులు చెల్లిస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణేనని పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో ఏటా రాష్ట్రానికి చెందిన దాదాపు 10వేల మంది బీసీ విద్యార్థులకు లబ్ధి చేకూరుతుందని, ఇందుకోసం ప్రభుత్వంపై ఏటా అదనంగా రూ.150 కోట్ల భారం పడుతుందని గంగుల వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆసరా పింఛన్లు, రైతు బంధు, ఉచిత కరెంటు తదితర పథకాల్లో బీసీలదే మెజార్టీ వాటా అని పేర్కొన్నారు. బీసీలకు ఆత్మగౌరవ భవనాలు, గ్రామాలు, పట్టణాల్లో కమ్యూనిటీ హాళ్లు, కుల వృత్తిదారుల ఆర్థిక స్వావలంబనకు రూ.లక్ష ఆర్థిక సాయం, ప్రపంచస్థాయి విద్యను అందించేలా 327 గురుకుల విద్యాలయాల ఏర్పాటు వంటి ఎన్నో సంక్షేమ పథకాలను తమ ప్రభుత్వం అమలు చేస్తోందని చెప్పారు.

ఈ నిర్ణయం విప్లవాత్మకం: జూలూరు గౌరీశంకర్

ఎక్కడా లేని విధంగా దేశంలోని ప్రతిష్టాత్మక సంస్థల్లో చదువుకునేందుకు బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజు చెల్లించాలని సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయం విప్లవాత్మకమని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ హర్షం వ్యక్తం చేశారు.

ఐఐటీ విద్యార్థి విషాదాంతం

- వారం రోజుల క్రితం అదృశ్యమైన కార్తీక్
- వైజాగ్ బీచ్‌లో మృతదేహం లభ్యం
- పరీక్షలో ఫెయిల్ అవడంతో తీవ్ర మనస్తాపం!
- ఐఐటీ హైదరాబాద్‌లో బీటెక్ సెకండియర్ చదువుతున్న మిర్యాలగూడ వాసి
- సముద్రంలో మునిగి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని అనుమానం



రోదిస్తున్న కార్తీక్ తల్లి సైదమ్మ

మిర్యాలగూడ టౌన్: వారం రోజుల క్రితం అదృశ్యమైన ఐఐటీ విద్యార్థి కార్తీక్ సోమవారం రాత్రి విశాఖపట్నంలోని జోడుగుళ్లపాలెం బీచ్‌లో శవమై తేలాడు. సంగారెడ్డి జిల్లా కంది మండల కేంద్రంలోని ఐఐటీ హైదరాబాద్‌లో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కార్తీక్ పరీక్షల్లో తప్పడంతో మనస్తాపానికి గురై బంగాళాఖాతంలో మునిగి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం వాటర్‌ట్యాంకు తండాకు చెందిన ధనావత్ ఉమ్లా నాయక్, సైదమ్మ దంపతులకు కుమారుడు ధనావత్ కార్తీక్ (20), కుమార్తె సాత్విక ఉన్నారు. ఉమ్లా నాయక్ వ్యవసాయ పనులు చేస్తుండగా, సైదమ్మ చింతలపాలెంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో కాంట్రాక్ట్ ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. కాగా కార్తీక్ ఇటీవల విడుదలైన సెమిస్టర్ ఫలితాల్లో రెండు సబ్జెక్టుల్లో ఫెయిల్ అయినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఈ నెల 17న రాత్రి క్యాంపస్ నుంచి బయటకు వెళ్లిన కార్తీక్ అప్పట్నుంచీ కన్పించకుండా పోయాడు. ఈ నెల 18న తల్లిదండ్రులు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ అని వచ్చింది. దీంతో వారు కళాశాలకు వెళ్లి ఆరా తీశారు. కార్తీక్ బయటకు వెళ్లి తిరిగి రాలేదని సిబ్బంది చెప్పడంతో ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు సంగారెడ్డి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జన్మభూమి ఎక్కి విశాఖలో దిగి..

దర్యాప్తులో భాగంగా పోలీసులు సీసీ టీవీ ఫుటేజీలు పరిశీలించగా..18వ తేదీ ఉదయం కార్తీక్ సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో విశాఖపట్నం వెళ్లే జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కినట్లు కన్పించింది. అతను అదేరోజు రాత్రి విశాఖలో దిగడం, రాత్రి 9.30 సమయంలో ఆర్కే బీచ్‌లోని ఓ బేకరీలో ఏవో కొనడం కూడా సీసీ టీవీ ఫుటేజీల ద్వారా గుర్తించారు. కార్తీక్ విశాఖపట్నంలో కన్పించినట్టు పోలీసులు ఇచ్చిన సమాచారంతో అతని తల్లిదండ్రులు అక్కడి తమ బంధువులకు విషయం చెప్పారు. 19వ తేదీ నుంచి కుటుంబసభ్యులు, బంధువులు గాలించినా ఆచూకీ దొరకలేదు. కాగా ఈ నెల 21న విశాఖ జోడుగుళ్లపాలెం బీచ్‌కు ఓ యువకుడి మృతదేహం కొట్టుకొచ్చింది. ఆరిలోవ పోలీసులు గుర్తు తెలియని శవంగా కేసు నమోదు చేసి కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. మంగళవారం ఉదయం మృతదేహాన్ని పరిశీలించిన కార్తీక్ తల్లిదండ్రులు అది తమ కుమారుడేనని గుర్తించారు. కార్తీక్ వారం రోజుల క్రితమే బంగాళాఖాతంలో దూకి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని అనుమానిస్తున్నారు. అతడి మృతదేహం కుళ్లిపోయింది. సెల్‌ఫోన్ ఐఎంఈఐ నంబరు ద్వారా ఆ మృతదేహం కార్తీక్‌దే అని పోలీసులు నిర్ధారించారు. మృతదేహాన్ని జలచరాలు తినడంతో పోస్టుమార్టం చేసేందుకు కూడా వీలు కాలేదు. దీంతో శవాన్ని వెంటనే అంబులెన్సులో మిర్యాలగూడ వాటర్ ట్యాంకు తండాకు తరలించి సాయంత్రం వారి వ్యవసాయ క్షేత్రంలో ఖననం చేశారు.

అమ్మకు బంగారం కొనిస్తానంటివయ్యా..

'ఉద్యోగం వచ్చిన తర్వాత అమ్మకు బంగారం కొనిస్తానంటివి.. అందరినీ మంచిగా చూసుకుంటా అంటివి.. ఇప్పుడు కనిపించకుండా పోయావా కొడుకా'అంటూ ఉమ్లానాయక్ కుమారుడి మాటలను గుర్తు చేసుకుంటూ రోదించిన తీరు అందరినీ కదిలించింది.

సమన్వయంతో ముందుకు

- ఉమ్మడి వ్యూహాలతోనే మావోయిస్టుల కట్టడి సాధ్యం
- నాలుగు రాష్ట్రాల డీజీపీల సదస్సులో నిర్ణయం



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్, చిత్రంలో ఏపీ డీజీపీ రవీంద్రనాథ్‌రెడ్డి, మహారాష్ట్ర డీజీపీ, రజనీశ్ సేత్, ఛత్తీస్‌గఢ్ డీజీపీ అశోక్ జునేజా

సాక్షి, హైదరాబాద్: మావోయి స్టుల కట్టడికి ఉమ్మడి వ్యూహాల తో ముందుకు వెళ్లాలని నాలుగు రాష్ట్రాల డీజీపీల సదస్సులో నిర్ణయించారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో పరస్పర సహకారంపైనా ప్రధానంగా ఈ సమా వేశంలో చర్చించినట్టు తెలిసింది. డీజీపీ అంజనీకుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ఆయన కార్యాలయంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల డీజీపీల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ డీజీపీ రవీంద్రనాథ్‌రెడ్డి, మహారాష్ట్ర డీజీపీ రజనీశ్ సేత్, ఛత్తీస్‌గఢ్ డీజీపీ అశోక్ జునేజా, సీఆర్‌పీఎఫ్ ఐజీ చారుసిన్హా, కేంద్ర ఇంటెలిజెన్స్ బ్యూరోకు చెందిన పలువురు సీనియర్ అధికారులు, తెలంగాణ రాష్ట్ర ఇంటెలిజెన్స్ అడిషనల్ డీజీ అనిల్‌కుమార్, ఆపరేషన్స్ చీఫ్ ప్రభాకర్‌రావు, గ్రేహౌండ్స్ అడిషనల్ డీజీ విజయ్‌కుమార్, శాంతిభద్రతల అడిషనల్ డీజీ సంజయ్‌కుమార్ జైన్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై అంతర్రాష్ట్ర డీజీపీల సదస్సు నిర్వహించడం పరిపాటి. అయితే కరోనా తర్వాత డీజీపీల కో–ఆర్డినేషన్ సమావేశం జరగలేదు. ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఆ రాష్ట్రంలో వారిని కట్టడి చేసేలా ఉమ్మడి వ్యూహాలు అమలు చేయాలని నిర్ణయించారు. సరిహద్దు రాష్ట్రాల పోలీసులతో ఉమ్మడి టీంల ఏర్పాటు, ఆయా రాష్ట్రాల పోలీస్ బలగాల మధ్య సమన్వయం పెంచేలా ఉమ్మడి శిక్షణపైనా దృష్టి పెట్టాలని నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ సరిహద్దు చర్ల ప్రాంతంలో కొత్తగా పోలీస్ బేస్ క్యాంపులను ఏర్పాటు చేశారు.

గోధుమల విక్రయానికి ఎఫ్‌సీఐ టెండర్ల ఆహ్వానం

సాక్షి, హైదరాబాద్: గోధుమల ధరలను నియంత్రించడంతోపాటు వినియోగాన్ని పెంచే ఉద్దేశంతో 10 టన్నుల నుంచి 100 టన్నుల వరకు ఫ్లోర్‌మిల్లులు, పిండి మిల్లులు, గోధుమ ఉత్పత్తుల తయారీదారులకు సెంట్రల్ పూల్ కింద ఈ– వేలం ద్వారా విక్రయిస్తున్నట్లు ఎఫ్‌సీఐ తెలంగాణ స్టేట్ జనరల్ మేనేజర్ దీపక్‌శర్మ తెలిపారు. ఈ క్రమంలో ఐదోసారి వేలంలో భాగంగా చర్లపల్లి గోడౌన్ నుంచి 1,800 టన్నుల గోధుమలను కనీసధర క్వింటాలుకు రూ.2,125(యూఆర్ఎస్ గోధుమ , రూ.2,150(ఎఫ్ఏక్యూ గోధుమ) లెక్కన టెండర్లు ఆహ్వానించినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటివరకు ఎఫ్‌సీఐ 6,900 మెట్రిక్ టన్నుల గోధుమలను విక్రయించిందని తెలిపారు.

ఎఫ్‌సీఐ వల్లే సీఎంఆర్ ఆలస్యం

- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మిల్లింగ్ ఇండస్ట్రీని కాపాడాలి
- రాష్ట్ర రైస్‌మిల్లర్ల సంఘం అధ్యక్షుడు నాగేందర్



సాక్షి, హైదరాబాద్: ఎఫ్‌సీఐ వ్యవహరిస్తున్న తీరుతో రాష్ట్రంలో మిల్లింగ్ ఇండస్ట్రీ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. సీఎంఆర్ విషయంలో మిల్లర్లను వేధించడ మే లక్ష్యంగా ఎఫ్‌సీఐ అధికారులు నిబంధన లకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని మిల్లర్ల సంఘం అధ్యక్షుడు గంప నాగేందర్ గుప్తా ఆరోపించారు. మంగళవారం నగరంలోని టూరిస్ట్ ప్లాజాలో మిల్లర్ల సంఘం సమావే శం జరిగింది. అనంతరం ఆయన మీడియా తో మాట్లాడారు. మిల్లర్లు మిల్లింగ్ చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోడౌన్‌ల నుంచి తరలించాల్సిన ఎఫ్‌సీఐ నాలుగైదు నెలలైనా రైల్వే వ్యాగన్ల ద్వారా ఇతర రాష్ట్రాలకు పంపడం లేదని, తద్వారా గోడౌన్‌లు నిండి పోయి మిల్లింగ్ జరగని పరిస్థితి నెలకొందని వివరించారు. ఒక్కో ఎఫ్‌సీఐ గోడౌన్‌కు వందలాది మిల్లుల నుంచి వచ్చిన బియ్యాన్ని కేటాయిస్తుండడంతో వారం రోజులైనా బియ్యం లారీలు అన్‌లోడింగ్ కావడం లేదన్నారు. దీంతో సమయానికి సీఎంఆర్ ఇవ్వలేని పరిస్థితి నెలకొందన్నారు.

ఇలాగైతే మిల్లింగ్ ఎలా?

ప్రస్తుతం రాష్ట్రంలోని మిల్లర్ల వద్ద కోటి మె ట్రిక్ టన్నుల ధాన్యం నిల్వలు ఉన్నాయని, ఎఫ్‌సీఐ ఇలాగే వ్యవహరిస్తే ఈ ధాన్యాన్ని మిల్లింగ్ చేయడం అసాధ్యమని గుప్త స్పష్టం చేశారు. ఎఫ్‌సీఐ కారణంగా 70 లక్షల మెట్రి క్ టన్నుల ధాన్యం మిల్లింగ్ చేయడానికి 24 నెలల కాలం పడుతుందన్నారు. మిల్లర్లకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.700 కోట్లు, ఎఫ్‌సీఐ నుంచి రవాణా చార్జీలు రూ.700 కోట్లు రావలసి ఉందని, వాటిని వెంటనే చె ల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రం పంపించే బలవర్ధక బియ్యం కెర్నల్స్ (ఎఫ్ ఆర్‌కే)లో నాణ్యత లేదని మిల్లులను ఎఫ్‌సీఐ డిఫాల్టర్లుగా ప్రకటించడం శోచనీయమన్నారు. సమావేశంలో సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రభాకర్ రావు పాల్గొన్నారు.

ఐదేళ్లలో ఆరుగురు ఆత్మహత్య

- మానసిక ఒత్తిడే కారణమనే అభిప్రాయం

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: దేశంలోని అత్యున్నత విద్యా సంస్థల్లో ఒకటైన హైదరాబాద్ ఐఐటీలో విద్యార్థులు అర్ధాంతరంగా తనువు చాలిస్తుండటం ఆందోళనకు గురిచేస్తోంది. చదువులతో తీవ్ర మానసిక ఒత్తిడి కారణంగానే విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారనే వాదన విన్పిస్తోంది. ఐదేళ్లలో మొత్తం ఆరుగురు ఐఐటీహెచ్ విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడటం గమనార్హం. 2019లో ముగ్గురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు ప్రాంతానికి చెందిన బీటెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థి అనిరుధ్ క్యాంపస్‌లోని ఓ భవనం ఏడో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. డిజైనింగ్ విభాగంలో ఎంటెక్ చదువుతున్న వారణాశికి చెందిన అంద్రూస్ మార్క్ ఉరేసుకున్నాడు. మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా నిజాంపేటకు చెందిన సిద్దార్థ కూడా హాస్టల్ వసతిగృహం పైనుంచి దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు. 2022లో ఎంటెక్ రెండో సంవత్సరం చదువుతున్న ఏపీలోని నంద్యాలకు చెందిన బి.రాహుల్, బీటెక్ పూర్తి చేసి ఎంటెక్‌లో చేరేందుకు సంగారెడ్డిలోని ఓ లాడ్జిలో ఉంటున్న జోధ్‌పూర్‌కు చెందిన మేఘకపూర్ ఇద్దరూ వారం రోజుల వ్యవధిలోనే ఆత్మహత్యకు పాల్పడటం సంచలనం సృష్టించింది. తాజాగా కార్తీక్ సముద్రంలో మునిగి ఆత్మహత్య చేసుకోవడం ఐఐటీహెచ్‌లో కలకలం రేపుతోంది. విద్యార్థులు మానసిక ఒత్తిడిని జయించేలా ఐఐటీహెచ్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సెల్ పనితీరు అంతంత మాత్రంగానే ఉండటంతో విద్యార్థుల ఆత్మహత్యలు కొనసాగుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఎంఎస్ఎంఈలకు నైపుణ్యాభివృద్ధి

వాల్‌మార్ట్, ఫ్లిప్‌కార్ట్‌తో పరిశ్రమల శాఖ ఒప్పందం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని లఘు చిన్న మధ్య తరహా సంస్థల్లో (ఎంఎస్ఎంఈ) సామర్థ్య పెంపు వాతావరణాన్ని సృష్టించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం కీలక ఒప్పందం కుదుర్చుకుంది. రాష్ట్ర పరిశ్రమల శాఖతో కుదిరిన అవగాహన ఒప్పందంపై వాల్‌మార్ట్, ఫ్లిప్‌కార్ట్, స్వస్తి సంస్థలు సంతకాలు చేశాయి. ఈ ఒప్పందంలో భాగంగా స్థానిక ఎంఎస్ఎంఈలకు దేశీయ మార్కెట్‌తో అనుసంధానం, ఆన్‌లైన్ రిటైల్ వ్యాపారం, తమ ఉత్పత్తుల వాణిజ్యీకరణ, అభివృద్ధి తదితరాలు సాధ్యమవుతాయి. ఎంఎస్ఎంఈలు తమ కార్యకలాపాల విస్తరణకు అవసరమైన వనరులు, నైపుణ్యాలు ఈ శిక్షణ ద్వారా అందుబాటులోకి వస్తాయి. ఈ ఒప్పందంలో భాగంగా రాష్ట్రంలోని ఎంఎస్ఎంఈలు తమ కార్యకలాపాలను డిజిటలీకరించడంతో పాటు సామర్థ్యం పెంపునకు వాల్‌మార్ట్ తోడ్పాటును అందిస్తుంది.

వ్యాపారాభివృద్ధికి శిక్షణ: వాల్‌మార్ట్ వృద్ధి సప్లయర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా చిన్న తరహా వ్యాపార, వాణిజ్యవేత్తలకు తమ వ్యాపార అభివృద్ధి, విస్తరణకు అవసరమైన లోతైన నైపుణ్య శిక్షణ అందుతుంది. ఈ ప్రోగ్రామ్‌లో ఇప్పటికే హైదరాబాద్, ఢిల్లీ, బెంగుళూరు, ముంబాయి, సూరత్, పానిపట్, కోల్‌కతా వంటి ప్రధాన నగరాలతో పాటు దేశంలోని ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లోని ఎంఎస్ఎంఈలు తమ వివరాలు నమోదు చేసుకుంటున్నాయి. 2019లో ప్రారంభమైన ఈ వాల్‌మార్ట్ వృద్ధి సప్లయర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో 50వేల ఎంఎస్ఎంఈల నైపుణ్యాభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకోగా...ఇప్పటికే 32వేలకు పైగా ఎంఎంఎస్ఎంఈలు ఈ ప్రోగ్రామ్ కింద శిక్షణ పూర్తి చేసుకున్నాయి. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, స్వస్తి డైరెక్టర్ జోసెఫ్ జూలియన్ కేజీ, వాల్‌మార్ట్ సప్లయర్ డెవలప్‌మెంట్ వైస్ ప్రెసిడెంట్ జేసన్ ఫ్రెమ్‌స్టాడ్ పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిర్లక్ష్యంపై కోర్టు సీరియస్

- సీఐపై క్రిమినల్ చర్యలకు న్యాయమూర్తి ఆదేశం
- సంచలనంగా మారిన కామారెడ్డి అదనపు జిల్లా జడ్జి ఆదేశాలు

సాక్షి, కామారెడ్డి: పోక్సో కేసులో బాధితురాలికి రక్షణ కల్పించి, భరోసా ఇవ్వాల్సిన అధికారులు.. నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై కామారెడ్డి అదనపు జిల్లా జడ్జి, పోక్సో కోర్టు అదనపు బాధ్యతలు చూస్తున్న జడ్జి లాల్‌సింగ్ శ్రీనివాస్ నాయక్ సీరియస్‌గా స్పందించారు. బాధితురాలి విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు కామారెడ్డి పట్టణ సీఐ నరేశ్‌పై 15 రోజుల్లో క్రిమినల్, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. కామారెడ్డి పట్టణానికి చెందిన ఓ బాలికపై లైంగిక వేధింపులకు సంబంధించిన కేసులో నిందితుడు సయ్యద్ అబ్దుల్ హలీమ్ షరతులతో కూడిన బెయిల్ పొందాడు. బెయిల్‌పై బయటకు వచ్చిన తర్వాత షరతులు పాటించకపోగా.. బాధితురాలిని, ఆమె కుటుంబ సభ్యులను మళ్లీ వేధింపులకు గురిచేశాడు. దీంతో బాధితులు కామారెడ్డి పట్టణ పోలీసు స్టేషన్‌కు వెళ్లి విషయాన్ని సీఐ దృష్టికి తీసుకువెళ్లారు. సీఐ బాధితురాలితో నిర్లక్ష్యంగా వ్యవహరించడమేగాక, ఫిర్యాదుపై స్పందించకపోవడంతో వారు ఈనెల 19న న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. పోక్సో కోర్టు న్యాయమూర్తి లాల్‌సింగ్ శ్రీనివాస్‌నాయక్ బాధితుల వాంగ్మూలాలను నమోదు చేయించారు. వాటిని పరిశీలించిన అనంతరం బాధితులతో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు ఎస్‌హెచ్‌వో నరేశ్‌పై క్రిమినల్, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీని ఆదేశించారు. ఈ విషయంలో పోలీసు ఉన్నతాధికారులకు కూడా ఉత్తర్వులు పంపించాలని కోర్టు సిబ్బందికి న్యాయమూర్తి సూచించారు. అలాగే కేసులో నిందితుడి బెయిల్ రద్దు కోరుతూ పిటిషన్ వేయాలని పీపీ నంద రమేశ్‌ను ఆదేశించారు.

చేనులో దంపతులను.. చంకలో బిడ్డను..

- సంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో ముగ్గురిని కాటేసిన కరెంటు



మృతి చెందిన భార్యాభర్తలు

ఝరాసంగం(జహీరాబాద్)/భిక్కనూరు: చేనుపనుల్లో నిమగ్నమైన దంపతులను కరెంటు కాటేసింది. దండెంపై బట్టలు ఆరేస్తుండగా కరెంటుషాక్ తగిలి తల్లిచంకలోని కొడుకు మృత్యువొడికి చేరాడు. ఈ ఘటనలు సంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో చోటుచేసుకున్నాయి. సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం బిడికన్నె గ్రామానికి చెందిన దేవిదాస్(34), మరియమ్మ(32) దంపతులు. అడవిపందుల బెడద నుంచి రక్షణగా తమ చేను చుట్టూ కరెంటుకంచె ఏర్పాటు చేశారు. మంగళవారం మధ్యాహ్నం చేను పనులు చేస్తున్న మరియమ్మ కాసక కరెంటుకంచెను తాకడంతో విద్యుత్ షాక్‌కు గురై పడిపోయింది. ఆ పక్కనే ఉన్న దేవిదాస్ ఆమెను కాపాడేందుకు ప్రయత్నిస్తుండగా కరెంటు షాక్ తగిలింది. దంపతులిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు.

నిజామాబాద్ జిల్లా భిక్కనూరు మండలం అంతంపల్లికి చెందిన రమ్య సోమవారం రాత్రి తన ఏడాదిన్నర కొడుకు రితిక్‌ను చంకలో ఎత్తుకుని బట్టలను దండెంపై ఆరేస్తోంది. దండెంగా కట్టిన జీఐ తీగపై బల్బుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్‌వైరు తేలి ఉండటంతో రమ్యకు, చిన్నారికి షాక్ తగిలింది. రమ్యకేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారు వచ్చి కట్టెతో వైరుపై గట్టిగా కొట్టారు. వైరు పక్కకు జరిగిపోవడంతో రమ్య, రితిక్ కింద పడిపోయారు. వెంటనే వారిని కామారెడ్డి ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి బాలుడు మృతి చెందినట్టు చెప్పారు. రమ్య కోలుకుంటోంది.

'అతిథి'కి ఆహ్వానం

పాత గెస్ట్ లెక్చరర్లను తక్షణమే తీసుకోండి: ఇంటర్ బోర్డు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్లకు ఇది తీపికబురే. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1654 మంది అధ్యాపకులను తిరిగి విధుల్లోకి చేర్చుకుంటున్నారు. ఇప్పటి వరకూ పనిచేసిన అర్హులైన గెస్ట్ లెక్చరర్లను విధుల్లోకి తీసుకోవాలని ఆదేశిస్తూ ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ నవీన్ మిత్తల్ మంగళవారం ఆదేశాలు జారీ చేయగా, అధికారిక ఉత్తర్వులను ఇంటర్‌బోర్డు ముఖ్య అధికారి జయప్రదాభాయ్ జిల్లా ఇంటర్ విద్యాధికారులకు పంపారు.

క్లుప్తంగా...

వాపస్ ఇవ్వబోమంటూ గ్రహీతలు అంగీకరిస్తేనే అవార్డులివ్వాలి

పార్లమెంటరీ స్థాయీ సంఘం సూచన

న్యూఢిల్లీ: దేశంలో కొన్నేళ్ల క్రితం 'అవార్డుల వాపసీ' కార్యక్రమం సంచలనం సృష్టించింది. కేంద్ర ప్రభుత్వంపై నిరసన వ్యక్తం చేస్తూ కొందరు తమ అవార్డులను తిరిగి ఇచ్చేశారు. ఇకపై అలాంటి అవాంఛనీయ పరిణామం పునరావృతం కాకుండా, పార్లమెంటరీ స్థాయీ సంఘం కీలక సిఫార్సు చేసింది. రవాణా, పర్యాటకం, సంస్కృతిపై ఏర్పాటైన ఈ స్థాయీ సంఘం ఇచ్చిన నివేదికను తాజాగా పార్లమెంట్‌లో సమర్పించారు. సాహిత్య అకాడమీ, ఇతర సాంస్కృతిక సంఘాలు, అకాడమీలు పూర్తిగా రాజకీయేతర సంస్థలని స్థాయీ సంఘం పేర్కొంది. రాజకీయాలతో వాటికి సంబంధం లేదని వెల్లడించింది. అందుకే ఇలాంటి సంస్థలు అందజేసే అవార్డుల విషయంలో గ్రహీతల నుంచి ముందుగానే అంగీకారం పొందాలని సూచించింది. రాజకీయ కారణాలతో అవార్డులను వెనక్కి ఇవ్వబోమంటూ వారు అంగీకరించేలా చూడాలని స్పష్టం చేసింది. ఒకవేళ అవార్డును వాపస్ చేస్తే భవిష్యత్తులో అలాంటి మరో అవార్డు కోసం వారి పేర్లను పరిగణనలోకి తీసుకోవద్దని తేల్చిచెప్పింది. ప్రభుత్వం ప్రదానం చేసిన పురస్కారాలను వెనక్కి ఇవ్వడం దేశాన్ని అవమానించడమే అవుతుందని పార్లమెంటరీ స్థాయీ సంఘం అభిప్రాయపడింది. అవార్డుల ప్రతిష్టను, హోదాను కూడా దెబ్బతీస్తుందని పేర్కొంది.

ఎస్సీ, ఎస్టీలు మినహా కుల గణన లేదు: కేంద్రం

న్యూఢిల్లీ: దేశానికి స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి ఎస్సీ, ఎస్టీలు మినహా కులాల వారీగా జనాభా లెక్కల సేకరణ జరగడం లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ మంగళవారం లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానమిచ్చారు. త్వరలో జరగబోయే జన గణనలో భాగంగా కులాల వారీ గా జనాభా లెక్కలను సైతం సేకరించాలని కొన్ని రాజకీయ పార్టీలు, సంఘాలు కోరుతున్నాయని చెప్పారు. రాజ్యాంగం(ఎస్సీలు) ఆర్డర్–1950, రాజ్యాంగం(ఎస్టీలు) ఆర్డర్– 1950లో పేర్కొన్న కులాల మినహా ఇతర కులాల లెక్కలను స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి ప్రభుత్వం సేకరించడం లేదని గుర్తుచేశారు.

బ్రిటన్ వీసా దరఖాస్తులకు ఆహ్వానం

లండన్: 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయసున్న పట్టభద్రుల కోసం యూకే–ఇండియా యంగ్ ప్రొఫెషనల్ స్కీమ్ కింద రెండో దశ బ్యాలెట్‌ను బ్రిటన్ ప్రారంభించింది. భారత యువ వృత్తి నిపుణులు బ్రిటన్‌లో స్థిరపడి పని చేస్తూ చదువుకోవడానికి ఉపయోగపడే ఈ పథకం కింద 2023కు 3,000 సీట్లున్నాయి.

చినుకుతో వణుకు

ఢిల్లీ నుంచి గల్లీ దాకా దేశమంతా అదే వ్యథ

ఆక్రమణలు, అడ్డగోలు నిర్మాణాలే కారణం

మొన్న ముంబై. నిన్న చెన్నై. ఇవాళ ఢిల్లీ.. నగరమేదైనా అదే కథ.. అదే వ్యథ..

చినుకే వరదై రాజధాని తల్లడిల్లిపోతోంది

యమునా నది మహోధృతి ధాటికి
కనీవినీ వరదలతో అతలాకుతలమవుతోంది..

ఏమిటీ పరిస్థితి..? ఎందుకీ దుస్థితి..?

యమునా నది ఢిల్లీ పరిధిలో 48 కి.మీ. మేరకు ప్రవహిస్తుంది. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రమాదకర స్థాయిని దాటి ప్రవహించింది. జూలై 10న సంభవించిన వరదల కారణంగా రాజధాని నగరానికి రూ.10 వేల కోట్లకు పైగా ఆర్థిక నష్టం సంభవించినట్లు అంచనా. ఢిల్లీలో చిత్తడి నేలలు, బావులు, సరస్సులు వంటి జల వనరులు 1,040కి పైగా ఉన్నాయి. వీటికి అధికారిక గుర్తింపు లేదు. ప్రభుత్వం నోటిఫై చేయకపోవడంతో అవి సులభంగా ఆక్రమణలకు గురవుతున్నాయి. ఫలితంగా ఢిల్లీని వరద కష్టాలు వెంటాడుతున్నాయి. నిజానికి దేశంలోని అన్ని చిన్నా పెద్దా నగరాలదీ ఇదే సమస్య...



- ఢిల్లీలో మురుగునీటి పారుదల వ్యవస్థ 1970ల నాటిది. నాటితో పోలిస్తే నగర జనాభా కనీవినీ ఎరగనంతగా పెరిగిపోయింది.
- దాంతో చిన్నపాటి వర్షానికే రోడ్లన్నీ జలమయంగా మారుతున్నాయి. ఇక అడ్డగోలు నిర్మాణాలతో డ్రైనేజీ వ్యవస్థ కుదించుకుపోయి సమస్య మరీ పెద్దదవుతోంది.
- ఢిల్లీలో యమున వరద నీరు చేరే ప్రాంతం దాదాపుగా 97 చదరపు కిలోమీటర్లుంటుంది. నగర భూభాగంలో ఇది 7%. ఇందులో అత్యధిక భూభాగాన్ని ఆక్రమణలు, ఇతర అభివృద్ధి ప్రాజెక్టులు కట్టడానికి కేటాయించడంతో నీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడుతున్నాయి.
- సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ నివేదిక ప్రకారం ఢిల్లీలో యమున వరద నీరు చేరే ప్రాంతాలు 600కు పైగా ఉన్నాయి. వీటిలో 60% వరకు నీరు లేక ఎండిపోయాయి. ఒక్క రోజులోనే అతి భారీ వర్షం కురవడంతో అవన్నీ ఇప్పుడు నీట మునిగాయి.
- పైగా వీటిలో చాలా ప్రాంతాలు ఆక్రమణలకు లోనయ్యాయి. వాటిని వ్యవసాయ క్షేత్రాలుగా మార్చుకొని లక్షలాది మంది బతుకుతున్నారు. మరెన్నో భూముల్ని అభివృద్ధి ప్రాజెక్టులకు కేటాయించారు. 2010లో కామన్‌వెల్త్ క్రీడల కోసం నిర్మించిన గ్రామం, అక్షరధామ్ ఆలయం వంటివెన్నో వరద ప్రాంతాల్లోని ఆక్రమిత భూములపై నిర్మించినవే.
- చిత్తడి నేలలు సహజసిద్ధంగా నీటిని పీల్చుకొని భూగర్భ జలాలను పెంపొందిస్తాయి. కానీ ఢిల్లీలోని చిత్తడి నేలల్లో 200కు పైగా ఎండిపోయి ఆక్రమణలకు గురయ్యాయి.

హతినికుండ్ వివాదం



- హరియాణాలో 1996లో కట్టిన ఈ ఆనకట్ట ద్వారా నీళ్లు యమున నది తూర్పు, పశ్చిమ కాలువల్లోకి ప్రవహిస్తాయి. హరియాణా ప్రభుత్వం ఈ బ్యారేజ్ గేట్లు ఎత్తేయడంతో నేరుగా యమున నదిలోకి వరద నీరు చేరి ప్రమాదకరంగా మారుతోందని ఢిల్లీ ప్రభుత్వం ఆరోపిస్తోంది. అయితే తాము నిబంధనలకనుగుణంగానే వ్యవహరిస్తూ లక్ష క్యూసెక్కులు దాటితేనే నీటిని వదులుతున్నామని హరియాణా ప్రభుత్వం వాదిస్తోంది. ఈ నెల 10వ తేదీన హతినికుండ్ ప్రాజెక్టు నుంచి ఏకంగా 3.59 లక్షల క్యూసెక్కుల నీరు యమునలోకి వచ్చింది. అందుకే ఢిల్లీ నీట మునిగిందన్న వాదనలు కూడా ఉన్నాయి. అయితే 2010 వర్షాకాలంలో 7 లక్షల క్యూసెక్కుల నీరు హతినికుండ్ నుంచి విడదల చేసినప్పటికీ అప్పట్లో నగరానికి పెద్దగా ముప్పు రాలేదు. ఇప్పుడు మూడు లక్షల క్యూసెక్కులకే ముప్పు రావడానికి ఆక్రమణలు, అడ్డగోలు నిర్మాణాలే కారణమని సౌత్ ఆసియా నెట్‌వర్క్ ఆన్ డామ్స్, రివర్స్, పీపుల్ కోఆర్డినేటర్ హిమాంశు ఠక్కర్ అభిప్రాయపడ్డారు.

చిత్తడి నేలల పునరుద్ధరణ..

- వరద ప్రభావాన్ని తగ్గించాలంటే ఆక్రమణలను తొలగించి నదీ తీర ప్రాంతాలను పునరుద్ధరించాల్సిన అవసరం చాలా ఉంది. నగరంలో డ్రైనేజీ వ్యవస్థను యుద్ధ ప్రాతిపదికన మెరుగుందుకు ప్రభుత్వం కృషి చేయాలి. యమునా నది పొంగి పొర్లకుండా ఢిల్లీకి రక్షణ కవచంలా ఉండే చిత్తడి నేలలు, సరస్సులు, చెరువుల వంటివి తగ్గిపోతున్నాయి. అవి లేకుండా యమున ప్రవాహం సవ్యంగా సాగదన్న అభిప్రాయాలున్నాయి. ఈ సరస్సులు, చెరువులు, బావుల వంటివి నీటిని స్టోరేజ్ చేయడం వల్ల డ్రైనేజీలోకి వెళ్లే నీటి ప్రవాహం తగ్గుతుంది. ''నదుల వరదను శాపంగా చూడకూడదు. పరివాహక ప్రాంతంలో గడ్డివాములు, చెట్లు పెంచడం వంటివి చేస్తే వరద ముప్పు నుంచి తప్పించుకోవచ్చు'' అని సీనియర్ సైంటిస్ట్ ఫయాద్ ఖుద్‌సర్ చెప్పారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

> ఢిల్లీ రెండు రకాల సమస్యలు ఎదుర్కొంటోంది. నిర్మాణాలు పెరిగి కాంక్రీట్ జంగిల్‌గా మారింది. వాతావరణ మార్పుల ప్రభావాలను ఎదుర్కొనే సన్నద్ధత లేదు. అందుకే నగరం ఇలా వరద ముప్పుకు లోనవుతోంది.
>
> – రితేశ్ కుమార్, డైరెక్టర్ ఆఫ్ వెట్‌ల్యాండ్స్ ఇంటర్నేషనల్, సౌత్ ఏషియా



ఢిల్లీని ఠారెత్తిస్తున్న వరద బీభత్సానికి తాజా సాక్ష్యమీ ఫొటో. మంగళవారం హిండన్ నది పొంగి పొర్లి ఢిల్లీ పరిసర ప్రాంతాలను ముంచెత్తింది. దాంతో నోయిడాలో ఎకోటెక్ సమీపంలో ఇలా వందలాది కార్లు నీట మునిగిపోయాయి.

..సీఐసీ తీర్పును వాడుకోరాదు: సుప్రీం

న్యూఢిల్లీ: రాజకీయ పార్టీలను సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) పరిధిలోకి తేవాల్సిందిగా తమను కోరేందుకు కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ) ఆదేశాన్ని వాడుకోజాలరని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పార్టీలను ఆర్‌టీఐ పరిధిలోకి తేవాలంటూ దాఖలైన రెండు ప్రజా ప్రయోజన వ్యాజ్యాలను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ సారథ్యంలోని ధర్మాసనం మంగళవారం విచారించింది. అధికారిక విధులు నిర్వర్తించాల్సిందిగా కేంద్రాన్ని ఆదేశిస్తూ రిట్ ఆఫ్ మాండమస్ జారీ చేయాలంటూ సీఐసీ తీర్పు ఆధారంగా సుప్రీంకోర్టును కోరజాలరని ఈ సందర్భంగా స్పష్టం చేసింది. కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు విన్పించారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు విన్పించారు.

ఐదోసారి చంద్రయాన్–3 కక్ష్య పెంపు

జాబిల్లి వైపు దూసుకెళ్తున్న చంద్రయాన్ మిషన్

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) సతీష్ ధావన్ స్పేస్ సెంటర్–షార్ నుంచి ఈ నెల 14న ప్రయోగించిన చంద్రయాన్–3 మిషన్ కక్ష్య దూరాన్ని మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటలకు శాస్త్రవేత్తలు విజయవంతంగా పెంచారు. ప్రొపల్షన్ మాడ్యూల్‌లో నింపిన అపోజీ ఇంధనాన్ని మండించి చంద్రయాన్–3 మిషన్‌ను ప్రస్తుతం భూమికి దగ్గరగా 236 కిలోమీటర్ల ఎత్తుకు, భూమికి దూరంగా 1,27,609 కిలోమీటర్లు ఎత్తుకు పెంచి భూమధ్యంతర కక్ష్యలో పరిభ్రమించేలా చేశారు. ఎల్‌వీఎం3–ఎం4 ఉపగ్రహ వాహక నౌక ద్వారా చంద్రయాన్–3 మిషన్‌ను మొదట భూమికి దగ్గరగా 170 కిలోమీటర్లు, భూమికి దూరంగా 36,500 కిలోమీటర్ల ఎత్తులో భూమధ్యంతర కక్ష్యలోకి ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఇప్పటికే నాలుగు విడుతలుగా చేపట్టిన వివిధ ఆపరేషన్లలో భూమికి దగ్గరగా 233 కిలోమీటర్ల ఎత్తుకు, భూమికి దూరంగా 71,351 కిలోమీటర్ల ఎత్తుకు పెంచారు. తాజాగా ఐదోసారి కక్ష్య దూరాన్ని విజయవంతంగా పెంచారు. భూమికి సంబంధించిన కక్ష్యలో ఇదే చివరి ఆపరేషన్. ఆగస్టు 1న అర్ధరాత్రి 12.30 గంటలకు ట్రాన్స్ లూనార్ ఇంజెక్షన్ అనే ఆపరేషన్‌తో చంద్రయాన్–3 మిషన్ చంద్రుడి దిశగా ప్రయాణిస్తుంది. ఆగస్టు 17న లూనార్ ఆర్బిట్(జాబిల్లి కక్ష్య)కు చేరుకుంటుంది. ఐదు రోజులు పాటు చంద్రుడి చుట్టూ పరిభ్రమిస్తూ ఆగస్టు 23న చందమామ ఉపరితలంపై 30 కిలోమీటర్ల ఎత్తులో ప్రొపల్షన్ మాడ్యూల్ ల్యాండర్‌ను విడిచిపెడుతుంది. ఆగస్టు 23న సాయంత్రం 5.47 గంటలకు ల్యాండర్ చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతంలో ఉపరితలంపై దిగుతుంది. ఆ తరువాత ల్యాండర్ లోపల అమర్చిన రోవర్ బయటకు వచ్చి, చంద్రుడిపై 14 రోజుల పాటు పరిశోధనలు చేసి, ఇస్రోకు సమాచారం చేరవేస్తుంది.



కేంద్రంపై అవిశ్వాసం!

నేడు 'ఇండియా' కూటమి భేటీలో నిర్ణయం

- మణిపూర్‌పై అట్టుడికిన ఉభయ సభలు
- ప్రధాని పార్లమెంటుకు వచ్చి చర్చించాలి
- 51 మంది విపక్ష ఎంపీల నోటీసులు
- నిరసనలకు మద్దతు పలికిన బీఆర్ఎస్
- విపక్షాలు కలసి రావాలంటూ అమిత్ షా లేఖ

సాక్షి, న్యూఢిల్లీ: మణిపూర్ హింసపై పార్లమెంట్ వెలుపలా, లోపలా నిరసనలతో హోరెత్తిస్తున్నా ప్రధాని నరేంద్ర మోదీ నోరుమెదపకపోవడంపై విపక్షాలు మండిపడుతున్నాయి. ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇంక్లూజివ్ అలయన్స్ (ఇండియా) పేరిట ఇటీవలే ఒక్కటైన కాంగ్రెస్ సహా 26 విపక్షాలు ఈ అంశానికి సంబంధించి కేంద్రంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే యోచనలో ఉన్నాయి. రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన మంగళవారం జరిగిన విపక్షాల భేటీలో అవిశ్వాస తీర్మానంపై కీలక చర్చలు జరిగాయి. బుధవారం నేతలతో మరోసారి సంప్రదించి తుది నిర్ణయం తీసుకుంటామని కాంగ్రెస్ నేతలు వెల్లడించారు. తీర్మాన ప్రతి ఇప్పటికే సిద్ధమైందని, 50 మంది ఎంపీల సంతకాల సేకరణ ప్రక్రియ జరుగుతోందని వివరించారు. ఆ రోజు విధిగా లోక్‌సభకు హాజరవాలంటూ కాంగ్రెస్ ఇప్పటికే తమ సభ్యులకు విప్ జారీ చేసింది. మరోవైపు, మణిపూర్‌పై చర్చిద్దాం రమ్మంటూ ఉభయ సభల్లో విపక్ష నేతలు ఖర్గే, అధీర్ రంజన్ చౌదరిలకు అమిత్ షా లేఖలు రాశారు. లోక్‌సభలో ఈ మేరకు ప్రకటన కూడా చేశారు. 83 రోజులుగా సాగుతున్న మణిపూర్ హింసపై పార్లమెంటు ఉభయ సభల్లోనూ ప్రధాని మోదీ సమగ్రమైన ప్రకటన చేయాల్సిందేనని ఖర్గే డిమాండ్ చేశారు. అక్కడ పరిస్థితిని మెరుగు పరిచేందుకు కేంద్రం ఏం చేస్తోందో పార్లమెంటుకు చెప్పాల్సిన బాధ్యత ఆయనపై ఉందన్నారు.



ఖర్గే వర్సెస్ గోయల్

ఉభయ సభల్లోనూ విపక్షాలు మంగళవారం నాలుగో రోజు కూడా కార్యక్రమాలను అడ్డుకున్నాయి. మణిపూర్‌పై మోదీ వచ్చి ప్రకటన చేయాలంటూ నినదాలతో హోరెత్తించాయి. ఉదయం రాజ్యసభ ఆరంభానికి ముందే బీఆర్ఎస్‌తో పాటు 51 మంది విపక్ష ఎంపీలు 267 నిబంధన కింద నోటీసులిచ్చారు. 176 నిబంధన కింద ఇచ్చిన నోటీసులపై చర్చకు ప్రభుత్వం సిద్ధమని సభా పక్ష నేత, కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. 267 కింద నోటీసులిస్తే 176 కింద ఎలా చర్చ చేపడతారని కాంగ్రెస్ నేత పి.చిదంబరం ప్రశ్నించారు. తమ ఎంపీ సంజయ్‌సింగ్ సస్పెన్షన్‌ను నిరసిస్తూ ఆప్ సభ్యులు ఆందోళన కొనసాగించారు. దాంతో సభ మధ్యాహ్నానికి వాయిదా పడింది. తిరిగి మొదలవగానే విపక్షాలు వెల్‌లోకి దూసుకెళ్లి ఆందోళనకు దిగాయి. గోయల్, ఖర్గే మధ్య వాగ్వాదం జరిగింది. మణిపూర్ తగలబడుతుంటే దానిపై చర్చకు 'మోదీ సాబ్' సభకు ఎందుకు రాలేదని ఖర్గే ప్రశ్నించగా, విపక్ష పాలిత రాష్ట్రాల్లో ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న అకృత్యాల మీదా సభలో చర్చిద్దామని గోయల్ అన్నారు. దాంతో సభ మధ్యాహ్నం రెండింటి దాకా వాయిదా పడింది. ఎస్టీల రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టగానే విపక్షాల ఆందోళన నేపథ్యంలో సభ బుధవారానికి వాయిదా పడింది. లోక్‌సభ కూడా నేరుగా మధ్యాహ్నం రెండింటికి, అనంతరం జీవ వైవిధ్య బిల్లును ప్రవేశపెట్టాక సాయంత్రం ఐదింటికి వాయిదా పడింది. తర్వాత సహకార సంఘాల బిల్లును సభ ఆమోదించింది. ప్రతిష్టంభనకు ఫుల్‌స్టాప్ పెట్టేందుకు అఖిల పక్ష నేతలతో స్పీకర్ ఓం బిర్లా భేటీ అయినా లాభం లేకపోయింది. మోదీ వచ్చి మణిపూర్ హింసపై స్వయంగా చర్చ మొదలు పెట్టాల్సిందేనని వారు స్పష్టం చేశారు. ఏ రోజైనా చర్చకు సిద్ధమని, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చర్చ మొదలు పెడతారని అధికార పక్షం ప్రతిపాదించింది. ఇక సంజయ్ సింగ్ సస్పెన్షన్‌కు వ్యతిరేకంగా పార్లమెంట్ ఆవరణలో గాంధీ విగ్రహం వద్ద విపక్ష కూటమి సోమవారం రాత్రంతా బృందాలవారీగా చేసిన ధర్నాలో బీఆర్ఎస్ ఎంపీలు పాల్గొన్నారు.

మోదీకి 'ఇండియా' పేరు నచ్చినట్టుంది: మమత

కోల్‌కతా: ''ప్రధాని మోదీకి థ్యాంక్స్. విపక్ష కూటమి పేరు 'ఇండియా' ఆయనకు బాగా నచ్చినట్టుంది'' అంటూ పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ చెణకులు విసిరారు. విపక్ష కూటమి గురించి బీజేపీ ఎంతగా విమర్శలు చేస్తే, 'ఇండియా' అనే పేరు వారికి అంతగా నచ్చినట్టు అర్థమన్నారు.

మళ్లీ ఉత్తర కొరియా క్షిపణి ప్రయోగం

రెండు బాలిస్టిక్ మిస్సైళ్లు ప్రయోగించిన కిమ్ ప్రభుత్వం

సియోల్: తమ ప్రత్యర్థి దేశమైన దక్షిణ కొరియాకు అగ్రరాజ్యం అమెరికా ఆయుధ సాయం అందిస్తుండడాన్ని వ్యతిరేకిస్తూ ఉత్తర కొరియా ప్రతీకార చర్యలకు పాల్పడుతోంది. సోమవారం అర్ధరాత్రి తర్వాత రెండు షార్ట్–రేంజ్ బాలిస్టిక్ మిస్సైళ్లను ప్రయోగించింది. ఈ విషయాన్ని దక్షిణ కొరియా జాయింట్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ మంగళవారం బహిర్గతం చేశారు. ఉత్తర కొరియాలో కిమ్ జోంగ్ ఉన్ ప్రభుత్వం క్షిపణి ప్రయోగం నిర్వహించడం గత వారం రోజుల వ్యవధిలో ఇది మూడోసారి కావడం గమనార్హం. రాజధాని పాంగ్యాంగ్ సమీప ప్రాంతం నుంచి ప్రయోగించిన ఈ రెండు బాలిస్టిక్ మిస్సైళ్లు 400 కిలోమీటర్లు(248 మైళ్లు) ప్రయాణించి తూర్పు కోస్తా తీరంలో సముద్రంలో పడిపోయాయి. ఉత్తర కొరియా క్షిపణి ప్రయోగాలపై జపాన్ ప్రధానమంత్రి ఫుమియో కిషిడా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రెచ్చగొట్టే చర్యలకు పాల్పడొద్దని హెచ్చరించారు. తమ నిరసనను ఉత్తర కొరియాకు తెలియజేశామని చెప్పారు.


యూపీలో శిశువు ప్రాణాలు బలిగొన్న అడవి పిల్లి

బుదౌన్(యూపీ): ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బుదౌన్ జిల్లాలోని గొత్రపట్టి భొనీ గ్రామంలో ఘోరం జరిగిపోయింది. తల్లి పక్కన నిద్రిస్తున్న 15 రోజుల శిశువును అడవి పిల్లి నోట కరుచుకొని ఎత్తుకెళ్లింది. ఇంటిపై నుంచి కిందికి వదిలేసింది. దీంతో శిశువు మృతిచెందాడు. సోమవారం రాత్రి ఈ సంఘటన జరిగిందని పోలీసులు చెప్పారు. ఆస్మా అనే మహిళ 15 రోజుల క్రితం కవలలు.. ఆడ శిశువు, మగ శిశువుకు జన్మనిచ్చింది. వారికి అల్‌షిఫా, రిహాన్ అని పేర్లు పెట్టుకున్నారు. సోమవారం రాత్రి ఇంట్లోకి ప్రవేశించిన అడవి పిల్లి మగ శిశువు రిహాన్‌ను ఎత్తుకెళ్లింది. అప్రమత్తమైన ఆస్మా వెంటనే కేకలు వేసింది. అడవి పిల్లిని పట్టుకొనేందుకు ఆమె భర్త హసన్ ప్రయత్నించాడు. దాంతో ఇంటి పైకి చేరిన అడవి పిల్లి శిశువును వదిలేసింది. తీవ్ర గాయాలపాలైన శిశువు ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు.

అబూదాబిలో యువకుడికి మెర్స్–కోవ్ వైరస్

అబూదాబి: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ)లోని అబూదాబిలో ఓ యువకుడికి ప్రాణాంతకమైన మిడిల్ ఈస్ట్ రెస్పిరేటరీ సిండ్రోమ్ కరోనా వైరస్ (మెర్స్–కోవ్) సోకింది. అల్ అనిన్ నగరానికి చెందిన 28 ఏండ్ల యువకుడు అనారోగ్యం పాలయ్యాడు. పరీక్షలు నిర్వహించగా మెర్స్–కోవ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) వెల్లడించింది. అతడిని కలిసిన 108 మందికి సైతం పరీక్షలు నిర్వహించామని, వారికి వైరస్ సోకలేదని నిర్ధారణ అయినట్లు అబూదాబి అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం బాధిత యువకుడి ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందన్న విషయం తెలియరాలేదు. మెర్స్–కోవ్ వైరస్ తొలుత 2012లో సౌదీ అరేబియాలో బయటపడింది. ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా 27 దేశాల్లో ఈ వైరస్ కేసులు నమోదయ్యాయి. ఇప్పటిదాకా 2,605 మందికి మెర్స్–కోవ్ సోకగా వీరిలో 936 మంది మృతిచెందారు. ఈ వైరస్ ఒంటెల నుంచి వ్యాపిస్తుందని, మనుషుల నుంచి మనుషులకు సోకుతుందని నిపుణులు చెబుతున్నారు. అయితే, ఇండియాలో మెర్స్–కోవ్ కేసులు నమోదు కాలేదు. ఈ వైరస్‌కు ఇప్పటికైతే టీకా అందుబాటులో లేదు.

లోక్‌సభకు ఒంటరి పోరు: జేడీ(ఎస్)




శివాజీనగర: కాంగ్రెస్‌కు కావాల్సి వచ్చినప్పుడు జేడీ(ఎస్) లౌకిక పార్టీగా కనిపిస్తుంది. అవసరం తీరాక మరోలా కనిపిస్తుంది'' అంటూ జేడీ(ఎస్) అధినేత హెచ్‌డీ దేవేగౌడ మంగళవారం మండిపడ్డారు. ''కాంగ్రెస్ వాళ్లు నిజాయితీపరులు, నీతిమంతులు. అవసరమైనప్పుడు మాత్రం ఎవరితోనైనా పొత్తు పెట్టుకుంటారు'' అంటూ ఎద్దేవా చేశారు. ఇటీవల బెంగళూరులో జరిగిన విపక్షాల భేటీకి తమను పిలవలేదని చెప్పారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్ని సీట్లు గెలుస్తామో తెలియని, కానీ ఒంటరిగానే బరిలో దిగుతామని చెప్పారు.

దశదిశ లేని కూటమి

దేశం పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించలేరు

- దేశాన్ని విభజించడమే విపక్షాల లక్ష్యం
- నా మూడో టర్మ్‌లో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్
- బీజేపీ పార్లమెంటరీ పార్టీ భేటీలో మోదీ

న్యూఢిల్లీ: ప్రతిపక్ష కూటమి 'ఇండియా'పై ప్రధాని నరేంద్ర మోదీ విరుచుకుపడ్డారు. ఇలాంటి దశాదిశా లేని కూటమిని దేశంలో గతంలో ఎప్పుడూ చూడలేదని అన్నారు. ఈస్ట్ ఇండియా కంపెనీ, ఇండియన్ ముజాహిదీన్‌లో కూడా ఇండియా అనే పేరుందని, దేశం పేరును వాడుకుని ప్రజలను తప్పుదోవ పట్టించలేరని స్పష్టం చేశారు. మంగళవారం బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో మోదీ మాట్లాడారు. పార్లమెంట్ వర్షకాల సమావేశాలకు ప్రతిపక్షాలు అడ్డు తగులుతుండడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్లమెంట్‌లో విపక్షాలు బాధ్యత లేకుండా ప్రవర్తిస్తున్నాయని తప్పుపట్టారు. నిరాశలో మునిగిపోయిన విపక్ష ఎంపీలు దశాదిశా లేకుండా వ్యవహరిస్తున్నారని ఆక్షేపించారు. వారి ప్రవర్తనను బట్టి చూస్తే దీర్ఘకాలం విపక్షంలోనే ఉండాలని నిర్ణయించుకున్నట్లు కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. ప్రపంచవ్యాప్తంగా భారతదేశ కీర్తి ప్రతిష్టలు పెరుగుతున్నాయి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. తాను అధికారంలోకి వచ్చే సమయానికి మన దేశం ప్రపంచంలో పదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉండేదని, ''శాదిఃఇప్పుడు ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారిందని ఉద్ఘాటించారు. తన మూడో టర్మ్‌లో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. తద్వారా మరోసారి కేంద్రంలో మోదీ ప్రభుత్వమే రాబోతోందని పరోక్షంగా తేల్చిచెప్పారు. దేశ అభివృద్ధికి సహకరించాలని, చిత్తశుద్ధితో పని చేయాలని బీజేపీ నేతలకు మోదీ పిలుపునిచ్చారు.



మంగళవారం బీజేపీ పార్లమెంటరీ పార్టీ భేటీలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ తదితరులతో ప్రధాని మోదీ

అవినీతిపరులంతా ఒక్కటయ్యారు

ప్రతిపక్షాలు ఇండియా పేరిట కూటమిగా ఏర్పడ్డాయని, నిషేధిత ఉగ్రవాద, తీవ్రవాద సంస్థలు సైతం దేశం పేరును వాడుకుంటున్నాయని మోదీ వ్యాఖ్యానించారు. అవినీతి పార్టీలు, అవినీతి నాయకులు కూటమి పేరిట ఒక్కటయ్యారని విమర్శించారు. దేశాన్ని పాలించి, విభజించాలని ప్రతిపక్షాలు కోరుకుంటున్నాయని మండిపడ్డారు. అందుకే ఇండియా, ఇండియన్ అనే పేర్లతో జనాన్ని మభ్యపెట్టాలని చూస్తున్నాయని దుయ్యబట్టారు. వాజ్‌పేయి, ఎల్‌కే అద్వానీల వారసత్వమే ఎన్డీయే అని చెప్పారు.

అవును మేము 'ఇండియా'నే..

మణిపూర్‌లో ఇండియా భావనను పునర్నిర్మిస్తాం: రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: ప్రతిపక్ష కూటమి 'ఇండియా'పై ప్రధాని నరేంద్ర మోదీ చేసిన విమర్శలను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాహుల్ గాంధీ తిప్పికొట్టారు. ''మీ ఇష్టం వచ్చినట్లు మమ్మల్ని పిలుచుకోండి. కానీ, మేము ముమ్మాటికీ ఇండియానే. మణిపూర్‌లో ఇండియా భావనను కచ్చితతంగా పునర్నిర్మిస్తాం. మణిపూర్ కోలుకొనేందుకు సహకరిస్తాం. రాష్ట్రంలో ప్రతి మహిళ, ప్రతి చిన్నారి కన్నీటిని తుడిచేస్తాం. ప్రజల కోసం ప్రేమను, శాంతిని తిరిగి తీసుకొస్తాం'' అని రాహుల్ మంగళవారం ట్వీట్ చేశారు.

ఎప్పటికీ భరతమాత బిడ్డలమే: ఖర్గే

తాము మణిపూర్ హింసపై పార్లమెంట్‌లో మాట్లాడుతుంటే ప్రధాని మోదీ మాత్రం ఈస్ట్ ఇండియా కంపెనీ గురించి పార్లమెంట్ బయట మాట్లాడుతున్నారని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. ఇండియా కూటమిని ఈస్ట్ ఇండియా కంపెనీతో పోల్చడం ఏమిటని ప్రశ్నించారు. తాము ఎప్పటికీ భరతమాత బిడ్డలమేనని అన్నారు. ఈ మేరకు ఖర్గే ట్వీట్ చేశారు. బీజేపీ రాజకీయ పూర్వీకులు బ్రిటిష్ పాలకులకు బానిసలుగా పని చేశారని ధ్వజమెత్తారు. వాక్చాతుర్యంతో ప్రజల దృష్టిని మళ్లించడం ఆపాలని ప్రధాని మోదీకి హితవు పలికారు. మణిపూర్ హింసపై ఇకనైనా స్పందించాలని సూచించారు. 'ఇండియా' గురించి నోటికొచ్చినట్లు మాట్లాడొద్దని, ప్రధానమంత్రి పదవికి ఉన్న గౌరవాన్ని దిగజార్చవద్దని చెప్పారు. పేరులో ఏమీ లేకపోతే ప్రతిపక్ష కూటమి పేరును చూసి మోదీ ఎందుకు భయపడుతున్నారని ఖర్గే ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక వీడియో విడుదల చేశారు. పాట్నా, బెంగళూరులో ఇండియా కూటమి సమావేశాలు విజయవంతం కావడాన్ని మోదీ జీర్ణించుకోలేకపోతున్నారని చెప్పారు.



మంగళవారం దివంగత కాంగ్రెస్ నేత ఊమెన్ చాందీ సంస్మరణ సభలో ఆయన కుమారునితో రాహుల్ గాంధీ

ఎన్డీయే.. జాతీయ అపకీర్తి కూటమి

26 పార్టీలతో కూడిన విపక్ష ఇండియా కూటమిని చూసి ప్రధాని మోదీ బెంబేలెత్తిపోతున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ ఎద్దేవా చేశారు. ఇప్పటికే మృతప్రాయంగా మారిన ఎన్డీయేకు ప్రాణం పోసేందుకు మోదీ ప్రయత్నిస్తున్నారని, విపక్షాలపై దూషణల ద్వారా ఎన్డీయేకు కొత్త అర్థం చెబుతున్నారని వెల్లడించారు. ఎన్డీయే అంటే జాతీయ ప్రజాస్వామ్య కూటమి కాదని, అది జాతీయ అపకీర్తి కూటమి అని ట్విట్టర్‌లో తేల్చిచెప్పారు. విపక్ష కూటమిపై ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలను తృణమూల్ కాంగ్రెస్, రాష్ట్రీయ జనతాదళ్, ఆమ్ ఆద్మీ పార్టీ, శివసేన(ఉద్ధవ్ ఠాక్రే) తదితర పార్టీల నేతలు తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ వాద్రా కూడా తప్పుపట్టారు.

సాక్షి
కరీంనగర్

బుధవారం । 26 । జూలై । 2023

16 మండలాలకు ఇన్‌చార్జి ఎంఈవోలే

జిల్లాలోని విద్యాశాఖలో ఇన్‌చార్జీల పాలన సాగుతోంది. 16 మండలాల్లో ఇన్‌చార్జి ఎంఈవోలతో నెట్టుకొస్తున్నారు. దీంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. 8లో▸

దంచికొట్టిన వాన

- నెమ్మదిగా నిండుతున్న జలాశయాలు
- మంగళవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జోరువాన
- మరో రెండు రోజులు పాత కరీంనగర్‌కు రెడ్ అలర్ట్
- కడెం గేట్లు ఎత్తడంతో గోదావరికి భారీగా పెరిగిన వరద
- ఎల్లంపల్లి ఎనిమిది గేట్ల ద్వారా దిగువకు నీరు



శంకరపట్నం: ఉధృతంగా ప్రవహిస్తున్న అర్కండ్ల వాగు

సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి జిల్లాలో వాన దంచికొడుతోంది. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. మరో రెండు రోజులు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు భారీ వర్షసూచన ఉందని వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేసింది. ఈనెల 27న భారీ వర్షం ఉంటుందని, మరింత అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. తెరిపిలేని వానతో జలాశయాలు కళకళలాడుతున్నాయి. పాత జిల్లాకు ప్రాణాధారమైన మిడ్‌మానేరు, లోయర్ మానేరు ప్రాజెక్టులు నెమ్మదిగా నిండుతున్నాయి.

లోయర్ మానేరు..

దిగువమానేరు పూర్తి సామర్థ్యం 24 టీఎంసీలకుగాను ప్రస్తుతం 13 టీఎంసీల నీరు నిల్వ ఉంది. లోయర్ మానేర్ డ్యామ్ (ఎల్ఎండీ)కు 8,869 క్యూసెక్కుల వరద స్థిరంగా వస్తోంది. మొన్నటివరకు కాళేశ్వరం ఎత్తిపోతల నుంచి నీరు మిడ్‌మానేరు మీదుగా లోయర్ మానేరుకు చేరింది. ఇందులో మానేరు నది నుంచి 7,339 క్యూసెక్కుల నీరు వస్తుండగా, మిడ్‌మానేరు నుంచి కేవలం 1,530 క్యూసెక్కులే వస్తోంది. శనివారం నుంచి మంగళవారం వరకు కేవలం ఒక టీఎంసీ నీరు వచ్చి చేరింది. వాస్తవానికి సోమవారం గేట్లు తెరిచి మంత్రి గంగుల కమలాకర్ చేతుల మీదుగా నీటిని విడుదల చేద్దామనుకున్నారు. కానీ.. భారీవర్ష సూచనతో కార్యక్రమం రద్దయింది.

మిడ్‌మానేరు..

27 టీఎంసీల సామర్థ్యం ఉన్న ప్రాజెక్టులో ప్రస్తుతం 15 టీఎంసీల నీరునిల్వ ఉంది. మూలవాగు, మానేరు నదిల నుంచి వరద 6,500 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. అవుట్‌ఫ్లో కేవలం 1,530 క్యూసెక్కులు దిగువ మానేరుకు వదులుతున్నారు.

ఎల్లంపల్లి..


20 టీఎంసీల సామర్థ్యం కలిగిన ప్రాజెక్టులో ప్రస్తుతం 16 టీఎంసీల నీరునిల్వ ఉంది. గోదావరి నది నిర్మించిన ఎల్లంపల్లి ప్రాజెక్టుకు మంగళవారం భారీగా వరద పోటెత్తింది. ఉదయం నుంచి 59,504 క్యూసెక్కుల వరద వస్తుండగా.. అదే స్థాయిలో 59,504 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మొత్తం ఎనిమిది గేట్లు ఓపెన్ చేశారు. ఎగువన వర్షాలు కురుస్తుండటంతో నది క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి 43,412 క్యూసెక్కుల వరద, కడెం ప్రాజెక్టు నుంచి 16,042 క్యూసెక్కుల నీరు భారీగా వచ్చి చేరడంతో ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో ఒక్కసారిగా పెరిగింది.

సాధారణానికి మించి..

జిల్లాలో వర్షం దంచికొట్టింది. గత నెలలో లోటు వర్షపాతం నమోదుకాగా, పక్షం రోజులుగా కురుస్తున్న వర్షాలతో సాధారణానికి మించి వర్షపాతం నమోదైంది. శంకరపట్నం, మానకొండూరులో అలుగులు పారుతున్నాయి. మోయతుమ్మెద వాగుకు వరద ఇప్పుడే మొదలైంది.

జిల్లాలో వర్షపాతం (సె.మీలో)

జమ్మికుంట	10
ఇల్లందకుంట	9.8
గన్నేరువరం	8.6
చిగురుమామిడి	7.6
సైదాపూర్	7.3
హుజూరాబాద్	7.2
శంకరపట్నం	6.5
తిమ్మాపూర్	6.4
కరీంనగర్ అర్బన్, మానకొండూర్	4.6
వీణవంక	4.5
చొప్పదండి	4.1
గంగాధర, రామడుగు	3.9
కొత్తపల్లి	3.5



జల సవ్వడి

చుట్టూ అడవి. ఎత్తయిన కొండలు.. ఆ కొండల నుంచి జాలువారుతున్న జలపాతం.. ఆ జల సవ్వడి అందాలు చూసేందుకు రెండుకళ్లు చాలవు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు సైదాపూర్ మండలం రాయికల్ జలపాతం జాలువారుతోంది. దీంతో జలపాతం అందాలు చూసేందుకు పర్యాటకులు పెద్దసంఖ్యలో తరలివస్తున్నారు. – సైదాపూర్



కలెక్టరేట్ ఆవరణలో వర్షపు నీరు



కోతిరాంపూర్‌లో రహదారిలో..

రోడ్లపై వరద నీరు

- పొంగిపొర్లిన డ్రైనేజీలు
- ఇబ్బంది పడ్డ ప్రజలు
- సహాయక చర్యల్లో బల్దియా



కేబుల్ బ్రిడ్జి సమీపంలో..

కరీంనగర్ కార్పొరేషన్: నగరవాసులకు వానతిప్పలు తప్పడంలేదు. నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో ఇప్పటికే లోతట్టు ప్రాంతాలు జలయమయ్యాయి. మంగళవారం రోజంతా వర్షం కురవడంతో, డ్రైనేజీలు పొంగిపొర్లాయి. రోడ్లపై వరద నీళ్లు నిలిచి చెరువులను తలపించాయి. నగరపాలకసంస్థ అధికారులు సహాయ చర్యల్లో నిమగ్నమయ్యారు. ఎప్పటికప్పుడు రోడ్లు, వీధుల్లో నిలిచిన నీళ్లను మళ్లించే ప్రయత్నం చేశారు. కమాన్ నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు కరీంనగర్–హైదరాబాద్ ప్రధాన రహదారిపై వరదనీళ్లతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. డిజాస్టర్ ఫోర్స్ నీళ్లను మళ్లించడం, పైప్‌లైన్‌లను క్లియర్ చేసేందుకు ఐదారుగంటల పాటు కష్టపడాల్సి వచ్చింది. కేబుల్ బ్రిడ్జి సమీపంలోనూ పైప్‌లైన్ సక్రమంగా లేకపోవడంతో వరదనీళ్లు నిలిచాయి. ఆటోనగర్‌లో నీళ్లు మళ్లించేందుకు డిజాస్టర్ ఫోర్స్ శ్రమించాల్సి వచ్చింది. విద్యారణ్యపురి, కిసాన్‌నగర్ తదితర ప్రాంతాల్లో రోడ్లపై వరదనీళ్లు చేరడంతో కాలనీ వాసులు ఇబ్బంది పడ్డారు. విద్యానగర్, శ్రీనగర్‌కాలనీ తదితర ప్రాంతాల్లోనూ అదేపరిస్థితి నెలకొంది. అధికారులతో పాటు ఆయా డివిజన్‌లకు సంబంధించిన కార్పొరేటర్లు కూడా ఎప్పటికప్పుడు జేసీబీ, ఇతరత్రా సహకారంతో వరదనీళ్లను మళ్లించే ప్రయత్నం చేశారు.



కరీంనగర్‌రూరల్: బొమ్మకల్‌లో ఇళ్లలోకి వరదనీరు



గన్నేరువరం: పోలీసుస్టేషన్‌లో..



కరీంనగర్‌రూరల్: చామనపల్లి పాఠశాలలో..

కరీంనగర్‌రూరల్/సైదాపూర్/శంకరపట్నం/వీణవంక/గన్నేరువరం/మానకొండూర్/చిగురుమామిడి: కరీంనగర్‌రూరల్ మండలం బొమ్మకల్‌లోని మల్లయ్య చెరువు అలుగు పోస్తోంది. నీళ్లన్నీ గ్రామంలోని గోకుల్‌నగర్, శ్రీనగర్‌కాలనీ ప్రధాన వీధుల నుంచి ప్రవహించడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దుర్శేడ్‌లోని 1వ వార్డు అంగన్‌వాడీ కేంద్రం ఎదుట నీరు నిలిచింది.

- చేగుర్తిలో తాగునీటి బావి పైపులైన్ మానేరు నీటి ప్రవాహంలో కొట్టుకపోయింది. తాహెర్‌కొండాపూర్‌లో రెండిళ్లు కూలిపోయాయి. చెర్లభూత్కూర్ శివారులోని పోచమ్మ ఒర్రె ఉప్పొంగడంతో గుజ్జులపల్లె, ప్రశాంత్‌నగర్, ఐతరాజ్‌పల్లెకు, చామనపల్లి శివారులోని లోలెవల్ కల్వర్టు మీద నుంచి వరదనీళ్లు ప్రవహిస్తుండటంతో బహదూర్‌ఖాన్‌పేటకు రాకపోకలు నిలిచిపోయాయి.
- సైదాపూర్ పాత బస్టాండ్ జలమయమైంది. వరదనీరు ఇళ్లలోకి వెళ్లింది. బూడిదపల్లి పిట్టల కిరణ్ ఇల్లు కూలింది. శంకరపట్నం మండలం అర్కండ్ల వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. నేదురు సంపత్ వరదలో కొట్టుకుపోతుండగా అక్కడే ఉన్న రైతులు కాపాడారు. ముత్తారం రామసముద్రం చెరువు మత్తడి దూకుతోంది.



చిగురుమామిడి: ఇందుర్తి- కోహెడ మధ్య నిలిచిన రాకపోకలు



గన్నేరువరం: పిడుగుపడి ధ్వంసమైన ఇల్లు

- వీణవంక మండలం కోర్కల్, వీణవంక, రామక్రిష్టాపూర్, కొండపాక, లస్మక్కపల్లి, పోతిరెడ్డిపల్లి చెక్‌డ్యాంలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. గన్నేరువరంలోని కొత్త శ్రీనివాస్ ఇంటిపై పిడుగు పడటంతో గొడలు పగుళ్లుబారాయి. గన్నేరువరంలోని పోలీస్‌స్టేషన్‌లోకి వరదనీరు చేరింది.
- మానకొండూర్ మండలం కల్లెడ, దేవంపల్లి, కొండపల్కల చెరువులు మత్తడి దూకుతున్నాయి. చిగురుమామిడి మండలం రేకొండ శివారులో కల్వర్టు నుంచి భారీగా నీటి ప్రవాహం కొనసాగుతోంది. ఇందుర్తి- ఒగులాపూర్ గ్రామాల మధ్య నుంచి మోయతుమ్మెదవాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

న్యూస్‌రీల్

ఆరోగ్య జీవనం కోసమే హెర్బల్ గార్డెన్



మొక్కలు నాటుతున్న వైద్యులు

కరీంనగర్‌టౌన్: ప్రజల ఆరోగ్యవంతమైన జీవనం కోసం హెర్బల్ గార్డెన్ ఉపయోగపడుతుందని ఆయుష్‌శాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ రవినాయక్ అన్నారు. మంగళవారం జిల్లా ప్రభుత్వ ప్రధానాసుపత్రి ఆవరణలో ఆయుష్ వెల్‌నెస్ హెర్బల్ గార్డెన్‌ను ఏర్పాటు చేశారు. ఆస్పత్రి ప్రధాన ద్వారం ముందున్న గార్డెన్‌లో ఔషధ మొక్కలు నాటారు. అనంతరం రవినాయక్ మాట్లాడుతూ... ప్రభుత్వం అల్లోపతితో పాటు ఆయుష్ (ఆయుర్వేదం, యునాని, హోమియో) విభాగాలను సైతం ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చి మెరుగైన వైద్యుల సేవలు అందించేందుకు కృషి చేస్తుందన్నారు. ప్రజలు ఎవరికి నచ్చిన వైద్యాన్ని వారు పొందే అవకాశం కల్పించిందన్నారు. ఆసుపత్రి ఆవరణలో హెర్బల్ గార్డెన్ ఏర్పాటు ఆహ్లాదంతోపాటు ఆరోగ్య రక్షణకు ఉపయోగపడుతుందని తెలిపారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ లలితాదేవి, ఆసుపత్రి ఆర్ఎంవోలు డాక్టర్ జ్యోతి, డాక్టర్ నవీన, యునాని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ యత్రబ్‌సుల్తానా, ఆయుర్వే మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సంజీవ్‌కుమార్, హోమియోపతి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అరుణ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్ కర్ణన్ బదిలీ

- హుజూరాబాద్‌లో దళితబంధు సక్సెస్‌లో కీలకపాత్ర
- ఎన్నికల నిబంధనల మేరకు తప్పని బదిలీ
- కొత్త కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టనున్న గోపి



ఆర్వీ కర్ణన్



గోపి



ప్రఫుల్ దేశాయ్



జల్ల అరుణశ్రీ

సాక్షిప్రతినిధి,కరీంనగర్: దళితబంధు పైలెట్ ప్రాజెక్టును విజయవంతంగా అమలుచేసిన కరీంనగర్ కలెక్టర్ ఆర్వీ కర్ణన్ నల్గొండకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సీనియర్ ఐఏఎస్ అధికారి బి.గోపి కొత్త కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుతం గోపి సీసీఎల్ఏ సెక్రటరీగా వ్యవహరిస్తున్నారు. గతంలో వరంగల్ కలెక్టర్‌గా కూడా పనిచేశారు. ఎన్నికల నిబంధనల ప్రకారం.. గతంలో ఏఎన్నిక నిర్వహించిన అధికారి అయినా.. సాధారణ ఎన్నికలకు అదే జిల్లాలో పనిచేయకూడదు. ఈ లెక్కన కలెక్టర్ కర్ణన్ హుజూరాబాద్ ఉప ఎన్నిక, రెండు ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించారు. వాస్తవానికి ఆమధ్య జరిగిన ఐఏఎస్ అధికారుల సాధారణ బదిలీల్లో కర్ణన్ కూడా బదిలీ అవుతారని ప్రచారం జరిగింది. కానీ.. కలెక్టర్ కర్ణన్ పనితీరుతో పూర్తిస్థాయిలో సంతృప్తిగా ఉండటం, దళితబంధు అమలులో పూర్తి చేయాల్సిన కీలక పనులు ఉండటంతో ప్రభుత్వం ఆయననే కొనసాగించేందుకే మొగ్గుచూపింది. ఎన్నికలు సమీపిస్తుండటం, ప్రతిపక్షాలు ఆయన కొనసాగింపుపై అభ్యంతరాలు లేవనెత్తే అవకాశం ఉండటంతో ముందస్తుగా బదిలీ చేసింది.

దళితబంధుపై ప్రత్యేక ముద్ర..

జిల్లా పరిపాలనతోపాటు దళితబంధు అమలులో తనదైన ముద్ర వేసి.. రాష్ట్రవ్యాప్తంగా హుజూరాబాద్ మోడల్ రూపొందించిన అధికారిగా ఆర్వీ కర్ణన్ గుర్తింపు తెచ్చుకున్నారు. 2021లో కరీంనగర్ జిల్లాలో హుజూరాబాద్ ఉపఎన్నికకు ముందు బాధ్యతలు చేపట్టిన కర్ణన్.. వచ్చీరాగానే దళితబంధు ప్రాజెక్టుపై దృష్టి సారించారు. జిల్లా అధికారులంతా కలిసి రాత్రీపగలు కష్టపడి మొత్తంగా 18,041 దళితకుటుంబాలను లబ్ధిదారులుగా గుర్తించారు. దళితబంధు కోసం ప్రత్యేక యాప్ కూడా రూపొందించారు. సీఎం ప్రతిష్టాత్మకంగా మొదలుపెట్టిన కార్యక్రమం కావడంతో కర్ణన్ ఆదినుంచి ఈ పథకం అమలుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. లబ్ధిదారుల గుర్తింపు నుంచి వారికి రూ.10 లక్షల మంజూరు చేసేవరకు అన్నీ తానై వ్యవహరించారు. దళితబంధులో వాహనాల కోసం రూ.10 లక్షలు కేటాయించిన తర్వాత.. కలెక్టర్ రూటు మార్చారు. లబ్ధిదారులు వాహనాలు కాకుండా.. రిటైల్, కాఫీ షాపులు, మెడికల్ షాపులు, హార్డ్‌వేర్ తదితర వ్యాపారాలు పెట్టుకునేలా ప్రోత్సహించారు. హుజూరాబాద్‌లో గోలీసోడా, ఐరన్‌షీట్ ఉత్పత్తి కేంద్రాలను కూడా మంజూరుచేశారు. ఇందుకోసం తెలంగాణ పరిశ్రమలు మౌలిక సదుపాయాల సంస్థ (టీఎస్ ఐఐసీ) సంప్రదింపులు జరిపి భూకేటాయింపులు కూడా జరిపారు. అదేవిధంగా పథకం పక్కదారి పడుతుంది అన్న ఆరోపణలు వచ్చిన వెంటనే..అఫిడవిట్ మెలిక పెట్టి.. అవినీతి పరులకు ముకుతాడు వేశారు. కేవలం ఏడాదిలో దాదాపు రూ.2000 కోట్లు కేవలం ఒక్క జిల్లాలోని నియోజకవర్గంలో అమలవుతున్న పైలెట్ ప్రాజెక్ట కోసం ప్రభుత్వం నుంచి విడుదలవడం, వాటిని అంతే పకడ్బందీగా పంపిణీ చేయడం ఆయన కెరీర్‌లో మైలురాయిగా మిగిలిపోతుందని కలెక్టరేట్ అధికారులే ప్రశంసిస్తున్నారు.

విధుల్లో చేరకుండానే అదనపు కలెక్టర్ అరుణశ్రీ బదిలీ

జిల్లా అదనపు కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టకుండానే జల్ల అరుణశ్రీ బదిలీ అయ్యారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గా ఇటీవల అరుణశ్రీ నియమితులైన విషయం తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండడంతో ఎన్నికల సంఘం పక్కాగా వ్యవహరిస్తోంది. అరుణశ్రీ ది చొప్పదండి నియోజకవర్గంలోని కొడిమ్యాల స్వస్థలం. ఆమె అదనపు కలెక్టర్‌గా, చొప్పదండి ఎన్నికల అధికారిగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఆమె స్థానిక వ్యక్తి కావడం.. నియామకం ఎన్నికల ప్రవర్తన నియామవాళికి విరుద్ధం. ఈ నేపథ్యంలో విధుల్లో చేరకుండానే రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. ఆమె స్థానంలో జనగాం అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌ని నియమించింది.

ప్రమాదాల నివారణకు శిక్షణ



మాట్లాడుతున్న ఆర్ఎం సుచరిత

కరీంనగర్: తెలంగాణ ఆర్టీసీ ఏప్రిల్ చాలెంజ్ ఫర్ ట్రైనింగ్‌లో భాగంగా కరీంనగర్ జోనల్ వర్క్‌షాప్ ఆవరణలో రీజియన్ పరిధిలోని 11 డిపోలకు చెందిన దాదాపు 100మంది డ్రైవర్లకు చెన్నై చోళ ఎంఎస్ రిస్క్ సర్వీసెస్ సంస్థ ప్రతినిధులు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని హుజూరాబాద్ డిపోకు చెందిన సీనియర్ డ్రైవర్ నర్సయ్య చేతుల మీదుగా కరీంనగర్ రీజనల్ మేనేజర్ ఎన్. సుచరిత ప్రారంభించారు. ఆర్ఎం మాట్లాడుతూ.. 20రోజుల పాటు కొనసాగే కార్యక్రమంలో 2000 మంది డ్రైవర్లకు రోడ్డు భద్రత- ప్రమాదాల నివారణ అంశంపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. డ్రైవర్ ఉద్యోగం కష్టతరమైందని, ఆర్టీసీ ప్రయాణమంటే సురక్షిత ప్రయాణమనే నమ్మకం ప్రజలలో కలిగించింది సంస్థ డ్రైవర్లేనని అన్నారు. కొన్ని ప్రమాదాలలో సంస్థ భారీ మొత్తంలో నష్టపరిహారం చెల్లించాల్సి వస్తోందన్నారు. కరీంనగర్ రీజియన్‌ను ప్రమాదరహితంగా నిలపాలని ఆకాంక్షించారు. డిప్యూటీ రీజనల్ మేనేజర్ చందర్‌రావు మాట్లాడుతూ డ్రైవర్లు సురక్షితంగా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చాలని సూచించారు. ఈ సందర్భంగా టీం లీడర్ మురళీ కృష్ణ డ్రైవర్లకు శిక్షణ ఇచ్చారు. డిప్యూటీ రీజినల్ మేనేజర్(మెకానికల్) కె.సత్యనారాయణ, పర్సనల్ ఆఫీసర్ ఎం.చంద్రయ్య, కరీంనగర్–1 డిపో మేనేజర్ ప్రణీత్, ట్రైనర్లు ప్రేమానంద్, సుధాకర్, చందు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా ఆస్పత్రిలో రద్దీ

వాతావరణంలో మార్పులతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. దీంతో జిల్లా ఆస్పత్రి కిటకిటలాడుతోంది. రెండుమూడు రోజులుగా రద్దీ పెరుగుతోంది. మంగళవారం 700 వరకు ఓపీ నమోదైంది. ఓపీ బ్లాకులన్నీ జ్వరబాధితులతో కిక్కిరిసిపోయాయి. ఇన్‌పేషెంట్లుగా చేరేందుకు చాలా మంది విముఖత చూపుతున్నట్లు వైద్యులు తెలిపారు. కేవలం ఓపీ చూపించుకొని మందులు తీసుకెళ్తున్నారని వెల్లడించారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

క్లుప్తంగా

'ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి'



కరీంనగర్: గంగాధరలోని మహాత్మజ్యోతిరావు పూలే బీసీ గురుకుల బాలుర పాఠశాలలో మంత్రి కేటీఆర్ జన్మదినం సందర్భంగా హ్యాపీ బర్త్‌డే కేటీఆర్ అని విద్యార్థులను కింద కూర్చోబెట్టి ప్రదర్శన చేసిన ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేశ్ డిమాండ్ చేశారు. స్థానిక బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో జరిగిన నగర ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గంగాధరలో బీఆర్ఎస్ నేతల అత్యుత్సాహంతో విద్యార్థులు ఇబ్బంది పడ్డారని అన్నారు. విద్యార్థుల హక్కులను భంగం కలిగించేలా వ్యవహరిస్తే సహించేది లేదని దీనిపై పై ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బాలల సంఘానికి, మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని అన్నారు. ఇందుకు కారణమైన పాఠశాల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ నగర వర్కింగ్ ప్రెసిడెంట్ నునవత్ శ్రీనివాస్, నాయకులు కసిరెడ్డి సందీప్ రెడ్డి, అడప సాయికృష్ణ, వినయ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాతవాహన విద్యార్థినికి యంగ్ మేనేజర్ అవార్డు



కరీంనగర్ సిటీ: కరీంనగర్‌లోని శాతవాహన యూనివర్సిటీ ఎంబీఏ మొదటి సంవత్సరం విద్యార్థిని గోనె ధనలక్ష్మి యంగ్ మేనేజర్ అవార్డు అందుకున్నారు. వరంగల్‌లోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కాలేజీలో ఈనెల 22వ తేదీన నిర్వహించిన మంత్ర–2023 కార్యక్రమంలో శాతవాహన యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్న గోనే ధనలక్ష్మి యంగ్ మేనేజర్ అవార్డు, రూ.5వేల నగదు రివార్డుతో పాటు హెచ్‌ఆర్ ఈవెంట్ విజేతగా నిలిచారు. ధనలక్ష్మిని మంగళవారం శాతవాహన యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరికాంత్, అధ్యాపక బృందం ప్రత్యేకంగా అభినందించారు. బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ మనోహర్, అధ్యాపకులు ఎస్‌వీ.శ్రీరంగప్రసాద్, టి.కృష్ణకుమార్, మనోజ్ కుమార్, బి.అనూష, భరత్, కంచు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీని వెంటనే ప్రకటించాలి



కరీంనగర్: పీఆర్సీని వెంటనే ప్రకటించాలని పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పాతూరి రాజిరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం సంఘ కార్యాలయంలో మాట్లాడుతూ పీఆర్సీ కమిటీని వెంటనే వేసి ఐఆర్ ప్రకటించాలని కోరారు. జిల్లాలోని ఉపాధ్యాయుల సర్దుబాటు ఉత్తర్వులు ఇవ్వాలని, 2003 డీఎస్సీ టీచర్లకు పాత పెన్షన్ వర్తింపజేయాలని అన్నారు. కొత్త టైంటేబుల్‌ను ప్రైవేట్ పాఠశాలలు కూడా పాటించేలా తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు గోనె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పల్లెపాటి వేణుగోపాల్ రావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కేతిరి తిరుపతిరెడ్డి, రాంరెడ్డి, అశ్ఫాక్‌హుస్సేన్, వేణుగోపాలచారి తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంఈవోలు

- 16 మండలాలకు ఎంఈవోలు లేరు
- హెచ్‌ఎంలకు అదనపు బాధ్యతలతో సతమతం
- ఒక్కో ఎంఈవోకు రెండు, మూడు మండలాల బాధ్యతలు
- గెజిటెడ్ హెచ్‌ఎం పోస్టులు ఖాళీ
- విద్యాశాఖలో గాడి తప్పుతున్న పర్యవేక్షణ



డీఈవో కార్యాలయం

'మానకొండూర్ మండలం వెల్ది ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎం.మధుసూధనాచారి ప్రస్తుతం కరీంనగర్ అర్బన్, కరీంనగర్‌రూరల్, కొత్తపల్లి, మానకొండూరు మండలాలకు ఇన్‌చార్జి ఎంఈవోగా కొనసాగుతున్నారు. పాఠశాల పర్యవేక్షణతో పాటు నాలుగు మండలాలకు సంబంధించి ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల పర్యవేక్షణ చూడాలి. ప్రభుత్వం చేపడుతున్న విద్యాసంబంధిత కార్యక్రమాల్లో పాల్గొంటూ రోజువారీ నివేదికలు ఇవ్వాలి. ఇది ఒక మానకొండూర్ ఎంఈవో పరిస్థితి కాదు జిల్లాలోని 16 మండలాల్లో ఇన్‌చార్జి ఎంఈవోల వ్యథ'.

కరీంనగర్: జిల్లాలోని 16 మండలాల్లో ఎంఈవోలు లేకపోవడంతో విద్యావ్యవస్థ పర్యవేక్షణ అగమ్యగోచరంగా తయారైంది. కొత్తగా ఏర్పడ్డ కరీంనగర్‌రూరల్, కొత్తపల్లి, గన్నేరువరం, ఇల్లందకుంట మండలాలకు ఎంఈవోల నియామకం జరగనే లేదు. అక్కడా సమీప పాఠశాలల సీనియర్ హెచ్‌ఎంలను ఇన్‌చార్జీలుగా నియమించి కాలం వెళ్లదీస్తున్నారు. ఒక్కొక్కరికి రెండు, మూడు మండలాల బాధ్యతలు అప్పగించడంతో పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కరీంనగర్‌అర్బన్, కరీంనగర్‌రూరల్, కొత్తపల్లి, మానకొండూరు మండలాలకు ఒక్కరే ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తూనే వెల్ది జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా కొనసాగుతున్నారు. పాఠశాలల సర్వతోముఖాభివృద్ధికి దోహదపడే గెజిటెడ్ హెచ్‌ఎంల పోస్టులను సైతం భర్తీ చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. దీంతో జిల్లాలో గెజిటెడ్ హెచ్‌ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ఎంఈవోలకు తప్పని తిప్పలు

- ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ, ఉపాధ్యాయుల పనితీరు, మధ్యాహ్న భోజన అమలు, సర్వశిక్షాభియాన్ చేపట్టే కార్యక్రమాల నిర్వహణలో ఎంఈవోల పాత్ర కీలకం. ఏళ్ల తరబడి రెగ్యులర్ ఎంఈఓలు లేకపోవడంతో ఖాళీగా ఉన్న వీరిస్థానాల్లో సీనియర్ ప్రధానోపాధ్యాయులను ఇన్‌చార్జీలుగా నియమిస్తున్నారు.
- పాఠశాలల పని ఒత్తిడితో పాటు అదనపు బాధ్యతలు తలకు మించిన భారంగా మారిందని వాపోతున్నారు. విద్యార్థులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయలేకపోతున్నామని చెబుతున్నారు.
- సొంత పాఠశాలల్లో సిలబస్, విద్యార్థుల బాగోగులను పట్టించుకోకపోవడంతో ఆ ప్రభావం ఫలితాలపై పడుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. పర్యవేక్షణ కరువై పాఠశాలల్లో ఉపాధ్యాయులు సైతం సమయపాలన పాటించడం లేదనే విమర్శలు ఉన్నాయి.
- జిల్లాలో పదవ తరగతి పరీక్షల నిర్వహణతో పాటు ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలతో పాటు టైప్‌రైటింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడర్, డ్రా యింగ్, బీఎడ్, డీఎడ్ ప్రవేశ పరీక్షలు డీఈవో నిర్వహించాల్సి ఉంటుంది. డిప్యూటీ ఈవో లేకపోవంతో ఈ బాధ్యతలను కూడా డీఈవోనే నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది.
- విద్యావ్యవస్థ గాడితప్పే ప్రమాదముందని గ్రహించిన (గతంలో)ఆంధ్రప్రదేశ్ పరిపాలన ట్రిబ్యునల్ ఇన్‌చార్జి ఎంఈఓలుగా హెచ్‌ఎంల ను నియమించరాదని ఆదేశాలు జారీ చేసింది. అయినా ఆదేశాలను లెక్కచేయకుండా సర్వీసు రూల్స్ ప్రమోషన్ల అడ్డంకి సాకును చూపుతూ సీనియర్ హెచ్‌ఎంలనే మండల విద్యాధికారులుగా నియమిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారులు చేతులు దులుపుకుంటున్నారు.

ఒక్క ఎంఈవో అన్నీతానై

ప్రతి మండల వనరుల కేంద్రంలో రెగ్యులర్ మండల విద్యాధికారితో పాటు సీనియర్ అసిస్టెంటు1, జూనియర్ అసిస్టెంటు 1, అటెండర్ 1, రాత్రి కాపలాదారి ఒకరు ఉండాలి. కేవలం ఒక్క విద్యాధికారి మాత్రమే అన్నీ తానై పనులు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. శాశ్వత సిబ్బందిని నియమించకుండా, కాంట్రాక్టు ప్రాతిపదికన నియమించిన సిబ్బందితోనే పనులు చేయించడం గమనార్హం. ప్రతి మండలంలో 40 నుంచి 100 పాఠశాలల పర్యవేక్షణ చేయాలి. 100 నుంచి 300 మంది ఉపాధ్యాయుల పనితీరు చూడాలి. వేతనాలు, సెలవులు, మధ్యాహ్న భోజనం, నెలవారి నివేదికలు, పాఠశాలల అవసరాలు, ఆర్వీఎం కార్యక్రమాలు, ఉన్నతాధికారుల సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలి. రెగ్యులర్ మండల విద్యాధికారులను నియమిస్తే ఖజానాపై భారం పడుతుందనే కారణంతో ప్రభుత్వం రెగ్యులర్ అధికారులను నియమించడం లేదనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

కాంగ్రెస్‌తోనే బలహీనవర్గాలకు రాజ్యాధికారం



మాట్లాడుతున్న వి.హన్మంతరావు

- కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హన్మంతరావు

కరీంనగర్‌టౌన్: బలహీనవర్గాలకు రాజ్యాధికారం కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హన్మంతరావు అన్నారు. మంగళవారం కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ బీసీ ఐక్య వేదిక సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా వి.హనుమంతరావు, మంథని శాసనసభ్యుడు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, శాసనమండలి సభ్యుడు జీవన్ రెడ్డి హాజరయ్యారు. వి.హనుమంతరావు మాట్లాడుతూ. చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరిగిందని, ఇలాంటి ముఖ్యమంత్రిని నేను ఎన్నడు చూడలేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బీసీల గురించి ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు కాంగ్రెస్ పార్టీలోనే న్యాయం జరిగిందని ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన మల్లిఖార్జున ఖర్గేను ఏఐసీసీ అధ్యక్షుడిగా నియమించడం జరిగిందని అన్నారు. తాను రెడ్డి సామాజికవర్గానికి చెందిన వాడినైతే ఎప్పుడో ముఖ్యమంత్రి అయ్యేవాడినని అన్నారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ 60శాతం ఉన్న బలహీనవర్గాల వారికి సముచిత స్థానం కల్పించాలన్నారు. మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ బలహీన వర్గాలకు చెందిన వారిని పీసీసీ అధ్యక్షులుగా ఎంతో మందికి అవకాశం కల్పించిందని ఇది వేరే పార్టీల వల్ల అవుతుందా అని అన్నారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, ఆది శ్రీనివాస్, ఆడ్లూరి లక్ష్మణ్ కుమార్, మక్కాన్‌సింగ్, ఈర్ల కొమురయ్య, వైద్యుల అంజన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పొన్నం దూరం...

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కమిటీలో చోటు కల్పించకపోవడంపై అలకబూనిన మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ బీసీ ఐక్య వేదిక సమావేశానికి హాజరు కాలేదు. పొన్నం అనుచరులు సైతం హాజరుకాకపోవడంతో సభ వెలవెలపోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో పీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్ నేతృత్వంలో బీసీ నేతలు చొరవ తీసుకొని ఉదయం నుంచే ఉమ్మడి జిల్లాలోని నాయకులందరికీ ఫోన్లు చేసి కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు కృషిచేశారు.

గురుకుల విద్యార్థికి అస్వస్థత

మానకొండూర్: మండలంలోని దేవంపల్లి గురుకుల కళాశాలలో ఓ విద్యార్థి అస్వస్థతకు గురయ్యాడు. సమాచారం అందించడంలో కళాశాల సిబ్బంది నిర్లక్ష్యంగా వహించారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. తిమ్మాపూర్ మండలం అల్గునూర్ గ్రామానికి చెందిన పూజిత్ సోమవారమే ఇంటర్ ఫస్టియర్‌లో చేరాడు. సాయంత్రం స్వల్ప జ్వరంతో అస్వస్థతకు గురయ్యాడు. మంగళవారం ఉదయం ఫిట్స్ వచ్చాయి. తోటి విద్యార్థులు ఇనుప వస్తువును చేతిలో పెట్టి ప్రథమచికిత్స అందించడంతో అపాయం తప్పింది. ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో కళాశాలకు చేరుకున్నారు. సోమవారం నుంచి అస్వస్థతకు గురైతే ఇప్పుడు సమాచారం ఇస్తారా అని ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్‌పై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాష్ట్ర కరాటే సంఘం చైర్మన్‌గా వసంత్ కుమార్



కరీంనగర్‌స్పోర్ట్స్: తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కరాటే డో సంఘం రాష్ట్ర చైర్మన్‌గా జిల్లాకు చెందిన ఒకినావా కరాటే సంస్థల అధినేత కె.వసంత్‌కుమార్ నియామకమయ్యారు. ఇటీవల కరీంనగర్‌లో జరిగిన రాష్ట్ర సంఘం నూతన కార్యవర్గ సమావేశంలో వసంత్ కుమార్‌ను నియమించారు. వసంత్‌ను సంఘం కన్వీనర్ చల్లా హరిశంకర్, కరాటే ఇన్‌స్ట్రక్టర్లు గౌరు రాజిరెడ్డి, మొండయ్య, సురభి వేణుగోపాల్, ఒలింపిక్ సంఘం కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి అభినందించారు.

కో ఎడ్యుకేషన్ పాలిటెక్నిక్ ఏర్పాటు చేయాలి

కరీంనగర్: జిల్లా కేంద్రంలో కో ఎడ్యుకేషన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్‌లు వేర్వేరు ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా పరిధిలో సిరిసిల్లలో మాత్రమే కోఎడ్యుకేషన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఉందని, జిల్లా కేంద్రంలో మహిళా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఉందని, దీనిలో 40శాతం సీట్లు ఎస్సీలకు కేటాయించారని తెలిపారు. జిల్లాకేంద్రంలో కోఎడ్యుకేషన్ పాలిటెక్నిక్ కళాశాల లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రస్తుతం డిమాండ్ ఉన్న ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్, కంప్యూటర్ సైన్స్ కోర్సులతో కళాశాల ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. జిల్లా మంత్రి ఈ విషయంపై చొరవ చూపి కళాశాల ఏర్పాటును ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని పేర్కొన్నారు.

విద్యుత్ చౌర్యం కేసులో జరిమానా

కొత్తపల్లి(కరీంనగర్): పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం రాచమల్లి గ్రామానికి చెందిన పల్లె శ్రీనివాస్‌ను విద్యుత్ చౌర్యం కేసులో అరెస్టు చేశారు. కోర్టు జరిమానా విధించిందని ఉమ్మడి కరీంనగర్ జిల్లా విద్యుత్ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ కె.స్వామి తెలిపారు. శ్రీనివాస్ తనఇంటికి అనుమతి లేకుండా అక్రమంగా విద్యుత్‌ను వినియోగిస్తుండగా విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. కేసు నమోదు చేసి మొదటి నేరంకింద రూ.వేయి జరిమానా విధించారు. మళ్లీ విద్యుత్ చౌర్యానికి పాల్పడుతూ విద్యుత్ విజిలెన్స్ అధికారులకు పట్టుబడగా కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. పెద్దపల్లి జిల్లా సెషన్స్ జడ్జి డి.హేమంత్ కుమార్ ఎదుట నిందితుడిని మంగళవారం ప్రవేశపెట్టగా రూ.10,724 జరిమానా చెల్లించాలని, లేదంటే మూడు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పు వెలువరించినట్లు తెలిపారు. ఎస్సైలు ఎ.నిరంజన్‌రెడ్డి, టి.నరేష్, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

టాటాఏస్ బోల్తా.. కూలీలకు గాయాలు



హుజూరాబాద్ రూరల్: మండలంలోని రాంపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలో మంగళవారం సాయంత్రం కూలీలతో వెళ్తున్న టాటాఏస్ వాహనం బోల్తాపడింది. పలువురు మహిళాకూలీలకు గాయాలు అయ్యాయి. సమీప ధర్మరాజుపల్లి గ్రామంలో నాట్లు వేసేందుకు గొల్లపల్లి గ్రామానికి చెందిన సుమారు 18మంది మహిళలు టాటాఏస్ వాహనంలో వెళ్లారు. తిరిగి వస్తుండగా.. ఓ కారును తప్పించబోయే క్రమంలో టాటాఏస్ బోల్తా పడింది. స్థానికులు 108కు సమాచారం ఇచ్చారు. క్షతగాత్రులను హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు.

రాజన్న ఆలయంలో విజిలెన్స్ దాడులు

- బెంబేలెత్తిన అధికారులు
- సిబ్బందిలో అయోమయం



ఈవో కృష్ణప్రసాద్‌తో చర్చిస్తున్న అధికారులు

వేములవాడ: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజన్న ఆలయంలో మంగళవారం విజిలెన్స్ దాడులు జరిగాయి. సీఐలు అనిల్‌కుమార్, వరుణ్‌ప్రసాద్, తహసీల్దారు దినేశ్‌రెడ్డి, ఏఈ శశిధర్, ఇద్దరు కానిస్టేబుళ్ల బృందం ఆలయానికి చేరుకుంది. ముందుగా ప్రసాదాల తయారీ గోదాం, ప్రసాదాల విక్రయ కౌంటర్లు, ఆలయంలోని విభాగాలను తనిఖీ చేసి రికార్డులు స్వాధీనపరుచుకున్నారు. అనంతరం ఈవో చాంబర్‌కు చేరుకుని రికార్డులు పరిశీలించారు. ప్రసాదాల తయారీకి వాడే కాజు, కిస్మిస్, చక్కెర మిశ్రమాల తీరు, గోదాంలోని స్టాక్, ప్రసాదాల కౌంటర్‌లోని స్టాక్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆలయంలో అధికారుల సీనియారిటీ జాబితా, ఉద్యోగుల ప్రమోషన్‌లో తీసుకున్న చొరవ, గతంలో విజిలెన్స్ కేసుల్లో ఉన్నవారి వివరాలు, వారు చేస్తున్న డ్యూటీపై విచారణ చేపట్టారు. కాగా విజిలెన్స్ అధికారుల తనిఖీలతో అధికారులు, సిబ్బంది అయోమయానికి గురయ్యారు. ఎక్కడివారక్కడే తమతమ విభాగాల్లో పనులు చేసుకుంటూ కనిపించారు. ఈవిషయంపై విజిలెన్స్ అధికా రులను విలేకరులు ప్రశ్నించగా, తమకు అందిన ఫిర్యాదుల మేరకు ఆలయంలో తనిఖీలు నిర్వహించి, రికార్డులు స్వాధీనం చేసుకున్నామని, ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించనున్నట్లు పేర్కొన్నారు.

రూ.40 లక్షలు దుర్వినియోగం వాస్తవమే..

- పది లక్షలు రికవరీ రూ.30 లక్షలు చెల్లించాలి
- ఏపీఎం సంపత్

సాక్షి ఎఫెక్ట్

చిగురుమామిడి: చిగురుమామిడి మండలం లంబాడిపల్లి గ్రామంలో స్వశక్తి సంఘాల మహిళలకు చెందిన రూ.40లక్షలు దుర్వినియోగమైనట్లు మండల ఐకేపీ ఏపీఎం ఎం సంపత్ తెలిపారు. మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన 'స్వశక్తి మహిళల డబ్బులు ఏమైనట్లు' అనే కథనానికి ఏపీఎం స్పందించారు. దుర్వినియోగమైన రూ.40లక్షల్లో రూ.10 లక్షలు సదరు మహిళ నుంచి రికవరీ చేసినట్లు తెలిపారు. గత మూడు నెలలుగా తమ సిబ్బందితో గ్రామానికి వెళ్లి ఒక్కోస్వశక్తి సంఘం నుంచి ఎంత చెల్లించారనే దానిపై పరిశీలించినట్లు తెలిపారు. నాలుగు నెలల క్రితమే సదరు మహిళ స్వశక్తి సంఘాల మహిళలు చెల్లించిన డబ్బులు తానే వాడుకున్నట్లు తమకు లిఖితపూర్వకంగా వెల్లడించినట్లు తెలిపారు. నెలరోజుల్లో చెల్లిస్తానని చెప్పిందని, మూడు నెలలు గడిచినా ఇంత వరకు చెల్లించలేదన్నారు. కాగా గ్రామంలో 27 స్వశక్తి సంఘాల్లో రెండు సంఘాలు దివ్యాంగుల గ్రూపులని, మిగిలినవి 25 సంఘాలకు గాను చిగురుమామిడి యూనియన్ బ్యాంకు అధికారులు 16 సంఘాలకు నోటీసులు ఇచ్చారని వివరించారు. దుర్వినియోగమైన డబ్బు రికవరీ చేసేవరకు వదిలే ప్రసక్తి లేదన్నారు.

కట్నం వేధింపులు.. భర్తకు ఏడేళ్ల జైలు

కరీంనగర్‌క్రైం: కట్నం కోసం భార్యను వేధించి, ఆమె ఆత్మహత్యకు కారణమైన భర్తకు జిల్లా జడ్జి బి.ప్రతిమ మంగళవారం ఏడేళ్ల జైలు శిక్ష , రూ.15వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ వివరాల మేరకు.. మేడ్చల్ జిల్లా కీసర మండలం నాగారం గ్రామానికి చెందిన జ్యోతి(22)కి, యాదాద్రి జిల్లా కొలనుపాక గ్రామానికి చెందిన వల్లెపు అశోక్‌తో 2016 ఏప్రిల్ 12న వివాహం జరిగింది. ఆ సమయంలో రూ.4లక్షల కట్నం ఇస్తామని, కొంతమేరకు ఇచ్చారు. మూడున్నర తులాల బంగారం అప్పగించారు. వివాహమైన కొద్దిరోజులకే జ్యోతిని భర్త అశోక్, అత్తమామలు వేధించసాగారు. పెద్దమనుషుల జోక్యంతో గొడవలు కాస్త సద్దుమణిగాయి. 2018లో గన్నేరువరం మండలం గుండ్లపల్లికి వచ్చిన అశోక్, జ్యోతి దంపతులు బావులు తవ్వే పనులు చేస్తూ అక్కడే నివాసం ఉన్నారు. 2018 ఏప్రిల్ 18న వీరికి ఆడపిల్ల జన్మించింది. పుట్టింటి వద్ద కొన్ని రోజులుంచి తిరిగి జ్యోతిని గుండ్లపల్లికి తీసుకెళ్లాడు. మళ్లీ కట్నంకోసం వేధించడంతో 2018 జూన్19న జ్యోతి ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. జ్యోతి తల్లి మారమ్మ ఫిర్యాదు మేరకు గన్నేరువరం పోలీసులు భర్త అశోక్, అతని కుటుంబసభ్యులపై కేసు నమోదు చేశారు. అప్పటి రూరల్ ఏసీపీ ఉషారాణి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన జడ్జి ప్రతిమ అశోక్‌కు ఏడేళ్ల జైలుశిక్ష, రూ.15 వేల జరిమానా విధించారు. మిగితావారికి నిర్దోషులుగా వదిలిపెట్టారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.వెంకటేశ్వర్లు కేసు విచారించి వాదించారు.

నాయీబ్రాహ్మణులకు పేటెంట్ హక్కు కల్పించాలి



ధర్నా చేస్తున్న నాయీబ్రాహ్మణ ఐక్యవేదిక నాయకులు

కరీంనగర్: నాయీబ్రాహ్మణులకు క్షౌరవృతి మీద పేటెంట్ హక్కు కల్పించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. తెలంగాణ నాయీబ్రాహ్మణ ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుంజపడుగు హరిప్రసాద్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జంపాల నర్సయ్య, సింగిరాల వెంకటస్వామి మాట్లాడుతూ నాయీబ్రాహ్మణులకు క్షౌరవృత్తి వంశ పారంపర్యంగా వస్తోందని అన్నారు. ఇప్పుడు కొన్ని కార్పొరేట్ సంస్థలు ఈ వృత్తిలోకి చొరబడి దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. గ్రామాల నుంచి పట్టణాల వరకు నాయీబ్రాహ్మణుడు తన కులవృత్తి ద్వారా ఈ సమాజానికి సేవ చేస్తున్నాడన్నారు. నాయీబ్రాహ్మణులు ఆర్థికంగా, రాజకీయంగా అన్ని రకాలుగా వెనకబడి ఉన్నారని తెలిపారు. తమ కుల వృత్తికి పేటెంట్ హక్కు కల్పిస్తే ఆర్థికంగా ఎదిగేందుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్ర, జిల్లా నాయకులు శంకర్, బాలసురేందర్, శంకర్, రమేష్, గంగాధర్, ముని, లక్ష్మణ్, రాజశేఖర్, అశోక్, నరహరి, శ్రీనివాస్, అంజయ్య, విద్యాసాగర్, వీరేందర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గాయాలు కాలేదని చెప్పి.. అనంతలోకాలకు

- బొలెరో వాహనం, కారు ఎదురెదురుగా ఢీ
- బంధువులతో ఫోన్‌లో మాట్లాడిన అరగంటకే మృతి
- మృతుడు ధర్మపురి బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు
- బంజేరుపల్లి తండా బి వద్ద ఘటన



ప్రమాదం తర్వాత సత్యనారాయణ



సత్యనారాయణ (ఫైల్)

ధర్మారం/ధర్మపురి: రోడ్డు ప్రమాదానికి గురైన కారులో నుంచి దిగాడు.. తనకు ఎలాంటి గాయాలు కాలేదని బంధువులకు ఫోన్‌లో తెలిపాడు.. ఆ తర్వాత అరగంటకే అనంతలోకాలకు వెళ్లిపోయాడు ధర్మపురికి చెందిన న్యాయవాది బండారి సత్యనారాయణ(49). ప్రత్యక్ష సాక్షులు, మృతుడి బంధువుల కథనం ప్రకారం.. సత్యనారాయణ గతంలో బార్ అసోసియేషన్ ధర్మపురి అధ్యక్షుడిగా పని చేశారు. మంగళవారం జగిత్యాల కోర్టులో పని ముగించుకొని, తన సొంత పనులపై కారులో కరీంనగర్ వెళ్లారు. అక్కడి నుంచి ధర్మపురి వస్తుండగా పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని బంజేరుపల్లి తండా బి గ్రామం వద్ద ఆయన కారు, మేకల లోడ్‌తో ఆర్నకొండ వైపు వెళ్తున్న బోలెరో వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బోలెరో రోడ్డు కింద బోల్తా పడింది. ఆ వాహన డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కారు బెలూన్స్ ఓపెన్ కావడంతో సత్యనారాయణ ఒంటిపై ఎలాంటి గాయాలు కాలేదు. ఆయన బయటకు వచ్చి, వెంటనే తన బంధువులకు ఫోన్‌లో జరిగిన విషయం చెప్పాడు. తనకు ఎలాంటి గాయాలు కాలేదన్నాడు.

గతంలో గుండెకు స్టంట్లు..

అప్పటికే స్థానికులు ఇచ్చిన సమాచారంతో 108 వాహనం సంఘటన స్థలానికి చేరుకుంది. వాహనంలోకి ఎక్కిస్తుండగానే సత్యనారాయణ ప్యాంట్‌లో మూత్ర విసర్జన చేసినట్లు స్థానికులు తెలిపారు. చికిత్స నిమిత్తం కరీంనగర్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఆయన గుండెకు కొన్ని నెలల క్రితం స్టంట్లు పడినట్లు బంధువులు పేర్కొన్నారు. మృతుడికి భార్య శోభ, ఇంటర్ చదివే కుమారుడు, ఐదో తరగతి చదివే కూతురు ఉన్నారు. సత్యనారాయణ చనిపోయిన వార్త తెలుసుకున్న కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బొలెరో వాహనం వేగంగా వచ్చి, ఢీకొట్టడం వల్లే సత్యనారాయణ చనిపోయాడని మృతుడి బాబాయి కుమారుడు రాజమహేంద్ర పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బొలెరో డ్రైవర్, ఆర్నకొండకు చెందిన సంతోష్ రెడ్డిపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సత్యనారాయణ పేర్కొన్నారు.






ఆస్పత్రి ఆవరణ.. బురదమయం

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి ఆవరణ బురదమయంగా మారింది. రోగులతో పాటు వైద్యులు, నర్సులు, సిబ్బంది రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మెడికల్ కళాశాలగా మారుతున్న ఆసుపత్రి ఆవరణలో బురద లేకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని రోగుల బంధువులు, సిబ్బంది కోరుతున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

చిత్ర కథ — జలకాలాటకు మెరుపు తీగ సై..!



మెరుపు తీగకు ఎన్నెన్ని హొయలు.. నింగి మెడలో మెరవాలని.. పుడమి కాంతకు ఎన్నెన్ని సిరులు.. పొంగి పారే ఈ చెరువులు.. భూమి ఆకాశానికి హద్దులు చెరిపిన వర్షాధారాలతో పుడమి పులకిస్తున్నది. చెరువులు మత్తడి దూకుతుండగా జలకాలాటకు మెరుపు తీగ సై అంటోంది. ఈ దృశ్యం మంగళవారం సాయంత్రం కొత్తపల్లి(హెచ్) చెరువు వద్ద 'సాక్షి' కెమెరాకు చిక్కింది. - కొత్తపల్లి

క్లుప్తంగా

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న వీఆర్ఏలు

కరీంనగర్ అర్బన్: వీఆర్ఏలకు పేస్కేల్ ప్రకటించి, పదోన్నతి కల్పించినందుకు హర్షిస్తూ వీఆర్ఏలు మంగళవారం సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. నగరంలోని సంఘ కార్యాలయ ఆవరణతో పాటు కలెక్టరేట్ ఎదుట సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, గంగుల కమలాకర్‌ల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. వీఆర్ఏల సంఘం నేతలు నలువాల మల్లేశం, చెట్టి రవి, నలువాల సాయికిషోర్, గాజుల తిరుపతి, సంపత్‌వర్మ, కోమల, అనూష, చందన, మమత, భాగ్యలక్ష్మి, స్వరూప, మాధవి తదితరులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌కు శుభాకాంక్షల వెల్లువ



అదనపు కలెక్టర్‌తో రేషన్ డీలర్ల సంఘం నేతలు

కరీంనగర్ అర్బన్: అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన లక్ష్మీకిరణ్‌ను రేషన్ డీలర్ల సంఘం నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛమిచ్చి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రొడ్డ శ్రీనివాస్, సహాధ్యక్షుడు కూర ధర్మరాజు, ప్రధాన కార్యదర్శి గాలి గట్టయ్య, బి.రవీందర్, రజిత, సమత, మేకల శ్రీనివాస్, నరేశ్, విజయ్‌కుమార్, శరన్ కుమార్ తదితరులు ఉన్నారు.

ఏసీపీని కలిసిన అంబేడ్కర్ సంఘం నాయకులు



విద్యానగర్: కరీంనగర్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన నరేందర్‌ను మంగళవారం తెలంగాణ అంబేడ్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి అమర్‌నాథ్, ఎస్సీ పరిరక్షణసమితి రాష్ట్ర అధ్యక్షుడు మారేడు మోహన్, జిల్లా అధ్యక్షుడు దావు సంతోశ్, నాయకులు అరవింద్, లక్ష్మణ్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాతో సన్మానించారు.

ఎస్సైకి సన్మానం



ఎస్సైని సన్మానిస్తున్న యాదవ సంఘం నాయకులు

కొత్తపల్లి: కొత్తపల్లి ఎస్సైగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన డి.చంద్రశేఖర్‌ను మంగళవారం యాదవ సంఘం నాయకులు బొకే అందించి శాలువాతో సన్మానించారు. బడుగు, బలహీన వర్గాల నుంచి అధికారులుగా రాణించడం మనందరికి గర్వకారణమని, మరికొంత మంది అధికారులు సైతం రాణిస్తూ ఉన్నత స్థానంలో ఉండాలని ఆకాంక్షించారు. యాదవ సంఘం నాయకులు జినుక రవీందర్, జిట్టవేణి పర్శరాం, బొల్లవేణి నాగరాజు, జిట్టవేణి మల్లయ్య, బొల్లవేణి రేణయ్య, గడ్డి కనకయ్య, బొల్లవేణి కనుకమ్మ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ గెస్ట్ లెక్చరర్ల కొనసాగింపు తీర్పుపై హర్షం

కరీంనగర్‌సిటీ: ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్లను యథావిధిగా కొనసాగించాలనే హైకోర్టు తీర్పుపై ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల గెస్ట్ లెక్చరర్ల సంఘం అధ్యక్షుడు రాములు, మహేందర్, రాజు, అశోక్, మల్లేశం తో పాటు అధ్యాపకులు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన నూతన నోటిఫికేషన్ కూడా హైకోర్టు రద్దు చేస్తూ తీర్పు ఇచ్చినట్లు తెలిపారు.

లాభాల బాటలో వ్యవసాయ మార్కెట్

- లక్ష్యానికి మించి ఆదాయం
- కరీంనగర్ మార్కెట్‌కు రూ.4.54 కోట్లు
- 2022–23లో 102.83 శాతం రాబడి



కరీంనగర్ మార్కెట్ కమిటీ కార్యాలయం

కరీంనగర్ అర్బన్: సమష్టి కృషి.. పారదర్శక నిర్ణయాలతో కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ లాభాల బాటలో నడుస్తోంది. మార్కెట్ పాలకవర్గ చిత్తశుద్ధికి తోడు ప్రభుత్వ ప్రోత్సాహకం మరింత వన్నె తెస్తోంది. మొత్తంగా కరీంనగర్ వ్యవసాయ మార్కెట్‌కు కాసుల పంట పండింది. కొత్త పాలకవర్గం చేపట్టిన చర్యలతో ఆదాయం గణనీయంగా పెరిగింది. పక్కాగా మార్కెట్ ఫీజు వసూలుతో పాటు పకడ్బందీగా కార్యకలాపాల నిర్వహణతో రాబడిలో వృద్ధి సాధించింది. మునుపెన్నడూ లేనివిధంగా 2022–23 ఆర్థిక సంవత్సరంలో లక్ష్యానికి మించి 102.88 శాతంతో రూ.4.54 కోట్ల ఆదాయాన్ని ఆర్జించి రికార్డు సృష్టించింది. కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ దినదినాభివృద్ధి దిశగా పూర్వవైభవం వైపు అడుగులేస్తోంది. ఏఎంసీ పరిధిలో కొత్తపల్లి, కరీంనగర్ రూరల్, తిమ్మాపూర్ మండలాలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో చెరువులు, కుంటలు జలాలతో కళకళలాడుతున్నాయి. భూగర్భ జలం అంచనాలకు మించి పెరిగింది. అలాగే సాగుకు నాణ్యమైన నిరంతర కరెంట్ సరఫరాతో పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. కొన్నేళ్లుగా పడావువడ్డ భూములన్నీ సాగులోకి వచ్చాయి. దిగుబడులు సైతం అదే స్థాయిలో పెరిగాయి. ప్రధాన ఆహార పంటలుగా వరి, మక్కతో పాటు పప్పు దినుసులు, వాణిజ్య పంటగా పత్తిని అధిక విస్తీర్ణంలో రైతులు సాగు చేశారు.

వివిధ రూపాల్లో ఆదాయం

మార్కెట్ యార్డులో రైతులు పంట ఉత్పత్తుల విక్రయానికి వీలుగా అన్ని సౌకర్యాలు కల్పించారు. ధాన్యంతో పాటు పత్తి కొనుగోళ్లు చేపడుతున్నారు. ప్రధాన మార్కెట్‌కు అనుబంధంగా శనివారం అంగడి సమీపంలోని మహాత్మాగాంధీ హోల్‌సేల్ కూరగాయల మార్కెట్లో 12మంది, యార్డు ఆవరణలోని పండ్ల మార్కెట్లో 16 మంది కమీషన్ ఏజెంట్లు రైతుల నుంచి కూరగాయలు, పండ్లు కొనుగోలు చేస్తుంటారు. అలాగే మార్కెట్ కమిటీ పరిధిలో 43 రైస్‌మిల్లులు, 3 జిన్నింగ్ మిల్లుల్లోనూ నిర్వాహకులు రైతుల నుంచి పంట ఉత్పత్తులు కొనుగోలు చేస్తారు. కొనుగోళ్లపై ఒక శాతం మొత్తాన్ని మార్కెట్ కమిటీకి ఫీజు రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. ప్రధాన మార్గాల్లోని ఏఎంసీ చెక్‌పోస్టులను పటిష్టం చేశారు. ప్రభుత్వ సంస్థల నుంచి రావాల్సిన బకాయిల వసూళ్లతో పాటు యార్డులోని గోదాముల అద్దె, లైసెన్సుల రెన్యువల్, ఇతర అంశాలపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ఆదాయం పెంపునకు ఏఎంసీ చైర్మన్ రెడ్డవేణి మధు తీసుకున్న నిర్ణయాలు సత్ఫలితాన్నిచ్చాయి. గతంతో పోల్చితే మార్కెట్ ఆదాయం పెరిగింది.

లక్ష్యానికి మించి వసూలు

మార్కెట్ కమిటీకి 2022–23 ఆర్థిక సంవత్సరానికి మార్కెట్ ఫీజు లక్ష్యాన్ని రూ.4.42 కోట్లుగా నిర్దేశించారు. లక్ష్య సాధనకు అధికారులు, సిబ్బంది సమష్టిగా పనిచేసి రూ.4.54 కోట్లు రాబట్టారు. ఫీజు వసూళ్లలో 102.83 శాతంతో రికార్డు సాధించి లక్ష్యాన్ని అధిగమించారు. ఇందులో గంజ్ ఆదాయం రూ.74.58లక్షలు, డైరెక్ట్ ఇంపోర్ట్స్ ద్వారా రూ.118.83లక్షలు, చెక్ పోస్టుల ద్వారా రూ.16.32 లక్షలు, వెజిటేబుల్ మార్కెట్ నుంచి రూ.25.46లక్షలు, ఫ్రూట్ మార్కెట్ నుంచి రూ.23.24 లక్షలు, సివిల్ సప్లై కార్పొరేషన్ ద్వారా రూ.216.78 లక్షలు, ఎఫ్‌సీఐ నుంచి రూ.49.52లక్షల ఆదాయం సమకూరింది.

రైతుల సౌకర్యార్థం షెడ్లు

అన్నదాతలు మార్కెట్‌ను ఇంటిలా భావించేలా మార్కెట్ కమిటీ దిద్దుబాటు చర్యలు చేపట్టింది. ఇప్పటికే విపణికి వచ్చే రైతుల సౌకర్యార్థం భోజనం ఏర్పాటు చేసింది. సీజన్‌లో ఇబ్బందులు లేకుండా భోజన సౌకర్యంతో పాటు విశ్రాంతి భవనాన్ని మరింత సౌకర్యంగా మలిచారు. చల్లని తాగునీటితో పాటు శౌచాలయాలను ఆధునీకరించారు. ఇక పంట ఉత్పత్తులు దెబ్బతినకుండా భారీ షెడ్లను నిర్మించారు.

సమష్టి కృషితో లక్ష్య సాధన



పాలకవర్గం బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రతీ వ్యవహారాన్ని పారదర్శకంగా నిర్వహిస్తున్నాం. రైతులు, వ్యాపారులకు మెరుగైన సేవలందిస్తున్నాం. దీంతో ఆదాయం సైతం ఆదే స్థాయిలో సమకూరింది. అధికారులు, సిబ్బంది సమష్టిగా పనిచేసి 2022–23 సంవత్సరానికి 102.83శాతంతో రూ.4.54కోట్ల ఆదాయంతో లక్ష్యాన్ని అధిగమించాం.
– రెడ్డవేణి మధు, మార్కెట్ కమిటీ చైర్మన్

వివాదాస్పద ఆర్చీ తొలగింపు



జేసీబీతో ఆర్చీని తొలగిస్తున్న దృశ్యం

- కోర్టు ధిక్కారణ నేపథ్యంలో 'స్వచ్ఛంద' చర్యలు

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని భగత్‌నగర్‌లో సంవత్సరకాలంగా వివాదాస్పదమవుతున్న ఆర్చీని మంగళవారం ఎట్టకేలకు తొలగించారు. కోర్టు ధిక్కారణ అంశం తెరపైకి వస్తున్న సమయంలో ఈ ఆర్చీని 'స్వచ్ఛందం'గా తొలగించుకోవడం విశేషం. ఆర్చీ నిర్మించిన కార్పొరేటర్, ఫిర్యాదు చేసిన పిటిషనర్.. ఇద్దరూ అధికార బీఆర్ఎస్‌కు చెందిన వారే కావడం, నగరంలో ఎక్కడా లేని విధంగా భగత్‌నగర్‌లో వ్యక్తిగత ఆర్చీల సంస్కృతి మొదలవడంతో అందరి దృష్టి దీనిపై పడింది. 51వ డివిజన్ భగత్‌నగర్ అంబేడ్కర్ స్టేడియం ఎదురుగా, కాలనీ ప్రధాన రహదారిలో 12వ డివిజన్ కార్పొరేటర్ తోట రాములు గతేడాది తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఆర్చీని నిర్మించారు. అయితే నిర్మాణ సమయంలోనే స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 51వ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు తుల భాస్కర్‌రావు నగరపాలక సంస్థ కమిషనర్, కలెక్టర్‌కు పలుమార్లు ఫిర్యాదు చేశారు. కాని నిర్మాణం ఆగకపోవడంతో 2022, జూన్ 14న భాస్కర్‌రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్ దారు పేర్కొన్నట్లు చర్యలు తీసుకోవాలంటూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. కాని ఆర్చీ నిర్మాణం ఆగకపోగా, ప్రారంభోత్సవం కూడా జరిగింది. దీంతో కోర్టు ఆదేశాలను ధిక్కరించినట్లు పిటిషనర్ మరోమారు కోర్టును ఆశ్రయించారు. కోర్టు ధిక్కారం కింద చర్యలకు అవకాశం ఉన్న క్రమంలో మంగళవారం ఆర్చీని స్వచ్ఛందంగా తొలగించారు. కోర్టు ధిక్కారం ప్రభావం తమపై పడే అవకాశం ఉండడంతో అధికారుల ఒత్తిడి మేరకే ఈ నిర్ణయం తీసుకున్నారనే ప్రచారం కూడా జరుగుతోంది. ఇదిలా ఉంటే బీఆర్ఎస్ కార్పొరేటర్ నిర్మించుకున్న ఆర్చీని బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు తొలగింపచేసిన వైనం నగరంలో ఆసక్తికరంగా మారింది.

అనుమతి లేనందునే ఫిర్యాదు

నగరంలో ఆర్చీలకు అనుమతి లేదు. ఆర్చీ నిర్మిస్తున్న సమయంలోనే స్థానికులు అభ్యంతరాలు చెప్పారు. కాని నిర్మాణం ఆపలేదు. కమిషనర్, కలెక్టర్‌లకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. అందుకే స్థానికుల కోరిక మేరకు కోర్టును ఆశ్రయించా. చివరికి న్యాయమే గెలిచింది.
–తుల భాస్కర్‌రావు, బీఆర్ఎస్ 51వ డివిజన్ అధ్యక్షుడు

ఆధ్యాత్మికం — ఘనంగా శీత్లా భవాని పండుగ



కరీంనగర్‌లోని డ్యాం కట్ట కింద మంగళవారం బంజారాలు శీత్లా భవాని పండుగను ఘనంగా నిర్వహించారు. గిరిజనులు తమ కులదేవతలకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ భీమా సాహెబ్, చింతకుంట ఎంపీటీసీ భూక్యా తిరుపతినాయక్, గిరిజన సంఘాల నేతలు గుగులోతు తిరుపతి నాయక్, రాజు నాయక్, తిరుపతి, శివరాజు, బోడా మోహన్ నాయక్, లక్పతి నాయక్, నరేశ్ పటేల్, రవీందర్ నాయక్, హబిల్ నాయక్, ఎంజి నాయక్, సుకుమార్ నాయక్ ,కిషన్ నాయక్, భాస్కర్ నాయక్, రూప్సింగ్ నాయక్, రాజేందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. - కరీంనగర్‌కల్చరల్

నీట్ ర్యాంకర్‌కు ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న ప్రతినిధులు

విద్యానగర్(కరీంనగర్): నీట్‌లో 979 ర్యాంకు సాధించి ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న కీర్తి శరణ్యకు మంగళవారం కరీంనగర్‌లోని స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ బాధ్యులు శ్రీనివాస్, పద్మలత, సేల్స్ టీం సభ్యులు ఆర్థిక సాయం అందజేశారు. పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్‌కు చెందిన కీర్తి శరణ్య నీట్‌లో 979లో ర్యాంకు సాధించినప్పటికీ పై చదువులు చదివే ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఆమె పరిస్థితులు తెలుసుకున్న సభ్యులు వారి కార్యాలయంలో రూ.54,525ల చెక్కును శరణ్య, ఆమె తండ్రి లచ్చయ్యలకు అందించారు. ఈ కార్యక్రమంలో స్టార్ హెల్త్ ఏరియా అసిస్టెంట్ మేనేజర్ గోపుకుమార్, భరోసా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు అకెనపల్లి నాగరాజుతో పాటు పల్లెర్ల మొండయ్య, శ్రీనివాస్, అడిగొప్పుల భాస్కర్, నటరాజ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఆర్టీసీ అధికారులు

విద్యానగర్: కరీంనగర్‌కు చెందిన మల్లేశం మంగళవారం కరీంనగర్ బస్టాండ్ నుంచి సికింద్రాబాద్ వెళ్తున్న బస్‌లో తన సెల్‌ఫోన్ మరిచిపోయి వర్గల్ వద్ద దిగిపోయారు. విషయాన్ని బస్ డ్రైవర్ శ్రీనివాస్ బాధితుడికి తెలియజేసి ఆ సెల్‌ఫోన్‌ను అప్పగించారు. ఈ కార్యక్రమంలో డిపో–1 మేనేజర్ ప్రణీత్ తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

కొత్తపల్లి చెరువులోకి భారీగా వరద నీరు

- మత్తడి వద్ద వర్షంలోనూ చేపల వేట
- పరిసరాల్లో రక్షణ చర్యలు శూన్యం
- కొత్తపల్లి–వెలిచాల కల్వర్టుపై కొనసాగుతున్న వరద
- రాణిపూర్–కొక్కెరకుంట రోడ్డుకు గండి



కొత్తపల్లి–వెలిచాల బైపాస్ కల్వర్టుపై వరద నీటిలో చేపలు పడుతున్న జాలర్లు



రాణిపూర్–కొక్కెరకుంట సర్వీసు రోడ్డుపై గండి

కొత్తపల్లి: కొత్తపల్లి చెరువులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ఉధృతంగా మత్తడి దూకుతోంది. మత్తడి పరిసరాల్లో భయానక పరిస్థితులు నెలకొన్నాయి. అయినప్పటికీ మత్తడి కట్టపై మంగళవారం వర్షంలోనూ చేపల వేట కొనసాగుతోంది. ప్రవాహం అధికంగా ఉన్న మత్తడి కట్టపై వలలు వేస్తూ చేపలు పడుతున్నారు. అంతేకాకుండా చేపల విక్రయంతో కరీంనగర్–జగిత్యాల రహదారిపై ట్రాఫిక్ ఇబ్బంది ఏర్పడుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో కట్టడి చేయాల్సిన పురపాలక సంఘం, పోలీసులు ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో అడ్డు లేకుండా పోతోంది. దీంతో యథేచ్ఛగా చేపలు పడుతున్నారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఎగువ ప్రాంతం నుంచి వరద పోటెత్తుతోంది. కొత్తపల్లి–వెలిచాల(చింతకుంట)లో లెవల్ కల్వర్టుపై వరద నీటి ప్రవాహం పెరిగింది. ద్విచక్రవాహనాలు, చిన్న వాహనాలకు ఇబ్బంది ఏర్పడుతోంది. చెరువులు, కుంటలు నిండుకుండను తలపిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. మండలంలోని మల్కాపూర్ పంచాయతీ పరిధిలోని లక్ష్మీపూర్‌లో గల శ్రీలక్ష్మీహోమ్స్‌కు వెళ్లే రోడ్డంతా మూకాళ్ల లోతు నీటితోనిండిపోయింది. దీంతో రాకపోకలు నిలిచిపోగా స్థానికులు అధికారులకు సమాచారం ఇవ్వడంతో వరద నీటిని పక్క చేళ్లలోకి మళ్లించారు.

నిలిచిన రాకపోకలు

కొత్తపల్లి పట్టణ పరిధిలోని రాణిపూర్–కొక్కెరకుంట రైల్వే సర్వీసు రోడ్డుపై కల్వర్టు వద్ద గండి పడింది. ఇరువైపుల రాకపోకలు నిలిచిపోయాయి. వెంటనే మరమ్మతు చేపట్టాలని రైల్వే ఉన్నతాధికారులకు టీఆర్ఎస్ నాయకుడు బండ గోపాల్‌రెడ్డి విన్నవించారు. చీకట్లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ఈ మార్గం గుండా వెళ్లకుండా ముళ్లకంప వేశారు.

కొనసాగుతున్న స్వీపర్ల దీక్షలు



రిలే దీక్షలు చేస్తున్న స్వీపర్లు

కరీంనగర్: ప్రభుత్వ జిల్లా, మండల పరిషత్ పాఠశాలల్లో గత 40 ఏళ్లుగా పనిచేస్తున్న స్వీపర్లను రెగ్యులర్ చేయాలని కోరుతూ ప్రభుత్వ జిల్లా, మండల పరిషత్ స్కూల్ స్వీపర్ల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రమేష్, అలీం,శంకరయ్య, మొండయ్య, స్వీపర్లు పాల్గొన్నారు.

జంగం సమాజం కార్యవర్గం ఎన్నిక

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని దేవుళ్లపురి భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో మంగళవారం జంగం సమాజం ఎన్నికలను ఆవునూరి రమేశ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా కిన్నెర సురేశ్, గంజి కాశీనాథం, కోశాధికారి అవునూరి భద్రయ్య, ఉపాధ్యక్షులుగా బొమ్మకంటి రాజవీరయ్య, భీమనాథుని శివకుమార్, సంయుక్త కార్యదర్శిగా లింగాపురం, చంటి వీరయ్య, సభ్యులుగా మాణిక్ ప్రభు, ఆవునూరి నాగరాజు, రాజులను ఎన్నుకున్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఒకరికి జైలు

కరీంనగర్‌క్రైం: మద్యం తాగి వాహనం నడిపిన ఓ వ్యక్తికి కోర్టు ఐదురోజుల జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధించింది. కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడిన ఐదుగురిని మంగళవారం కోర్టులో హాజరుపరిచారు. చింతకుంటకు చెందిన మలోతు రాజుకు కోర్టు ఐదు రోజుల జైలుశిక్ష, రూ.2వేలు జరిమానా విధించింది. మిగితా నలుగురికి రూ.9500 జరిమానా విధించారు.

క్లుప్తంగా...



రాష్ట్రపతితో జయధీర్ తిరుమలరావు

రాష్ట్రపతి భవన్‌లో ఆదివాసీ కళా ప్రదర్శన

ద్రౌపదీముర్ము బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా నిర్వహణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రపతిగా ద్రౌపదీ ముర్ము బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా భారత ప్రభుత్వం సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో మంగళవారం పాత తివాచీల మ్యూజియంలో సూత్ర కళాదర్పణ్, జనజాతి దర్పణ్ పేర్లతో ఆదివాసీ కళాప్రదర్శన నిర్వహించింది. ఈ ప్రదర్శనలో ఆదివాసీ స్వాతంత్య్ర ఉద్యమ వీరుల చిత్రపటాలు, వ్యవసాయ పరికరాలు, లోహ కళాఖండాలను, ఆదివాసీ జీవిత ఛాయాచిత్రాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో రాష్ట్రపతితో పాటు ఇందిరాగాంధీ రాష్ట్రీయ కళాకేంద్రం మెంబర్ కార్యదర్శి సచ్చిదానం జోషి, హైదరాబాద్ ఆద్యకళా మ్యూజియం డైరెక్టర్ జయధీర్ తిరుమలరావు, జానపద సంపద విభాగం అధిపతి కె.అనిల్‌కుమార్, అరుణ్ కుమార్‌రెడ్డి, సతీశ్‌లాల్ తదితరులు పాల్గొన్నారు. ప్రదర్శనలోని కళాఖండాలను తిలకించి ఇలాంటి అతిపెద్ద మ్యూజియం ఏర్పాటుకు ఇది తొలి అడుగు అని పలువురు అభిప్రాయపడ్డారు. ఇందులో సగానికి పైగా కళా ఖండాలను ప్రదర్శించిన హైదరాబాద్ ఆద్యకళా మ్యూజియం వారిని రాష్ట్రపతి అభినందించారు.

మైహోం సిమెంట్ పరిశ్రమలో ప్రమాదం

మేళ్లచెరువు: సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండల కేంద్రం పరిధిలోని మైహోం సిమెంట్ పరిశ్రమలో మంగళవారం జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మైహోం సిమెంట్ పరిశ్రమలో 4వ ప్లాంట్ నిర్మాణ పనులు సాగుతున్నాయి. అందులో నాల్గవ అంతస్తు స్లాబ్ పనులు చేస్తుండగా దాని కింద నుంచి రెడిమిక్స్‌ను బ్లోయర్ ద్వారా పై అంతస్తులకు చేరవేస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం సమయంలో రెడిమిక్స్ పైకి పంపిస్తుండగా జామ్ కావడంతో ఆ నలుగురు కార్మికులు పైపులను సరిచేస్తుండగా ఒక్కసారిగా 40 మీటర్ల ఎత్తులో పైపులు విరిగి పోవడంతో వారు కింద పడిపోయారు. వారిలో మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అరవింద్ సింగ్ (32) మృతిచెందగా.. రాజాసింగ్‌కు తీవ్ర గాయాలయ్యాయి.

దారుణంగా దర్యాప్తు

వివేకా హత్య కేసులో కల్పిత కథనాలతో డైలీ సీరియల్‌లా సీబీఐ ఛార్జ్ షీట్: సజ్జల

సాక్షి, అమరావతి: సీబీఐ లాంటి ప్రతిష్టాత్మక సంస్థ కూడా చెత్తగా దర్యాప్తు చేస్తుందనేందుకు మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు నిదర్శనంగా నిలుస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ప్రజాక్షేత్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కోలేని గుంట నక్కలకు సీబీఐ వేదికగా మారిందని మండిపడ్డారు. మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇటీవల సీబీఐ దాఖలు చేసిన సప్లిమెంటరీ ఛార్జ్‌షీట్ మొత్తం కల్పిత కథేనని కొట్టిపారేశారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుకు బాకాలు ఊదే ఎల్లో మీడియాకు నాలుగు రోజులు మసాలా కథనాలు వండివార్చడానికి మాత్రమే సీబీఐ ఛార్జ్‌షీట్ ఉపయోగపడుతుంది కానీ ఈ డైలీ సీరియల్ న్యాయస్థానాల్లో నిలబడదని తేల్చి చెప్పారు. వైఎస్ భారతమ్మ, తాను కలిసి సునీతమ్మ ఇంటికే వెళ్లలేదని సజ్జల స్పష్టం చేశారు. అలాంటప్పుడు ఎంపీ అవినాశ్‌రెడ్డిని వెనకేసుకురావాలని సునీతమ్మను తాను ఎలా కోరుతానని ప్రశ్నించారు. సునీతమ్మ పచ్చి అబద్ధాలు చెబుతున్నట్లు స్పష్టమవుతోందన్నారు. సజ్జల ఇంకా ఏమన్నారంటే..

ఆ మాత్రం ఇంగిత జ్ఞానం లేదా?

ఎలాంటి ఆధారాలు లేకున్నా కేవలం వ్యక్తుల వాంగ్మూలాలను కల్పిత కథకు అనుకూలంగా మారుస్తూ సీబీఐ ఛార్జ్‌షీట్లు దాఖలు చేస్తోంది. వైఎస్ వివేకా హత్య వల్ల నష్టం ఎవరికి? అని ప్రశ్నిస్తే.. వైఎస్సార్ సీపీకి, జగన్‌కే అని చిన్న పిల్లాడైనా చెబుతాడు. ఇంకా చెప్పాలంటే నాడు కడప ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అవినాశ్‌రెడ్డికి నష్టం. రాజకీయంగా ఆత్మహత్య చేసుకోవాలని ఆయన ఎందుకు అనుకుంటారు? ఏ చిన్న దర్యాప్తు సంస్థ అయినా, ప్రైవేట్ డిటెక్టివ్ సంస్థకైనా ఈమాత్రం ఇంగితం ఉంటుంది. వివేకా హత్య కేసును రెండు సిట్‌లు దర్యాప్తు చేశాయి. అవి సేకరించిన కాల్ రికార్డ్స్, డేటాను సీబీఐ ఏం చేసిందో తెలియదు.

వ్యవస్థల్లోకి వైరస్‌లా చంద్రబాబు..

అన్ని వ్యవస్థల్లో వైరస్‌లా పాకిన చంద్రబాబు తన అనుచరులతో జాతీయ స్థాయిలో మేనేజ్ చేసేలా చక్రం తిప్పుతున్నారు. వివేకా హత్య వల్ల నాడు అధికారంలో ఉన్న చంద్రబాబుకు రెండు లాభాలు. ఒకటి వైఎస్ జగన్ ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయడం.. రెండోది.. పాదయాత్ర పూర్తిచేసి అభ్యర్థులను ప్రకటించేందుకు సిద్ధమైన వైఎస్ జగన్‌ను తేరుకోనివ్వకుండా చేయడం.

ప్రత్యర్థుల క్యాంపులో సునీతమ్మ..:

కారణాలు ఏమిటో తెలియదుగానీ వివేకా కుమార్తె సునీతమ్మ ఆ తర్వాత వ్యవహరిస్తున్న తీరు



చూస్తుంటే ఆమె పూర్తిగా ప్రత్యర్థుల క్యాంపులోకి వెళ్లినట్లు అనిపించింది. కథ మలుపు తిరగాలన్నప్పుడల్లా వారికి అనుగుణంగా ఆరేడు సార్లు సునీతమ్మ స్టేట్‌మెంట్లు తీసుకున్నారు. వారికి కావాల్సిన స్టేట్‌మెంట్లు తీసుకుంటూ ఇన్వెస్టిగేషన్ రివీల్డ్ అంటున్నారు. సునీల్ యాదవ్ అనే నిందితుడు బెయిల్‌కి దరఖాస్తు చేసినప్పుడు గూగుల్ టేకవుట్‌ను తెరపైకి తెచ్చి అవినాశ్‌రెడ్డి తండ్రిని లోపల పెట్టేశారు. గూగుల్ టేకవుట్ ఈ కేసులో నిలబడదని తెలియగానే యూనివర్సల్ టైమ్ కో-ఆర్డినేటర్ ప్రకారం మన సమయానికి 5.30 గంటలు కలపాలన్నారు. ఆ లెక్కన వారు చెప్పిన టైం మరుసటి రోజు 8 గంటలు కావడంతో దాన్ని పక్కన పెట్టేశారు. అది నిలబడదని వారికీ అర్థమైంది.

తెలంగాణ హైకోర్టు ప్రశ్నించడంతో..

తెలంగాణ హైకోర్టు గత మే 31న మొదటిసారిగా కేసును క్షుణ్ణంగా పరిశీలించి సీబీఐని పలు ప్రశ్నలు అడిగింది. మేం ముందు నుంచీ వ్యక్తం చేస్తున్న సందేహాలే అవి. అవినాశ్‌రెడ్డి జూన్ 19న సీబీఐ డైరెక్టర్‌కి లేఖ రాయడంతో సునీతమ్మ స్టేట్‌మెంట్ మరొకటి రికార్డు చేశారు. హింసాత్మక సంఘటనలు జరుగుతాయనే లేఖను బయట పెట్టలేదని సునీతమ్మ చెబుతున్నారు. అది అసహజం. సొంత తండ్రి చనిపోయినా లేఖ విషయాన్ని పట్టించుకోలేదంటే ఎలా నమ్మడం?

పది రోజుల తర్వాత పరామర్శకు వెళ్లా..

2019 మార్చి 23వ తేదీన భారతమ్మ వచ్చి సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పినట్లు చేయమన్నారని సునీతమ్మ స్టేట్‌మెంట్‌లో పేర్కొన్నారు. అవినాశ్‌ను సమర్థించాలని నేను కోరినట్లు కథ అల్లారు. ఆ రోజు భారతమ్మ, నేను కలిసి ఆమె ఇంటికి వెళ్లలేదు. వివేకా హత్య జరిగిన తర్వాత పది రోజులకు నా భార్యతో కలసి పరామర్శించడానికి వెళ్లా. బాగా షాక్‌తో ఉంటారనుకున్నాగానీ అంత ఇదిగా అయితే కనిపించలేదు. షాకింగ్ సంఘటన జరిగినప్పుడు మొదట ఇంటికి పెద్దలా ఉన్న వైఎస్ జగన్‌కు ఫోన్ రావాలి. కానీ సునీతమ్మ వైపు నుంచి ఫోన్ రాలేదు. వివేకా వ్యక్తిత్వాన్ని హననం చేసిన ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ, ఈనాడు ఈరోజు ఆమెకు మిత్రులు, సలహాదారులు, సన్నిహితులు. వివేకాకు మచ్చ రాకూడదని అవినాశ్‌రెడ్డి కుటుంబం మూడేళ్లు మౌనంగా అన్నీ భరించింది. చనిపోయిన వ్యక్తి గౌరవాన్ని కాపాడాలని మేం తపన పడుతుంటే బతికున్నవారినే సునీతమ్మ బజారుకీడుస్తున్నారు. బతుకులను నాశనం చేసే పరిస్థితికి వచ్చాక మౌనం వీడి నోరు తెరవాల్సి వస్తోంది.

వివేకా కోసం అవినాష్ ధర్నా

నిజానికి నాడు వివేకాకు ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వాలని జగన్‌కు ప్రతిపాదన చేసింది అవినాశే. ఒక ఎంపీటీసీని టీడీపీ నేతలు ఎత్తుకెళితే వివేకా కోసం అవినాశ్‌రెడ్డి స్వయంగా ధర్నాకు కూర్చున్నాడు. 2011లో పార్టీ పెట్టినప్పటి నుంచీ పులివెందుల విషయంలో తన ప్రతినిధిగా అవినాశ్‌ను జగన్ ఎంపిక చేసుకున్నారు. వైఎస్సార్‌కు వివేకా ఎలాగో ఇప్పుడు జగన్‌కు కూడా అవినాష్ అలానే.

గుంట నక్కలకు వేదిక..

వివేకాను వారే హత్య చేశారనేందుకు పది పన్నెండు కారణాలున్నాయి. ఆస్తి, కుటుంబ పరువు విషయాలే ప్రధానంగా హత్యలకు దారి తీస్తాయి. వివేకా చెక్ పవర్‌ను రద్దు చేయడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వివేకా రెండో భార్య షమీమ్ స్టేట్‌మెంట్లో అన్నీ ఉన్నాయి. వివేకా బావమరిది శివప్రకాశ్‌రెడ్డి బెదిరించాడని, మనుషులను పంపించాడని ఆమె స్టేట్‌మెంట్ ఇచ్చింది. దీనిపై సీబీఐ ఎందుకు విచారించదు? అన్ని శక్తులు ఉడిగిపోయిన గుంటనక్కలన్నీ ఒకచోట చేరి సీఎం వైఎస్ జగన్‌ను రాజకీయంగా దెబ్బతీసేందుకు సీబీఐని వేదికగా చేసుకుంటున్నాయి. పది బండలు వేస్తే ఒకటన్నా నమ్మకపోతారా అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే కోర్టు ఒకసారి మొట్టికాయలు వేసింది. న్యాయమూర్తి అమ్ముడుపోయాడంటూ ఆంధ్రజ్యోతి డిబేట్‌లో నేరుగా బురద చల్లే దుస్సాహసానికి ఒడిగట్టింది. జర్నలిజం పేరుతో బెదిరింపులకు పాల్పడుతూ ఉగ్రవాదుల కంటే దారుణంగా వ్యవహరిస్తున్నారు. చంద్రబాబు, ఎల్లో మీడియా కరివేపాకులా సునీతమ్మను వాడుకుంటున్నారు. ఎన్నికలు ముగియగానే ఆమెను అనాథలా పక్కన పెట్టడం ఖాయం.

దస్తగిరిని అప్రూవర్‌గా మార్చి ట్రైనింగ్

ఆధారాలు, పరిసరాలు, హత్యలో పాల్గొన్న వ్యక్తులు ఇలా అన్నీ ఒక వైపు చూపిస్తుంటే.. దర్యాప్తు మరోవైపు సాగుతోంది. ఎప్పుడైతే సునీతమ్మ ఆలోచన విధానం మారిందో అప్పుడే కేసును బలవంతంగా తిప్పడం మొదలుపెట్టారు. చంద్రబాబుకు లాభం చేకూరేలా మార్చారు. వ్యవస్థలను మేనేజ్ చేయడంలో సిద్ధహస్తులు కాబట్టి సీబీఐ చేతికి వచ్చాక వారికి తగ్గట్లుగానే అన్నీ జరుగుతూ వచ్చాయి. అవినాశ్‌రెడ్డి వైపు వేలు చూపించేందుకు దస్తగిరిని అప్రూవర్‌గా మార్చి రెండు మూడు నెలలు ట్రైనింగ్ కూడా ఇచ్చారు.

జస్టిస్ సామ్ కోషి బాధ్యతల స్వీకరణ రేపు

ప్రమాణం చేయించనున్న హైకోర్టు సీజే

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ హైకోర్టుకు న్యాయమూర్తిగా బదిలీ అయిన జస్టిస్ సామ్ కోషి ఈ నెల 27న బాధ్యతలు చేపట్టనున్నారు. గురువారం ఉదయం 10 గంటలకు హైకోర్టు మొదటి హాల్లో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే ఆయనతో ప్రమాణ స్వీకారం చేయిస్తారు. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్ హైకోర్టులో పనిచేస్తున్న జస్టిస్ సామ్ కోషిని సుప్రీంకోర్టు కొలీజియం తొలుత మధ్యప్రదేశ్‌కు సిఫార్సు చేయగా, వేరే రాష్ట్రానికి బదిలీ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దీంతో సుప్రీంకోర్టు కొలీజియం ఆయనను తెలంగాణ హైకోర్టుకు సిఫార్సు చేయగా, రాష్ట్రపతి ఆమోదముద్ర వేసిన సంగతి తెలిసిందే.

1991లో న్యాయవాదిగా ఎన్‌రోల్

జస్టిస్ సామ్ కోషి మధ్యప్రదేశ్‌లో 1967, ఏప్రిల్ 30న జన్మించారు. జబల్‌పూర్‌లోని జీఎస్ కళాశాల నుంచి కామర్స్‌లో డిగ్రీ పట్టా పొందారు. రాణి దుర్గావతి విశ్వవిద్యాలయం నుంచి న్యాయ విద్య పూర్తిచేసి 1991, మార్చి 9న న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. రాజ్యాంగం, సివిల్, సర్వీస్, లేబర్ అంశాల్లో ఎక్కువగా కేసులు వాదించారు. 2000 నుంచి 2013 వరకు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ హైకోర్టుల్లో న్యాయవాదిగా పనిచేశారు. ప్రభుత్వరంగ సంస్థలు, బ్యాంకులు, ప్రైవేట్ సంస్థలు, సౌత్ఈస్ట్ సెంట్రల్ రైల్వే, కోల్ ఇండియా లిమిటెడ్, నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎస్‌బీఐ, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, హిందూస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర విద్యుత్ బోర్డులకు కౌన్సిల్‌గా వ్యవహరించారు. 2002 నుంచి 2004 వరకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ న్యాయవాదిగా బాధ్యతలు నిర్వహించారు. 2005 నుంచి 2006 వరకు డిప్యూటీ అడ్వొకేట్ జనరల్‌గా పనిచేశారు. 2013, సెప్టెంబర్ 16న ఛత్తీస్‌గఢ్ హైకోర్టు అడిషనల్ జడ్జిగా నియమితులయ్యారు. ప్రస్తుతం తెలంగాణ హైకోర్టుకు బదిలీపై రానున్నారు.

9 మంది ఐఏఎస్‌ల బదిలీ

ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్ శాంతికుమారి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా తొమ్మిది మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన అధికారుల వివరాలు ..

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ
బి.గోపి	సీసీఎల్ఏ సెక్రెటరీ	కలెక్టర్, కరీంనగర్
ఆర్‌వీ కర్ణన్	===	కలెక్టర్, నల్లగొండ
టి.వినయ్‌కృష్ణారెడ్డి	కలెక్టర్, నల్లగొండ	రిపోర్ట్ టు జీఏడీ
వెంకటేశ్ దోత్రే	అడిషనల్ కలెక్టర్, మహబూబ్‌నగర్	అడిషనల్ కమిషనర్, జీహెచ్ఎంసీ
చెక్క ప్రియాంక	అడిషనల్ కలెక్టర్, పెద్దపల్లి	అడిషనల్ కలెక్టర్ (లోకల్‌బాడీస్) సూర్యాపేట
హేమంత కేశవ్ పాటిల్	====	అడిషనల్ కలెక్టర్ (లోకల్‌బాడీస్) ఆసిఫాబాద్
జల్ద అరుణశ్రీ	అడిషనల్ కలెక్టర్, కరీంనగర్	అడిషనల్ కలెక్టర్ (లోకల్‌బాడీస్) పెద్దపల్లి
ప్రఫుల్ దేశాయి	అడిషనల్ కలెక్టర్, జనగాం	అడిషనల్ కలెక్టర్ (లోకల్‌బాడీస్) కరీంనగర్
జి.రమేశ్	స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్, యూఎల్‌సీ,హైదరాబాద్	అడిషనల్ కలెక్టర్ (లోకల్‌బాడీస్) మెదక్

సెల్‌ఫోన్ వాడుతోందని తలపై మోదాడు

అన్న చేతిలో చెల్లెలి మృతి

ఇల్లెందురూరల్: సెల్‌ఫోన్ విషయంలో అన్నాచెల్లెలి మధ్య మొదలైన ఘర్షణ చివరికి చెల్లెలి ప్రాణాలు తీసింది. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు సీఎస్సీ బస్తీ గ్రామపంచాయతీ పరిధి రాజీవ్‌నగర్ తండాలో సోమవారం చోటుచేసుకుంది. ఏఎన్ఎంగా శిక్షణ పొందిన అజ్మీరా సింధు (23)ను సెల్‌ఫోన్ వాడకం తగ్గించాలని ఆమె సోదరుడు హరిలాల్ చెప్పినా వినిపించుకోలేదు. దీంతో సోమవారం సాయంత్రం ఇద్దరి మధ్య గొడవ జరిగింది. మాటామాటా పెరగడంతో కోపోద్రిక్తుడైన హరిలాల్ రోకలిబండతో సింధు తలపై బలంగా కొట్టాడు. దీంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిన సింధును కుటుంబీకులు ఖమ్మం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమె తలపై బలమైన గాయం ఉండటం, అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు పత్రికల్లో కథనాలు రావడంతో పోలీసులు మంగళవారం విచారణ చేపట్టగా సోదరుడు కొట్టడమే కారణమని వెల్లడైంది. కాగా, నిందితుడు హరిలాల్ పరారీలో ఉన్నట్లు ఇల్లెందు సీఐ కరుణాకర్ తెలిపారు.

పెన్‌గంగకు కొత్త కళ



కొరాట-చనాఖా బ్యారేజీతో పెన్‌గంగకు కొత్త కళ సంతరించుకుంది. ఆదిలాబాద్ నియోజకవర్గానికి సాగునీరు అందించాలనే సంకల్పంతో రెండు రాష్ట్రాల నడుమ ప్రవహిస్తున్న పెన్‌గంగ మధ్యలో 23 గేట్లతో నిర్మించిన బ్యారేజీ పనులు దాదాపు పూర్తయ్యాయి. సహజంగానే ఆకట్టుకునే పెన్‌గంగ నదిపై బ్యారేజీ నిర్మించగా నిండుకుండలా మారి మరింత ఆకట్టుకుంటోంది. - జైనథ్

వీరజవాన్ల స్ఫూర్తి పతాక



సిరిసిల్ల సాయినగర్‌లోని కార్గిల్‌లేక్‌పై వైజయంతి యుద్ధట్యాంకర్

సిరిసిల్ల: అది 1999.. సరిగ్గా ఇదే రోజు ఇండియా-పాకిస్థాన్ సరిహద్దుల్లో గల భారత భూభాగంలోని కార్గిల్ పర్వతశ్రేణులను ఆక్రమించిన పాకిస్తాన్ ప్రేరేపిత చొరబాటుదారులతో భారత సైన్యం వీరోచితంగా పోరాడి విజయం సాధించింది. ఎత్తైన గుట్టలు.. మంచుపర్వతాలు.. ప్రతికూల పరిస్థితుల మధ్య భారత సైనికులు రెండు నెలల పాటు చేసిన హోరాహోరీ యుద్ధంలో సుమారు 500 మంది జవాన్లు వీరమరణం పొందారు. పాకిస్తాన్ చొరబాటుదారుల నుంచి మన భూభాగాన్ని, సైన్యం పూర్తిగా స్వాధీనం చేసుకుంది. మన సైన్యం సాధించిన విజయానికి గుర్తుగా, భారత జవానుల త్యాగానికి చిహ్నంగా ప్రతి ఏటా జూలై 26ను కార్గిల్ విజయ్ దివస్‌ను నిర్వహిస్తారు. 24 ఏళ్ల కిందట జరిగిన కార్గిల్ యుద్ధంలో ఉపయోగించిన 'వైజయంతి యుద్ధ ట్యాంకర్'ను 2002లో సిరిసిల్లలో ఏర్పాటు చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఉన్న ఈ యుద్ధ ట్యాంకర్‌తో పాటు కార్గిల్ లేక్‌పై కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం..

- సైనికా.. సలాం..
- భారత జాతి గర్వించిన వేళ
- 21 ఏళ్ల కిందటే వైజయంతి యుద్ధ ట్యాంకర్ ఏర్పాటు
- నేడు కార్గిల్ విజయ్ దివస్

కార్గిల్ లేక్‌గా వర్ధన్‌కుంట

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోకి వెళ్లే దారిలో ఈ కార్గిల్ లేక్ ఉంది. గతంలో వర్ధన్‌కుంటగా పిలువబడే ఈ చెరువును కార్గిల్ లేక్‌గా 2002లో నామకరణ చేశారు. కార్గిల్ లేక్ ఒడ్డున కామారెడ్డి నుంచి వస్తుంటే పట్టణ ప్రవేశ ద్వారంగా వైజయంతి యుద్ధ ట్యాంకర్‌ను ఏర్పాటు చేశారు. కార్గిల్ యుద్ధంలో అమరులైన సైనికుల స్ఫూర్తిగా సిరిసిల్లలో వైజయంతి యుద్ధ ట్యాంకర్‌ను ఏర్పాటు చేశారు. అప్పటి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి చెన్నమనేని విద్యాసాగర్‌రావు, అప్పటి భారత రక్షణశాఖ మంత్రి జార్జి ఫెర్నాండేజ్, రక్షణ శాఖ అధికారులతో ప్రత్యేకంగా చర్చించి యుద్ధ ట్యాంకర్‌ను సిరిసిల్లలో ఏర్పాటు చేయించేందుకు భారత ప్రభుత్వ అనుమతి తీసుకున్నారు. అప్పటి మున్సిపల్ చైర్మన్ ఆడెపు రవీందర్ యుద్ధ ట్యాంకర్ ఏర్పాటుకు వేదిక నిర్మాణానికి రూ.4 లక్షలు వెచ్చించారు. 40 టన్నుల బరువైన ఆ యుద్ధ ట్యాంకర్‌ను ఢిల్లీ నుంచి తెప్పించారు. అప్పటి మున్సిపల్ కమిషనర్ తోపాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రత్యేకంగా ఢిల్లీకి వెళ్లి తీసుకొచ్చారు. అమరులైన వీర సైనికులను స్మరిస్తూ కార్గిల్ విజయానికి గుర్తుగా వైజయంతి యుద్ధ ట్యాంకర్‌ను కార్గిల్ లేక్‌పై ఏర్పాటు చేశారు. అరుదైన జ్ఞాపకంగా కార్గిల్ లేక్‌పై యుద్ధట్యాంకర్ దర్శనమిస్తోంది.



నిర్లక్ష్యపు జాడలు

కార్గిల్ లేక్ రూపురేఖలను మార్చేందుకు, పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలనే ప్రతిపాదనలు బుట్టదాఖలయ్యాయి. 21 ఏళ్ల గడిచినా పర్యాటక అభివృద్ధి ప్రతిపాదనలకే పరిమితమైంది. కార్గిల్ లేక్ ప్రాంతంలో ఉద్యానవనం, బోటింగ్ సదుపాయం, కుర్చీలు, విశ్రాంతి బెంచీలు, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. కార్గిల్ లేక్ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాల్సి ఉంది. కార్గిల్ లేక్ సమీపంలోనే సాయిబాబా, అయ్యప్ప ఆలయాలు ఉండడంతో కార్గిల్ లేక్‌కు పర్యాటక శోభ వస్తుందని ఆశించినా ఫలితం లేకుండా పోయింది. సిరిసిల్ల ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి కె.తారకరామారావు కార్గిల్ లేక్ అభివృద్ధికి రూ.21.10 లక్షలు కేటాయించి కొన్ని పనులు చేసినా, అవి పూర్తిస్థాయిలో అభివృద్ధికి నోచుకోలేదు.

అభివృద్ధి చేస్తే ప్రత్యేక ఆకర్షణ

రాజన్న సిరిసిల్లా జిల్లా కేంద్రానికి కార్గిల్‌లేక్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. యుద్ధట్యాంకర్, చెరువు, ఆలయాలు, రహదారి ఉండడంతో ఉద్యాన వనాలను అభివృద్ధి చేస్తే బాగుంటుంది. పర్యాటక స్థలంగా మార్చితే పట్టణ వాసులకు, కొత్తగా సిరిసిల్లకు వచ్చే వారికి సైనికుల తెగువ స్ఫూర్తినిస్తుంది. కార్గిల్ యుద్ధం జరిగిన నాటి సంఘటనలు స్ఫురణకు తెచ్చేలా తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కానీ దురదృష్టవశాత్తు కార్గి ల్ లేక్ ఆత్మహత్యలకు వేదికగా మారింది. ఆక్రమణలకు గురైంది. చెరువు కట్ట సైతం కబ్జాల కోరల్లో చిక్కింది. ఇప్పటికైనా పాలకులు స్పందించి అభివృద్ధి చేస్తే, సిరిసిల్లకు అదనపు అందం దరి చేరుతుంది. కార్గిల్‌లో అమరులైన సైనికుల చిహ్నంగా సిరిసిల్లలో వైజయంతి యుద్ధ ట్యాంకర్ ప్రత్యేక ఆకర్షణగా భావితరాలకు గుర్తుండిపోతుంది.

ఏటా కార్గిల్ దివస్ నిర్వహిస్తాం



నేను మున్సిపల్ చైర్మన్‌గా ఉన్నప్పుడే వర్ధన్‌కుంటకు కార్గిల్ లేక్‌గా నామకరణ చేశాం. అప్పటి నుంచి ప్రతి ఏటా కార్గిల్ దివస్ రోజు వైజయంతి యుద్ధ ట్యాంకర్ వద్ద కార్గిల్ యుద్ధంలో ప్రాణాలర్పించిన వీరజవాన్లకు జోహార్లు అర్పిస్తాం. జా తీయ జెండాను ఎగురవేసి విజయ సంకేతాన్ని అందిస్తాం. దేశం సాధించిన విజయానికి గుర్తుగా ప్రతి ఏటా సిరిసిల్లలో కార్గిల్ దివస్‌ను జరుపుతాం.

– ఆడెపు రవీందర్, మున్సిపల్ మాజీ చైర్మన్, సిరిసిల్ల

రైల్వే అండర్ బ్రిడ్జికి ముప్పు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రం మంచిర్యాలలోని హైటెక్‌సిటీ కాలనీ వెనుకభాగంలో ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జికి ముప్పు పొంచి ఉంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు హైటెక్‌సిటీ నుంచి రాజీవ్‌నగర్ వెళ్లే మార్గంలో ఉన్న బ్రిడ్జి కింద వరద నీరు చేరి ప్రమాదకరంగా మారింది. కొన్ని దశాబ్దాల క్రితం ఈ బ్రిడ్జి వద్ద రైల్వే ట్రాక్‌పై పెద్ద ఎత్తున నీరు చేరడంతో దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ రైలుకు ఘోర ప్రమాదం జరిగింది. గత ఏడాది వరకు హైటెక్‌సిటీ కాలనీలోనే ఉన్న మంచిర్యాల సిమెంటు కంపెనీ నుంచి వరద నీరు వెళ్లేది. ప్రస్తుతం కంపెనీలోకి వరద నీరు రాకుండా అడ్డుకట్ట వేయడంతో బ్రిడ్జి వద్ద నిలుస్తోంది. భారీ వర్షాలు కురిస్తే రైల్వేలైన్ వరద నీటిలో పూర్తిగా మునిగిపోయే అవకాశం ఉంది. రాజీవ్‌నగర్ ప్రజలు ఈ అండర్‌బ్రిడ్జి నుంచి మంచిర్యాలకు వచ్చేందుకు ఒక్క కిలోమీటరు దూరం మాత్రమే ఉండగా, వరద నీటితో అండర్ బ్రిడ్జి మునిగి నాలుగు కిలోమీటర్లు చుట్టూ తిరిగి మంచిర్యాలకు రావాల్సిన పరిస్థితి ఏర్పడింది.

రాకపోకల సమస్య తీర్చాలి

చిన్నపాటి వర్షానికే రైల్వే అండర్‌బ్రిడ్జి మునిగిపో



బ్రిడ్జి కిందికి చేరిన వరద నీరు

తోందని, సమస్య పరిష్కరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. వరద నీరు నిలిచిన బ్రిడ్జిని మంగళవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. రఘునాథ్ మాట్లాడుతూ లక్ష్మీటాకీస్ చౌరస్తా నుంచి రాజీవ్‌నగర్ వరకు అండర్ బ్రిడ్జి నిర్మిస్తామని ఎమ్మెల్యే హామీనిచ్చారని, రూ.77.64 కోట్లు విడుదలయ్యాయని చెప్పి ఇప్పటికీ పనులు ప్రారంభించలేదని తెలిపారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, బల్ల రవి, రాజేందర్ పాల్గొన్నారు.

గర్భిణికి దారి కష్టాలు



వాగు దాటుతున్న భారతి

బజార్‌హత్నూర్: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన ఆరు నెలల గర్భిణి పూసం భారతి ఐరన్ ఇంజక్షన్ కోసం సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బయలుదేరింది. దారిలో బంద్రేవ్ వాగుపై వంతెన లేకపోవడంతో గ్రామస్తులు వరదనీటిలో ఆమెను వాగు దాటించారు. ఈమె వాగుదాటే వీడియో మంగళవారం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో జిల్లా స్థాయి అధికారులు మెడికల్ ఆఫీసర్ భీంరావ్‌ను వివరణ కోరారు. మెడికల్ ఆఫీసర్ భీంరావ్‌ను సంప్రదించగా భారతి ఆరు నెలల గర్భిణి అని చెప్పారు. ఆమెకు ఐరన్ ఇంజక్షన్ మూడు డోసులకు రెండు పూర్తయ్యాయని తెలిపారు. మూడో డోస్ కోసం వర్షాలు తగ్గిన తర్వాత రావాల్సి ఉండగా, స్థానికంగా ఆశ కార్యకర్త, ఏఎన్ఎంను సంప్రదించకుండా తొందరపడినట్లు పేర్కొన్నారు.

నంది విగ్రహం నీరు తాగింది..!

- వైరల్‌గా మారిన వీడియో
- ఎయిర్ గ్యాప్‌తో నీరు ఇంకే అవకాశం ఉందన్న సైన్స్ టీచర్లు

జన్నారం: నంది విగ్రహం నీరు తాగిందంటూ ఓ వీడియో మంచిర్యాల జిల్లాలో వైరల్‌గా మారింది. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం పొనకల్ మేజర్ గ్రామ పంచాయతీలో కొత్త వేణుగోపాల్ గుప్తా కుటుంబ సభ్యులు సోమవారం రాత్రి 8గంటల ప్రాంతంలో పూజ చేశారు. నిర్మల్ జిల్లాలో నంది విగ్రహం నీరు తాగిందని తెలియడంతో ఇంట్లో తులసి చెట్టు వద్ద విగ్రహం ముఖం వద్ద చెంచాతో నీరు ఉంచారు. చెంచాలోని నీరంతా విగ్రహం పీల్చుకోవడంతో ఇంకిపోయింది. మరోసారి ప్రయత్నం చేయగా అలాగే జరిగింది. దీంతో కొందరు వీడియో తీయగా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ



నంది విగ్రహం వద్ద చెంచాలో నీరు ఇంకుతున్న దృశ్యం

విషయమై జిల్లా సైన్స్ అధికారి మధుబాబును సంప్రదించగా చాలా రోజుల బండరాయిలో రంధ్రాలు ఏర్పడి ఎయిర్ గ్యాప్ ఉండడం వల్ల గాలి లోపలికి లాగి నీరు ఇంకిపోతుందని, ఇలాంటి సంఘటనలు జరుగుతుంటాయని తెలిపారు.

పీసీసీఎఫ్ సమీక్ష

జన్నారం: కవ్వాల్ టైగర్‌జోన్ పర్యటనలో భాగంగా జిల్లాలో పర్యటించిన రాష్ట్ర అటవీ ముఖ్య సంరక్షణ అధికారి(పీసీసీఎఫ్) లోకేశ్ జైస్వాల్ మంగళవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని డీఎఫ్‌వో కార్యాలయంలో టైగర్ ప్రాజెక్ట్ ఫీల్డ్ డైరెక్టర్, సీపీ వినోద్‌కుమార్‌తో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పీసీసీఎఫ్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన మొదటిసారి పర్యటించారు. ఈ సందర్భంగా టైగర్ మానిటరింగ్, వైల్డ్‌లైఫ్ ప్రొటెక్షన్, హాబిటెడ్ అభివృద్ధి, అభివృద్ధి పనులపై సమీక్షించారు. టైగర్‌జోన్ ప్రాంతంలోని అడవిలో ఉన్న గ్రామాల ప్రజలకు పునరావాసం కల్పించే చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. సెన్సిటివ్ జోన్‌లను గుర్తించాలని, సంరక్షణపై ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. టైగర్‌జోన్ పరిధిలో పర్యటించిన ప్రాంతాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల వివరాలు తెలుసుకున్నారు. జిల్లా అటవీ సంరక్షణ అధికారి శివ్‌ఆశిష్‌సింగ్, మంచిర్యాల, ఆసిఫాబాద్, ఆదిలాబాద్ ఎఫ్‌డీవోలు పాల్గొన్నారు.

'గొడ్ల చావిడిలో పశువుల ఆలనా పాలనా స్త్రీలు చూసినప్పుడు వాటికి వైద్యం మేమెందుకు చేయలేము' అంటున్నారు నేటి యువతులు. శ్రీ వెంకటేశ్వర పశు వైద్యశాల 12వ స్నాతకోత్సవంలో 'బ్యాచులర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్' చదివిన లొగుడు ప్రత్యూష ఏకంగా 7 గోల్డ్ మెడల్స్ సాధిస్తే, తీర్థాల హేమనయని 5 గోల్డ్ మెడల్స్ సాధించింది. వెటర్నరీ రంగంలో 60 శాతం సీట్లు అమ్మాయిలే సొంతం చేసుకుంటున్నారని పశు వైద్యరంగంలో తమ సామర్థ్యం చూపి ఉపాధి అవకాశాలు అందుకుంటున్నామని వారు అంటున్నారు.

న్యూస్‌మేకర్స్

ఇంటి పేరు గోల్డ్ మెడల్


ప్రత్యూష

ఆంధ్రప్రదేశ్‌లో పశువైద్యానికి సంబంధించిన ఏకైక యూనివర్సిటీ– శ్రీ వేంకటేశ్వర పశు వైద్య విశ్వవిద్యాలయంలో విద్యార్థినులు అద్భుత ప్రతిభ చూపిస్తున్నారు. జూలై 22న జరిగిన 12వ స్నాతకోత్సవంలో 'బ్యాచులర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్' (బి.వి.ఎస్.సి) కోర్సులో ఒకరు ఏడు స్వర్ణాలు, మరొకరు ఐదు స్వర్ణాలు సాధించి గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రశంసలు అందుకున్నారు. ఒకప్పుడు పశు వైద్యంలో మగవారే 90 శాతం ఉండేవారు. నేడు అరవై నుంచి డెబ్బయి శాతం అమ్మాయిలే ఉంటున్నారు. బి.వి.ఎస్.సిలో రాష్ట్రవ్యాప్తంగా కేవలం 200 పై చిలుకు సీట్లు ఉంటే వాటిలో ప్రతి ఏటా అమ్మాయిలే ఎక్కువ సీట్లు పొందుతున్నారు. తిరుపతి, పొద్దుటూరు, గన్నవరం, గరివిడిలలో ఉన్న నాలుగు కాలేజీలు శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం కిందకే వస్తాయి. సీట్లు తక్కువే అయినా వాటిని పొందుతున్న అమ్మాయిలు ఎక్కువ. 'ఈ రంగంలో మాకు ఆసక్తి ఉంది. చేయగల సామర్థ్యం ఉంది. అవకాశాల పట్ల ఎరుక ఉంది' అంటున్నారు వాళ్లు. 7 స్వర్ణాలు సాధించిన ప్రత్యూష, 5 స్వర్ణాలు సాధించిన హేమనయని అంతరంగాలు...

పశు వ్యాధులను శోధించే సైంటిస్ట్ అవుతాను

నేనిప్పుడు ఉత్తర్ ప్రదేశ్‌లోని బరేలీలో 'ఇండియన్ వెటర్నరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్'లో పిజి సీటు సాధించి వెటర్నరీ మైక్రోబయాలజీ చేస్తుండటం వల్ల మొన్నటి స్నాతకోత్సవానికి హాజరు కాలేకపోయాను. కాని 7 గోల్డ్ మెడల్స్ సాధించడం మాత్రం సంతోషంగా ఉంది. చదువులో బాగా రాణించాలని రోజుకు ఆరు గంటలు చదివాను. సీనియర్లు, అధ్యాపకులు బాగా ప్రోత్సహించారు. బి.వి.ఎస్.సిలో ఐదు సంవత్సరాల్లో 18 సబ్జెక్ట్స్ చదువుతాము. వాటిలో దాదాపు 17 గోల్డ్‌మెడల్స్ ఉంటే నాకు 7 వచ్చాయి. మాది అనంతపురం. మా నాన్న గవర్నమెంట్ టీచర్. నేను తిరుపతి కాలేజీలో బి.వి.ఎస్.సి చేశాను. ఎం.బి.బి.ఎస్ డాక్టర్ కావాలని ఇంటర్‌లో బై.పి.సి చదివి 969 మార్కులు సాధించాను. నీట్‌లో సీట్ రాకపోయినా బాధపడలేదు. ఎంసెట్‌లో 1248వ ర్యాంకు సాధించి వెటర్నరీ కళాశాలలో బి.వి.ఎస్.సి డిగ్రీలో చేరాను. మనుషులకు వైద్యం చేసే డాక్టరైనా పశువులకు వైద్యం చేసే డాక్టరైనా డాక్టరే. చిన్నప్పటి నుంచి నాకు మూగజీవాలంటే ఇష్టం. ఆడవాళ్లు పశువుల ఆలనా పాలనా బాగా చూస్తారు. వైద్యం కూడా బాగా చేయగలరని నా నమ్మకం. అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చితే మన దేశంలో పశు వైద్యానికి సంబంధించిన ఇన్‌ఫ్రా తక్కువే ఉంది. కాని ఇటీవల పెట్స్‌కు డిమాండ్ పెరిగింది. అయితే రేబిస్ వంటి ఏ ఒకటి రెండు వ్యాక్సిన్ల గురించి మాత్రమే కాకుండా పశువులకు సంబంధించిన ఎన్నో వ్యాక్సిన్ల గురించి తగినంత చైతన్యం రావాలి. నాకైతే పశువులకు వచ్చే వ్యాధుల గురించి పరిశోధించే సైంటిస్ట్ కావాలని ఉంది. వైరస్, ఫంగస్, బ్యాక్టీరియా ఇవి పశువులకు ఎలా జబ్బులు కలిగిస్తాయో పరిశోధనలు కొనసాగుతూ ఉంటే పశువులను కాపాడటమే కాదు వాటి వల్ల మనుషులకు వచ్చే జబ్బులను కూడా నిరోధించి మనుషులనూ కాపాడవచ్చు.

– లొడుగు ప్రత్యూష, బి.వి.ఎస్.సి, ఏడు బంగారు పతకాల గ్రహీత, ఎస్.వి. వెటర్నరీ కళాశాల, తిరుపతి

ఆంధ్రా నుంచి అమెరికా వరకు అవకాశాలు

ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ నుంచి పట్టా అందుకుంటున్న తీర్థాల హేమనయని



మనుషులకు వైద్యం చేసే డాక్టర్లు మనుషులకు మాత్రమే చేస్తారు. కాని మేము భిన్న జంతు జీవాలకు వైద్యం చేస్తాం. కుక్క, పిల్లి, ఆవు, గేదె, గుర్రం, గొర్రె... ఒక్కోదానికి ఒక్కో రీతిన వైద్యం చేయాలి. నేడు పశువైద్యం చదివితే తెలుగు రాష్ట్రాల్లో ఉద్యోగ భద్రత ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో డిగ్రీలో వచ్చిన మార్కుల ఆధారంగా ప్రభుత్వ ఉద్యోగం వస్తుంది. లేదంటే కొద్దిపాటి పెట్టుబడితో పెట్ క్లినిక్ పెట్టుకుంటే మంచి ఉపాధి. ఆంధ్రప్రదేశ్ నుంచి అమెరికా వరకు ఎన్నో ఉపాధి అవకాశాలు వెటర్నరీ డాక్టర్లకు ఉండటం వల్ల, రిజర్వేషన్ ప్రయోజనం అదనంగా జతై నేడు ఎక్కువమంది అమ్మాయిలు పశు వైద్యం చదువుతున్నారు. నేను కూడా ఆ అవగాహనతోనే పొద్దుటూరు వెటర్నరీ కాలేజీలో బి.వి.ఎస్.సి చేశాను. నాకు 5 గోల్డ్ మెడల్స్, 1 సిల్వర్ మెడల్ రావడం చాలా సంతోషంగా ఉంది. మాది పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట మండలం కొండమంచిలి గ్రామం. నాన్న నా చిన్న వయస్సు నుంచే గల్ఫ్ దేశాలకు వెళ్లారు. నేను బాగా చదవడానికి మా అక్క, అమ్మ ముఖ్య కారకులు. అక్కయ్య సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని సైతం వదులుకొని నాకు అండగా ఉంటోంది. ఇంటర్ వరకు పాలకొల్లులో చదివాను. ఇంటర్ బై.పి.సిలో 987 మార్కులు సాధించి ప్రతిభా పురస్కారాన్ని అందుకున్నాను. జంతువుల పట్ల ప్రేమతో ఎలాగైనా వెటర్నరీ డాక్టర్ కావాలని ఎంసెట్ రాసి 1499 ర్యాంకును సాధించాను. ఎలాగైనా గోల్డ్ మెడల్ సాధించాలని తపన పడేదానిని. రోజుకు సుమారు 4 నుంచి 6 గంటలు చదివాను. సెలవురోజులలో కళాశాలలో ఉన్న లైబ్రరీలను, ల్యాబ్‌లను సందర్శించి ప్రాక్టికల్‌గా సబ్జెక్ట్‌ను అర్థం చేసుకుని చదివాను. కళాశాల అధ్యాపకుల ప్రోత్సాహం మరువలేనిది. ప్రస్తుతం వెటర్నరీ పీజీ చేయాలని ప్రవేశ పరీక్ష రాశాను. భవిష్యత్తులో పశువైద్య అధ్యాపకురాలుగా రాణించాలని ఉంది.

– తీర్థాల హేమనయని, బి.వి.ఎస్.సి, 5 బంగారు పతకాల గ్రహీత, కాలేజ్ ఆఫ్ వెటర్నరీ, ప్రొద్దుటూరు.

– పోగూరి చంద్రబాబు, రిపోర్టర్, సాక్షి, తిరుపతి; ఫోటోలు: కేతారి మోహనకృష్ణ

తాన్వీ హన్స్, శ్వేతా సుబ్బయ్య. ఒకరు ఫుట్ బాల్ క్రీడాకారిణి, మరొకరు ఫిట్‌నెస్ ట్రైనర్. ఈ ఇద్దరు ఏడేళ్ల క్రితం బెంగళూరులో మహిళల కోసం సరదాగా ఓ స్పోర్ట్స్ సెషన్‌ను ఏర్పాటు చేశారు. అది మొదలు ఇప్పుడు దేశం అంతటా మహిళల కోసం స్పోర్ట్స్ సెషన్‌లు, నెట్‌వర్కింగ్ ఈవెంట్‌లు నిర్వహిస్తున్నారు. ఇప్పుడు దాదాపు 5000 మందికి పైగా ఈ మహిళా నెట్‌వర్క్ ఉమెన్ స్పోర్ట్స్ కమ్యూనిటీని విస్తరించడానికి ట్రావెల్ గ్రూప్స్ ఏర్పాటు చేస్తుంటారు. 14 ఏళ్లలోపు అమ్మాయిల నుంచి అరవై ఏళ్లకు పైగా వయసున్న బామ్మలు కూడా వీరి గ్రూప్‌లో సభ్యులు. ఈ నెల నుంచి సెప్టెంబర్ వరకు మహిళల్లో క్రీడాస్ఫూర్తి నింపడానికి ఈవెంట్స్ నిర్వహిస్తున్నారు తాన్వి, శ్వేత.

మహిళల్లో క్రీడాస్ఫూర్తికి..


తాన్వి, శ్వేత

క్రీడల ద్వారా కనెక్ట్ అయిన మహిళల సంఘంగా తాన్వి, శ్వేతలు ఏర్పాటు చేసిన 'సిస్టర్స్ ఇన్ స్వెట్' గురించి చెప్పుకోవచ్చు. ప్రొఫెషనల్ ఫుట్‌బాల్ ప్లేయర్ అయిన తాన్వీ హన్స్ 2017లో ఢిల్లీ నుంచి బెంగళూరుకు వెళ్లింది. అక్కడ ఆమెకు శ్వేత సుబ్బయ్య పరిచయం అయ్యింది. తన ఫిట్‌నెస్ ఇన్‌స్ట్రక్టర్‌లలో శ్వేత ఒకరు. కొద్దిరోజుల్లోనే వారిద్దరి మధ్య మంచి స్నేహం కుదిరింది. ''ఒకసారి జరిగిన ఫ్రెండ్స్ పార్టీలో లేడీస్ అంతా 'మాకు కూడా క్రీడలు నేర్పించవచ్చు కదా! అని అడిగారు. దాంతో ఆ వీకెండ్‌లో ఒక గ్రౌండ్ బుక్ చేసి, కొంతమంది మహిళలను ఆహ్వానించాం. అదొక ఫన్ సెషన్ అనుకున్నాం. నలుగైదుగురు వస్తారు అనుకుంటే ఏకంగా 17 మంది మహిళలు వచ్చారు' అని నాటి రోజులను గుర్తుచేసుకుంటుంది తాన్వి.

సరదాగా మొదలై..

35 ఏళ్ల వయసున్న మహిళల కోసం గంటన్నర స్పోర్ట్స్ సెషన్‌ను మొదటిసారి ఏర్పాటు చేశారు. ఆ సమయంలో శ్వేత ఫిట్‌నెస్ ట్రైనర్‌గా... తాన్వి క్రీడల కోసం మహిళలు తమ శరీరాన్ని ఎలా సిద్ధం చేసుకోవాలో వివరించింది. అంతా సరదాగా జరిగిన ఈ కార్యక్రమం తర్వాత కొత్త ఆలోచనకు దారి వేసింది. 'ఆ మొదటి సెషన్ తర్వాత లేడీస్ మా వద్దకు వచ్చారు. ఈ ప్రోగ్రామ్ చాలా బాగుందని, ప్రతి వారాంతంలో తమకోసం ఓ సెషన్ ఏర్పాటు చేయాలని కోరారు. అలా ఈ కమ్యూనిటీ మొదలైంది' అని వివరిస్తుంది తాన్వీ. స్కూళ్లు, కాలేజీల తర్వాత క్రీడల నుండి తప్పుకుంటున్న మహిళల ఆలోచనల్లో తిరిగి స్పోర్ట్స్ పట్ల జీవం పోయడమే తమ ధ్యేయంగా చెబుతారు వీరు. ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, టచ్ రగ్బీతో సహా ఇతర స్పోర్ట్స్ ఫార్మాట్‌లతో ఈ గ్రూప్ రన్ అవుతోంది.

అన్ని వయసుల వారూ..

''2017లో మొదటి సెషన్ ప్రారంభమైనప్పుడు 35 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసున్న మహిళలు అని మాత్రమే అనుకున్నాం. ఆ తర్వాత సగటు వయసు 25 నుంచి 30కి చేర్చాం. కానీ, మాతో ఆడుకోవడానికి ఉత్సాహం చూపే 12–14 ఏళ్ల వయసున్న అమ్మాయిలు కూడా ఉన్నారు. అలాగే, 65 ఏళ్ల మహిళలు కూడా ఆసక్తి చూపారు. అలా చిన్న వయసు నుంచి సీనియర్ మహిళల వరకు అందరూ మా గ్రూప్‌లో ఉన్నారు. వీరితోపాటు పరిశ్రమల యజమానులు, తల్లులు, గృహిణులు, విద్యార్థులూ ఉన్నారు. కాలేజీల్లో ఆడుకోవడానికి విద్యార్థులకు అవకాశం ఉందని మొదట్లో మేం అనుకునేవాళ్లం. కానీ, అలాంటి వ్యవస్థ చాలా వరకు మన విద్యా సంస్థల్లో లేదని తెలిసింది. మొత్తమ్మీద వివిధ రకాల ప్రొఫైల్స్ మా వద్దకు చేరాయి. సాధారణంగా క్రీడలు అబ్బాయిలు, పురుషుల కోసమే అనే ఆలోచన మన సంస్కృతిలో పాతుకుపోయాయి. స్కూల్ స్థాయిలో మన దగ్గర కొన్ని విద్యా సంస్థలు అమ్మాయిలకు క్రీడల్లో అవకాశాలను ఇస్తాయి. కానీ, వారి ఎంపికలో చాలా వ్యత్యాసాలు ఉంటాయి. కాలేజీల్లోనూ ఇదే తేడా కనిపిస్తుంది. అందువల్లే, క్రీడల్లో పాల్గొనాలని ఉన్నా మహిళలు డ్రాప్‌ఔట్ అవుతుంటారు. వీటన్నింటినీ ఆలోచించి మేం ఈ ఏర్పాటు చేశాం' అని తాన్వి చెబుతుంది. 'మహిళలు ఇతర మహిళలతో ఆడుకోవడానికి మేం అవకాశాలు కల్పిస్తున్నాం. దీని వల్ల వారు సుఖంగా, సురక్షితంగా ఉంటారు. తమ కోసం మంచి సమయం గడుపుతారు' అంటుంది శ్వేత.

ఆడుకోవడానికి ఉత్సాహం చూపే 12-14 ఏళ్ల వయసున్న అమ్మాయిలు కూడా ఉన్నారు. అలాగే, 65 ఏళ్ల బామ్మలు కూడా ఆసక్తి చూపారు. అలా చిన్న వయసు నుంచి సీనియర్ మహిళల వరకు అందరూ మా గ్రూప్‌లో ఉన్నారు.

బెంగళూరులో ప్రతివారం ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, టచ్ రగ్బీ సెషన్స్ నిర్వహిస్తున్నారు ఈ టీమ్. అలాగే, ప్రతి ఆదివారం, మూడు నెలలకోసారి సైక్లింగ్ ఈవెంట్‌లను నిర్వహిస్తున్నారు. స్విమ్ సెషన్స్ కూడా నిర్వహిస్తూ తమ బృంద సభ్యులను మరింత ఉల్లాసపరుస్తున్నారు. ఇందుకోసం స్పెషల్‌గా తమలోనే కోచ్‌లను నియమించుకుంటున్నారు. ఆసక్తి ఉన్నవాళ్లు ఎవరైనా వీరి బృందంలో చేరవచ్చు. 'ఈ స్పోర్ట్స్ కమ్యూనిటీలో చేరడానికి మహిళలు ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. క్రీడల్లో పాల్గొనడానికి మాత్రం నామమాత్రపు రుసుము చెల్లించాలి' అని చెబుతున్నారు తాన్వీ, శ్వేత.

ప్రతి ఈవెంట్‌కు స్పాన్సర్లను వెతకడం, వాటి ద్వారా ఖర్చులు తగ్గించడం వల్ల క్రీడల్లో పాల్గొనే మహిళలు ఈ సెషన్స్‌లో సంతోషంగా పాల్గొంటున్నారని వివరిస్తున్నారు.

ఎంబ్రాయిడరీ ఎంపవర్‌మెంట్


షీలాపావెల్


తోడా ఆదివాసీ మహిళలు

తోడా ఆదివాసీలు... నీలగిరుల్లో ఉంటారు. వారి జీవనం ప్రకృతి ఒడిలో ప్రకృతితో మమేకమై సాగుతుంది. వారి చేతిలో రూపుదిద్దుకున్న ఎంబ్రాయిడరీ డిజైన్‌లు కూడా వారు నివసిస్తున్న ప్రకృతి సౌందర్యాన్ని ప్రతిబింబిస్తాయి. పూలు, లతలు, పౌరాణిక గాథలు కుట్టులో రూపుదిద్దుకుంటాయి. తెల్లటి వస్త్రం, గోధుమ వర్ణంలోని వస్త్రం మీద నల్లటి దారాలతో ఈ ఎంబ్రాయిడరీ చేస్తారు. సాధారణంగా ఎంబ్రాయిడరీ చేస్తే ఒక వైపు చక్కటి డిజైన్ కనిపిస్తే వెనుక వైపు దారాల ముడులుంటాయి. తోడా ఆదివాసీలు చేసే ఎంబ్రాయిడరీలో రెండు వైపులా డిజైన్ అందంగా కనిపిస్తుంది. ఇలాంటి అందమైన పనితనం కొండలకే పరిమితమైపోతే ఎలాగ అనుకున్నారు షీలాపావెల్. నీలగిరుల్లో తోడా ఆదివాసీలు నివసించే కుగ్రామాలన్నింటిలో పర్యటించారామె. వారిని స్వయం సహాయక బృందంగా సంఘటితపరిచారు. 'షాలోమ్ ఊటీ' పేరుతో తోడా ఆదివాసీ మహిళలను ఒక వేదిక మీదకు తీసుకువచ్చారు షీలా పావెల్. ఇప్పుడు తోడా ఆదివాసీ మహిళలు వారానికి ఐదు వందల నుంచి ఐదు వేల రూపాయలు సంపాదించుకోగలుగుతున్నారు. 'వారి చేతిలో ఉన్న కళ గొప్పతనం వారికి తెలియజేశాను, ఆ కళను ప్రపంచానికి పరిచయం చేశాను' అన్నారు షీలా పావెల్.


ఎంబ్రాయిడరీ చేస్తున్న ఆదివాసీ మహిళ

సాధికారత కుట్టారు

షీలా పావెల్ వయసు 59. తమిళనాడులోని ఊటీలో నివసిస్తారు. ఆమె 2005లో షాలోమ్ ఊటీ స్వయం సహాయక బృందాన్ని ప్రారంభించారు. అప్పుడు 250 మందితో మొదలైన బృందంలో ఇప్పుడు 150 మంది చురుగ్గా ఉన్నారు. అప్పటి సంగతులను తెలియచేస్తూ ''తోడా ఆదివాసీ మహిళల చేతిలో ఏం నైపుణ్యం ఉందో తెలియదు. అందమైన ఎంబ్రాయిడరీతో చక్కటి శాలువాలు వాళ్ల చేతిలో రూపుదిద్దుకోవాల్సిందే. ఈ మహిళలు తాము ఎంబ్రాయిడరీ చేసిన శాలువాలను సమీపంలోని ఊటీ పట్టణానికి తెచ్చి అమ్ముకునేవారు. ఊటీలో దుకాణాల వాళ్లు తక్కువ ధరకు కొని వాటిని పర్యాటకులకు మంచి ధరకు అమ్ముకునేవారు. ఈ మహిళలకు మరొక ప్రపంచం తెలియకపోవడంతో ఆ వచ్చిన డబ్బుతో సంతృప్తి పడేవారు. వారిని సంఘంగా ఏర్పరిచి, వారు తయారు చేసిన శాలువాలు, కీ చైన్‌లు, మఫ్లర్‌లు, పర్సులు వంటి వాటిని తమ బృందం పేరుతో లేబుల్ అతికించి అమ్మడం మొదలు పెట్టారు. వ్యవస్థీకృతంగా లేని పనిని, కళ చేతిలో ఉన్న వారిని వ్యవస్థీకృతం చేయడమే నేను చేసింది. అప్పట్లో షాల్ కోసం వాళ్లు తీసుకునే క్లాత్‌కంటే కొంచెం మెరుగైన క్లాత్ కొని ఇవ్వడం, మార్కెటింగ్ మెళకువలు నేర్పించడం వంటివి చేశాను. గతంలో ఐదు వందలకు అమ్మిన శాలువాలను ఇప్పుడు వెయ్యి రూపాయలకు అమ్మగలుగుతున్నారు. నా కళ్లముందే వారి జీవన స్థాయులు పెరిగాయి. నేను కోరుకున్న లక్ష్యాలు రెండూ నెరవేరాయి. వీరి కళ విలువ వీరికి తెలిసింది, వీరి కళ గురించి బయటి ప్రపంచానికి తెలిసింది. క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాతో అనుసంధానం చేయగలిగాను. తోడా ఎంబ్రాయిడరీ వస్తువులు చెన్నై, బెంగళూరు, ముంబయి, హైదరాబాద్‌లో కూడా లభిస్తున్నాయిప్పుడు.

కళ కొనసాగాలి

ఈ కళ ఎదుర్కొంటున్న మరో చాలెంజ్ ఏమిటంటే... కొత్తతరం ఈ ఎంబ్రాయిడరీ నేర్చుకోవడం లేదు. చదువుకుని ఉద్యోగాలకు వెళ్లడం మంచి పరిణామమే. కానీ ఈ కళను కూడా నేర్చుకోవచ్చు కదా అనిపిస్తుంది. తోడా ఆదివాసీల జనాభా పదమూడు వందలుంటే అందులో ఏడు వందల వరకు మహిళలున్నారు. డెబ్బై ఏళ్ల వాళ్లతో కలుపుకుంటే ఈ ఎంబ్రాయిడరీ వచ్చిన వాళ్లు మూడు వందల లోపే ఉన్నారిప్పుడు. ఇతరులకు నేర్పించే ఆలోచనలో ఉన్నాను'' అని తెలియ చేశారు షీలా పావెల్.

యూత్ పల్స్

నేస్తమా పుస్తకం విందామా!



పుస్తకం హస్తభూషణం అన్నారు. చేతిలో ఉండాల్సిన పుస్తకం 'ఆడియో బుక్స్' రూపంలో చెవికి చేరువవుతోంది. వ్యక్తిత్వ వికాసం నుంచి కాల్పనిక సాహిత్యం వరకు పుస్తకాలను 'ఆడియో బుక్స్' రూపంలో వినడానికి యూత్ ఆసక్తి ప్రదర్శిస్తోంది...

పుస్తకాలు బాగా చదివే అలవాటు ఉన్న బెంగళూరుకు చెందిన విరజ, పుస్తకాల విలువ గురించి తెలుసుకొని వాటిపై ప్రేమ పెంచుకున్న భోపాల్‌కు చెందిన చైత్రకు పుస్తకాలకు చేరువ కావడానికి ఒకప్పుడు టైమ్ దొరికేది కాదు. ఇప్పుడు మాత్రం వీరిద్దరికి మాత్రమే కాదు యువతరంలోని ఎంతోమందికి పుస్తకాలు దగ్గర కావడానికి 'టైమ్' అనేది సమస్య కావడం లేదు. దీనికి కారణం... ఆడియో బుక్స్.

మిలీనియల్స్, జెన్‌జెడ్ జెనరేషన్‌కు 'ఆడియో బుక్స్' హాట్ ఫేవరెట్‌గా మారాయి.

'ఒక పుస్తకం చదవడానికి రకరకాల కారణాల వల్ల నెల రోజులు పట్టిన సందర్భాలు ఉన్నాయి. అయితే ఆడియో బుక్స్ వారానికి ఒకటి వినగలుగుతున్నాను. వినడం పూర్తయిన వెంటనే ఆ పుస్తకానికి సంబంధించిన నోట్స్ రాసుకుంటాను' అంటుంది విరజ.

గూగుల్ ప్లేలో ఆడియో బుక్స్ సెక్షన్ ప్రారంభమైన కొత్తలో యువత అంత దగ్గర కాలేదు. అయితే ఇప్పుడు దృశ్యం మారింది. వారి ప్రధానమైన ఆసక్తులలో 'గూగుల్ ఆడియో బుక్స్' కూడా ఒకటి.

గూగుల్ ప్లేలో డబ్బు చెల్లించే ఆడియో బుక్స్‌తో పాటు చెల్లించనవసరం లేనివి కూడా ఉన్నాయి.

'ఓకే గూగుల్, హూ ఈజ్ అథర్?' 'ఓకే గూగుల్, స్టాప్ ప్లేయింగ్ ఇన్ 20 మినిట్స్'...ఇలాంటి కమాండ్స్ గూగుల్ అసిస్టెంట్‌కు ఇవ్వవచ్చు.

గ్లోబల్ ఆడియో బుక్స్ మార్కెట్ లీడర్‌గా ఉన్న 'ఆడిబుల్' ఇండియన్ మార్కెట్‌లోకి ప్రవేశించిన తరువాత ఆడియో బుక్స్‌కు ఊపు వచ్చింది. రకరకాల వయసుల వారిని దృష్టిలో పెట్టుకొని 'ఆడిబుల్ ఇండియా'లో వేలాది ఆడియో బుక్స్‌ను రొమాన్స్, థ్రిల్లర్, ఆధ్యాత్మికం, హారర్, డ్రామా జానర్‌లలో తీసుకువచ్చారు.

ఇంగ్లిష్‌తో సహా హిందీ, మరాఠీ, ఉర్దూ, బెంగాలీ... మొదలైన భాషలలో ఆడియో బుక్స్ ఉన్నాయి.

'ఆడియో బుక్స్ సక్సెస్ కావడానికి కారణం మన మూలాల్లోనే ఉంది. చిన్నప్పుడు కథలను వినేవాళ్లం' అంటుంది ముంబైకి చెందిన స్మిత.

ఒక పుస్తకం విజయాన్ని అంచనా వేసే ప్రమాణాలలో ఆడియో బుక్స్ కూడా చేరాయి. మాతృభాషలో పుస్తకాలు చదవడానికి ఇబ్బంది పడే యువతరానికి ఆడియో బుక్స్ ఆత్మీయనేస్తాలయ్యాయి.

'పాడ్‌కాస్ట్‌తో పాటు ఆడియో బుక్స్‌కు ఆదరణ పెరిగింది' అంటున్నాడు 'వన్ బై టు' మీడియా కో–ఫౌండర్ రాజేష్ తాహిల్.

ఫిక్షన్, రొమాన్స్ జానర్స్ కోసం యాపిల్ బుక్ 'మాడిసన్' 'జాక్సన్' 'హెలెన్' అనే డిజిటల్ నేరేటర్‌లను క్రియేట్ చేసింది.

యూఎస్, యూరోపియన్ దేశాలలో పబ్లిషర్స్‌కు ఆడియో కంటెంట్ క్రియేట్ చేయడానికి సొంతంగా స్టూడియోలు ఉన్నాయి. మన దేశంలో అలాంటి పరిస్థితి వచ్చినట్లు లేదు. ఒక ఆడియో బుక్‌కు కనీసం లక్ష రూపాయలు ఖర్చు అవుతుందని అంచనా.

'స్పాటిఫై' అనగానే గుర్తుకు వచ్చేది సంగీతం. ఆడియో బుక్స్ ఆదరణను పసిగట్టిన ఈ డిజిటల్ మ్యూజిక్ సర్వీస్ యూఎస్‌తో పాటు నాలుగు దేశాల్లో ఆడియో బుక్ ఫీచర్‌ని ప్రవేశపెట్టింది. మూడు లక్షల ఆడియో బుక్స్‌ను తీసుకువచ్చిన 'స్పాటిఫై' యూజర్‌ల కోసం 'ఆడియో కామెంట్' తీసుకురానుంది.

ఆడియో బుక్ ఇండస్ట్రీ ఊపందుకోవడాన్ని గమనించిన పబ్లిషర్‌లు రానున్న రోజుల్లో ఆడియో బుక్స్ స్పేస్‌ను పెంచాలనుకుంటున్నారు. క్లాసిక్స్‌పై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు.

'గతంతో పోల్చితే ఆడియో బుక్స్ వినడానికి వెచ్చిస్తున్న టైమ్ పెరిగింది' అంటున్నాడు 'స్టోరీ టెల్ ఇండియా' కంట్రీ మేనేజర్ యోగేష్ దశరథ్.

ఆడియో బుక్స్ యూత్‌ను ఆకట్టుకోవడానికి ప్రధాన కారణం ప్రయాణాలలో, బారెడు క్యూలలో నిలబడిన సందర్భాలలో కూడా వాటిని వినే అవకాశం ఉండడం. కొందరైతే వ్యాయామాలు చేస్తూ కూడా ఆడియో బుక్స్ వింటున్నారు.

'ఆడియో బుక్స్ వల్ల పుస్తకం చదివే దృశ్యం అదృశ్యం కానుందా?' అనే ప్రశ్నకు ఇంజనీరింగ్ స్టూడెంట్ సౌమ్య మాటల్లో జవాబు దొరుకుతుంది.

'పుస్తకం చదవడం అంటేనే నాకు ఇష్టం. అంతమాత్రాన ఆడియో బుక్స్‌కు దూరం కాలేదు. సమయ సందర్భాలను బట్టి చదవాలా, వినాలా అనేదాన్ని ఎంచుకుంటాను' అంటుంది సౌమ్య.

ఆడియో బుక్ రీడ్ బై సెలబ్రిటీ


సోహా అలీఖాన్

ఆడియో బుక్స్ విజయంలో పుస్తకంలోని కంటెంట్‌తో పాటు నేరేటర్ ప్రతిభ కూడా ఆధారపడి ఉంటుంది. వినే కొద్దీ వినాలనుకునే గొంతులు ఆడియో బుక్స్ విజయంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి.'ఆడియో బుక్ రీడ్‌బై సెలబ్రిటీస్' ధోరణి మన దేశంలోనూ పెరగనుంది. ఆడియో బుక్ రీడింగ్‌లో బాలీవుడ్ నటి సోహా అలీఖాన్ మంచి పేరు తెచ్చుకుంది. వుడీ ఎలెన్ 'కౌంట్ డ్రాకులా'తో పాటు ఎన్నో పుస్తకాలు ఆమె స్వరంలో యువత మంత్ర ముగ్ధులై విన్నారు.



సాకేత్ జోడీ శుభారంభం

అట్లాంటా ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీలో సాకేత్ మైనేని-యూకీ బాంబ్రీ (భారత్) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. అమెరికాలో జరుగుతున్న ఈ టోర్నీలో పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ సాకేత్, ఢిల్లీ ఆటగాడు యూకీ బాంబ్రీ ద్వయం 6-3, 6-4తో కెవిన్ కింగ్-ఆండ్రెస్ మార్టిన్ (అమెరికా) జంటపై గెలిచింది. 68 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సాకేత్, యూకీ ఒక ఏస్ సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేశారు.



పోరాడి ఓడిన అంకిత రైనా

వార్సా ఓపెన్ డబ్ల్యూటీఏ-250 టెన్నిస్ టోర్నీలో భారత నంబర్‌వన్ అంకిత రైనా పోరాటం ముగిసింది. పోలాండ్‌లో మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 200వ ర్యాంకర్ అంకిత రైనా 6-4, 4-6, 6-7 (4/7)తో ప్రపంచ 95వ ర్యాంకర్ జోడీ బరేజ్ (బ్రిటన్) చేతిలో ఓడిపోయింది. 2 గంటల 37 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ఇద్దరూ తమ సర్వీస్‌లో తడబడ్డారు. 12 సార్లు చొప్పున తమ సర్వీస్‌ను చేజార్చుకున్నారు. అంకితకు 2,930 డాలర్ల (రూ. 2 లక్షల 39 వేలు) ప్రైజ్‌మనీ దక్కింది.

హైదరాబాద్, వైజాగ్‌లో క్రికెట్ కిక్

భారత జట్ల టెస్టు, టి20 మ్యాచ్‌లు కేటాయింపు • స్వదేశంలో 2023-2024 సీజన్ షెడ్యూల్


ఉప్పల్ స్టేడియం


వైజాగ్ స్టేడియం

ముంబై: టీమిండియా సొంతగడ్డపై ఆడే షెడ్యూల్‌ను భారత్ క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) పర్యటనలు-టెక్నికల్ కమిటీ మంగళవారం ఖరారు చేసింది. వచ్చే 2023-24 సీజన్‌కు సంబంధించిన షెడ్యూల్‌లో మేటి జట్లయిన ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌లు ఉండటంతో క్రికెట్ కిక్ మరింత క్రేజీని పెంచనుందనడంలో అతిశయోక్తి లేదు. ఈ కొత్త సీజన్‌లో సొంతగడ్డపై టీమిండియా 16 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడుతుంది. ఇందులో 5 టెస్టులు, మూడు వన్డేలు, 8 టి20 మ్యాచ్‌లున్నాయి. ప్రతిష్టాత్మక వన్డే వరల్డ్‌కప్ భాగ్యానికి నోచుకోలేకపోయిన వేదికలకు ఈ సీజన్‌లో న్యాయం చేశారు. ఆయా రాష్ట్రాల క్రికెట్ ప్రియులకు గట్టి ప్రత్యర్థులతో వినోదాన్ని అందివ్వనున్నారు.

ఈ సీజన్ సంగతులివి...

కొత్త సీజన్ ఆస్ట్రేలియా జట్టు రాకతో మొదలవుతుంది. మెగా ఈవెంట్‌కు ముందు మూడు వన్డేల సిరీస్ ఆడుతుంది. మొహాలీ, ఇండోర్, రాజ్‌కోట్ 50 ఓవర్ల మ్యాచ్‌లకు వేదికలు కాగా... వన్డే ప్రపంచకప్ ముగిశాక ఐదు టి20ల ద్వైపాక్షిక టోర్నీ ఆడుతుంది. కొత్త ఏడాదిలో మూడు టి20లను అఫ్గానిస్తాన్‌తో ఆడుతుంది. ఇదయ్యాక వెంటనే ఇంగ్లండ్‌తో సమరానికి సిద్ధమవుతుంది. ఇరు జట్ల మధ్య జనవరి 25 నుంచి ఐదు టెస్టుల సిరీస్ మొదలవుతుంది.

ఇదీ... హైదరాబాద్, వైజాగ్ ముచ్చట

వచ్చే సీజన్ తెలుగు రాష్ట్రాల క్రికెట్ ప్రియుల్ని తెగ మురిపించనుంది. గట్టి ప్రత్యర్థి ఆసీస్‌తో ఐదు టి20ల సిరీస్ వైజాగ్‌లో మొదలైతే... హైదరాబాద్‌లో ముగుస్తుంది. ఈ నవంబర్ 23న వైజాగ్‌లోని వైఎస్ రాజశేఖరరెడ్డి క్రికెట్ స్టేడియంలో తొలి మ్యాచ్, డిసెంబర్ 3న హైదరాబాద్‌లో ఆఖరి మ్యాచ్ జరుగుతాయి. మళ్లీ కొత్త సంవత్సరం జనవరి 25-29 వరకు ఇంగ్లండ్‌తో తొలి టెస్టు హైదరాబాద్‌లో, ఫిబ్రవరి 2-6 వరకు రెండో టెస్టు వైజాగ్‌లోని వైఎస్ఆర్ స్టేడియంలో నిర్వహించనున్నారు.

స్వదేశంలో భారత జట్టు షెడ్యూల్		
ఆస్ట్రేలియా జట్టుతో మూడు వన్డేలు (2023)		
సెప్టెంబర్ 22	తొలి వన్డే	మొహాలి
సెప్టెంబర్ 24	రెండో వన్డే	ఇండోర్
సెప్టెంబర్ 27	మూడో వన్డే	రాజ్‌కోట్
ఆస్ట్రేలియా జట్టుతో ఐదు టి20లు (2023)		
నవంబర్ 23	తొలి టి20	వైజాగ్
నవంబర్ 26	రెండో టి20	త్రివేంద్రం
నవంబర్ 28	మూడో టి20	గువాహటి
డిసెంబర్ 1	నాలుగో టి20	నాగ్‌పూర్
డిసెంబర్ 3	ఐదో టి20	హైదరాబాద్
అఫ్గానిస్తాన్ జట్టుతో మూడు టి20లు (2024)		
జనవరి 11	తొలి టి20	మొహాలి
జనవరి 14	రెండో టి20	ఇండోర్
జనవరి 17	మూడో టి20	బెంగళూరు
ఇంగ్లండ్ జట్టుతో ఐదు టెస్టులు (2024)		
జనవరి 25-29	తొలి టెస్టు	హైదరాబాద్
ఫిబ్రవరి 2-6	రెండో టెస్టు	వైజాగ్
ఫిబ్రవరి 15-19	మూడో టెస్టు	రాజ్‌కోట్
ఫిబ్రవరి 23-27	నాలుగో టెస్టు	రాంచీ
మార్చి 7-11	ఐదో టెస్టు	ధర్మశాల

భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌పై

రెండు మ్యాచ్‌ల నిషేధం

బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో అనుచిత ప్రవర్తనపై ఐసీసీ చర్య



దుబాయ్: భారత మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌పై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) చర్య తీసుకుంది. మైదానంలోనూ, మైదానం బయట క్రీడాస్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరించడంతో పాటు అనుచిత ప్రవర్తనకు పాల్పడటంతో హర్మన్‌పై ఐసీసీ రెండు అంతర్జాతీయ మ్యాచ్‌ల నిషేధం విధించింది. దీని ప్రకారం ఈ ఏడాది జరిగే ఆసియా క్రీడల్లో భారత్ ఆడే తొలి రెండు మ్యాచ్‌లకు హర్మన్ దూరం కానుంది.

వివరాల్లోకెళితే... గత శనివారం మిర్పూర్‌లో భారత్, బంగ్లాదేశ్ మహిళల మధ్య మూడో వన్డే జరిగింది. 'టై'గా ముగిసిన ఈ మ్యాచ్‌లో వేర్వేరు సందర్భాల్లో హర్మన్ దురుసుగా వ్యవహరించింది. ముందుగా తనను అంపైర్ అవుట్‌గా ప్రకటించడంతో అసంతృప్తిని వ్యక్తం చేస్తూ తన బ్యాట్‌తో స్టంప్స్‌ను బలంగా కొట్టి పడేయడంతో పాటు వెళుతూ వెళుతూ అంపైర్‌ను చూస్తూ ఏవో వ్యాఖ్యలు చేసింది. దీనిపై మూడు డీమెరిట్ పాయింట్లు శిక్షగా విధించగా, మ్యాచ్ ముగిసిన తర్వాతా అంపైరింగ్ ప్రమాణాలు బాగా లేవంటూ విమర్శించింది. దీనిపై ఒక డీమెరిట్ పాయింట్ శిక్ష పడింది. అనంతరం వేదికపై బంగ్లాదేశ్ కెప్టెన్ నిగార్ సుల్తానాతో కలిసి ట్రోఫీ అందుకునే సమయంలో 'మ్యాచ్ టై చేసింది అంపైర్లే తప్ప మీరు కాదు. ఫొటో దిగేందుకు వాళ్లనూ రమ్మనండి' అంటూ బంగ్లాదేశ్ ఆటగాళ్లను ఉద్దేశించి చెప్పింది. దీనిపై సుల్తానా కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తూ కాస్త మర్యాద నేర్చుకోమంటూ సహచరులతో కలిసి వేదిక నుంచి దిగేసింది. 4 డీమెరిట్ పాయింట్లు అంటే 2 సస్పెన్షన్ పాయింట్లతో సమానం. దాంతో రెండు మ్యాచ్‌ల నిషేధం పడింది. దీంతోపాటు ఆమె మ్యాచ్ ఫీజులో కూడా 75 శాతం కోత పడింది. ఐసీసీ లెవల్-2 నిబంధన ప్రకారం నిషేధానికి గురైన తొలి మహిళా క్రికెటర్ హర్మన్ కావడం గమనార్హం.

కెరీర్ బెస్ట్ రెండో ర్యాంక్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ

న్యూఢిల్లీ: ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) పురుషుల డబుల్స్ ర్యాంకింగ్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) ద్వయం కెరీర్ బెస్ట్ ర్యాంక్‌కు చేరుకుంది. మంగళవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ మూడు నుంచి రెండో ర్యాంక్‌కు చేరుకుంది. వీరిద్దరి ఖాతాలో 87,211 పాయింట్లు ఉన్నాయి. 91,629 పాయింట్లతో ఫజర్ అల్ఫియాన్-అర్దియాంతో (ఇండోనేసియా) ద్వయం టాప్ ర్యాంక్‌లో కొనసాగుతోంది. గతవారం సాత్విక్-చిరాగ్ జోడీ కొరియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీలో డబుల్స్ టైటిల్ గెలిచింది. ప్రస్తుతం జపాన్ ఓపెన్ టోర్నీలో ఈ జంట పోటీపడుతోంది.



ఖండాంతరాలను చుట్టొచ్చే పారిస్ ఒలింపిక్స్ టార్చ్ ఇదే



పారిస్: వచ్చే ఏడాది పారిస్ ఆతిథ్యమిచ్చే ఒలింపిక్స్ క్రీడలకు ముందు ఖండాంతరాలను చుట్టొచ్చే జ్యోతి (టార్చ్)ని మంగళవారం ఆవిష్కరించారు. 70 సెంటిమీటర్ల పొడవున్న ఈ సొగసైన మెరిసే టార్చ్ బరువు కేజిన్నర. తళతళ మెరిసే స్టెయిన్‌లెస్ స్టీల్‌తో దీన్ని డిజైన్ చేశారు. వచ్చే ఏడాది మే 8న ఒలింపిక్స్ జ్యోతి రిలే ప్రారంభవుతుంది. ప్రపంచవ్యాప్తంగా సుమారు పది వేల మంది టార్చ్‌ను పట్టుకొని పరుగులు తీయనున్నారు.

కేసీ పెయిర్ ఘనత



సిడ్నీ: ప్రపంచకప్ ఫుట్‌బాల్ టోర్నీల్లో మ్యాచ్ ఆడిన అతి పిన్న వయస్కురాలిగా దక్షిణ కొరియా అమ్మాయి కేసీ పెయిర్ (16 ఏళ్ల 26 రోజులు) రికార్డు సృష్టించింది. కొలంబియాతో మంగళవారం జరిగిన మహిళల ప్రపంచకప్ మ్యాచ్‌లో కేసీ పెయిర్ కొరియా తరఫున 78వ నిమిషంలో బరిలోకి దిగింది. గతంలో ఈ రికార్డు ఐఫెనీ చిజ్నీ (నైజీరియా; 16 ఏళ్ల 34 రోజులు; 1999 ప్రపంచకప్‌లో) పేరిట ఉంది.

పాకిస్తాన్‌కు ఆధిక్యం

కొలంబో: శ్రీలంక, పాకిస్తాన్ జట్ల మధ్య రెండో టెస్టులో రెండో రోజు 10 ఓవర్ల ఆట సాధ్యపడింది. ఈ పది ఓవర్లలో పాక్ 33 పరుగులు చేసింది. వర్షంతో ఆట నిలిచే సమయానికి పాక్ తొలి ఇన్నింగ్స్‌లో 38.3 ఓవర్లలో 2 వికెట్లకు 178 పరుగులు చేసి 12 పరుగుల ఆధిక్యాన్ని సంపాదించింది.

సంచలనాలతో బోణీ...

ప్రిక్వార్టర్ ఫైనల్లో శ్రీకాంత్, ప్రణయ్


ప్రణయ్

టోక్యో: జపాన్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నీలో తొలి రోజు భారత అగ్రశ్రేణి క్రీడాకారులు అదరగొట్టే ప్రదర్శన చేశారు. పురుషుల సింగిల్స్‌లో హెచ్ఎస్ ప్రణయ్, కిడాంబి శ్రీకాంత్ తమకంటే మెరుగైన ర్యాంక్ ఉన్న ఆటగాళ్లను బోల్తా కొట్టించి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. మంగళవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో ప్రపంచ పదో ర్యాంకర్ ప్రణయ్ 21-17, 21-13తో ప్రపంచ ఆరో ర్యాంకర్, ఈ ఏడాది ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ చాంపియన్ లీ షి ఫెంగ్ (చైనా)పై... ప్రపంచ 20వ ర్యాంకర్ శ్రీకాంత్ 21-13, 21-13తో ప్రపంచ ఎనిమిదో ర్యాంకర్ చౌ తియెన్ చెన్ (చైనీస్ తైపీ)పై సంచలన విజయాలు సాధించారు. లీ షి ఫెంగ్‌పై ప్రణయ్‌కిది వరుసగా మూడో విజయంకాగా... చౌ తియెన్ చెన్‌పై శ్రీకాంత్‌కిది రెండో గెలుపు. 2014లో హాంకాంగ్ ఓపెన్‌లో చౌ తియెన్ చెన్‌ను తొలిసారి ఓడించిన శ్రీకాంత్ ఆ తర్వాత ఈ చైనీస్ తైపీ ప్లేయర్‌తో ఆడిన ఆరుసార్లు ఓటమి చవిచూశాడు. మహిళల సింగిల్స్‌లో భారత రైజింగ్ స్టార్ ఆకర్షి కశ్యప్ పోరాటం తొలి రౌండ్‌లోనే ముగిసింది. ప్రపంచ నంబర్‌వన్ అకానె యామగుచి (జపాన్)తో జరిగిన మ్యాచ్‌లో ఆకర్షి 17-21, 17-21తో ఓడిపోయింది.

మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ (భారత్) జోడీ 11-21, 21-15, 21-14తో సయాకా హొబారా-యు సుజు (జపాన్) జంటను ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరింది. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో సిక్కి రెడ్డి-రోహన్ కపూర్ (భారత్) జోడీ 21-18, 9-21, 18-21తో యె హాంగ్ వె-లీ చియా సిన్ (చైనీస్ తైపీ) ద్వయం చేతిలో ఓడిపోయింది.


శ్రీకాంత్

సినిమా

తారా తీరం



గోవా... కంగువా

ఇటీవల విడుదలైన 'కంగువా' సినిమా గ్లింప్స్ వీడియోను బట్టి ఈ చిత్రం చారిత్రాత్మక నేపథ్యంతో సాగుతుందని ఊహించవచ్చు. కానీ కథ పరంగా ఈ చారిత్రాత్మక నేపథ్యం సినిమాలో కొంత భాగం వరకే ఉంటుందని, ఈ సినిమా కథ ప్రధానంగా తీర ప్రాంతమైన గోవా నేపథ్యంలో ఉంటుందనే వార్తలు వినిపిస్తున్నాయి. గత ఏడాది సెప్టెంబరు, అక్టోబరులో 'కంగువా' సినిమా గోవాలో ఓ భారీ షెడ్యూల్ చిత్రీకరణను పూర్తి చేసుకున్న సంగతి గుర్తుండే ఉంటుంది. ఇక సూర్య, దిశా పటానీ హీరో హీరోయిన్లుగా శివ దర్శకత్వంలో 'కంగువా' సినిమా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. యూవీ క్రియేషన్స్‌తో కలిసి స్టూడియో గ్రీన్ జ్ఞానవేల్ రాజా ఈ సినిమా నిర్మిస్తున్నారు. 'కంగువా' రెండు భాగాలుగా రిలీజ్ కానుంది, తొలి భాగం తమిళ సంవత్సరాదికి ఏప్రిల్ 12న విడుదల కానుందనే టాక్ వినిపిస్తోంది.


విజయ్ దేవరకొండ

జటాయు?

హీరో విజయ్ దేవరకొండ వరుస సినిమాలతో దూసుకెళుతున్నారు. ఇప్పటికే మూడు ప్రాజెక్ట్‌తో బిజీగా ఉన్న ఆయన తాజాగా ఇంద్రగంటి మోహనకృష్ణ దర్శకత్వంలో ఓ సినిమాకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు వార్తలు వస్తున్నాయి. శివ నిర్వాణ దర్శకత్వంలో విజయ్ దేవరకొండ నటిస్తున్న తాజా చిత్రం 'ఖుషి'. ఈ సినిమా సెప్టెంబర్ 1న విడుదలకు సిద్ధమవుతుండగానే గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో 'వీడీ 12'(వర్కింగ్ టైటిల్), పరశురామ్ డైరెక్షన్‌లో 'వీడీ 13' (వర్కింగ్ టైటిల్) సినిమాలకు కొబ్బరికాయ కొట్టారు విజయ్. తాజాగా ఇంద్రగంటి-విజయ్‌ల కాంబినేషన్‌లో ఓ సినిమా రానుందంటూ వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత 'దిల్' రాజు పాన్ ఇండియా స్థాయిలో నిర్మిస్తారని టాక్. ఈ మూవీకి 'జటాయు' అనే టైటిల్‌ని పరిశీలిస్తోందట చిత్రబృందం. ఈ సినిమాలో విజువల్ ఎఫెక్ట్స్ భారీగా ఉంటాయని, ప్రీ ప్రొడక్షన్ పనులు కూడా ప్రారంభమయ్యాయని భోగట్టా. కాగా 'గీత గోవిందం' వంటి హిట్ తర్వాత విజయ్ దేవరకొండ - పరశురామ్ కాంబినేషన్‌లో ప్రారంభమైన 'వీడీ 13' చిత్రాన్ని 'దిల్' రాజు నిర్మిస్తున్నారు. ఈ సినిమా పూర్తయిన వెంటనే విజయ్-ఇంద్రగంటి కాంబినేషన్ చిత్రాన్ని ఆరంభించాలనుకుంటున్నారట 'దిల్' రాజు.

ధనుష్‌తో జోడీ?

తెలుగు, తమిళ, కన్నడ, హిందీ చిత్రాలతో జోరు మీదున్నారు హీరోయిన్ రష్మికా మందన్న. వరుస చాన్స్‌లు అందుకుంటున్న ఈ బ్యూటీ తాజాగా హీరో ధనుష్‌కి జోడీగా నటించనున్నారని టాక్. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ధనుష్ హీరోగా తెలుగు, తమిళ, హిందీ భాషల్లో గత ఏడాది నవంబరులో ఓ సినిమాకి శ్రీకారం జరిగిన సంగతి తెలిసిందే. సోనాలి నారంగ్ సమర్పణలో సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఈ చిత్రంలో ధనుష్ సరసన రష్మికా మందన్న నటించే చాన్స్ ఉందట. ఈ మేరకు చిత్ర యూనిట్ ఆమెతో చర్చలు జరుపుతోందని టాక్. ఇదే సినిమాలో హీరో నాగార్జున ఓ కీలక పాత్ర చేయనున్నారనే వార్తలు వస్తున్నాయి. ఇక ప్రస్తుతం రష్మిక తెలుగులో 'పుష్ప 2', రెయిన్ బో' చిత్రాలతో పాటు హిందీలో 'యానిమల్' మూవీ చేస్తున్నారు.


రష్మికా మందన్న

గేమ్ స్టార్ట్

సముద్రతీర ప్రాంతాల్లో కబడ్డీ ఆడనున్నారట హీరో రామ్‌చరణ్. తొలి చిత్రం 'ఉప్పెన'తో దర్శకుడిగా ప్రేక్షకుల మెప్పు పొందిన బుచ్చిబాబు సన దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. వెంకట్ సతీష్ కిలారు ఈ సినిమాను నిర్మించనున్నారు. ఇది స్పోర్ట్స్ డ్రామా అని సమాచారం. అలాగే ఈ సినిమా కథ 'ఉప్పెన' తరహాలో మత్స్యకారుల నేపథ్యంలో సాగుతుందట. అందుకే వైజాగ్, కాకినాడ వంటి లొకేషన్స్‌లో ఈ సినిమా మేజర్ షూటింగ్‌ని జరిపేలా చిత్ర యూనిట్ ప్లాన్ చేస్తోందనే టాక్ వినిపిస్తోంది. అంతే కాదు.. కథ రీత్యా ఈ సినిమాలో రామ్‌చరణ్ అన్నదమ్ములుగా ద్విపాత్రాభినయం చేయనున్నారని, ఈ అన్నదమ్ముల్లో ఓ పాత్ర దివ్యాంగుడని భోగట్టా. ఇక ఈ సినిమాలో హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్, రష్మికా మందన్న, జాన్వీ కపూర్ వంటి వార్ల పేర్లు తెర పైకి వచ్చాయి. వచ్చే ఏడాది ప్రారంభంలో ఈ సినిమా షూటింగ్ ఆరంభమయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.

తీర ప్రాంత దేవర

'జనతా గ్యారేజ్' వంటి హిట్ తర్వాత హీరో ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో 'దేవర' చిత్రం తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఇందులో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రకథ సముద్ర తీర ప్రాంతం నేపథ్యంలో ఉంటుందని ఈ సినిమా ప్రారంభోత్సవంలో కొరటాల శివ వెల్లడించిన సంగతి గుర్తుండే ఉంటుంది. దేశంలో విస్మరణకు గురైన సముద్ర తీర ప్రాంతంవారి నేపథ్యంలో ఈ సినిమా సాగుతుందట. ఇందులో తండ్రీకొడుకులుగా ఎన్టీఆర్ ద్విపాత్రాభినయం చేస్తున్నారని, ఫ్లాష్‌బ్యాక్‌లో వచ్చే ఎన్టీఆర్ సీన్స్ సినిమాకు ప్రధాన హైలైట్‌గా ఉంటాయని టాక్. అలాగే 'దేవర' సినిమాకు సంబంధించిన ఓ షూటింగ్ షెడ్యూల్ గోవాలో జరగనుందని తెలిసింది. కాగా ఈ సినిమా ఆరంభం అయిన దగ్గర్నుంచి ఎక్కువగా యాక్షన్ సన్నివేశాలనే చిత్రీకరిస్తున్నారు. స్టంట్ కొరియోగ్రాఫర్స్ కెన్నీ బెట్స్, సాల్మోన్, పీటర్ హెయిన్స్ కొన్ని యాక్షన్ సీక్వెన్స్‌లను డిజైన్ చేశారు. ఈ సన్నివేశాలను ఎక్కువగా సెట్స్‌లోనే తీశారు. అయితే మేజర్ యాక్షన్ సీన్స్‌ను తీసిన తర్వాత టాకీ, సాంగ్స్‌పై ఫోకస్ పెడతారట. కల్యాణ్ రామ్, కె. హరికృష్ణ, మిక్కిలినేని సుధాకర్ నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది ఏప్రిల్ 5న విడుదల కానుంది.

ప్రేమ తీరం

ప్రేమ తీరం చేరేందుకు సముద్రంలో బోటు డ్రైవర్‌గా ప్రయాణం చేయనున్నారట నాగచైతన్య. లవ్‌స్టోరీస్ సినిమాల్లో ఆడియన్స్‌ను ఎక్కువగా అలరిస్తుంటారు నాగ చైతన్య. 'ఏ మాయ చేసావె', 'ప్రేమమ్' వంటి ప్రేమ కథా చిత్రాలతో ఇప్పటికే ఈ విషయాన్ని నాగచైతన్య నిరూపించుకున్నారు. కాగా దర్శకుడు చందు మొండేటి ఇటీవల నాగచైతన్యకు ఓ ప్రేమకథ వినిపించారని, ఇందులో బోటు డ్రైవర్ అయిన మత్స్యకారుడి పాత్రలో నాగ చైతన్య నటిస్తారనీ ప్రచారం జరుగుతోంది. సూరత్‌లో జరిగిన ఓ వాస్తవ ఘటన ఆధారంగా ఈ సినిమా కథ ఉంటుందనే టాక్ కూడా వినిపిస్తోంది. నాగచైతన్య కెరీర్‌లోనే భారీ బడ్జెట్‌తో గీతా ఆర్ట్స్ సంస్థ ఈ సినిమాను నిర్మించనుందని, ఇందులో కీర్తి సురేష్ హీరోయిన్‌గా నటిస్తారనే ప్రచారం జరుగుతోన్న సంగతి తెలిసిందే. త్వరలోనే ఈ సినిమా గురించి అధికారిక ప్రకటన రానుందని ఫిల్మ్‌నగర్ భోగట్టా.

రీల్స్

సుమన్‌కి నటకేసరి




శతాధిక చిత్ర దర్శకులు దివంగత కోడి రామకృష్ణ జయంతి వేడుకలు వాసవి ఫిల్మ్ అవార్డ్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగాయి. తెలుగు రాష్ట్రాల్లోని సామాజిక సేవా తత్పరులు, ప్రతిభావంతులకు ఈ పురస్కారాలు అందించారు. నటుడు సుమన్‌కి 'నట కేసరి' బిరుదు ప్రదానం చేశారు. ''కోడి రామకృష్ణగారి పేరు చిరస్థాయిగా నిలిచేలా చేయడమే ఈ పురస్కారాల ముఖ్యోద్దేశం'' అన్నారు నిర్వాహకులు టి. రామ సత్యనారాయణ, వీబీజీ రాజు, కొత్త వెంకటేశ్వరరావు. దర్శకులు కార్తీక్ వర్మ దండు, రామ్ అబ్బరాజు, వెంకట్ పెదిరెడ్ల, రచయిత భాను తదితరులు పురస్కారాలు అందుకున్నారు. కోడి రామకృష్ణ కుమార్తె, నిర్మాత కోడి దివ్య పాల్గొన్నారు.

నవ్వు.. ఎమోషన్...


సంజయ్ రావు


సంజయ్ రావు, ప్రణవి మానుకొండ జంటగా నటించిన చిత్రం 'స్లమ్ డాగ్ హజ్బెండ్'. ఏఆర్ శ్రీధర్ దర్శకత్వంలో అప్పిరెడ్డి, వెంకట్ అన్నపరెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 29న విడుదల కానుంది. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో సంజయ్ రావు మాట్లాడుతూ– ''ఏఆర్ శ్రీధర్ ఈ సినిమా కథ చెబుతున్నప్పుడు నాన్నగారు (నటుడు బ్రహ్మాజీ) కూడా బాగా నవ్వుకున్నారు. మంచి కామెడీ ఫిల్మ్. క్లైమాక్స్‌లో ఎమోషనల్ సీన్స్ ఉన్నాయి. ఇక ఓ యాక్టర్‌గా పరిణితి చెందాలనే గ్యాప్ తీసుకున్నాను. 'పిట్టకథ'కు దర్శకత్వ విభాగంలో చేసిన సాయికృష్ణతో ఓ సినిమా చేస్తున్నాను. తమిళంలో శింబు హీరోగా చేయనున్న సినిమాలో నేను నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్ర చేసే చాన్స్ ఉంది'' అన్నారు.

చనువుగా చూసిన...


విరాట్ కర్ణ, ప్రగతి

విరాట్ కర్ణ, ప్రగతి శ్రీవాస్తవ జంటగా శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'పెదకాపు-1'. మిర్యాల రవీందర్ రెడ్డి ఈ సినిమా నిర్మిస్తున్నారు. శ్రీకాంత్ అడ్డాల గత చిత్రాలకు సంగీతం అందించిన మిక్కీ జె. మేయర్ ఈ చిత్రానికి కూడా సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రంలోని 'చనువుగా చూసిన...' అంటూ సాగే పాట ప్రోమోను విడుదల చేశారు మేకర్స్. ''పొలిటికల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న చిత్రం 'పెదకాపు-1'. అణచివేత, ఘర్షణల నేపథ్యంలో కథ సాగుతుంది'' అని చిత్ర బృందం పేర్కొంది.

తారకాసుర 2 షురూ


విజయ్, జైపాల్ ముదిరాజ్

కన్నడలో హిట్‌గా నిలిచిన 'తారకాసుర' చిత్రానికి సీక్వెల్‌గా తెలుగులో 'తారకాసుర 2' ఆరంభమైంది. విజయ్ భాస్కర్ రెడ్డి పాల్యం లీడ్ రోల్‌లో నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. తొలి సీన్‌కి పటాన్ చెరువు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి కెమెరా స్విచ్ఛాన్ చేయగా, జైపాల్ ముదిరాజ్ క్లాప్ కొట్టారు. పటాన్ చెరువు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ గౌరవ దర్శకత్వం వహించారు. ''తారకాసుర'ని అదే పేరుతో తెలుగులో రిలీజ్ చేయనున్నాం'' అన్నారు విజయ్ భాస్కర్ రెడ్డి.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▼	29	66,356
నిఫ్టీ ▲	8	19,681

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	14,173	▲	114
డోజోన్స్	35,449	▲	88
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,692	▲	13
డాక్స్	16,212	▲	21
షాంఘై	3,232	▲	67
నికాయ్	32,683	▲	18

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారట్)	59,143	▽	291
బంగారం (22 క్యారట్)	58,906	▽	290
వెండి (కిలో)	73,939	▽	251

లాభాల్లోకి టాటా మోటార్స్

- క్యూ1లో ఆర్జన రూ. 3,301 కోట్లు
- రూ. 1,01,528 కోట్లకు ఆదాయం



న్యూఢిల్లీ: ఆటో రంగ దేశీ దిగ్గజం టాటా మోటార్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి త్రైమాసికంలో టర్న్‌అరౌండ్ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో రూ. 3,301 కోట్ల నికర లాభం ఆర్జించింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 4,951 కోట్ల నికర నష్టం ప్రకటించింది. లగ్జరీకార్ల బ్రిటిష్ అనుబంధ సంస్థ జాగ్వార్ ల్యాండ్‌రోవర్(జేఎల్ఆర్)తోపాటు వాణిజ్య వాహన బిజినెస్ పుంజుకోవడం కంపెనీ పటిష్ట పనితీరుకు దోహదపడ్డాయి. ఇక మొత్తం ఆదాయం సైతం రూ. 71,228 కోట్ల నుంచి రూ. 1,01,528 కోట్లకు జంప్‌చేసింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 77,784 కోట్ల నుంచి రూ. 98,267 కోట్లకు ఎగశాయి. ఈ కాలంలో టాటా మోటార్స్ స్టాండెలోన్ నష్టం రూ. 181 కోట్ల నుంచి రూ. 64 కోట్లకు తగ్గింది. మొత్తం ఆదాయం రూ. 14,793 కోట్ల నుంచి రూ. 15,733 కోట్లకు బలపడింది.

జేఎల్ఆర్ జూమ్...

ప్రస్తుత సమీక్షా కాలంలో జేఎల్ఆర్ ఆదాయం 57 శాతం జంప్‌చేసి 6.9 బిలియన్ పౌండ్లను తాకగా.. 43.5 కోట్ల పౌండ్ల పన్నుకు ముందు లాభం ఆర్జించింది. కొత్త ఏడాదిని పటిష్టంగా ప్రారంభించినట్లు జేఎల్ఆర్ కొత్త సీఈవో అడ్రియన్ మార్డెల్ పేర్కొన్నారు. క్యూ1లో రికార్డ్ క్యాష్‌ఫ్లోను సాధించినట్లు వెల్లడించారు. ఈ ఏడాది మొత్తం క్యూ1 స్థాయి పనితీరు చూపగలమని విశ్వసిస్తున్నట్లు గ్రూప్ సీఎఫ్‌వో పీబీ బాలాజీ పేర్కొన్నారు. కాగా.. వాణిజ్య వాహన విభాగం ఆదాయం 4.4 శాతం పుంజుకుని రూ. 17,000 కోట్లను తాకింది. దేశీయంగా హోల్‌సేల్ అమ్మకాలు 14 శాతం క్షీణించి 82,400 యూనిట్లకు చేరగా.. రిటైల్ విక్రయాలు ఇదే స్థాయిలో నీరసించి 77,600 యూనిట్లకు పరిమితమయ్యాయి. ప్రయాణికుల వాహన విభాగం ఆదాయం 11 శాతం ఎగసి రూ. 12,800 కోట్లను తాకినట్లు కంపెనీ ఈడీ గిరీష్ వాగ్ తెలియజేశారు. అమ్మకాలు 8 శాతం వృద్ధితో 1,40,400 యూనిట్లకు చేరినట్లు వెల్లడించారు.

ఫలితాల నేపథ్యంలో టాటా మోటార్స్ షేరు 1.6 శాతం లాభంతో రూ. 639 వద్ద ముగిసింది.

ఎల్‌అండ్‌టీ లాభం హైజంప్

- క్యూ1లో రూ. 3,116 కోట్లు
- రూ. 10,000 కోట్లతో బైబ్యాక్



న్యూఢిల్లీ: ఇంజినీరింగ్ దిగ్గజం ఎల్‌అండ్‌టీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 36 శాతం జంప్‌చేసి రూ. 3,116 కోట్లను తాకింది. ఇందుకు అధిక ఆదాయం సహకరించింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 2,293 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 36,547 కోట్ల నుంచి రూ. 49,028 కోట్లకు ఎగసింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 33,619 కోట్ల నుంచి రూ. 44,696 కోట్లకు పెరిగాయి. కాగా.. సొంత ఈక్విటీ షేర్ల కొనుగోలు(బైబ్యాక్)కి రూ. 10,000 కోట్లవరకూ వెచ్చించేందుకు బోర్డు ఆమోదించినట్లు కంపెనీ వెల్లడించింది. అంతేకాకుండా వాటాదారులకు షేరుకి రూ. 6 చొప్పున ప్రత్యేక డివిడెండును సైతం బోర్డు ప్రకటించింది. 2025–26కల్లా రిటర్న్ రేషియోలను మెరుగుపరచుకునే వ్యూహాత్మక లక్ష్యాలలో భాగంగా మిగులు నగదును వాటాదారులకు చేరవేయనున్నట్లు కంపెనీ సీఈవో, ఎండీ ఎస్ఎన్ సుబ్రమణ్యన్ పేర్కొన్నారు.

ఫలితాల నేపథ్యంలో ఎల్‌అండ్‌టీ షేరు బీఎస్ఈలో 1.7 శాతం నష్టంతో రూ. 2,562 వద్ద ముగిసింది.

సైయంట్ లాభం రూ.168 కోట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇంజనీరింగ్ సేవల్లో ఉన్న సైయంట్ జూన్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 45 శాతం ఎగసి రూ.168 కోట్లు సాధించింది. టర్నోవర్ రూ.1,250 కోట్ల నుంచి రూ.1,686 కోట్లకు ఎగసింది. డిజిటల్, ఇంజనీరింగ్, టెక్నాలజీ (డీఈటీ) విభాగం ఆదాయం రూ.1,060 కోట్ల నుంచి రూ.1,450 కోట్లకు చేరింది. ఈ త్రైమాసికంలో డీఈటీ సెగ్మెంట్లో కంపెనీ రూ.400 కోట్ల ఆదాయాన్ని సమకూర్చే ఆరు పెద్ద డీల్స్‌ను అందుకుంది. డీఈటీ ఆర్డర్ బుక్ 32.5 శాతం అధికమై రూ.1,584 కోట్లకు చేరుకుంది.

సైయంట్ షేరు ధర బీఎస్ఈలో 1.16 శాతం క్షీణించి రూ.1,466.45 వద్ద స్థిరపడింది.

ఏషియన్ పెయింట్స్ ఫర్వాలేదు

- నికర లాభంలో 52 శాతం వృద్ధి
- మెరుగుపడిన మార్జిన్లు



న్యూఢిల్లీ: ముడి సరుకుల ధరలు తగ్గుముఖం పట్టడంతో జూన్ త్రైమాసికానికి ఏషియన్ పెయింట్స్ బంపర్ లాభాలను ప్రకటించింది. కన్సాలిడేటెడ్ నికర లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూసినప్పుడు 52 శాతం పెరిగి రూ.1,575 కోట్లకు చేరుకుంది. డెకరేటివ్ పెయింట్స్ విభాగంలో అధిక అమ్మకాలు కూడా బలమైన పనితీరుకు కలిసొచ్చింది. క్రితం ఏడాది ఇదే కాలంలో కంపెనీ నమోదు చేసిన లాభం రూ.1,036 కోట్లుగా ఉంది. కన్సాలిడేటెడ్ ఆదాయం 6.7 శాతం పెరిగి రూ.9,154 కోట్లకు చేరుకుంది. తయారీలోకి వినియోగించే ముడి సరుకుల ధరలు తగ్గుముఖం పట్టడంతో సంస్థ వ్యయాలు పెద్దగా పెరగకుండా నియంత్రణలోనే ఉన్నాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో వ్యయాలు రూ.7,288 కోట్లు కాగా, సమీక్షా త్రైమాసికంలో అవి రూ.7,305 కోట్లుగా నమోదయ్యాయి. డెకరేటివ్ పెయింట్స్ విభాగంలో విలువ పరంగా, సంఖ్యా పరంగా రెండంకెల వృద్ధిని సంస్థ సాధించింది. ఇండస్ట్రియల్ పెయింట్స్ వ్యాపారంలో ఆదాయం రెండంకెల స్థాయిలో వృద్ధి చెందింది. అంతర్జాతీయ వ్యాపారం ఆదాయం 1.4 శాతం తగ్గి రూ.695 కోట్లుగా ఉంది.

చర్యల ఫలితం..: ''మొత్తం మీద రికార్డు స్థాయిలో మార్జిన్లు పెరిగాయి. ముడి సరుకుల ధరలు తగ్గడం, నిర్వహణ, ఫార్ములేషన్ పరంగా తీసుకున్న చర్యలు అనుకూలించాయి. ఆటో ఓఈ, ఇండస్ట్రియల్ కోటింగ్ వ్యాపారం రెండంకెల వృద్ధిని సాధించాయి. దీనికి ప్రొటెక్టివ్, పౌడర్ కోటింగ్ వృద్ధికి కూడా తోడైంది''అని ఏషియన్ పెయింట్స్ ఎండీ, సీఈవో అమిత్ సింగ్లే వివరించారు. హోమ్ డెకరేషన్ విభాగంలో ఫ్యాబ్రిక్స్, డెకరేటివ్ లైటింగ్, యూపీవీసీ డోర్లు, విండోలు మంచి వృద్ధిని చూస్తున్నాయని చెప్పారు. కాకపోతే కిచెన్, బాత్ విభాగాల్లో స్తబ్దత నెలకొన్నట్టు తెలిపారు. రానున్నది పండుగల సీజన్ కావడంతో బలమైన వృద్ధిని కొనసాగిస్తామన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

ఫలితాల నేపథ్యంలో ఏషియన్ పెయింట్స్ షేరు 4 శాతం క్షీణించి రూ.3,400 వద్ద ముగిసింది.

దక్షిణాదికి ఫుడ్‌లింక్



సంజయ్ వజిరాణి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: లగ్జరీ క్యాటరింగ్ కంపెనీ ఫుడ్‌లింక్ ఎఫ్ అండ్‌బీ హోల్డింగ్స్ ఇండియా తాజాగా దక్షిణాదిన అడుగుపెట్టింది. హైదరాబాద్‌లో 15,000 చదరపు అడుగుల్లో అంతర్జాతీయ స్థాయి అత్యాధునిక కిచెన్‌తోపాటు గిడ్డంగిని ఏర్పాటు చేసింది. అంబానీ–పిరమల్, దీపిక–రణ్‌వీర్, కేఎల్ రాహుల్–అథియా శెట్టి, తెలుగు రాష్ట్రాల్లో ఎన్‌టీవీ, రెడ్డి ల్యాబ్స్ కుటుంబ సభ్యుల వివాహ వేడుకల క్యాటరర్‌గా వ్యవహరించిన ఫుడ్‌లింక్‌కు రోజుకు 10 లక్షలకుపైగా అతిథులకు ఆహారం అందించే సామర్థ్యం ఉంది. ఫోర్బ్స్ ఇండియా టాప్–100లోని 75% వ్యాపార సంస్థలు, వారి కుటుంబ సభ్యులకు సేవలు అందించినట్టు ఫుడ్‌లింక్ సీఈవో సంజయ్ వజిరాణి మంగళవారమిక్కడ మీడియాకు తెలిపారు. 'లగ్జరీ క్యాటరింగ్, రెస్టారెంట్ల వ్యాపార విస్తరణకు హైదరాబాద్‌లో మూడేళ్లలో రూ.100 కోట్లు వెచ్చిస్తాం. ఇండియా బిస్ట్రో, చైనా బిస్ట్రో, గ్లోకల్ జంక్షన్, ఆర్ట్ ఆఫ్ దమ్ రెస్టారెంట్ల సంఖ్యను ఇప్పుడున్న 35 నుంచి 100కు చేరుస్తాం. ఈ ఆర్థిక సంవత్సరం రూ.450 కోట్ల టర్నోవర్ దాటుతాం. మూడేళ్లలో రూ.1,000 కోట్ల ఆదాయం ఆశిస్తున్నాం. అప్పుడు ఐపీవోకు వెళ్తాం' అని చెప్పారు.

మార్కెట్లో 'ఫెడ్' అప్రమత్తత

- ఒడిదుడుకుల ట్రేడింగ్‌లో స్వల్ప లాభాలు
- సెన్సెక్స్‌కు నష్టం.. నిఫ్టీకి లాభం



ముంబై: ట్రేడింగ్ ఆద్యంతం తీవ్ర ఒడిదుడుకులకు లోనైన స్టాక్ సూచీలు మంగళవారం మిశ్రమంగా ముగిశాయి. ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్ల నిర్ణయం(నేటి రాత్రి), కీలక కంపెనీల క్యూ1 ఆర్థిక ఫలితాల వెల్లడి నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించారు. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరల పెరుగుదల మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. సెన్సెక్స్ ఉదయం 146 పాయింట్ల లాభంతో 66,531 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 381 పాయింట్ల పరిధిలో 66,178 వద్ద కనిష్టాన్ని, 66,559 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 29 పాయింట్ల స్వల్ప లాభంతో 66,356 వద్ద నిలిచింది. నిఫ్టీ 57 పాయింట్లు పెరిగి 19,729 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించింది. ఇంట్రాడేలో 19,616 – 19,729 శ్రేణిలో ట్రేడైంది. ఆఖరికి ఎనిమిది పాయింట్ల స్వల్ప నష్టంతో 19,681 వద్ద నిలిచింది. బ్యాంకులు, ఎఫ్ఎంసీజీ, ఐటీ షేర్లలో రియల్టీ షేర్లలో అమ్మకాలు తలెత్తాయి. మెటల్, ఇంధన, ఆటో, ఫార్మా, మీడియా రంగాల చిన్న, మధ్య తరహా షేర్లకు డిమాండ్ నెలకొంది. ఫలితంగా బీఎస్ఈ మిడ్, స్మాల్‌క్యాప్ సూచీలు 0.39%, 0.31 శాతం చొప్పున రాణించాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,089 కోట్ల షేర్లను కొన్నారు.., దేశీ ఇన్వెస్టర్లు రూ.334 కోట్ల షేర్లను అమ్మేశారు. ఆర్థిక వేత్తలు అంచనాలకు తగ్గట్లే ఫెడ్ రిజర్వ్ కీలక వడ్డీ రేట్లు 25 బేసిస్ పాయింట్లు పెంచొచ్చనే ఆశలతో ప్రపంచ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- చైనాలో కోవిడ్ అనంతరం నెలకొన్న ఆర్థిక సవాళ్లను అధిగమించేందుకు అక్కడి ప్రభుత్వం భారీ ఉద్దీపన ప్యాకేజీ ప్రకటించవచ్చనే వార్తలతో దేశీయ మెటల్ షేర్లకు డిమాండ్ నెలకొంది. బీఎస్ఈ మెటల్ ఇండెక్స్ మూడుశాతం ర్యాలీ చేసింది. జిందాల్ స్టీల్, హిందుస్థాన్ కాపర్, హిందాల్కో షేర్లు 5.50 – 4% ర్యాలీ చేశాయి. జేఎస్‌డబ్ల్యూ, ఏపీఎల్ అపోలో, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, టాటా స్టీల్, నాల్కో షేర్లు 3% లాభపడ్డాయి. సెయిల్, వేదాంత, అదానీ ఎంటర్‌ప్రైజెస్, ఎన్ఎండీసీ, హిందూస్థాన్ జింక్ షేర్లు రెండు శాతం ర్యాలీ చేశాయి.
- దేశీయ ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు ఆసక్తి చూపడంతో అదానీ గ్రూప్ షేర్లు లాభపడ్డాయి. అదానీ గ్రీన్ ఎనర్జీ 10%, అదానీ పవర్ 9.3% ర్యాలీ చేశాయి. అదానీ ట్రాన్స్‌మిషన్ 8%, అదానీ విల్మార్ 5%, అదానీ టోటల్ గ్యాస్, ఎన్‌డీటీవీ షేర్లు పెరిగి అప్పర్ సర్క్యూట్‌ను తాకాయి. ఈ గ్రూప్ చెందిన అంబుజా సిమెంట్స్ 4%, ఏసీసీ 5%, లాభపడ్డాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ పోర్ట్స్ 2% పెరిగాయి. పది కంపెనీల షేర్ల ర్యాలీతో గ్రూప్ మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ విలువ ఒక్క రోజులోనే రూ.50,501 కోట్లకు పెరిగి రూ.10.60 లక్షల కోట్లకు చేరింది.
- టాటా స్టీల్ షేరు ఆరంభ నష్టాల నుంచి కోలుకొని లాభాల్లోకి వచ్చింది. చివరికి 3% లాభపడి రూ.119 వద్ద స్థిరపడింది.

విన్సిస్ ఐటీ @ రూ. 121-128

అగస్ట్ 1–4 మధ్య పబ్లిక్ ఇష్యూ



న్యూఢిల్లీ: సాఫ్ట్‌వేర్ సేవల కంపెనీ విన్సిస్ ఐటీ సర్వీసెస్ పబ్లిక్ ఇష్యూ ఆగస్ట్1న ప్రారంభంకానుంది. 4న ముగియనున్న ఇష్యూకి ధరల శ్రేణి షేరుకి రూ. 121–128గా కంపెనీ ప్రకటించింది. ఇష్యూలో భాగంగా రూ. 10 ముఖ విలువగల 38.9 లక్షల ఈక్విటీ షేర్లను విక్రయానికి ఉంచనుంది. తద్వారా దాదాపు రూ. 50 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. చిన్నతరహా సంస్థల కోసం స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం ఎన్ఎస్ఈ ఏర్పాటు చేసిన ఎమర్జ్ ప్లాట్‌ఫామ్ ద్వారా కంపెనీ లిస్టుకానుంది. నిధులను వర్కింగ్ క్యాపిటల్, అనుబంధ సంస్థ రుణ చెల్లింపులు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది. 2023 మార్చికల్లా కంపెనీ రూ. 157 కోట్ల ఆదాయాన్ని, రూ. 16 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది.

టీవీఎస్ సప్లై చైన్ ఐపీవోకు సెబీ గ్రీన్‌సిగ్నల్



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ కంపెనీ టీవీఎస్ సప్లై చైన్ సొల్యూషన్స్ మరోసారి పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. టీవీఎస్ మొబిలిటీ గ్రూప్ కంపెనీ ఇందుకు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నుంచి తాజాగా అనుమతి పొందింది. ఇష్యూలో భాగంగా రూ. 750 కోట్ల విలువైన ఈక్విటీని జారీ చేయనుంది. అంతేకాకుండా మరో 2 కోట్ల షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. కంపెనీ ఏప్రిల్‌లో తాజాగా సెబీకి ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. ఈక్విటీ జారీ నిధులను అనుబంధ సంస్థలు టీవీఎస్ ఎల్ఐ యూకే, టీవీఎస్ ఎస్‌సీఎస్ సింగపూర్ రుణ చెల్లింపులకు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది. టీవీఎస్ గ్రూప్ కంపెనీ ప్రధానంగా సమీకృత సరఫరా చైన్ సొల్యూషన్లు అందిస్తోంది. కాగా.. ఇండస్ట్రియల్ ప్యాకేజింగ్ సొల్యూషన్ల కంపెనీ పిరమిడ్ టెక్నోప్లాస్ట్ సైతం పబ్లిక్ ఇష్యూకి రానుంది. మార్చిలో ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసిన కంపెనీ ఇందుకు సెబీ నుంచి తాజాగా ఆమోదాన్ని పొందింది.

జాబ్ పాయింట్

ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, న్యూఢిల్లీలో 342 జూనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు

న్యూఢిల్లీలోని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ).. జూనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 342
» **పోస్టుల వివరాలు:** జూనియర్ అసిస్టెంట్(ఆఫీస్)–09, సీనియర్ అసిస్టెంట్ (అకౌంట్స్)–09, జూనియర్ ఎగ్జిక్యూటివ్(కామన్ కేడర్)–237, జూనియర్ ఎగ్జిక్యూటివ్(ఫైనాన్స్)–66, జూనియర్ ఎగ్జిక్యూటివ్(ఫైర్ సర్వీసెస్)–03, జూనియర్ ఎగ్జిక్యూటివ్(లా)–18.
» **అర్హత:** పోస్టును అనుసరించి డిగ్రీ, బీకాం, ఐసీడబ్ల్యూఏ, సీఏ, ఎంబీఏ, బీఈ, బీటెక్, ఎల్ఎల్‌బీ ఉత్తీర్ణతతోపాటు లైట్ మోటార్ వెహికల్ లైసెన్స్ కలిగి ఉండాలి.
» **వయసు:** 04.09.2023 నాటికి సీనియర్/జూనియర్ అసిస్టెంట్‌కు 30 ఏళ్లు, జూనియర్ ఎగ్జిక్యూటివ్‌కు 27 ఏళ్లు మించకూడదు.
» **పే స్కేల్:** నెలకు జూనియర్ ఎగ్జిక్యూటివ్‌కు రూ.40,000 నుంచి రూ.1,40,000, సీనియర్ అసిస్టెంట్‌కు రూ.36,000 నుంచి రూ.1,10,000, జూనియర్ అసిస్టెంట్‌కు రూ.31,000 నుంచి రూ.92,000.
» **ఎంపిక విధానం:** పోస్టును అనుసరించి కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, కంప్యూటర్ లిటరసీ టెస్ట్, ఫిజికల్ మెజర్‌మెంట్, ఎండ్యూరెన్స్ టెస్ట్, డ్రైవింగ్ టెస్ట్ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 05.08.2023.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 04.09.2023.
» **వెబ్‌సైట్:** www.aai.aero

విజయనగరం జిల్లా డీసీహెచ్‌ఎస్‌లో వివిధ ఉద్యోగాలు

విజయనగరం జిల్లాలోని డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్ కార్యాలయం(డీసీహెచ్ఎస్), డిస్ట్రిక్ట్ హాస్పిటల్ కాంట్రాక్ట్/అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన ఏపీవీవీపీ హాస్పిటల్స్‌లో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 04
» **పోస్టుల వివరాలు:** థియేటర్ అసిస్టెంట్–02, ఆడియో మెట్రీషియన్ /ఆడియోమెట్రిక్ టెక్నీషియన్–02.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, సంబంధిత విభాగంలో బీఎస్సీ/డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
» **వేతనం:** నెలకు థియేటర్ అసిస్టెంట్‌కు రూ. 15,000, ఆడియోమెట్రీషియన్‌కు రూ.32,670
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. అవసరమైన ధ్రువపత్రాలను విజయనగరంలోని డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్ కార్యాలయం(డీసీహెచ్ఎస్), డిస్ట్రిక్ట్ హాస్పిటల్ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 30.07.2023.
» **వెబ్‌సైట్:** https://vizianagaram.ap.gov.in

జీజీహెచ్ కాకినాడలో వివిధ పోస్టులు

కాకినాడలోని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ కాంట్రాక్ట్/అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 07
» **పోస్టుల వివరాలు:** థియేటర్ అసిస్టెంట్–01, మేల్ నర్సింగ్ ఆర్డర్లీ–04, ఫిమేల్ నర్సింగ్ ఆర్డర్లీ–02.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, డిప్లొమా, ఫస్ట్ ఎయిడ్ సర్టిఫికేట్ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 42 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.15,000 చెల్లిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును సూపరింటెండెంట్ కార్యాలయం, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, కాకినాడ, కాకినాడ జిల్లా చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 29.07.2023.
» **వెబ్‌సైట్:** https://eastgodavari.ap.gov.in

ఐఎఫ్‌బీ, హైదరాబాద్‌లో ప్రాజెక్ట్ స్టాఫ్ పోస్టులు

హైదరాబాద్ లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ బయోడైవర్సిటీ(ఐఎఫ్‌బీ) ప్రాజెక్ట్ స్టాఫ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 04
» **పోస్టుల వివరాలు:** జూనియర్ ప్రాజెక్ట్ ఫెలో(జేపీఎఫ్)–02, ప్రాజెక్ట్ అసిస్టెంట్–01, ఫీల్డ్ అసిస్టెంట్–01.
» **అర్హత:** పోస్టును అనుసరించి 10+2/బీఎస్సీ/ఎంఎస్సీ ఉత్తీర్ణులవ్వాలి.
» **వేతనం:** నెలకు రూ.17,000 నుంచి రూ.20,000 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఇంటర్వ్యూ వేదిక:** ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ బయోడైవర్సిటీ(ఐఎఫ్‌బీ), దూలపల్లి, కొంపెల్లి (ఎస్.ఓ.), హైదరాబాద్, తెలంగాణ–500100.
» **ఇంటర్వ్యూ తేది:** 02.08.2023.
» **ఇంటర్వ్యూ సమయం:** ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు.
» **వెబ్‌సైట్:** http://ifb.icfre.gov.in

ఇంటర్న్‌షిప్.. నైపుణ్యాలపై గురి!

చదువుకుంటూనే ఇండస్ట్రీ స్కిల్స్ సొంతం చేసుకుని.. జాబ్ మార్కెట్‌లో ముందంజలో నిలిచేందుకు మార్గం.. ఇంటర్న్‌షిప్! అకడమిక్‌గా చదువుకున్న సబ్జెక్ట్ అంశాలను వాస్తవ పరిస్థితుల్లో అన్వయించి.. రియల్ టైమ్ నైపుణ్యాలు అందుకునేందుకు అవకాశం కల్పిస్తుంది ఇంటర్న్‌షిప్!! అందుకే ఇప్పుడు ఏఐసీటీఈ అకడెమిక్స్‌లో ఇంటర్న్‌షిప్‌ను తప్పనిసరి చేసింది. ఈ నేపథ్యంలో..ఇంటర్న్‌షిప్ ప్రాధాన్యత, విద్యార్థులకు ప్రయోజనాలు, అందుకునేందుకు మార్గాలపై ప్రత్యేక కథనం..

» ఇంటర్న్‌షిప్‌తో క్షేత్ర నైపుణ్యాల సాధన
» భవిష్యత్తు అవకాశాలకు మెరుగైన మార్గం
» ఇంటర్న్ ట్రైనీగా చూపిన ప్రతిభతో శాశ్వత కొలువు
» ఇంటర్న్‌షిప్ చేసేందుకు ఎన్నో మార్గాలు



ఇంజనీరింగ్, ఎంబీఏ ప్రోగ్రామ్‌ల కరిక్యులంలో ఇంటర్న్‌షిప్‌ను తప్పనిసరి చేస్తూ.. ఏఐసీటీఈ మార్గదర్శకాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. విద్యార్థులు అప్పటి వరకు తాము అకడమిక్‌గా అధ్యయనం చేసిన అంశాలను.. వాస్తవ పరిస్థితుల్లో అన్వయించేలా క్షేత్రస్థాయిలో శిక్షణ పొందడమే ఇంటర్న్‌షిప్. ఆయా కోర్సులు చదువుతున్న సమయంలోనే క్షేత్ర నైపుణ్యాలు పొందేందుకు చక్కటి మార్గంగా ఇంటర్న్‌షిప్స్‌ను పేర్కొనొచ్చు. ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయిలో అనుసరిస్తున్న విధానం ప్రకారం–ఇంటర్న్‌షిప్ అంటే విద్యార్థులు కొద్దిరోజుల పాటు ఏదైనా ఒక సంస్థలో వాస్తవ పని వాతావరణంలో విధులు నిర్వర్తించడం! దీనివల్ల విద్యార్థులకు సదరు ఇండస్ట్రీలోని క్షేత్ర పరిస్థితులపై అవగాహన లభించడమే కాకుండా.. తాజా నైపుణ్యాలు కూడా సొంతమవుతాయి.

క్రెడిట్స్ కేటాయింపు

ఏఐసీటీఈ నిబంధనల ప్రకారం–బీటెక్‌లో చేరిన ప్రతి ఒక్కరూ రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ల తర్వాత తప్పనిసరిగా ఇంటర్న్‌షిప్ చేయాలి. ప్రతిసారి రెండు నెలలు చొప్పును మొత్తంగా కోర్సు వ్యవధిలో ఆరు వందల నుంచి ఏడు వందల గంటల పాటు ఇంటర్న్‌షిప్ పూర్తి చేయాలి. ఈ ఇంటర్న్‌షిప్స్‌కు ఏఐసీటీఈ క్రెడిట్స్‌ను కూడా కేటాయించింది. ప్రతి 40–45 గంటల వ్యవధికి ఒక క్రెడిట్ చొప్పున మొత్తం 14 నుంచి 20 క్రెడిట్స్ లభిస్తాయి. ఇప్పటికే పలు సెంట్రల్ యూనివర్సిటీలు, ఐఐఎంలు, ఐఐటీలు వంటి ప్రముఖ విద్యాసంస్థలు ఇంటర్న్‌షిప్‌ను తప్పనిసరి చేస్తూ.. వాటిని తమ విద్యార్థులకు ఇప్పించడానికి ఇండస్ట్రీ వర్గాలతో ఒప్పందాలు కూడా చేసుకుంటున్నాయి.

అన్ని రకాల కోర్సులకు

ప్రస్తుత పరిస్థితుల్లో ఇంటర్న్‌షిప్ అన్ని విభాగాలకు విస్తరిస్తోంది. కొన్నేళ్ల క్రితం వరకు ఇంటర్న్‌షిప్ అంటే టెక్నికల్, మేనేజ్‌మెంట్ విద్యార్థులకే అనే భావన ఉండేది. కానీ.. ఇటీవల కాలంలో ఇంటర్న్‌షిప్ ట్రెండ్ సంప్రదాయ, నాన్–టెక్నికల్ డిగ్రీ విభాగాలకూ విస్తరిస్తోంది. ముఖ్యంగా బ్యాచిలర్ డిగ్రీ విద్యార్థులకు ఈ–కామర్స్ సంస్థలు, స్టార్ట్–అప్ కంపెనీలు ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పిస్తున్నాయి. ఇందుకోసం తమ సంస్థల వెబ్‌సైట్స్ లేదా జాబ్ పోర్టల్స్ ద్వారా ప్రకటనలను విడుదల చేస్తున్నాయి.

ఇంటర్న్ ట్రైనీ అవకాశాలు

ఇంటర్న్‌షిప్ అవకాశాల కోసం ప్రస్తుతం పలు మార్గాలు అందుబాటులోకి వచ్చాయి. కొన్ని సంస్థలు కోర్సు చివరి సంవత్సరంలో అడుగుపెట్టే విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి.. ఇంటర్న్ ట్రైనీగా పని చేసే అవకాశం కల్పిస్తున్నాయి. ఆ సమయంలో విద్యార్థుల డొమైన్‌కు అనుగుణంగా.. సంస్థలోని వివిధ విభాగాలను కేటాయిస్తున్నాయి. విద్యార్థులు తమ డొమైన్ సంబంధిత విభాగాల్లో, సంస్థల్లో ఇంటర్న్‌షిప్ కోసం అన్వేషణ సాగించి.. అవకాశాలు అందిపుచ్చుకోవాలి. దీనివల్ల భవిష్యత్తులో ఉద్యోగ సాధనలో ముందంజలో నిలిచే అవకాశం లభిస్తుంది అంటున్నారు నిపుణులు.

ఆన్‌లైన్ నియామకాలు

పలు సంస్థలు తమ వెబ్‌సైట్స్ ద్వారా ఆన్‌లైన్ విధానంలో ఇంటర్న్ ట్రైనీ అవకాశాలు కల్పిస్తున్నాయి. తమ వెబ్‌సైట్‌లో కెరీర్స్/కరెంట్ ఆపర్చునిటీస్ ఆప్షన్‌లో ఇంటర్న్‌షిప్ ఖాళీల వివరాలు ప్రకటిస్తున్నాయి. వీటికి దరఖాస్తు చేసుకుని ఎంపిక ప్రక్రియలో విజయం సాధిస్తే.. ఇంటర్న్ ట్రైనీగా అవకాశం లభిస్తుంది. ఈ ఎంపిక ప్రక్రియలో సంస్థలు అభ్యర్థుల అకడమిక్ నైపుణ్యాలతోపాటు ప్రాక్టికల్ థింకింగ్, అనలిటికల్ స్కిల్స్‌ను పరిశీలించే విధంగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నాయి.

జాబ్ సెర్చ్ పోర్టల్స్

ఇంటర్న్‌షిప్ అందుకునేందుకు మరో మార్గం.. జాబ్‌సెర్చ్ పోర్టల్స్. ఇవి.. క్లయింట్ సంస్థల్లోని ఇంటర్న్‌షిప్ ఖాళీల సమాచారాన్ని పొందుపరుస్తున్నాయి. గతంలో కేవలం జాబ్ లిస్టింగ్స్‌కే పరిమితమైన ఈ పోర్టల్స్.. ఇప్పుడు ఇంటర్న్ ఖాళీల వివరాలను కూడా అందుబాటులోకి తెస్తున్నాయి. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని అకడమిక్ వర్గాలు సూచిస్తున్నాయి.

సోషల్ వేదికలు

ట్విటర్, లింక్డ్‌ఇన్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికలు సైతం ఇంటర్న్‌షిప్ అవకాశాల సమాచారాన్ని వెల్లడిస్తున్నాయి. వీటిల్లో ఆయా సంస్థలు, రంగాలకు చెందిన నిపుణులు పోస్టింగ్స్ పెడుతున్నారు. దీంతో.. విద్యార్థులు సోషల్ నెట్‌వర్కింగ్ సైట్స్ ద్వారా సదరు రంగాల్లోని నిపుణుల ద్వారా ఇంటర్న్ ట్రైనీ ఖాళీలకు సంబంధించిన వివరాలు తెలుసుకునే వీలుంది.

డిజిలాకర్‌లో సమాచారం

ఇంటర్న్‌షిప్ అవకాశాలను తెలుసుకునేందుకు ప్రభుత్వ స్థాయిలో సైతం పలు మార్గాలు అందుబాటులోకి వచ్చాయి. నేషనల్ ఈ–గవర్నెన్స్ విభాగంలోని డిజిలాకర్‌లో నిరంతరం తాజా ఇంటర్న్‌షిప్ ఖాళీలను పొందుపరుస్తున్నారు.

వీటిని అందుకోవాలంటే..అభ్యర్థులు డిజిలాకర్ ఇంటర్న్‌షిప్ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకుని దరఖాస్తు చేసుకోవచ్చు. ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆధ్వర్యంలో పనిచేసే డిజిలాకర్‌లో అధిక శాతం ఖాళీలు కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ తదితర సాంకేతిక విభాగాల్లోనే ఉంటున్నాయి. అదే విధంగా గ్రామీణ మంత్రిత్వ శాఖ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సోషల్ జస్టిస్ వంటి ఇతర శాఖల్లోనూ ఇంటర్న్‌షిప్ నియామకాలు జరుగుతుంటాయి. కాబట్టి విద్యార్థులు వీటి కోసం ఆయా శాఖల వెబ్‌సైట్స్‌ను పరిశీలిస్తుండాలి.

ఐఐటీలు, ఐఐఎంల్లో ఇలా

దేశంలో ప్రతిష్టాత్మక విద్యా సంస్థలైన ఐఐటీలు, ఐఐఎంలు కార్పొరేట్ సంస్థలతో ఒప్పందాలు చేసుకుంటున్నాయి. దీంతో బీటెక్ మూడో సంవత్సరం, ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు సమ్మర్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్, ప్రీ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ పేరుతో సంస్థల్లో ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పిస్తున్నాయి. ఇలా ఎంపికైన వారిని ఇంటర్న్ ట్రైనీగా పేర్కొంటున్నారు. వీరు ఆరు నుంచి ఎనిమిది వారాల వ్యవధిలో ఆయా సంస్థల్లో ఇంటర్న్ ట్రైనీగా రియల్ టైమ్ విధులు నిర్వర్తిస్తారు. అంతేకాకుండా సమ్మర్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్, ప్రీ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ పేరుతో ఇంటర్న్‌ట్రైనీగా ఎంపికైన వారికి సంస్థలు స్టయిఫండ్ పేరుతో ఆకర్షణీయ ఆర్థిక ప్రోత్సాహకాన్ని సైతం అందిస్తున్నాయి.

ఇంటర్న్‌షిప్ శిక్షణ

ఇంటర్న్‌షిప్ అందుకున్న అభ్యర్థులు సంస్థలో చేరిన తర్వాత చక్కటి పని తీరు చూపాలి. తమకు కేటాయించిన విభాగం, విధులకు సంబంధించి టీమ్ సభ్యులతో కలిసి పనిచేయాలి. ఏదైనా సందేహం తలెత్తితే.. టీమ్ లీడర్ లేదా ఇతర సీనియర్లను సంప్రదించి నివృత్తి చేసుకోవాలి. ఇంటర్న్‌షిప్ సమయంలో సంస్థ ఉద్యోగి మాదిరిగా పూర్తి అంకితభావంతో పనిచేయాలి. ఫలితంగా క్షేత్ర నైపుణ్యాలతోపాటు భవిష్యత్ అవకాశాలకు మార్గం ఏర్పడుతుంది.

రియల్ టైమ్ స్కిల్స్

ఇంటర్న్ ట్రైనీగా ఇండస్ట్రీలో విధులు నిర్వహించడం ద్వారా రియల్ టైమ్ నైపుణ్యాలు లభిస్తాయి. వీటితోపాటు ఇంటర్ పర్సనల్ నైపుణ్యాలు, నెగోషియేషన్ స్కిల్స్, టీం వర్కింగ్ కల్చర్, డెసిషన్ మేకింగ్ స్కిల్స్, ప్రాబ్లమ్ సాల్వింగ్ నైపుణ్యాలు వంటివి సొంతమవుతాయి. టీమ్ మెంబర్స్, టీమ్ లీడర్స్‌తో చర్చించి టాస్క్‌ని సమర్థవంతంగా పూర్తి చేయగలిగే నైపుణ్యం లభిస్తుంది. సంబంధిత రంగంలో.. తాజా పరిణామాల గురించి ఇతరులతో చర్చించడం, సమస్యకు తమ స్థాయిలోనే పరిష్కారం కనుగొనే విధంగా అనలిటికల్ స్కిల్స్, ప్రాబ్లమ్ సాల్వింగ్ వంటివి అలవడతాయి.


శాశ్వత కొలువు

ఇంటర్న్ ట్రైనీలు.. సంస్థలో శాశ్వత కొలువు సైతం సొంతం చేసుకునే వీలుంది. ఇంటర్న్ ట్రైనీగా చూపే ప్రతిభ, పనితీరు సంస్థ యాజమాన్యం మెచ్చే రీతిలో ఉంటే.. పూర్తి స్థాయి ఉద్యోగం కూడా లభిస్తుంది. ఐఐటీలు, ఐఐఎంల నుంచి ఆయా సంస్థల్లో ఇంటర్న్ ట్రైనీగా ఎంపికైన వారిలో 50 శాతం మేరకు.. శిక్షణ సందర్భంగా ప్రతిభ చూపి.. అదే సంస్థలో ఫైనల్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ అందుకుంటున్నారు.



నీరు లేదు.. వాన నీరే..

నార్నూర్(ఆదిలాబాద్): ఒకటి, రెండు రోజులు కాదు.. ఏకంగా 15 రోజులుగా నీటి వసతిలేక 367 మంది విద్యార్థినులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఆదుకునేనాథుడే లేక వారికి వానదేవుడే దిక్కు అయ్యాడు. కొద్దిరోజులుగా నిల్వ చేసుకున్న వాననీటితోనే స్నానాలు చేస్తున్నారు. కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు. ఇదీ ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, కళాశాల దుస్థితి. వంట చేయడానికి నీళ్లు లేక వర్కర్లు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను ఎస్‌వో ప్రియాంక సర్పంచ్ మెస్రం జైవంత్‌రావు దృష్టికి తీసుకెళ్లగా రెండ్రోజులు గ్రామపంచాయతీ ట్రాక్టర్ ద్వారా నీరు సరఫరా చేశారు. తర్వాత పంచాయతీ వర్కర్లు సమ్మెలో ఉండటంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది దీంతో విద్యార్థినులు ఇంటి బాట పడుతున్నారు. నీటిసమస్యను డీఈవో ప్రణీత, కేజీబీవీ జిల్లా సెక్టోరియల్ అధికారి ఉదయశ్రీ దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లభించలేదని విద్యార్థినులు అంటున్నారు. కలెక్టర్ స్పందించి నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు. రెండ్రోజుల్లో నీటిసమస్య పరిష్కరించకుంటే కలెక్టర్ కార్యాలయానికి వెళ్తామని పేర్కొన్నారు.





24 గంటల్లో 31 కాన్పులు

- జనగామ ఎంసీహెచ్ మరో రికార్డు..
- మంత్రి హరీశ్‌రావు ట్వీట్

జనగామ: జనగామ మాతాశిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్) ప్రసవాల్లో మరో రికార్డు సృష్టించింది. 24 గంటల వ్యవధిలో 31 కాన్పులు చేసి.. వైద్యులు సర్కారు దవాఖానా సత్తా చాటారు. సాధారణ ప్రసవాలు–17, ఆపరేషన్లు 14 కాగా... ఇందులో 12మంది మగపిల్లలు, 19 మంది ఆడపిల్లలు జన్మించారు. అందరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్‌రాజు ఆధ్వర్యంలో అసిస్టెంటు ప్రొఫెసర్ డాక్టర్ స్రవంతి, డాక్టర్లు సౌమ్యారెడ్డి, సిరిసూర్య, సిబ్బంది సంగీత, విజయరాణి, సెలెస్టీనా ప్రసూతి కాన్పులు చేశారు. ఎంసీహెచ్ వైద్యుల అంకితభావంతో సర్కారు దవాఖానాలపై ప్రజలకు మరింత నమ్మకం పెరుగుతోందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ట్వీట్ చేశారు. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి కూడా వీరిని అభినందిస్తూ, ప్రతి ఒక్కరూ సర్కారు దవాఖానాల సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సైలెంట్ కిల్లర్.. వయెలెంట్‌గా..

కేన్సర్‌తో గతేడాది ఏకంగా 27,339 మంది మృత్యువాత

కేన్సర్ మృతుల్లో 13వ స్థానంలో తెలంగాణ

దేశంలో ప్రతి తొమ్మిది మందిలో ఒకరికి కేన్సర్ వచ్చే అవకాశం


జాతీయ వైద్య పరిశోధన మండలి నివేదిక



సాక్షి, హైదరాబాద్: సైలెంట్ కిల్లర్‌గా పిలిచే కేన్సర్ వ్యాధి రాష్ట్రంలో వయెలెంట్‌గా విస్తరిస్తోంది. పొగాకు, మద్యం వినియోగం, ఆహారపు అలవాట్లు, వ్యవసాయంలో పెరిగిపోతున్న రసాయన ఎరువులు, శీతల పానీయాల వినియోగం, ఆధునిక జీవన శైలి పోకడల వంటి పరిణామాలతోనే కేన్సర్ చాపకింద నీరులా వ్యాపిస్తోంది. కేన్సర్‌ను ప్రారంభదశలోనే గుర్తించి చికిత్స మొదలుపెట్టగలిగితే వ్యాధిని నయం చేయవచ్చని వైద్యనిపుణులు చెబుతుండగా...శరీరంలో తెలియకుండానే మొదలైన ఈ వ్యాధిని ముదిరిపోయేంతవరకూ పసిగట్టలేకే మరణాలవరకూ తెచ్చుకుంటున్నాం. జాతీయ వైద్య పరిశోధక మండలి (ఐసీఎంఆర్) వెల్లడించిన తాజా నివేదికలోని కేన్సర్ కేసుల, మరణాల గణాంకాలు ఇప్పుడు ప్రమాద ఘంటికల్ని మోగిస్తు న్నాయి. 2022లో దేశవ్యాప్తంగా 8.08లక్షల మంది కేన్సర్‌తో మరణించగా...అందులో ఒక్క తెలంగాణలోనే 27,339 మంది ఉన్నట్లు ఐసీఎంఆర్ నివేదికలో పేర్కొంది.

అంతకుముందు రెండేళ్లతో పోల్చుకుంటే దేశంతో పాటు రాష్ట్రంలోనూ కేన్సర్ రోగులు, మరణాల సంఖ్య పెరగడం ఆందోళన కలిగిస్తోంది. ఐసీఎంఆర్ నివేదిక ప్రకారం కేన్సర్ మరణాల్లో తెలంగాణ దేశంలో 13వ స్థానంలో ఉంది. 1.16లక్షల మరణాలతో ఉత్తరప్రదేశ్ తొలి స్థానంలో ఉండగా 66,879 మరణాలతో మహారాష్ట్ర దాని తర్వాతి స్థానంలో నిలిచింది. దేశంలోని ప్రతి లక్ష మందిలో ఒకరికి కేన్సర్ ఉన్నట్లు నివేదికలో పేర్కొంది. 2022లో దేశంలో కేన్సర్ రోగులు 14.61 లక్షలుండగా అందులో తెలంగాణలోనే కొత్తగా 49,983 కేన్సర్ కేసులు నమోదయ్యాయి. ఇక భవిష్యత్తులో దేశంలో ప్రతి తొమ్మిది మందిలో ఒకరికి కేన్సర్ వచ్చే అవకాశం ఉందని, 2025 నాటికి ఆ సంఖ్య 15.7 లక్షలకు చేరుకోనుందని ఐసీఎంఆర్ తాజా నివేదికలో హెచ్చరించింది.

రెండేళ్లతో పోలిస్తే పెరిగిన మరణాల సంఖ్య



అధికంగా ఆ వయసువారే..

60–64 వయస్సు గలవారు అత్యధికంగా కేన్సర్ బారిన పడుతున్నారు. పురుషుల్లో నమోదయ్యే కేన్సర్ కేసుల్లో ఊపిరితిత్తుల కేన్సర్ కేసులు 10.6%, నోటి కేన్సర్ 8.4%, ప్రొస్టేట్ కేన్సర్ కేసులు 6.1%, నాలుక కేన్సర్ కేసులు 5.9%, కడుపు కేన్సర్ కేసులు 4.8% నమోదవుతున్నాయి. మహిళల్లో నమోదయ్యే కేన్సర్ కేసుల్లో రొమ్ము కేన్సర్ 28.8%, గర్భాశయ కేన్సర్ 10.6%, అండాశయ కేన్సర్ 6.2%, ఊపిరితిత్తుల కేన్సర్ 3.7% నమోదవుతున్నాయి.

35 ఏళ్లు దాటితే పరీక్షలు తప్పనిసరి...

- ప్రపంచ ఆరోగ్య సంస్థ నిబంధనల ప్రకారం 35ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఏడాదికి ఒకసారి లేదా రెండేళ్లకోసారైనా కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలి. దంత వైద్యుల వద్దకు వెళితే వారు చేసే పరీక్షలు నోటి కేన్సర్ నిర్ధారణకూ ఉపయోగపడతాయి. 8 నుంచి 18 ఏళ్లలోపు ఆడ పిల్లలకు సర్వైకల్ కేన్సర్ రాకుండా టీకాను వేయించి వ్యాధి రాకుండా అడ్డుకోవచ్చు. యాభై ఏళ్లు దాటినవారికి మలంలో రక్తం పడితే కొలనోగ్రఫీ ద్వారా వ్యాధిని గుర్తించవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

ఆలస్యంగా రావడం వల్లే అధిక మరణాలు

- ప్రస్తుతం రాష్ట్రంలో 70 శాతం మంది కేన్సర్ చివరి దశలో ఉండగా మాత్రమే ఆస్పత్రులకు వస్తున్నారు. దీంతో అధిక మరణాలు నమోదవుతున్నాయి. ఇక విదేశాల్లో 70 నుంచి 80 శాతం మంది మొదటి దశలోనే ఆస్పత్రులకు వచ్చి వైద్యులను సంప్రదిస్తున్నారు. సర్వైకల్, రొమ్ము కేన్సర్లను సులువుగా నయం చేయవచ్చు. రొమ్ము కేన్సర్‌ను మూడో దశలోనూ, థైరాయిడ్ కేన్సర్ వస్తే 100% నయం చేయవచ్చని వైద్యులు భరోసా ఇస్తున్నారు.

పిల్లల్లో రక్త సంబంధిత కేన్సర్లే అధికం..

- జన్యుమార్పిడి వల్లే పిల్లల్లో కేన్సర్ వస్తుంటుందని, ఎక్కువగా వారి లో రక్త సంబంధిత కేన్సర్లు అధికంగా వస్తుంటాయని వైద్యులు చెబుతున్నారు. పిల్లల్లో వైద్యానికి స్పందించే లక్షణం ఎక్కువ వారికి వచ్చే కేన్సర్లలో 80% వరకు నయం చేయడానికి వీలుంటుందని ఆంకాలజిస్టులు చెబుతున్నారు. మూడో దశ కేన్సర్లతో వచ్చే పిల్లల్ని సగం మందిని, నాలుగోదశలో వస్తే 25% మందిని బతికించవచ్చని అదే తొలి రెండు దశల్లో వస్తే 90%మందికి నయం చేయవచ్చని వైద్యులు చెబుతున్నారు.

దేశంలో 2035 నాటికి 13లక్షల కేసులు..

- పొగాకు, మద్యం, చెడు ఆహారపు అలవాట్ల వల్ల 66 శాతం, ఇన్ఫెక్షన్లతో 20% కేన్సర్లు వస్తున్నాయి. హార్మోన్లు, జన్యుమార్పుల వల్ల 10% పైగా, కాలుష్యం వల్ల ఒక శాతం కేన్సర్ రిస్క్‌లున్నాయి. 2035 నాటికి దేశంలో కేన్సర్ మరణాలు 13 లక్షలకు చేరుకుంటాయని అంచనా.

–డాక్టర్ కిరణ్ మాదల, నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కాలేజీ



చెత్తకుప్పల నుంచి చదువులమ్మ ఒడికి..

హనుమకొండ: చెత్త ఏరే చిట్టిచేతులు నోట్ బుక్స్ పట్టాయి. చెదిరిన నెత్తి, చిరిగిన బట్టలతో ఉండే పిల్లలు శుభ్రంగా తయారై బడి బాట పట్టారు. 11 మంది బాలలు చెత్తకుప్పలను వీడి చదువులమ్మ ఒడికి చేరుకున్నారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయానికి చెత్త ఏరుకునే బాలలతోపాటు తల్లిదండ్రులను పిలిపించారు. చదువు ప్రాముఖ్యత గురించి వారికి అవగాహన, చైతన్యం కల్పించారు. దీంతో పిల్లలను పాఠశాలకు పంపేందుకు తల్లిదండ్రులు అంగీకరించారు. వెంటనే జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి మేన శ్రీనును పిలిపించి 11 మంది బాల కార్మికులను గురుకులాల్లో చేర్పించారు. పిల్లలకు నోట్‌బుక్స్ అందించారు. బాలలకు, తల్లిదండ్రులకు వినయ్‌భాస్కర్ భోజనం వడ్డించారు. వారితో కలిసి భోజనం చేశారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.